భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

నవంబరు **1957**


సంపుటము 34 : : సంచిక 11

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

నవంబరు 1957

1957 నవంబరు 1 వ తేదీ



రాజథానినగరంలోని పోలీసుమైదానంలో పోలీసుదళాల వందనసమర్పణను స్వీకరించుతున్న
గవర్నర్ శ్రీ భీమసేన్ సాచార్

తాపసి

దాశరథి

ఇరులు నిశాపతి భుజము లెక్కి శిరమ్మున నెక్కి తారకా
తరుణుల గల్లభాగములు తాకి నభమ్మును ప్రాకి నిండు చం
దురుపయి సోకి భూధరము త్రోవలలోపయనించి మెల్లగా
ధరపయి కాలుమోపెను కదా! హరినీల వినీల కాంతులన్.

ఇటు ప్రాకి అటు ప్రాకి ఇందుబింబాననా
ముఖముపై కస్తూరిబొట్టుపెట్టి,
ఇటుదూకి అటుదూకి కుటిల నీలాలకా
భ్రుకుటి కాధనువు నంబకము కూర్చి,
ఇటుసాగి అటుసాగి ఇందీవరేక్షణా
పక్ష్మ భాగములపై వచ్చి వ్రాలి
ఇటువీగి అటువీగి మృగనేత్రి బంగారు
చెక్కిలిపై అగర్ చుక్క నునిచి

వెండికొండపయిం గా మబ్బువిధముతోచి
చంద్రకేదారమున లేడిచాయ తిరిగి
ఆదిశేషునిపై విష్ణువై శయించి
చీకటులు కూర్చె నందమ్ము లోకమునకు

ఇరులు కోకిలములై ఎచ్చోట కూయునో
అచ్చోట ఆమని అవతరించు
ఇరులె తుమ్మెదలుగా ఏవేళ మ్రోయునో
ఆవేళల వసంత మాగమించు
ఇరులె ఉత్పలములై ఏనాడు పూచునో
ఆరోజు నవశరత్తన్నమాట
ఇరులె నెమళ్లయి ఎట నృతిసేయునో
అటనె నవాషాఢ మందసించు

ఇరులకన్న అందమెచట కానగరాదు
ఇరులె అందమునకు దరులుసుమ్మ
ఇరులు లేనినాడు నరులు కానగరారు
నరులు లేనినాడు ధరణిలేదు

కబరీ భరమ్ములై కనుపించు చీకట్లు
కావలె నాకెల్ల కాలములను,
నల్ల కల్వలవోలె నాట్యమాడెడు నిరుల్
కన్పించవలె నెల్ల కాలమిచట
నీలమేఘమ్ములై నింగి బ్రాకెడి తమం
బెల్ల వేళల కనుపించవలయు
జవరాలి కనుపాపచాయ దోచెడు నాంధ్య
మన్ని కాలాల ప్రత్యక్షమగుత.

ఇరులె కురులయి ఝరులయి పరుగులెత్తి
ఇరులె కరులయి హరులయి ఇంపు నింపి
ఇరులె తరులయి సురలయి ధరణి నిండి
ఇరులె నరులకు మరులు కల్పించవలయు

తిమిరలతా కుడుంగమున దీపముపెట్టెడి వెఱ్ఱిదాన, దీ
పము పురుపీ మహాంధ్య మదిపాము; పృదాకువు పుర్వమెక్కునో
కృమి ఉరగమ్ము మింగునో గ్రహింపుము పైదలి! తామసీ తురం
గమ ఖురఘట్టనమ్ముల వికావికలైనవి దీపదీధితుల్.

వెచ్చదనము లేని వెఱ్ఱిదీపమ్ముల
పెట్టదలచెదేల పిచ్చిదాన,
వర్షధారవోలె వచ్చు చీకట్లలో
మట్టి దివ్వె నిలుచుమాట కల్ల

గాళి నాల్కమీది కంటకమ్ములలోన
చిక్కుకొన్న యట్టి చిన్నపురుగు
అంధకారమందు ఆటాడుదీపంబు
మరు నిముసము నందు మడియగలదు.

అంధకార గృధ్రమార్చెను పెనురెక్క-
లంతటను తుఫానులలము కొనియె
చిన్నదీప కళిక యెన్నాళ్లు నిలుచును?
మలిగిపోవుగాక మరు నిముసము

ఆకాశమ్మది చీకటిల్లు శశి తారార్కావళుల్ మిణ్గురుల్,
లోకం బియ్యది చీకటింటి పరదాలో నున్న మృత్పిండ; మిం
దాకల్పింపగ జూచెదేల పరిహాసార్థమ్మొ! దీపావళీ
ప్రాకారమ్ములు? తామసీ ధరణి కంపంబల్లదే వచ్చెడిఁ.

పాపిని, నాకు దీపముల బారులు చిమ్మెడి కాంతి ధారపై
కోపము; నన్ను చీకటుల కోవలలో శయనింపనిమ్ము, ని
ద్రా పరతంత్రమై బ్రతుకు దాగిలి మ్రుచ్చుల నాడుచున్న దే
లా పురికొల్పెదమ్మ! నను అంధతమః పథముల్ త్యజింపగా

విద్యుద్వల్లిక శాశ్వతమ్ముగ నభోవీథిఁ ప్రభాదండమై
విద్యోతించిన రీతి నుండిన నిన్నుఁ వీక్షింపగాలేను, నీ
ఖద్యోత ప్రతిమాన తైజసిక శృంగారమ్ము నాకేలనే,
ఆద్యంతమ్ములు లేని చీకటి పథం బందేగు ఘూకానకుఁ.

కానుగు చెట్ల నీడల నొకానొక స్వప్నపు సెజ్జపైన ని
ద్రాణములైన లోచనములఁ శయనింపగనిమ్ము; అంధకా
రాన మనస్సు శాంతిపడె; రాను భవత్కమనీయకాంతి సా
ధానకు; నన్ను పిల్వకు ముదార భవద్ధృదయాంగణానకుఁ.

విశ్వాంతరయానము

యస్. ఆర్. కె.

గగనపథానికి ఎగరాలని మానవుడు ఆదినుంచీ కలలు గంటూనే వున్నాడు. గగనపథం స్వర్గసీమ, అక్కడ అతని దేవతలూ, పితృదేవతలూ నివసించుతూ వుంటారు. సూర్యచంద్రాది గ్రహాలు ప్రత్యక్ష దైవాలు. ఆదేవతలను మానవుడు పూజిస్తున్నాడు. బొందితో స్వర్గానికి పోయిన పుణ్యపురుషుల గాథలు పురాణాలలో అనంతంగా వున్నాయి.

ఉన్నట్లుండి, రష్యనులు, ఒక కృత్రిమగ్రహాన్ని తయారుచేసి విశ్వాంతరంలోకి విసరివేశారు. ఈ బాల చంద్రుడు, చంద్రుడు తిరిగినట్టే భూమిచుట్టూ తిరుగనారంభించాడు. దీంతో విశ్వాంతరయానమునకు గల అవకాశాలను గూర్చి ప్రపంచమంతా అత్యుత్సాహంతో ఆలోచించ మొదలుపెట్టింది. ఈ కృత్రిమ గ్రహానికి రష్యనులు "స్పుట్నిక్" అని నామకరణం చేశారు. గగనపథాన దీని అవతరణతో, శాస్త్రవిజ్ఞానవేత్తలలోనూ, సామాన్య ప్రజలలోనూకూడా, విశ్వాంతరయానాన్ని గూర్చి, చిత్ర విచిత్రాలైన అనేకరకాల ఊహాగానాలు చెలరేగుతున్నాయి. ఏది ఏమైనా,

సరీగా ఈ వ్యాసాన్ని ముగింపుచేస్తున్న ఈతరుణానికి—అనగా 3-11-57 తేదీ గం॥ 11-45 నిమిషాలకు, రష్యా మరొక కృత్రిమగ్రహాన్ని ఈ ఉదయం అంతరిక్షంలోకి వదలినట్లు మాస్కో-రేడియో ప్రకటించింది. దీనిలో ఒక కుక్కను కూడా పైకి పంపారట. ఇది సురక్షితంగా వున్నట్లుకూడా ప్రకటించారు. దీనికి కావలసిన ఆహారపానీయాలనుకూడా ఆ గోళంలో వుంచారు. ఈ కుక్కకోసం 'ఎయిర్ కండిషన్డ్' గదికూడా ఏర్పాటుచేశారట! దాని అదృష్టం! అవును విశ్వాంతరంలోకి ఎగిరిన ప్రథమగౌరవంకూడా దానికి దక్కిందిగదా!

దీన్లో, విశ్వకిరణ ప్రసారాలను, సూర్యమండల ప్రసారాలనూ, శబ్ద తరంగ ప్రసారగతులనూ, ఎక్స్-రే, అల్ట్రా-వైలెట్ రే ప్రసారాలను, నమోదు చేసి ప్రసారంచేసే యంత్రాలను ఉంచారు.

ఈ రెండవ స్పుట్నిక్ బరువు 1120.7 పౌనులు, అంటే దాదాపు అర టన్ను. మొదటిదాని బరువు 183 పౌనులు మాత్రమే. ఇది సెకనుకు 26000 అడుగుల వేగంతో అంటే గంటకు 15173 మైళ్ళ వేగంతో పరిభ్రమించుతోంది. ఇది భూమిని చుట్టి రావటానికి 102 నిమిషాలు పడుతున్నది. రోజుకు 14 ప్రదక్షిణాలు చేస్తుంది. మొదటి స్పుట్నిక్ 16 ప్రదక్షిణాలు చేస్తోంది. దాని వేగము గం॥కు 18000 మైళ్ళు. మొదటి స్పుట్నిక్ 560 మైళ్ల ఎత్తున ఎగురుతోంది. ఇది 930 మైళ్ల ఎత్తున ఎగురుతున్నది.

ఈకృతిమ గ్రహచాలనం, మానవజాతి, సాంకేతికపరిజ్ఞాన రంగంలో సాధించుతున్న విజయ పరంపరల చరిత్రలో ఒక మహత్తర ఘట్టం. ఈ సంఘటనను పురస్కరించుకుని, పలువురితో పాటు మనంకూడా, విశ్వాంతరయానానికి గల అవకాశ అనవకాశాలను — పోనీ ఊహాగానంగానే — కొంత చర్చించి వినోదించుదాం. 'స్పుట్నిక్' ప్రయోగ వివరాలను గూర్చి దినదినం అనేక విషయాలు పత్రికలలో చదువుతూనే వున్నాం గనుక దానిని గూర్చి ఇక్కడ ఎక్కువ చర్చించటం లేదు.

'సూర్యమండల గ్రహకూటమిని గూర్చి కోపర్నికస్ స్థాపించిన సిద్ధాంతం సర్వత్రా అంగీకరించబడి ఖగోళశాస్త్రం అభివృద్ధి చెందినకొలదీ, సూర్యుని చుట్టూ తిరుగుతున్న ఈ గోళాలను గురించీ, వాటిమీద జీవరాసుల ఉనికికి గల సావకాశాలనుగురించీ, విశ్వాంతరయానానికి గల సావకాశాలనుగురించీ పలువురు యోజించ మొదలుపెట్టారు. ఈ విషయాన్ని పురస్కరించుకుని, శాస్త్రవిజ్ఞాన పరిశోధనకు సంబంధించిన గ్రంథాలే కాక, కేవల ఊహావైచిత్రిగల కాల్పనిక రచనలుకూడా బహుళసంఖ్యలో వెలువడుతూ వచ్చినాయి. వాటి నన్నిటినీ జనం మహోత్సాహంతో చదువుతున్నారు. ఇట్టి వాఙ్మయ ప్రచురణ ఒక కొత్త వాణిజ్యవకాశంగా కూడా పరిణమించింది.

పశ్చిమ దేశాలలో అనేక 'విశ్వాంతరయాన సంఘాలు 'ఏర్పడినాయి. ఆలు లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగమని, టోకియోలో అనేకమంది, అంగారకగ్రహంలో ఇళ్ళస్థలాలు కొనటానికి యొగబడుతున్నారు. ఒక పెద్ద మనిషి, అంగారకగ్రహానికి హక్కుదారైనట్టు ఆగోశంలో నివేశన స్థలాలు అమ్ముతున్నారు. ముందుగా కొనుక్కోకపోతే మళ్ళీ స్థలం దొరకదని కొందరికి బెంగగాకూడా వుంది, చేతిలో డబ్బు తక్కువగా వున్నవాళ్ళకు!

ఆకాశంలో ఒకటి రెండు మైళ్ళు పైకి పోవాలంటే, ప్రప్రథమంగా మానవుడు కనుగొన్న సాధనం గాలి గుమ్మటం. దీనికి వున్న యితర ఇబ్బందులమాట అటుంచి, ఇది గాలికంటే తేలికైనదై వుండాలి. అందుచేత దీనికిగల అవకాశాలు చాలా పరిమితమైనవి. ఈ సంవత్సరమే, అమెరికా సైనికశాఖలోని మేజర్ ఒకరు, గాలిగుమ్మటంలో 100,000 అడుగుల ఎత్తుకు వెళ్ళగలిగాడు. ఇది ప్రపంచావధిని ఇంతవరకు సాధించిన గరిష్ఠప్రమాణం. (మనిషి లేకుండా రష్యనులు, 120,000 అడుగుల ఎత్తుకు ఒక గాలిగుమ్మటాన్ని ఎగుర వేయగలిగారు) ఈ కారణం చేతనే, విమానాలకుగల యానావకాశాలుగూడా పరిమితమౌతున్నాయి.

విశ్వాంతరయానానికి 'రాకెట్' (అవాయి) ఒక్కటే పరమసాధనమని, శాస్త్రవిజ్ఞానవేత్తలు ఏనాడో గ్రహించారు. రాకెట్లను తొలుతగా తయారు చేసినవారు చీనావారని చెబుతారు. ఈ అవాయిల సంగతి అనాదికాలంనుంచీ తెలిసేవుంది. రాకెట్ అసలు ఎలా ఎగురుతుంది? న్యూటన్ స్థాపించిన 'చలనసూత్రాలలో మూడవది — "కార్యము ప్రతి కార్యమును కల్గించును — కార్య ప్రతికార్యముల చలనశక్తి పరస్పర వ్యతిరేకమార్గముల వ్యాపించును" అనేది. ఈ సూత్రంలో నిర్వచింపబడిన 'చలన' ధర్మమే రాకెట్ చలనానికి కారణమౌతున్నది. రాకెట్ వెనుక భాగంలో హఠాత్తుగా కలిగింపబడిన ప్రేలుడు రాకెట్‌ను, ముందుకు నెట్టుతుంది. ఈ ప్రేలుడును నిర్ణీత పద్ధతిలో నిర్వహించి ప్రేలుడువల్ల సృష్టింపబడుతున్న వాయువులను, నిర్ణీత పరిమాణముగల విసర్జన వాలికాముఖం నుంచి క్రమపద్ధతిని బయటికి పంపేటట్లు యేర్పాటు చేయగలిగితే రాకెట్ యొక్క పురోగమన వేగాన్ని మనం క్రమబద్ధం చేయవచ్చు. రాకెట్ల నిర్మాణంలో తుపాకిమందులాంటి ఘనపదార్థాలను ఉపయోగించితే రాకెట్‌లో ఇంధన నిక్షేపానికి సువిశాలములైన, వివరాలను నిర్మించవలసి వస్తుంది. వీటి బరువు తలకుమించినదౌతుంది. అందుచేత ఎక్కువ ఎత్తుకు పంప నుద్దేశించిన రాకెట్లలో ఇంధన ద్రవ్యాలుగా ఘనపదార్థాలను ఉపయోగించటం సాధ్యం కాదు. ఘనపదార్థాలకు మారుగా ద్రవపదార్థాలను ఇంధనాలుగా వాడవచ్చునసే అభిప్రాయం కలిగినా 1926 వరకూ ఈ ప్రక్రియను సాధించినవా రెవరూ లేరు.

1926 లో, గొడార్డ్ (Goddard) అనే శాస్త్రవిజ్ఞానవేత్త, అల్కహోలునూ, ద్రవరూపంలో వున్న ఆక్సిజనును కలిపి ఒక ఇంధనద్రవ్యాన్ని తయారుచేసుకుని దాన్ని వాడిచూచాడు. గొడార్ట్ ప్రయోగించిన రాకెట్ ఒక మైలుకు మించి ఎగరలేదు. గాలి గుమ్మటాలు ఎగురుతున్న ఎత్తుతో పోల్చిచూస్తే యిదేమీ చెప్పుకోదగిన సంగతి కాకపోయినా, రాకెట్ విన్యాసానికి సంబంధించినంతవరకు, ఇది ప్రధానమైన ముందడుగేనని చెప్పాలి.

రెండవ ప్రపంచయుద్ధ తరుణంలో నాజీలు ప్రయోగించిన 'వి—2' అనే రాకెట్ ఆయుధాల సంగతి అందరికీ జ్ఞప్తి వుండేవుంటుంది. ఈ 'వి—2'ల నిర్మాణం, రాకెట్‌కు సంబంధించిన సాంకేతిక విజ్ఞానంలో మహత్తరమైన పురోగమనమని అంగీకరించి తీరాలి. సాంకేతికరంగంలో మానవుడు సాధించిన మహత్తర విషయాలన్నీ, యుద్ధావసర పరిణామాలుగానే సాధింపబడుతూ వుండటం దురదృష్టకరమైన విషయం. విమానాలు, జలాంతర్గాములు, అణ్వస్త్రాలు ఇవన్నీ యుద్ధావసరాలకోరకు నిర్మింపబడినవే కదా?

వి—2 రాకెట్ పొడవు 46 అడుగులు వుంటుంది. ఆక్సిజన్ ద్రవం, ఆల్కహాలూ కలిపి దానికి ఇంధనంగా వాడేవారు. ఇది గంటకు 3000 మైళ్ళ వేగంతో పోతుంది. దానితో వున్న యిబ్బంది వొకటే, ఇది వదలిన వారి చెప్పుచేతల్లో వుండదు. అందుచేత ఒక ప్రత్యేక లక్ష్యాన్ని ఛేదించాలంటే దీన్ని నమ్ముకుని లాభం లేదు.

యుద్ధం ముగిసిన అనంతరం, ఇటు రష్యనులు, అటు అమెరికనులూ కూడా, ప్రతిభాశాలురైన జర్మన్ శాస్త్ర విజ్ఞానవేత్తలను చాలామందిని, తమ తమ దేశాలకు తీసుకొని వెళ్ళారు. వీరిలో, 'వి—2' నిర్మాత హెర్మన్ వాన్ బ్రాన్.(Herman Vaun Braun) అమెరికాలో వుండి ఖండాంతర వేధి ఆయుధ నిర్మాణంలో ప్రముఖపాత్ర వహించుకున్నారు. ఈ ఖండాంతర వేధి ఆయుధోత్పత్తికి వి—2 బీజప్రాయమైనది. ఈ ఖండాంతర వేధి ఆయుధాలను నిర్మించటానికి, వాటిని సర్వసంపన్నములైన తిరుగులేని ఆయుధాలుగా రూపొందించటానికి, ఇటు అమెరికా, అటు రష్యాకూడా చాలా తీవ్రంగా కృషిచేస్తున్నాయి. ఈ ఖండాంతర వేధిరాకెట్లు అటంబాంబులనూ, హైడ్రోజన్ బాంబులనూ ముక్కులకు తగిలించుకుని, నిరాటంకగతిని, నిరవధిక వేగంతో, శత్రు కేంద్రాలకు వెళ్ళి ఈ బాంబులను వదిలి వాటిని ధ్వంసం చెయ్యాలి. ఈ రాకెట్‌ను వదులుతున్న విన్యాసకేంద్రమునుంచి, రేడియో, రాడార్ మొదలైన సాధనలతో దాని గమనాన్ని అదుపు చేసి క్రమబద్ధం చేసే సావకాశం వుండాలి.

ఇప్పుడు నిర్మింపబడుతున్న ఈ ఖండాంతర వేధులు, ముందు రానున్న విశ్వాంతరయాననౌకలకు ప్రాథమిక ప్రాతిపదికలు కానున్నవని మనం ఊహించవచ్చు. ఈ ఖండాంతర వేధుల నిర్మాణం సంపూర్ణంగా ఫలోన్ముఖమైనప్పుడు, విశ్వాంతరయానం సుసాధ్యమౌతుంది.

ఈ ఖండాంతర వేధులు చోదితాస్త్రాలుగా వుంటేగాని లాభంలేదని చెప్పాం. చోదితాస్త్రమంటే, విన్యాసకేంద్రంనుంచి దీని గమనాన్ని క్రమబద్ధంచేసి లక్ష్యసిద్ధిని చేకూర్చే అవకాశం వుండాలి. రాడార్ సాధనాన్ని అభివృద్ధిచేస్తే, ఈ ఆయుధాలను ఇలా అదుపుచేసే సావకాశం కలుగవచ్చు. ఇటీవల 'జర్ మేనియమ్' స్ఫటికాల గుణగణాలనుగురించి జరిగిన పరిశోధన ఫలితాలు చూస్తే, ఈ అడ్డంకులను త్వరలోనే అధిగమించవచ్చు ననిపిస్తుంది. ఇది ఇలా వుండగా మరికొన్ని యితర బాధలున్నాయి. రాకెట్లకు తగునైన ఇంధన ద్రవాలు లభించాలి. ఈ ఇంధన ద్రవాలలో చాలా భాగం ఇతరపదార్థాలను తినివేసే స్వభావం కలవి. ఇలాంటివి రాకెట్‌నే తినివేయవచ్చు. రెండవది: ఈ రాకెట్ల నిర్మాణానికి ఉపయోగించే పదార్థం వాతావరణ కర్షణవల్ల తగలబడి భస్మమైపోకుండా నిలువగలిగేదిగా వుండాలి.

ఈ సాధన సంపత్తిని చేకూర్చుకోవటానికి అమెరికన్ సైనికశాఖవారు తీవ్రంగా కృషిచేస్తున్నారు. కాని ఈ ఖండాంతర వేధి కార్యక్రమంలో ప్రధాన పాత్ర వహించుకున్న వాన్ బ్రాన్ విశ్వాంతర యానానికీ ఒక పథకాన్ని తయారుచేసి అక్కడ పెట్టారు. ఈయన, శాస్త్రవిజ్ఞాన జగత్తు వదలి కాల్పనిక జగత్తులో విహరించుకున్నారని ఈయన పథకాన్ని అవహేళన చేస్తున్నవారు లేకపోలేదు. ఏదియేమైనా ఆయన భూమినుండి పైకి లేచిపోవటానికి, అక్కడనుంచి విశ్వాంతరంలో విహరించటానికీ ఒక సమగ్రమైన పథకాన్నే తయారుచేశారు. అది ఆచరణసాధ్యమా కాదా అనేది ప్రయోగానంతరంగాని తేలే విషయం గాకపోయినా, ఈ పథకం పరిశీలనార్హం.

ఇక్కడ, అసలు భూమితో తెగతెంపులు చేసుకుని పైకిపోవటానికిగల అటంకాలేమిటో, వాటిని అధిగమించటానికి అవసరమైన సాధనసంపత్తి యేమిటో ముందు విచారించవలసివుంది. భూమ్యాకర్షణ శక్తిని అధిగమించట మెలా అనేది ప్రధానసమస్య. మనం

వాడే రాకెట్‌కు ఒక నిర్దిష్టమైన గమనవేగాన్ని చేకూర్చగలిగితే ఇది సాధ్యమౌతుంది. దీన్ని 'అధిగమన వేగం' (Escape Velocity) అంటారు. ఈ అధిగమన వేగం గంటకు 25000 మైళ్లు వుండాలి. అంటే సెకనుకు 7 మైళ్లు. ఈ గమనవేగాన్ని సాధించగలిగితే, భూమ్యాకర్షణను అధిగమించి విశ్వాంతరంలో ప్రవేశించవచ్చు. భూవాతావరణం అవధిని దాటితే తరువాతి గమనం మరింత సులభమౌతుందంటున్నారు. విశ్వాంతరంలో ప్రవేశించిన తరువాత చంద్రగోళానికిగాని ఇతర గ్రహాలకుగాని తేలికగా చేరవచ్చు.

ఇక రెండవ అటంకం — వాతావరణ కర్షణ: దినదినం మనం ఉల్కలు రాలిపడటం చూస్తూనే వుంటాం. ఇతర గోళాలనుంచి ఊడిరాలిన యీ ముక్కలు, అత్యంత తీవ్రవేగంతో రివ్వున దూసుకొనివస్తూ, ఆ తీవ్రవేగంతో భూమియొక్క వాతావరణంలో ప్రవేశించగానే, కన్నుమూసేక్షణంలో, క్రిందపడకుండా మధ్యమార్గంలోనే భస్మమై కర్పూరంలా హరించిపోవటంకూడా మనం దినదినం చూస్తూనే వుంటాము. వాయుకర్షణవల్ల ఉల్కలు అలా మండిపోతాయి. తీవ్రమైన వేగంతో, రాకెట్లు వాయుగర్భంలోనుంచి పయనించేటప్పుడు వాటికికూడా ఇదే దుర్గతి పడుతుంది. ఈ వాయుకర్షణప్రభావాన్ని తట్టుకోగల, తగిన లోహాలుగాని, లోహమిశ్రమాలుగాని, ఇంతవరకు పెంపొందింపబడలేదు. కాని రష్యనుల 'స్పుట్నిక్' విన్యాసానంతరం, ఇట్టిది సాధింపబడినట్లు మనం ఊహించవలసి వస్తున్నది. రాకెట్ విన్యాసరంగంలో రష్యనులు విశేష సాంకేతికపరిజ్ఞానం సంపాదించారని 'స్పుట్నిక్' ప్రయోగంతో స్పష్టంగా తేలిపోయింది.

ఖగోళశాస్త్రం చాలా కచ్చితమైన శాస్త్రం, విశ్వాంతరంలో పరిభ్రమించుతున్న గోళాలనుగూర్చి మనకు అనేక విషయాలు తెలుసు. అందుచేత, విశ్వాంతరయాన నౌకలను, విశ్వపథానికి లేపగలిగినప్పుడు ఆయా గోళాలను చేరటానికి అవి యే యే దిక్కులకు పోవాలో ఆ యానమార్గాలను మనం తేలికగా లెక్కగట్టి నిరూపించవచ్చు.

విశ్వాంతరయానావకాశాలను సమీక్షచేస్తూ ప్రసిద్ధ శాస్త్రవేత్త లియనార్డు ఇలా అన్నారు: "స్పెయిన్ అగ్రంలోనుంచుని అమెరికాఖండం ఉనికిని స్థిరం చేసుకుని, ఆ ఖండాన్ని చేరుకోవటానికి తెప్పపడవలో బయలుదేరబోతున్న కొలంబస్ పరిస్థితి ఆనాడు ఎలా వున్నదో, ఈనాడు విశ్వాంతరయాన రంగంలో మన పరిస్థితి సరీగా అలానేవుంది. ఇంచుమించు ప్రాంగణంలో వున్నాం"

ఒకే ఒక రాకెట్‌తో విశ్వాంతరయానానికి ఉపక్రమించటం సాధ్యంకాదని శాస్త్రవేత్తలు మొదటినుంచీ చెబుతున్నమాటే. ఎలాంటి రాకెట్‌ను నిర్మించినా ఒకే ఒక రాకెట్, "అధిగమనవేగాన్ని" అందుకోలేదు. ఇది పెక్కు రాకెట్ల సమీకరణ అయివుండాలి. అట్టడుగు రాకెట్ పేలి కొంతదూరం పోయి దానిలోని ఇంధనద్రవ్యం అయిపోగానే అది ఊడి క్రిందపడిపోవాలి. అప్పుడు తక్షణం రెండవది పేలాలి — ఇలా ఒకదానివెంట ఒకటి పనిచేస్తేనే గాని తగిన 'అధిగమనవేగాన్ని' అందుకోలేదు. గంటకు 25000 మైళ్ళ ఈ అధిగమనవేగాన్ని అందుకోవటానికి కనీసం 3 రాకెట్ల దొంతరను వాడాలని లెక్కగట్టారు. ఒక చిన్న మోటారుకారంత బరువున్న ఒక బరువును విశ్వాంతరంలోకి పంపాలంటే, దాన్ని మోసుకుపోవటానికి వాడే రాకెట్ల బరువు ఒక పెద్ద సముద్రపు ఓడ బరువంత వుంటుందని కూడా అంచనా వేశారు.

ఈ అంచనాలను, ఇప్పుడు 'స్పుట్నిక్' విన్యాసాన్ని గురించి రష్యనులు ప్రకటించిన అంకెలతో పోల్చి చూడవచ్చు. ఈ రాకెట్లను నిట్టనిలువుగా పంపలేదని అందరూ అంగీకరించుకున్న విషయమే. ఈ కృత్రిమగోళం ఇప్పుడు ఒక నిర్ణీత వలయంలో భూమి చుట్టూ తిరుగుతున్నది. దాన్ని ఆ వలయంలో స్థాపన చేయాలంటే నిట్టనిలువుగా పైకి పంపి లాభంలేదు. దాన్ని ఆవలయంలో స్థాపించటానికి భూభాగానికి సమాంతరంగా పోయే గమనాన్ని ఏ దశలోనో దానికి కొంత కలుగజేసి వుండాలి. ఈవిషయం నిజమేనని రష్యన్ పత్రిక 'ప్రావదా' కూడా అంగీకరించింది. రష్యన్‌శాస్త్రవేత్తలు ప్రకటించుతున్న వివరాలనుబట్టి ఈకృత్రిమ గోళాన్ని విసరటానికి ఉపయోగించిన రాకెట్ల గమనవేగం గంటకు 18000 మైళ్లు మాత్రమే. ఇది భూమ్యాకర్షణ శక్తిని అధిగమించటానికి వలసిన 25000 మైళ్ళ 'అధిగమనవేగాని' కంటే చాలా తక్కువ. పైన వివరించిన విధంగా రష్యనులు దీని విన్యాసాన్ని ఒక ప్రత్యేకమైన పద్ధతిని నిర్వహించా

రవటం స్పష్టం. విశ్వాంతరయానకేంద్రంగా నిర్మించబోతున్న గోళాన్ని ప్రత్యేకమైన పద్ధతిలో విన్యాసం చేయాలని వాన్‌బ్రాన్, మిగతా శాస్త్రజ్ఞులూ అంటున్నదే. వాటిని మొదట కొంచెం ఏటవాలుగా వదలాలి, అనంతర గమనంలో వేసే రాకెట్లు దీన్ని తిరిగి నిట్టనిలువుగా పంపాలి అన్నారు. రష్యనులు పంపిన గోళం భూమి చుట్టూ గంటకు 18000 మైళ్ళ వేగంతో భ్రమణం చేస్తున్నది—560 మైళ్ల ఎత్తున. ఇది ఇంతయెత్తున పోవటంలేదని కొందరంటున్నారు. భూమియొక్క వ్యాసం షుమారు 7916 మైళ్ళు వున్నదనీ, భూమధ్య కేంద్రం, కేంద్రంగా, ఈకృత్రిమ గోళంయొక్క గమనవలయం యేర్పడ్డదనీ మనం దృష్టియందు వుంచుకుంటే స్వల్ప వ్యత్యాసాలు గమనించదగినవి కావు.

ఈకృత్రిమ గ్రహాన్ని విన్యాసం చేయుటంవల్ల నూతనంగా లభించనున్న శాస్త్ర విజ్ఞాన విషయాలు, విశ్వాంతర యానాన్ని గూర్చి పూర్వం వ్యాప్తిలోవున్న అనేక ఊహాలను తారుమారు చేయవచ్చు. కాని పూర్వం శాస్త్రజ్ఞులుచేసిన ఊహాలూ, కట్టినలెక్కలూ వేసిన అంచనాలూ చాలావరకు నిజమేనని యిందువల్ల రూఢి.అవుతోంది. రష్యనులు సాధించిన విషయాలేమిటో వారు బహిర్గతం చెయ్యకుండావున్న కారణంగా వాటినిగురించి కచ్చితంగా చెప్పటానికి అవకాశంలేదు. అందుచేత, అమెరికన్ వర్గాలనుంచి మాత్రమే లభించిన వివరాలను ఒకదానికొకటి చేర్చి, విశ్వాంతరయానరంగంలో సాధించిన పురోగమనాన్ని అంచనా వేయవలసి వస్తోంది.

ఇక వాన్‌బ్రాన్ పథకాన్ని కొంచెం పరిశీలించుదాం. ఈ పథకంలోని ప్రధాన విషయాలు ఇవి: విశ్వాంతరంలో 1000 మైళ్ళ ఎత్తున ఒక విశ్వాంతర యాన కేంద్రాన్ని ('స్పేస్ స్టేషన్')(Space Station) నిర్మించాలి. ఈ స్టేషన్ నిర్మాణానికి కావలసిన వివిధ భాగాలను ముందుపంపి ఒక వలయంలో తిరుగుతూండేట్టు స్థాపించాలి. అనంతరం మనుష్యులు పైకిపోవాలి. ఈ భాగాలన్నిటినీ ఒకటిగాచేర్చి స్టేషన్ కట్టాలి. ఈ కేంద్రాన్ని విశ్వాంతరయాన నౌకల, లేదా రాకెట్ల నిర్మాణకేంద్రంగా ఉపయోగించాలి. ఈ పథకంలో వున్న వైచిత్రియావత్తూ ఇక్కడేవుంది. ఇక్కడనుంచి యాననౌకలను వదలటం చాలా సులభమట. అక్కడనుంచి చంద్రగోళానికి వెళ్ళాలంటే. 7000 మైళ్ళ గమనవేగంవున్న నౌక చాలట. అంటే భూమిమీదినుంచి లేవటానికి కావలసిన వేగంలో ఇంచుమించు నాలుగోవంతు. ఈ స్టేషన్ నిర్మాణానికి కావలసిన పరికరాలను పైకి పంపటానికి వాన్‌బ్రాన్ ఒక సమగ్ర ప్రణాళికను వివరాలతోసహా తయారుచేసే వుంచారు. స్టేషన్ నమూనా విషయంలోనే ఇంకా కొంత ఆలోచిస్తున్నారు. ఈ స్టేషన్ నెమ్మదిగా తిరిగే చక్రాకారంలోవుంటే వీలుగా వుంటుందని ఆయన అభిప్రాయం. దానికి కొంత కృత్రిమాకర్షణశక్తి లభిస్తుందనీ స్వల్ప పరికరాలతో నిర్మించవచ్చుననీ ఆయన ఊహ. ఈ స్టేషన్ భాగాలను పైకిపంపటానికి మూడు అంచెల రాకెట్లను చాలా వాటిని తయారుచేయాలి. వాటిలో ఒకొకదాని బరువు ఇంధనద్రవ్యాలతో సహా 7000 టన్నులు. దీన్ని పేలిస్తే 84 సెకండ్లలోపల 5250 టన్నుల బరువుగల ఇంధనాన్ని వ్యయంచేసి మొదటి రాకెట్ రాలిపోతుంది. ఇక 990 టన్నులు బరువుగల రెండు రాకెట్లు మాత్రమే మిగులుతాయి. మరొక 124 సెకండ్లయేసరికి రెండో రాకెట్ కూడా రాలిపోతుంది. ఇక 143 టన్నులు మాత్రం బరువుగల చివరి రాకెట్ మిగులుతుంది. ఇది 1075 మైళ్ళ ఎత్తుకు ఎగిరి అక్కడనుంచి నెమ్మదిగా పడిపోనన్నాపోతుంది లేదా భూమిచుట్టూ తిరుగుతూ విశ్వాంతరంలో నిలిచన్నాపోతుంది. దీని గమనవేగం 15840 మైళ్ళు వుంటుంది.

ఇదంతా కేవలం ఊహామాత్రమైన ప్రణాళికే ననుకోండి! అయినా వాన్‌బ్రాన్ గారు చెబుతున్న ఈ బ్రహ్మాండమైన రాకెట్లను నిర్మించాలంటే, అత్యంత వ్యయప్రయాసలతో కూడుకున్న వ్యవహారం మాట అటుంచి ఈ రాక్షస యంత్రాలు అదుపుతప్పితే అప్పుడు ఎక్కడ ఏంజరిగి ఎలా పరిణమించుతుందనేది ఊహాకందని విషయం. అమెరికనులు న్యూమెక్సికోలోని 'వైట్ శాండ్స్' అనే చోట, ఈఖండాంతర వేధి రాకెట్ల కార్యక్రమాన్నంతా సాగించుతున్నారు. ఇక్కడ జరిగే పరీక్షలలోనే ఒకొక్క రాకెట్ ఉన్నట్టుండి అదుపుతప్పి, దాని యిష్టం వచ్చినట్టు వ్యవహరించుతూ వుంటుంది.

'స్పుట్నిక్'తో రష్యనులు కొంత ముందుకు పోయారు గనుక వారితో పోటీకి అమెరికనులు కూడా

తమ పరిశోధనలను యింకా తీవ్రం చేయవచ్చు. ఇటీవల అమెరికనులు ఒక రాకెటును 4000 మైళ్ళ ఎత్తుకు పంపినట్లు ఒక వార్త వచ్చింది. ఇది అనధికారవార్త కావటంవల్ల ఇందులో కొంత అతిశయోక్తి వుందని అంగీకరించినా ఇది పెద్ద పురోగమనమేనని అంగీకరించాలి.

రష్యనులు విన్యాసంచేసిన ఈ బాలచంద్రునివల్ల కలిగే ప్రయోజనం యేమిటి అని కొందరంటున్నారు. భూవాతావరణాన్ని అతిక్రమించిన అనంతావధిలో వుండే స్థితిగతులేమిటో మనం దానివల్ల తెలుసుకోవచ్చు. భూమిచుట్టూ వున్న ఈ వాయుగర్భం మన్ని ఎలా రక్షించుతోందో ఇటీవలనే మనకు అర్థమైంది. ఉల్కలు, విశ్వాంతరయాన నౌకలు ఎదుర్కోవలసిన భయంకర ప్రమాదాలలో మొట్టమొదటివి. ఇవి ఈ నౌకలను ఫిరంగిగుండ్లు లా ఎదుర్కొని ఛిన్నాభిన్నం చేస్తాయి ఈ ఉల్కలు అనుక్షణం వేలాది సంఖ్యలో భూమివైపు ఫిరంగిగుండ్లులా దూసుకువస్తూ వుంటాయి. కాని అదృష్టవశాత్తూ, ఇవి తీవ్రతరమైన గమనవేగం కలిగివుండటంచేత భూవాతావరణంలో ప్రవేశించగానే వాయుకర్షణవల్ల మండి భస్మమైపోతాయి. అవిధంగా మనం తలలు బ్రద్దలైపోకుండా రక్షింపబడుతూ వున్నాము. సోవియెట్ స్పుట్నిక్ చాలా చిన్నది కావటంచేత వీటి ప్రమాదాలనుంచి తప్పుకుంటూ వుండవచ్చు. అంతేగాని ఈకృత్రిమ గోళాలు ఏమాత్రం పెద్దవైనా అవి ఉల్కల ప్రమాదాన్ని ఎదుర్కోవలసి వస్తుంది.

ఇక రెండవప్రమాదం విశ్వకిరణాల ప్రసరణ: (Cosmic Radiation). ఈ కిరణాలు విశ్వాంతరంలో ఎక్కడ ఎలా ఉత్పత్తి అవుతున్నాయనేది అంతు తెలియని యింద్రజాలంగావున్నా వాటి ఉనికిమాత్రం విస్పష్టమైపోయింది. ఈ కిరణాలు, ఊహించటానికి వీలులేని గమనవేగంగల అణువులను కలిగివుంటాయి. ఏ పదార్థమూ వీటిధాటికి తట్టుకోలేదు. ఈ విశ్వకిరణాలు భూవాతావరణంలోనుంచి దూసుకువచ్చి భూమిలోకి కొన్నివందల అడుగులలోతువరకూ చొచ్చుకుపోతూ వుంటాయి. జీవకండరాలమీద వాటిప్రభావమెట్టిదో—అది ఒక అంతుతెలియని అజ్ఞాతభీభత్సం! నిజానికి జీవపరిణామంలోవస్తున్న విపర్యయము (Mutations) లకు ఈ విశ్వకిరణప్రసారమే కారణమనుకుంటున్నారు. విపర్యయమంటే పరిసరానుకూల్యంగా పెంపొందటమని పొరపాటుగా అర్థం చేసుకోగూడదు. జీవపరిణామానికి పరిసరానువృత్తి కారణమనే బహుజనవిశ్వాసం వుంది. కాని, జీవపరిణామానికి ప్రధానకారణం, విపర్యయమనీ, ఇది పరిసరానువృత్తికి అతీతమైనదనీ నవీన శాస్త్రజ్ఞులు ఇప్పుడు చెబుతున్నారు. ఈ విపర్యయకారణంగా మార్పుచెందుతున్న జీవరాసులను పరిసరానువృత్తి సంస్కరించుతుంది. పరిసరానువృత్తి లేని పరిణామజీవులు నశించుతాయి. కోతిమానవుడుగా పరిణామం చెందటానికి విశ్వకిరణప్రసరణవల్ల కలిగిన విపర్యయమే కారణమై వుంటుంది. ఈ విశ్వకిరణ ప్రసారంనుంచి తప్పుకోవటానికి, శాస్త్రీయవిజ్ఞాన విషయాలను పురస్కరించుకుని కాల్పనిక రచనలు చేసేవారు (Science - fiction Writers) చిత్రవిచిత్రాలైన అనేకసూచనలు చేస్తున్నారు. అవన్నీ కేవలం ఊహాసౌధాలు. విశ్వకిరణప్రసారంనుంచి ఏవిధమైన పరిరక్షను సాధించటానికైనా ఇంకా చాలా కాలం పడుతుంది.

భీతావహములైన ఈ ప్రమాదములస్థితి ఇలావుండగా, విశ్వాంతర యాత్రికులు యెదుర్కోవలసిన చిక్కులు ఇంకా చాలావున్నాయి. మనం భూమ్యాకర్షణకు ఎంతో అలవాటుపడివున్నాము. అట్టి ఆకర్షణ లేనిస్థితిలో శారీరకంగానూ, మానసికంగానూ కూడా మన స్థితి కల్లోలమైపోవచ్చు. ఈ స్థితిరాకుండా చేయటానికి కృత్రిమంగా కొంత ఆకర్షణను నిర్మించుకోవలసి వస్తుంది. విశ్వాంతరంలో వున్న పరిస్థితులు స్పష్టంగా తెలిస్తేనేగాని, దానికి తగువైన సాధనలను ఊహించటానికి సావకాశం వుండదు.

మామూలు రైలుప్రయాణం చేస్తుంటేనే మన వాళ్లకు ఒళ్లు తిరగటం, కళ్లు తిరగటం వేవిళ్ల మనుషుల్లా వాంతులు చేసుకోవటం ఇవన్నీ ప్రారంభమౌతాయి—గంటకు 40 మైళ్లు మించని ఈ వేగానికే. 25000 మైళ్ల వేగంతో పోతున్న మనుష్యులసంగతి ఎలావుంటుందో ఊహించండి! ఇంత భయంకర చలనం జీవకండరాలనుకూడా విచ్ఛిన్నం చేయవచ్చు.

ఇంతవరకూ ఇవి మనం ఊహించగల ప్రమాదాలు, విశ్వాంతరంలో మనఊహకు అందని ప్రమా

దాలు ఇంకా ఎన్నో వుండవచ్చు. ఏది ఏమైనా విశ్వాంతరయానాన్ని సాధించటానికి తీవ్రమైన ప్రయత్నాలు సాగుతున్నాయి. విజయం చేకూరేదినం అతి సన్నిహితమై వున్నదనే ఆశించుదాం. వాన్ బ్రౌన్ పథకంలోవున్న అనేక చిక్కులను ఇతర శాస్త్రవేత్తలు ఎత్తిచూపి తీవ్రంగా విమర్శించుతున్నారు. ఇలా ఎత్తిచూపుతున్నారు గనుక వీటిని అధిగమించగల శక్తులనుకూడా త్వరలోనే శాస్త్రజ్ఞులు సాధించవచ్చు. విశ్వాంతరాధిపత్యంకొరకు రష్యా అమెరికాలమధ్య చెలరేగిన పోటీదృష్ట్యా, ఈ కార్యం త్వరలోనే సిద్ధించవచ్చు.

నూతనంగా మనం విశ్వాంతరంలో నిర్మించ నూహించుతున్న స్టేషన్నుంచి, చంద్రుణ్ణి చేరుకోవటానికి 7000 మైళ్ళ గమన వేగమున్న వాయునౌక చాలునని పైన చెప్పుకున్నాం. అంగారక గ్రహాన్ని చేరటానికి అంతకంటె ఇంకా కొంచెం గమనవేగమున్న వాయునౌక కావాలి. విశ్వాంతర కేంద్రంనుంచి దాన్ని నిర్ణీతమైన కాలంలో, నిర్ణీతమైన దిక్కుగా వదలాలి— అంగారకుని గమనాన్ని, భూమిచుట్టూ తిరిగేటప్పుడు ఈ విశ్వాంతరయాన కేంద్రగమనాన్ని లెక్కగట్టి. శుక్రగ్రహానికి పోవాలంటె ఈ నౌకను అంగారక గ్రహానికి పంపేదిక్కుకు ఎదురుగావున్న దిక్కుకు పంపాలి.

సూర్యకుటుంబ గ్రహాలలో భూమితో పోలిక చేయదగిన గ్రహాలు అంగారకుడూ, శుక్రుడూ, ఇవి రెండే. అంగారక గ్రహ వ్యాసము 4230 మైళ్లు. శుక్ర గ్రహ వ్యాసము 8008 మైళ్లు. శుక్రగ్రహంమీద ప్రాణవాయువు (Oxigen) లేదంటున్నారు. అందుచేత అక్కడ జీవరాసుల ఉనికికి ఆస్కారం కనుపించదు. అంగారక గ్రహంలో అట్లాంటి ఆస్కారం కనుపిస్తున్నది. (ఇది వేరే ప్రత్యేకవిషయం. ఈ విషయాన్ని ఇక్కడ చర్చించటానికి అవకాశం లేదు.) అక్కడ ఏదోరకం జీవరాశి ఉండే ఆస్కారముంది అనేమాట నిజం. కాని బహుళప్రచారంలో వున్న 'శుక్రగ్రహంలోని కాలువలు' వగైరా వ్యవహారమంతా వట్టి అభూతకల్పన.

ప్రతిదీ అసాధ్యమంటూ కూర్చునే నిరాశావాదులు కొందరు ఎప్పుడూ వుంటూనే వుంటారు. అలాగే, ఈ విశ్వాంతరయానం కడంటూ సాగే వ్యవహారం కాదని కొందరంటూనే వున్నారు. కాని మానవుడు త్వరలో విశ్వపథాన్ని జయించబోతున్నాడని ప్రపంచం సర్వత్రా పలువురు విశ్వసించుతున్నారు.

ఇందిర

శ్రీ మాస్తి వెంకటేశఅయ్యంగార్

* కన్నడ రచనకు అనువాదం *

నారాయణమూర్తి జీవితానికి ఇంటా బయటాకూడా సుఖంలేదు. అనేక కారణాలవల్ల ఎప్పుడూ దుఃఖంగా వుంటూ వుంటాడు. కచ్చేరీనుండి యింటికి వచ్చి ఏదో విసంగా రెండు ముద్దలు మింగి పడక గది లోకివెళ్ళి కూర్చున్నాడు. అతని భార్య యింట్లో పనులు చేసుకొంటూవుంది. "పాపం, ఒక్కతే చేసుకొంటూ వుంది పనులన్నీ, సాయంచేసేవాళ్లు ఎవ్వరూ లేరు." అని అనుకొన్నాడు. ఇంకా యిలా అనుకొన్నాడు. "ఇందిరో! ఆమె కూడా యింటిపనులన్నీ తానే చేసుకొంటూ వుండేది. అయినా ఎప్పుడూ నవ్వు ముఖంతో ఉండేది. అయితే యింతమంది పిల్లా జెల్లా ఇందిరకు లేరు. అబ్బ, యీ పిల్లల బాధను వర్ణించడం కష్టం. పిల్లలు లేనివాళ్లు అయ్యో! మాకు పిల్లలులేరు, సంతాన సుఖం మేము పొందడంలేదు, అని బాధపడుతూ ఉంటారు. పిల్లలు వున్నవాళ్ళ బాధ వేరేలా ఉంటుంది. పాపం, ఆ బిడ్డణ్ణి ఆసుపత్రిలో వదిలి వచ్చాను. ఇక్కడ ఇంట్లో పక్కలమీద పడుకొని నిద్రిస్తూ వున్న పిల్లలమాదిరిగా వాడుకూడా మా పిల్ల వాడేగదా! కాని సావిత్రి అలా భావించడంలేదు. ఇందిర బ్రతికివుంటే యిలా ఉండేదా!"

ఇలా ఆలోచిస్తూ వుండగానే నారాయణమూర్తికి కునుకు వచ్చింది. దుఃఖంగా వున్న మనస్సు, అలసిపోయిన శరీరం—యీ రెండిటికీ విశ్రాంతి అవసరం. ఇంతలో అక్కడికి ఇందిర వచ్చింది.

ఆమె ఎలా వుంటుందో తెలియు నంతవరకు ఆమె రాకలోవున్న అంతరార్థం మీకు బోధపడదు. ఇందిర మంచిరూపసి. కోలముఖం. నిర్మలంగాను అందంగాను మిసమిసలాడుతూవుంది ఆమె ముఖకాంతి. ఆ అందం రెండు కనుబొమల మధ్యగా వెళ్ళి కనుదోయి మీదకు మళ్ళింది. వికసించిన మల్లె పుష్పాలలా వున్నాయి ఆమె నేత్రాలు. ఆ సుందర పుష్పాల్లో నల్లని తుమ్మెదలు చిక్కుబడిపోయి బైటకురాలేక చంచలంగా అటూ యిటూ తిరుగుతూ వున్నవి. "ఇదిగో, వదిలివేశాం" "ఇదిగో వదలలేదు." అంటూ ఆ తుమ్మెదల్ని ఆశపెడుతూ వున్నవి ఆ కనురెప్పలు. పొడుగుపాటి అందమైన ముక్కు. సగం వికసించిన గులాబీ రెక్కల్లాంటి పెదవులు. సన్నని, తెల్లని బియ్యపు గింజల్లాంటి పండ్లు. పసుపుపచ్చగ నిగనిగలాడే బుగ్గలు. ముఖాన రెండు కనుబొమల మధ్య కొంచెం పైగా చిన్ని కుంకంబొట్టు. నిజానికి చాలా అందమైన ముఖం ఇందిరది. అంత పొడగరీకాదు, అంతపొట్టీకాదు. చూపటానికి సామాన్యంగా వుంటుంది. మొత్తంమీద ఇందిర అపరూపసుందరి.

ఆమెను చూస్తేనే చాలు సంతోషం కలుగుతుంది. సంతోషమే గాదు. ఎంతకోపం వచ్చినా మటుమాయమై పోవలసిందే. మన కోపాన్ని వ్యాకులతను తొలగించే వాళ్ళు రావడం మనకు యిష్టం వుండదు కారణం వాళ్లు 'మన వాళ్లు' కావడమే. అందువల్లనే నారాయణమూర్తి ఇందిరను చూచికూడా ఏమీ మాట్లాడలేదు.

ఇందిర అతని దగ్గరకు వచ్చింది. అతని ముఖాన్ని పైకి ఎత్తుతూ చిరునవ్వు నవ్వి అన్నది—"అప్పుడే నిద్ర వచ్చిందీ! మాట్లాడరేం? అయితే వుండండి దానికి యిదే మందు" అంటూ ఆమె నారాయణమూర్తి ఒడిలో కూర్చున్నది.

దైవవశ్యాన్ని ప్రేమ అత్యద్భుతంగా జయించింది. రాగికీ బంగారానికీ ఎక్కువ తేడావుంటుందా లేక ప్రసన్నతకూ అప్రసన్నతకూ ఎక్కువ తేడావుంటుందా? దైవవశ్యం రాగిని బంగారం చేయలేదుగాని ప్రేమమాత్రం ఆపని చేసివేస్తుంది. అప్రసన్నతను ప్రసన్నతగాను, శత్రువును మిత్రునిగాను, దుఃఖంతో క్రుంగిపోయేవారిని సుఖవంతులుగాను చేసివేస్తుంది.

అనువాదకులు : శ్రీ వేమూరి రాధాకృష్ణమూర్తి

ఆకాశంలో విహరించే తారలాంటి అందమైన రమణి నారాయణమూర్తి ఒడిలో కూర్చునే సరికి అతని మనస్సు చంద్రునిలా చల్లబడి పోయింది. అతనికోపం శాంతించింది. వ్యాకులత తొలగిపోయింది. నారాయణమూర్తి ఆమెను హృదయానికి గట్టిగా హత్తుకున్నాడు.

"ఇందిరా!" అని పిలిచాడు.

"నేను, మాట్లాడను. ముందుగా నేను పలకరిస్తే మీరు పలకలేదుగా! యిక మీరు ఇందిరా, ఇందిరా అని యిరువది సార్లు పిలిచినా పలకను. నోరుకదపను.

"ఇందిరా!"

"నోరుకదపనని చెప్పలేదూ!"

"అయితే నోరు కదపకుండానే యిన్నిమాటలు మాట్లాడుతూ వున్నావా?"

"అదిగాదు. మళ్ళీ నన్ను పేరుబెట్టి పిలుస్తారని అలా అన్నానండీ!"

"ఏం! ఎందుకు?"

"మీరు నన్ను పేరుబెట్టి పిలిస్తే నాకు ఎంతో సంతోషం కలుగుతుంది!"

"నిజంగానా!"

"కాకపోతే యిందులో సందేహమా!"

"అయితే దీన్ని అబద్ధమనే భావించవచ్చు."

ఇందిర నారాయణమూర్తి భుజంమీద తన తల ఆనించింది. నారాయణమూర్తి చెక్కిలిని ఇందిర ఉచ్ఛ్వాసనిశ్వాసాలు స్పృశించాయి. ఆమె ముఖాన్ని రెండుచేతుల్లోకితీసుకొని చూచాడు. అబ్బ, ఎంత అందమైన ముఖం! ఆమె నేత్రాల్లో అపారమైన ప్రేమనిండివుంది. ఇందిరను గట్టిగ కౌగలించుకున్నాడు.

"ఇందిరా అని నేనుపిలిస్తే నీకు అంత సంతోషం ఎందుకు కలుగుతుంది?"

"ఏమో నాకు తెలియదు."

"తెలియకుండా ఎందుకు ఉంటుంది! నిజం చెప్పు."

"ఏమి చెప్పాలో నేర్పండి. అలాగే చెబుతాను."

"నేర్పితే చెప్పేటందుకు నీలాంటి తెలివిగలదే కావాలి!"

"నేను వీణవాయించితే మీకు బాగా వుంటుందా?"

"నీవు వీణ వాయించితే విని చాలారోజులైంది. నిజంగా వీణ అంటే నాకు చాలాయిష్టం.

"ఎందుకని?"

"వీణానిస్వనం మధురం. అందుకని"

"ఆ నేర్పరితనం, ఆకళ ఎవరిది?"

"నీది—"

అవును నాదే. మీరు 'ఇందిరా' అని పిలిస్తే నా హృదయంలో వీణానిస్వనం మారుమ్రోగుతుంది. ఆ మధురనాదం కేవలం నాఒక్కదానికే వినబడుతుంది. అందుకనే నాకు సంతోషం కలుగుతుంది.

నారాయణమూర్తి ఏమీ మాట్లాడలేదు. ఇందిర కూడా మౌనంగావుంది. ప్రణయజీవులకు—కలయిక సమయంలో—సంభాషణలవల్ల కలిగినంత ఆనందం మౌనంగావున్నా తప్పక కలుగుతుంది. కొద్దిసమయం గడిచింది. నారాయణమూర్తి ఇలా అన్నాడు—

"ఇందిరా!"

"ఏం?"

"నేనంటే నీకు ఎంతప్రేమో చెప్పు!"

"నిన్ను గాఢంగా ప్రేమిస్తూవున్నా"నని ఆమె అనాలని నారాయణమూర్తి అభిలాష. ఈవిధంగా భావించని భర్త ఎవడు వుంటాడు?"

"నాకు మీమీద అసలు ప్రేమ లేనే లేదు."

"లేదూ!......ఎందుకని?" నారాయణమూర్తి ముఖం వెలవెలబోయింది. తాను అనుకొన్న ప్రకారం సమాధానం అతనికి లభించలేదు.

"మీరంటే నాకు కొంచెంకూడా ప్రేమ లేదు. కాని మీరంటే ఏమిటో అమిత పిచ్చిగా వుంటుంది నన్ను పిచ్చిదాన్ని చేసివేశారు" అని నవ్వుతూ తన శిరస్సు అతని బుజంమీదకు బాగా వాల్చింది. నారాయణమూర్తి ముఖం వికసించింది.

"ఇందిర హృదయం చాలా చిన్నది. అయినా అందులో ఎంత ప్రేమ నిండి వుంది! ప్రేమను కూడా ఎంత అద్భుతంగా ప్రకటిస్తూవుంది! నాకోసం ప్రాణం అర్పించేటందుకుకూడా ఇందిర సిద్ధమే" అనుకొన్నాడు నారాయణమూర్తి. అతని హృదయం ప్రేమతో నిండిపోయింది.

"ఓం" అనే అక్షరానికి విద్వాంసులు అనేక అర్థాలు చెబుతారు. అదేవిధంగా నారాయణమూర్తికి 'ఇందిర' అనే శబ్దంలో అనేక విశేషాలు ద్యోతక

మైనవి. అపరిమితమైన ప్రేమ. అమితమైనదయ. మిక్కుటమైన మోహం మొదలైనవన్నీ కనబడ్డాయి. అతని శరీరంలోని రక్తం ఇందిర అనే శబ్దాన్ని బట్టి ప్రవహిస్తూ వున్నదా" అన్నట్లు తోచింది.

ప్రేయసి తన ప్రియుని భుజంమీద తల ఆనించి అతనివంక చూడటం ప్రారంభించింది. నారాయణమూర్తి ఆమెను తనదగ్గరకు చేర్చుకున్నాడు. తలవంచి ఆమెను తదేకంగా చూడటం ప్రారంభించాడు. ఎంతసేపు అలా కూర్చున్నారో తెలియదు.

అన్నివిధాల సుఖం పొందుతూవుండే గృహస్థాయిని ఆ సమయంలో నారాయణమూర్తి అందుకున్నాడు. అట్టి సుఖం, అట్టి శాంతి కలగడం చాలా కష్టం. అంతటి సుఖశాంతులు కలిగితేమాత్రం వాటితో సరితూగే వస్తువు మరొకటిలేదు. అపొందిన సుఖాన్ని గురించి దాని వాస్తవికతనుగురించి యోజించేశక్తి ప్రారంభంలో మానవునికి ఉండదు. కొంతసేపు నారాయణమూర్తి కూడా యీస్థితిలో నే వున్నాడు. తరువాత "ఇంతకు ముందో" అని ఆలోచించడం ప్రారంభించాడు. ఇంతకుముందు ఏమి జరిగిందో అతడు మరచిపోయాడు. విషయం మరచినా హృదయం మాత్రం వ్యాకులంగానే వుంది.

"ఇందిరయిప్పుడు యిక్కడ వున్నది. సరే, యింతకుముందో......"అని కొంచెం సేపు ఆలోచించాడు. కొంతజ్ఞాపకం వచ్చింది. వ్యాకులత మితిమీరింది. కొద్ది సేపటికే అన్ని విషయాలూ మరచిపోయాడు. మనస్సు శాంతించింది. మళ్ళీ అన్ని విషయాలు జ్ఞాపకం వచ్చాయి. ఇంతకుముందు...... ఆ ఆసుపత్రిలో పడివున్న పిల్లవాడు......యింటిలో నిద్రపోతూవున్న యీ చిన్నపిల్లలు......వీళ్ళను గన్నతల్లి.........ఆసుపత్రిలో ప్రమాదస్థితిలో పడివున్న పిల్లవాడిని గన్నతల్లి.........మెరపులా అన్ని విషయాలు మెరసిపోయినవి. మళ్ళి ఏమీజ్ఞాపకం రాలేదు.

"ఇందిరా!"

"ఏం?"

"ఇందిరా! ఎప్పుడు వచ్చావు?"

"షుమారు అరగంట అయివుంటుంది."

"ఈ గదిలోకి వచ్చావా!"

"అవును."

"ఎక్కడనుంచి యీ రాక?"

"అదేమిటి! అలా ఎందుకు అడుగుతూన్నారు?

"నీవు ఎక్కడికి వెళ్ళావో చెప్పవూ?"

"ఎక్కడికీ వెళ్లలేదే!"

"అయితే నిన్ను చూచి చాలారోజులైనట్లుందేం?

"బలే! బాగానే వుంది."

"ఉండు ఏమో జ్ఞాపకం వస్తూవుంది. ఆఁ అంతా జ్ఞాపకం వచ్చింది." అంటూవుండగానే నారాయణమూర్తి శరీరం కంపించింది. ఇందిర శరీరాన్ని తడిమి చూచాడు.

"ఇందిరా! నీవు నిజంగా యిక్కడే వున్నావా?"

"బాగానే వుంది. అలా అంటారేమిటి? యిక్కడ లేకపోతే మీ చేతికి ఎలా దొరుకుతాను చెప్పండి!"

"అయితే నాకుఏమి జ్ఞాపకం వచ్చిందో చెప్పనా!"

"చెప్పండి."

"నీనా పెండ్లి...మన కాపురం...మా అమ్మ నాన్నలతో మనం కలసివుండటం...అంతా నిజమే గదూ!"

"అవును నిజమే."

"ఆ తర్వాత అమ్మ చనిపోయింది. నాన్న చనిపోయాడు. చివరి సమయంలో నిన్ను దగ్గర కూర్చోబెట్టుకొని..."

"అవును"

"అమ్మా! పసివాడు. జాగ్రత్త. అబ్బాయీ! పసివాడు జాగ్రత్తరా!" అని మనిద్దరికీ చెప్పారుగదూ!

"అవును"

"ఎంతో గారాబంగా పెంచావు వాడిని. నేను అప్పుడప్పుడు వాడిని కసిరే వాడిని. నీవు మాత్రం వాడిని ఎప్పుడూ కసరలేదు."

"మీరు కసిరితే తప్పేముంది? వాడి మంచికేగా!"

"అదికాదు నా అభిప్రాయం. నీవు చాలా గారాబంగా పెంచేదానివని చెప్పడమే నా ఉద్దేశ్యం. యింతలో ఒకసారి జ్వరం వచ్చి నీవు మంచంపట్టావు."

"అవును."

"ఎన్నో మందులు వాడాను, జ్వరంవల్ల సన్నబడి పోతూ వుండే దానివి. అప్పుడు నాగుండె బ్రద్దలై

పోతూ ఉండేది. ఒకరోజున...నీవు...అది స్వప్నమూ లేక నిజమేనా?

"అసలు విషయం ఏమిటి?"

నారాయణమూర్తి ఇందిరను గట్టిగా పట్టుకొన్నాడు.

"ఒకరోజున నువ్వు ఎక్కడికో......వెళ్ళి పోయావు."

"ఏమిటండీ యీ మాటలు?"

పిల్లవాడిని పెంచేవాళ్ళు ఎవ్వరూ లేరు. నాకు చాలా కష్టమైపోయింది. ఇందిరా! నేను చాలా రోజులు ఏడ్చాను. నాశోధకు అంతులేదు.

"ఊఁ"

"ఏడ్చి ఏడ్చి పిచ్చివాడిలా అయిపోయినాను.."

క్షణంసేపు నారాయణమూర్తి ఏమీ మాట్లాడలేదు. అతనిస్థితి యిప్పుడుగూడా పిచ్చివాడిలాగేవుంది. ఆలోచనా పరంపర బయలుదేరింది...ఇప్పుడు ఇందిర

నాదగ్గరే కూర్చొనివుంది. నేను ఇందిరతో మాట్లాడుతూవున్నాను. యిదంతాసరే. కాని ఆరోజున వెళ్ళిపోయిందిగదూ?......ఎక్కడికివెళ్ళింది?...... ఆరోజున...ఎక్కడికో వెళ్ళిపోయింది...నిజమే వెళ్ళిపోయింది. కాని ఎక్కడికి వెళ్ళినట్లు? ఏమైపోయినట్లు?...యీ ప్రశ్నలకు ఏమీ జవాబుతోచలేదు.

నారాయణమూర్తి అప్పుడున్న స్థితిలో...అంటే అర్ధనిద్రావస్థలో మానవుల మనస్సు అనేకవిధాలుగా విభజింపబడి ఉంటుంది. కొంతభాగం జాగ్రదావస్థలోనూ, కొంతభాగం నిద్రావస్థలోనూ ఉంటుంది. మనం ప్రతిరోజు వేరువేరు అవయవాలద్వారా పొందే జ్ఞానమంతా శరీరంలోని వేరువేరు భాగాలలో వుంటుంది. అర్ధనిద్రావస్థలో జాగృతభాగాలలోని విషయాలు సహజంగానే జ్ఞాపకం వస్తాయి. నిద్రితములైయున్న భాగాలకు సంబంధించిన విషయాలు మాత్రం జ్ఞాపకం రావు. ఈసమయంలో నారాయణమూర్తి పరిస్థితి కూడా అలాగే వుంది. చాలా రోజులనుండి అనుభవం పొంది వున్నందున హృదయానికి హత్తుకొనివున్న విషయం వెంటనే జ్ఞాపకం వచ్చివేసింది. కాని విషాదకరమైన ఘట్టం హృదయానికి దూరంగా వున్నందున అర్ధనిద్రావస్థలో అది జ్ఞప్తికి రాలేదు. "ఇందిర ఏమైనట్లు?" అనే విషయం అతనికి అర్థంకాలేదు. కాని విషాదకరమైన ఒక అనుభవఘట్టం మాత్రం అర్థమవుతూ వుంది.

"తరువాత ఒక పర్యాయం రెండు జాములవేళ పిల్లవాడికి ఆకలి వేసింది. యింటిలోవాడికి ఏమీ దొరకలేదు తినడానికి. ఇంటి దగ్గర మంచి చెడ్డ చూచే వాళ్లు ఎవరూ లేకపోవడమే యిందుకు కారణం. నేను కచ్చేరీనుండి యింటికి వచ్చాను. పిల్లవాడు వెక్కి వెక్కి ఏడుస్తూ వున్నాడు. నాకు అమిత దుఃఖం కలిగింది.

"ఊఁ"

"వాడి పోషణచేసేవారు యింట్లో ఎవ్వరూ లేరు. ఎవరైనా వుంటే బాగుండుననిపించింది. కాని ఏమి చేయాలో తోచలేదు...ఒకరోజున బాబాయి వచ్చి యీడువచ్చిన ఒక అమ్మాయి వుంది. పెండ్లిచేసుకోమని చెప్పాడు—ఎందుకనో గాని పెండ్లి చేసుకొందామనే కోరికే నాకు కలగలేదు." కాని పిల్లమాత్రం మంచిది. అందకత్తె చేసుకో" మని అనేక విధాల చెప్పాడు బాబాయి. పెళ్లి పిల్లనుచూచాను. ఆమె యీ సావిత్రియే—అందంగానే వున్నది. కాని సావిత్రిని పెండ్లి చేసుకుందామనే కోరిక ఏమీ కలుగలేదు.

నాకు యింట్లో బాధగావుంది. ఏకాంత జీవితమంటే విసుగు బుట్టింది. ఇందిరా! నీవు లేనందున హృదయం వ్యాకులపడిపోయింది. బాబాయివచ్చి మళ్లీ చెప్పాడు. "ఒరే మూర్తి, ఆ పిల్లవాడిని చూసైనా పెండ్లిచేసుకోరా! ఇంట్లో వాడి మంచీ చెడూ చూచే వారు ఎవ్వరూ లేరు. సావిత్రిని పెండ్లిచేసుకో. పిల్లవాడిని పోషిస్తుంది. పిల్లవాడికేకాదు. నిన్నుగూడా పోషిస్తుంది."

"మంచిదే."

"నేను అంగీకరించాను."

"నా యిష్టప్రకారమే పెండ్లి చేసుకున్నాను. సావిత్రి యిక్కడకు వచ్చింది. కొద్దిరోజుల వరకు సావిత్రికూడా నీలాగేవుంది. కాని తరువాత తరువాత మారిపోయింది. సావిత్రికి సంతానం కలిగినప్పటి నుండీ యీ పిల్లవాడినిగురించి శ్రద్ధవహించడం మానివేసింది. ఈ విషయమై నేను దానిని కోప్పడ్డానుకూడా. కాని లాభం లేకపోయింది. సావిత్రికికూడా కోపంవచ్చింది. అప్పటినుంచీ యీ యింట్లో సుఖం మృగ్యమైపోయింది.

ఇందిర ఏమీ మాట్లాడలేదు. ఆమె కళ్ళనుండి కన్నీటిధారలు అవిరామంగా ప్రవహిస్తున్నట్లు నారాయణమూర్తికి కనపడింది.

ఆపిల్లవాడూ, సావిత్రికి పుట్టిన యీ పిల్లలూ, సమానమే. కాని సావిత్రికి మాత్రం అలాతోచలేదు. యిద్దరినీ వేరువేరుగా భావించింది. నేను ఏమీ చేయలేక పోయాను. అన్నంపెట్టేదీ, మిగతా మంచీ చెడూ అంతా చూచేది సావిత్రేగదా! నే నేమి చేయగలను? ఆమె ఏమిచేసినా చూస్తూ వూరుకోవలసి వచ్చింది.

ఇందిర ఏమీ మాట్లాడలేదు.

'నేను అసలు పెండ్లి చేసుకొన్నది ఆ బిడ్డడి కోసమే. కాని వాడికి మాత్రం సుఖం కలుగలేదు. ఏదో విధంగా పెరిగి పెద్దవాడైతే అన్ని కష్టాలు యీ తీరుతవని అనుకొన్నాను. ఆవిధంగానూ జరగలేదు.

ఇందిర మౌనంగానే వున్నది.

"మొన్న వాడు ఎక్కడనుండో జ్వరంతో వచ్చాడు. డాక్టరుకు చూపించాను. ఆయన ప్లేగువ్యాధి అని చెప్పాడు. వాడిని యింటిలో వుంచితే మిగతా వాళ్ళకు గూడా వ్యాధి సోకుతుందేమోనని భయం కలిగింది. ఆసుపత్రిలో చేరుస్తావా అంటే అక్కడ వాడికి సేవచేసే వాళ్ళెవరూ లేరు. ఎలాగా అనే ఆలోచనలో బడ్డాను. ఆసుపత్రిలో నే చేర్చమని సావిత్రి సలహా చెప్పింది."

"సరే"

"వాడిని అక్కడే చేర్చాను. బాబాయి అక్కడ వున్నాడు. సావిత్రినన్ను పిల్లవాడిదగ్గర, ఆసుపత్రిలో వుండనీయలేదు. నేను అక్కడ వుండకూడదట. దాని హృదయం చాలా కఠోరం. ఇందిరా! సావిత్రి హృదయం నిజంగా పాషాణం."

ఇందిర కదలకుండ కూర్చొనివుంది.

ఇవాళ సాయంత్రమే వాడిని చూచి వచ్చాను. పిల్లవాడు గిలగిల తన్నుకుంటూ వున్నాడు నేను చూడలేకపోయాను. ఊరికి దూరంగా కాపురం వుండటంవల్ల త్వరగా యింటికివచ్చాను. అమ్మా! అమ్మా! అని ఒకటేఅరుపు. అమ్మఏదీ! పాపం, ఎంత బాధపడుతూ వున్నాడో చెప్పలేను."

"వాడు బాగానే వున్నాడు. మీరేమీ బాధ పడకండి." అన్నది ఇందిర.

"నాకు ధైర్యం కలిగేటందుకా యిలా అంటున్నావు? సాయంత్రం అంత బాధపడుతూ వున్న వాడికి అప్పుడే ఎలా నయమవుతుంది? పోనీలే! నీవు సమయానికి వచ్చావు. వాడి వ్యవహారం యికనువ్వు చూస్తావుకదూ!"

"తప్పకుండా."

"అయితే యిక నాకు చింతలేదు. చూడు! నిన్ను చూడంగానే నా బాధంతా మాయమై పోయింది. అంటూ నారాయణమూర్తి ఇందిరను ప్రేమతో కౌగలించుకొన్నాడు.

"నిజంగా పిల్లవాడికి నయమయిందా?"

"ఆ నయమయింది."

"నువ్వు చూచావా?"

"ఆ, మీరుకూడా చూస్తారా?"

"ఏదీ! ఎక్కడున్నాడు?"

"అడుగో" అంటూ ఇందిర గదిగుమ్మం వైపు వ్రేలితో చూపించింది. నారాయణమూర్తి అటు చూశాడు. గోపాలుడు నిలబడివున్నాడు. వాడు బాగా ఆరోగ్యంగా వున్నాడు. నారాయణమూర్తికి అమితానందం కలిగింది. సంతోషంలో ఇందిరను చూద్దామని అవైపుకు తిరిగాడు. ఇందిర రూపం అస్పష్టంగా కనబడింది. "ఇందిరా" అని పిలుస్తూ ఆమెను పట్టుకుందామని ప్రయత్నించాడు. కాని ఆమె చిక్కలేదు. పర్వత శిఖరంమీద నిలబడి మేఘాల్ని పట్టుకుందామని ప్రయత్నించి విఫలుడైపోయిన బాలునిలా అయింది. నారాయణమూర్తి స్థితి. "ఇందిరా" అని గట్టిగా అరిచాడు. ఇంతిలో మెలకువ వచ్చింది.

ఇందిర చనిపోయి పది సంవత్సరాలు గడిచాయి. అప్పుడు పత్నీ వియోగ దుఃఖం అంటేఏమిటో అతనికి బోధపడింది. నేడు ఆ ఇందిరయే కలలో కనబడి తియ్యని మాటలు మాట్లాడి అదృశ్యమై పోయింది. నేడు మళ్లీ రెండవసారి పత్నీవియోగదుఃఖం కలిగింది నారాయణమూర్తికి.

నారాయణమూర్తి కిటికీగుండా బైటకు చూచాడు. రాత్రిసమయం. అంతటా నిశ్శబ్దంగావుంది. పిండారబోసినట్లు వెన్నెల కాస్తూవుంది. నిర్మల ఆకాశంలో చంద్రుడు తన ప్రియురాండ్రగు తారా సమూహం మధ్య ఆనందంతో విహరిస్తూ వున్నాడు. అతని శీతల కిరణాలు తమ కాంతితో యావత్తు ప్రపంచాన్ని స్నానం చేయిస్తూవున్నవి. ఆహా ఏమికాంతి? ఎంత ఆనందం?

ఆ నీరవమైన వెన్నెలరాత్రియందు బిడ్డడు గోపాలునికి గూడా అతని తల్లి ఇందిరతో బాటు అనంత శాంతిదేవతామతల్లి ఒడిలో శరణ్యం లభించిన నే విషయం నారాయణమూర్తికి తెలియలేదు.

మా ఆవిడ నీళ్లాడేదాకా మా గుమ్మంతొక్కొద్దు

శ్రీ కవికొండల వేంకటరావు

పాత్రలు: భర్త రామేశం; భార్య వెంకమ్మ; ఆడపిల్ల; మగపిల్లడు; అల్లుడు; ప్రక్కింటి ఆడమనిషి; ప్రక్కింటి మగమనిషి

మొదటి రంగము : రామేశం ఇంట్లో

ప్రక్కింటి ఆడమనిషి : మనకు విద్య కావాలమ్మా! అప్పుడు జీవితంయొక్క విలువ తెలుస్తుంది.

వెంకమ్మ: ఏమో! ఇంతికాలం విద్యలేకుండా పెరిగాను.

ప్ర.ఆ: నీకు పిల్లలా?

వెంక: అవును! ఉన్నారమ్మా! ఒక మగపిల్లవాడు, ఒక ఆడపిల్ల.

[పిల్లవాడు, పిల్ల ఆలా వెళతారు.]

ప్ర.ఆ: వాళ్ళేనా?

వెంక: అవునమ్మ వాళ్ళే! వాళ్ళల్లో ఆడపిల్లకు పెళ్ళి చెయ్యాలి.

ప్ర.ఆ: ఏం? మగపిల్లవాడికి పెళ్ళిచేయ అక్కరలే!

వెంక: వాడే కట్టుకుంటాడు ఎవర్తెనో ఒకర్తెను.

ప్ర.ఆ: అలాంటి ధీమాయే ఆడపిల్ల విషయంలోనూ మనం కలిగివుండాలి—వాళ్ళిలా వస్తున్నారు.

[పిల్లవాడు పిల్లా వస్తారు]

మగపిల్లవాడు : అక్కా! మనం "కారమ్స్" ఆడుకుందామా?

ఆడపిల్ల: వద్దురా! చింతగింజ లాడుకుందాం!

[వాళ్ళిద్దరూ నిష్క్రమిస్తారు]

ప్ర.ఆ: అప్పుడే వాళ్ళిద్దరిలోను తేడా కనిపించేని.

వెంక: కనబడదుటమ్మా! ఆడపిల్ల ఆడపిల్లే. మగపిల్లవాడు మగపిల్లవాడే. అందుకనే ఆడపిల్లకు త్వరగా మనం పెళ్ళిచేయా లంటూవున్నది.

ప్ర.ఆ: ఏం? ఆడపిల్ల చదువుకుంటే చెడిపోతుందా?

వెంక: చెడదుకాని—దానికి చదువు అనవసరమని నా అభిప్రాయం.

ప్ర.ఆ: ఏమో! నేను వాళ్ళకు చదువుండా లంటాను. మగవాళ్ళ కెలాగయినా చదువు వస్తుంది. ఆడవాళ్ళకే రాదు.

వెంక: రాకేం అమ్మా! చెప్పిస్తే వాళ్ళకూ వస్తుంది. ఇప్పటిమట్టుకు ఇద్దరకు సరిసమానంగా చదువు చెప్పిస్తున్నాం.

ప్ర.ఆ: నాకూ పిల్లలుంటే నేనూ చెప్పిస్తును.

వెంక: పిల్లలు నీకు లేరో! బ్రతికిపోయావు. పిల్లలుంటే భాగ్యముండాలి, భాగ్యముంటే యోగ్యత వుండాలి. అన్నీ వుంటే ఆరోగ్యముండాలి.

ప్ర.ఆ: అన్నీ ఒకచోట చేరివుండవు. అవి మనం చేర్చుకోవాలి.

వెంక: అవునమ్మా! పిల్లలంటే ఏలాగో కలుగుతారు కాని, భాగ్యంకలుగదు.

ప్ర.ఆ: ఏమి? మీకు భాగ్యం లేదా?

వెంక: అసలు లేదనను. కాని తగినంత భాగ్యం లేదు. ఏది రేడియో? ఏది ఎలక్ట్రిసిటీ? ఏది వంటలక్క?—చెప్పండీ!

ప్ర.ఆ: భాగ్యం తినంతనే వస్తుంది అని నా వూహ. పిల్లలే కలగరు.

వెంక: ఎవరికేది లేదో దాన్నిగురించి ఒత్తి చెబుతారు.

ప్ర. మగమనిషి: (పిలుస్తాడు) ఒసేవ్! (అని)

ప్ర.ఆ: మా ఆయన పిలుస్తున్నారమ్మ! వెళ్ళొస్తా!

వెంక: బొట్టుంచుకు వెళ్లు. (బొట్టు పెట్టును)

ప్ర.ఆ: ఏమిటో పూర్వకాలపు ఆడమనిషివి! ఇంకా బొట్టు పెడతావు. [తెలు]

రెండవ రంగము : ప్రక్కయిల్లు

ప్ర.మగ: ఏమిం? ఎక్కడికి వెళ్లావు? ఇంతలోకే వెళ్లాలీ, నేను ఇడ్డెనలు తెచ్చే లోపుగా! వెళ్ళి ఏం పాము కొచ్చావు?

ప్ర.ఆడ: ఏమీ పాముకు రాలేదండీ! ఒక సంగతి తెలుసుకు వచ్చాను. వాళ్ళకొక ఆడపిల్ల, ఒక మగపిల్లవాడూ వట!

ప్ర. మగ: అయితే ఏమంటావు?

ప్ర.ఆడ: మనకు అలా లేరని.

ప్ర.మగ: మన కున్నది మన కున్నది, వాళ్ళ కున్నది వాళ్ళకున్నది.

ప్ర.ఆడ: మనకేమిటుంది?

ప్ర.మగ: భాగ్యం ఉంది, ఆ భాగ్యం పెట్టి ఇడ్డెనలు కొనుక్కుంటున్నాం, సినీమాలు చూస్తున్నాం! రేడియో వేసికొంటున్నాం, ఎన్నో ఇతర వినోదాలు చూస్తున్నాం! వాళ్ళకేముంది?

ప్ర.ఆడ: వీటన్నిటితో పాటు మనకొక్క ఆడపిల్లైనా ఉంటే బాగుండుననిపిస్తోంది.

ప్ర.మగ: అలా నీవు అఘోరిస్తూవుండబట్టే, ప్రభుత్వం ఈ పైనుండి ఆడపిల్లలను కూడా పెంచుకో వచ్చునని చట్టం చేసింది.

ప్ర.ఆడ: నేను అఘోరించబట్టి చేసిందనక పోనే, మీలాంటివాళ్లు చాలా మంది వుండబట్టి అలా చట్టం చేసింది ప్రభుత్వం అని ప్రభుత్వాన్ని అభినందించ రాదూ?

ప్ర.మగ: ప్రభుత్వమును అభినందించడం సులువే కాని, ఎవరిస్తారే ఆడపిల్లను దత్తత?

ప్ర.ఆడ: మగపిల్లవాణ్ణి ఎవరిస్తారో, ఆడపిల్లను వాళ్లే యిస్తారు.

ప్ర.మగ: కనుక్కో అదైతే, ప్రక్కింటి వాళ్ళ ఆడ పిల్లను మనకు పెంపు ఇస్తారేమో.

ప్ర.ఆడ: ఇవ్వకేం చేస్తారు? వాళ్ళకేం భాగ్యమా! బ్రతుకు తెరువా? బరువల్లా వదిలిపోయిందని వాళ్లు భావిస్తారు. ఈ రోజునే కనుక్కొంటాను. కనుక్కొమన్నారా?

ప్ర.మగ: ఈ వేళే కనుక్కోవడం ఎందుకులే? మరి రెణ్ణెల్లు పోయాక కనుక్కోవచ్చు.—మనకు మాత్రింకేలంగ కూడదూ పిల్లలు?

ప్ర.ఆడ: మళ్లా ఈ చట్టం మారిపోతుందేమో?

ప్ర.మగ: ఇది మారితే దీనిఅబ్బ మరొకటి. మనకీ భాగ్యం వున్నన్నాళ్ళు, ఎన్ని చట్టాలు మారినా ఇబ్బందిలేదు. ముందీ ఇడ్డెనలు తినువల్లారిపోతాయి. (అని తాను తిన ప్రారంభించును)

ప్ర.ఆడ: ఉండండి! వాటిల్లో ఇంత నెయ్యి కొంచెం వెయ్యనియ్యండి. (అని నెయ్యివేసి తానుకూడా ఆరగించును.) [తెర]

మూడవ రంగము : రామేశంఇల్లు.

రామేశం: ఏమిటావిడ అలా నిన్ను వేధిస్తూ వుంటుంది.

వెంక: ఏమీ లేదు. వాళ్ళకు మన ఆడపిల్లను దత్తత యిస్తామేమో అని ఊ—అనుకుంటుంది.

రా : నీవు అల్లా ఇయ్యడానికి వల్ల పడదంటున్నావా?

వెంక: అవును. అంటున్నాను. మనం కన్న పిల్లలు మనవాళ్లే! మగవాళ్ళు అయినా ఆడవాళ్ళు అయినా!

రా : ఇక అవితే ప్రభుత్వంచేసిన చట్టం ఎవరి కోసం?

వెంక: ఎవరికోసమో అది? మన కోసం మాత్రం కాదు. నిక్షేపం లాగు తొమ్మిది నెలలు మోసి నేను కనడం ఏమిటి? అవిడ పెంచడమేమిటి? అవిడతో నిష్కర్షగా చెప్పేశాను. ఆడపిల్లనైనా సరే మగపిల్లవాణ్ణి అయినా సరే, మన పిల్లల్ని మనం అయి ఇవ్వమని.

రా : నిష్కర్షగా చెప్పేశావు?

వెం : ఆఁ! నిష్కర్షగా చెప్పేశాను! మళ్ళీ మాట్లాడితే సిగ్గులేదటమ్మా అడగడానికి, ఎన్నిసార్లు అని అడుగుతావు?, నీనోరు నొప్పిపెట్టదా? అనికూడా అంటాను.

రా : నీవు కన్నట్టే ఈ పిల్లల్నందరినీ.

వెం : నేనుకాకపోతే మీరా ఏమిటి? మోసిందాన్ని నేను. నొప్పులు అవీ పడ్డదాన్ని నేను—అయినా దానికంత రాద్ధాంత మెందుకండీ? అవిడడిగింది, నేనియ్యనన్నాను. దీనికి మీ రాద్ధాంత మెందుకు?

రా : ఎందుకూ లేదు. మనకొక మగపిల్లవాడు చాలడా అని.

వెం : ఎక్కడికి చాలడం? ఉన్నమ్మకు ఉన్నకొద్దీ ఉండా లనిపిస్తుంది. కన్నమ్మకు కన్నకొద్దీ కనాలనిపిస్తుంది. ఇంతకూ ఈ విషయంలో మీ అభిప్రాయ మేమిటి?

రా : ఏమీ లేదు. ఒక కుటుంబానికి ఒక మగపిల్లవాడో, ఒక ఆడపిల్లో ఉంటే చాలని.

వెం : ఆసంగతి ఇదివరకే తోచవలసింది మీకు; నాకు తొలిమాటు మగవాడు కలిగినప్పుడే తోచవలసింది.

రా : అప్పటి కిన్ని వ్యూహాలు లేవు. ఇవన్నీ ఈ 'ఫామిలీ ప్లానింగు', ఆర్థికసమస్య వచ్చాక ఇప్పుడిప్పుడు నాలో రేకెత్తాయి.

వెం : ఏమో! నాలో రేకెత్తలేదుసుమండీ అలాంటి కొత్తవ్యూహాలేవీన్నీ! మన సంపద అంతా మన సంతానం అని నావ్యూహం!

రా : అయితే అలాఅని చెప్పేస్తా ఆయన గారితో.

వెం : ఏమిటి? ఈవిడ నన్ను వేధిస్తూన్నట్టే, ఆయన మిమ్మల్ని వేధిస్తూవున్నారా ఏమిటి? చెప్పారు కారేం ఈముక్క? వాళ్ళి భార్యాభర్తల కిద్దఱూ పుట్టినబుద్ధే యిది? అలాఅయితే మనల్ని వదలి పెట్టరు వాళ్లు! ఇంతకూ ఆడపిల్లను పెంచుకుంటే వాళ్ళయింటిపేరు నిలబడుతుందా? ఆయన పేరు నిలబడుతుందా? ఆమెను తిరింపచేస్తుందా? ఏమో! మన ఆడపిల్లనుగురించి మన మేమి అంటామో అని అడిగి వుంటారు. ఈ వాదనతో మరి పొద్దు పోగొట్టకోకండి. లెండి. మడికట్టుకోండి. [తెర]

నాలుగవ రంగము:

[వీధి గుమ్మం]

(నేపథ్యంలో ఆడపిల్ల పాట)

పొదుపుగా బ్రతుకండి!
పొదుపుగా వుండండి!
పొదుపుపత్రాలను కొనరండి!
పిల్లలాకోసమై
తాపత్రయం పడకండి!
ధనము కొఱతైయుండ,
ధాన్యంబు కొఱతగా,
మన స్వాతంత్రత ఎట్టు
చెల్లుబడి యగునండి?
మన ప్రభుత్వం బెట్లు
నడచునో చెప్పండి!
పొదుపుగా బ్రతుకండి,
పొదుపుగా వుండండి,
పొదుపు పత్రా లనుకొనరండి!

ప్రక్కయింటి మగమనిషి : ఆపిల్లవాళ్ళ ఆడపిల్లేలాగుంది.

ప్రక్కయింటి ఆడమనిషి : వాళ్లి ఆడపిల్లే! ఎంతలో ఎంతఎత్తు పెరిగిందో!—ఇట్టే ఎదుగుతారు ఆడపిల్లలు!

ప్ర. మగ : మరి ఆడపిల్లను పెంచుకుందాం అన్నావు మతి!

ప్ర. ఆడ : మనముంచుకుంటే అంత ఏపుగా కనిపించక పోవును.

ప్ర. మగ : అలా పొదుపుపాటపాడుతూ పత్రాలిమ్ముకుంటూ నడవకపోను.

ప్ర. ఆడ : మాటేంచేయును?

ప్ర. మగ : మనమిద్దఱం, కట్టకట్టే ఏమగాణ్నో పెళ్లాడి, ఈపాటికి కాపురంచేస్తూవుండును, ఏవ్వాళ్లోన్నో

ప్ర. ఆడ : ఏవ్వాళ్లో యేంఖర్మమూ, మనవ్వాళ్ళనే పెళ్ళాడియుండును ఆలా వెళ్ళేఒక అబ్బాయిని.

ప్ర. మగ : అలా ఒక మగ అబ్బాయి వెడుతున్నాడా?

ప్ర. ఆడ : వెడుతున్నాడేమిటి? వాళ్లిద్దరూ కలిసి, ఒకేపాట పాడుతుంటే.

[పై పాట తిరిగి యిద్దఱి గొంతుకలతో వినిపించును.]

ప్ర. మగ : అయితే వాళ్ళిద్దర్నీ ఇలా పిలుద్దాం!

ప్ర. ఆడ : మీ కిష్టమైతే పిలవండి!

ప్ర. మగ : ఏం నీకిష్టం లేదే?

ప్ర. ఆ : ఆలా మనం అనుకొనేలో వాళ్ళిద్దఱూ మాయమై పోయారు.

ప్ర.మగ : మళ్ళీ వస్తారు! ఎక్కడికి పెడతారు? వాళ్ళ పాట ఇంకా వినిపిస్తోంది! [తెర]

అయిదవ రంగము: రామేశం ఇల్లు

వెం : ఆ యింటః పొదుపు లేదేః?

అడ : ఆ యింటికి వెడితే వారు పెంచుకుంటాం అని అంటారని నా భయం, అంచేత నేను వెళ్ళ లేదు.

వెం : మీ రిద్దరూ వెళ్ళినా?

అడ : మే మిద్దఱం వెళ్ళినా వాళ్ళు పెంచుకుంటాం అనేటట్టున్నారు!

వెం : మీ కిద్దఱకు పెళ్ళైంది అని అన్నా?

అడ : ఆః! అల్లా కనిపించారు! అంచేత వాళ్ళయింటికి వెళ్ళలేదు.

వెం : వాళ్ళ యింటికి వెడితే తప్పక తీసికొని వుండురే ఒక పొదుపు పత్రం! మా అమ్మ! నీవంటే వాళ్ళకెంతో ప్రేమ.

అడ : ఇప్పుడైతేం, మించిపోయిందిలేదు. అక్కడకు వెళ్ళివస్తా! సరా!

వెం : వెళ్ళొచ్చి చెప్పు ఏమన్నారో, ఏం చేశారో.

అం : ఏం చెబుతారు? ఏం చేస్తారు? వాళ్ళు రేడియోయే బాగు చేయించుకుంటారా? 'ఎలెక్ట్రిక్' బిల్లే కడతారా? అద్దె యిస్తారా? కాఫీయే త్రాగుతారా? అన్నమే తింటారా? అన్నీపోతే మిగిలేది పెట్టి, ఒక మోటారుకారు కొంటా మంటారు. నన్ను చంపడంకాని పొదుపు పత్రమూ కొనరు. ఏమీ కొనరు.

వెం : అంత చేటు బండలైతే నిన్ను వాళ్ళు పెంచుకు ఎట్లా సుఖపెడతామన్నారో! నిన్నివ్వలేదో బ్రతికిపోయినాం! ఇంతకూ వాళ్ళూ నిన్ను సుఖపెట్టేదేమిటి? మగడు సుఖపెట్టాలిగాని: ఏమమ్మా! ఎన్ని పొదుపు పత్రాలు సంతకాలు చేయించి డబ్బు కట్టించావు ఈ వేళ !

అడ : మీ అల్లుడుగారూ నేనూ ఊరికే తిరిగి వచ్చాం! అంతే! ఎవ్వరూ పొదుపుమాట యెత్తడం లేదు. పత్రాలు కొనడంలేదు. దీనికి నాన్నగారు ఏమి జవాబు చెప్తారో?

[రామేశం అందాకా ఏదో పనిచూసుకుంటూ అని]

రామే: అంటే, మరి సరియైన పద్ధతిలో మీ వృత్తి జరుపలేదన్నమాట. వీధిలో కేవలం పచార్లు చేస్తూ కాలక్షేపం చేశారన్నమాట! ఏదైనా పని పూనుకుంటే అది 'సీరియస్'గా చేయాలి. వేళాకోళంగా చేయరాదు.

అడ : నేను వేళాకోళంగా చేశానా [అని ఏడ్చును.]

వెం : ఏడవకమ్మా! ఈ పొదుపూ వద్దు ఈ పత్రాలు వద్దు. నివ్వూ నీ మగడూ సుఖంగా వుంటే అంతే చాలు.

అడ : [వెక్కి వెక్కి ఇంకా ఏడ్చి, ఏడ్పు ఆపును–తెర]

ఆరవ రంగము: ప్రక్క ఇల్లు

వెం : ఏమమ్మా! మా అమ్మాయివద్ద ఒక పొదుపుపత్రం కొంటె మీ కేమైనా పరువు నష్టమా?

ప్ర. అడ : మీ అమ్మాయిని మాకు పెంపిస్తే ఏం అప్రతిష్ఠా?

వెం : మా అమ్మాయికి పెళ్ళి అయిపోయింది. మరి పెంపకం లేదు గింపకం లేదు.

ప్ర అడ : మా యింట్లో డబ్బు అయిపోయింది. మరి పొదుపు పత్రాలుకొనడం లేదు గిదుపు పత్రాలు కొనడం లేదు.

వెం : మాటకుమాట తెగులు.

ప్ర. అడ : ఆటకుఆట తెగులు [అని చెయ్యి విసరును]

వెంక: నీవు పొదుపుపత్రం కొనకపోతే పోయావుగాని నన్ను మాత్రం కొట్టబోకు. అప్పుడే అయిపోయిందీ మీభాగ్యం. మా పొదుపుపత్రం కొనేదగ్గఱ కొచ్చేటప్పటికి అయిపోయిందా మీభాగ్యం?

ప్ర.అ: మా భాగ్యం అన్నది మాతోటే వుండదు. మాయింట్లోను వుండదు. ఒక్కదమ్మిడీ మాఖజానాలో నిలవుండదు.

వెంక: మరి నిలవుండకపోతే ఏమౌతుందమ్మా అంత భాగ్యమూను?

ప్ర.అ: ఏమౌతుందా ? నా వొంటిమీదుంటుంది! నా యింటిమీదుంటుంది. నీకెందుకు ఆ ఆరా తీయడం.

వెంక: ఇంకా నయం? నీ తుంటిమీదుంటుంది అన్నావుకావు.

ప్ర.ఆ: అది అనగలను. నేను కట్టిన చీర నీవుకట్టగలవా? ఆఖరుకు నే తుకుముకు నే తుండుగుడ్డ నీకుందా? ఇవన్నీ కొనుక్కొంటూ, మా బ్రతుకు తెరువు హెచ్చించుకోమా? మీపొదుపు పత్రాలే కొనమా? ఏమో ఆయనగారు ఎలా చేసుకొస్తున్నారో ఈ సంసారము. ఇంట్లో ఏమీ లేదు. పొదుపూ లేదు. పోపూ లేదు. (అని తుంట్లు బాదుకొనును.)

వెంక: అంతచేటు బాదుకోనక్కరలేదమ్మా! ఇంతకూ మీఆయన్ను అడగమంటావు!

ప్ర.ఆ: ఏమో? ఎవర్నడుగుతావో గోదావరిలో దూకుతావో వెళ్ళు. [తెర]

ఏడవరంగము: ప్రక్కయిల్లు

[ఆడపిల్ల, ఆడపిల్ల మొగుడు, వెంకమ్మ, రామేశం ఒకసంఘంగాచేరి సంచారము; మళ్లీ పైపాట పాడతారు.]

ప్ర. మ: ఏమిటి మీరంతా మాచేత యీ పొదుపు పత్రాలు కొనిపించడాని కొక సంఘముగా చేరారా?

రా మే: మీచేత కొనిపించడ మేమిటి? అందరిచేత కొనిపిస్తాము. చూడండి ఒకనమోనా!

వెంక: అవునే అమ్మాయి! ఒక నమోనా కాగితం ఇయ్యి వారికి.

ఆడపిల్ల: నావద్దలేదు. ఆయనవద్ద వుండబోలు.

ఆడపిల్ల మొగుడు: అవును. నావద్దనే వున్నాయి. ఇదిగోనండీ! ఇదిచిత్తగిస్తే అన్నీ తెలుస్తాయి.

ప్ర.మగ: వీళ్లిద్దఱకూ ఎప్పుడుపెళ్లి అయింది?

ప్ర. ఆడ: అసలు పెళ్ళిఅయిందో లేదో వాళ్ళిద్దఱకూ, మీరంటున్నారుగాని

ప్ర. మగ: అందరూ మనమిద్దఱం వుండగలము మ్పు వుండగలరు టే!

వెంక: అయితే మీయిద్దఱూ ఇంకా పెళ్ళికాకుండానే యిలా వున్నారన్నమాట.

రా మే: ఏలావుంటేనేం అదే పొదుపు. పెళ్లి అనీ పేటాకులు అనీ డబ్బు వ్యయం చేయడ మెందుకని వాళ్ళు అలా వున్నారులాగుంది.

వెంక: మనంమాత్రం ఏం ఖర్చుచేశాం? మనమ్మాయి పెళ్ళి దానంతటదే అయింది.

ప్ర. మగ: ఇదంతా పొదుపులకి లక్షణం. పెళ్ళిళ్ళకు పెచ్చించే ఖర్చుపెట్టి యీ పొదుపుపత్రాలు కొంటే ఎంతో మేలు.

ఆడపిల్ల, ఆడపిల్ల మొగుడు: అందుకే మీదగ్గఱ కొచ్చాం.

ప్ర. మగ: ఏమే ఏమంటావు?

ప్ర. ఆడ: నేనేమంటాను. మీయిష్టమంటానుగాని— అయినా నాకు పేళిళ్ళు అంటువ్యా రంతాను. మగపిల్లవాడో ఆ పుట్టేది ఆడపిల్లో తెలుసుకుని మఱీ త్యాగం చెయ్యండి.

ప్ర. మ: ఆఁ! అంతమటుకు ముదిరిందీ మనపాశం! ఇక పొదుపు చూపించే దేమిటి మనము? అప్పుట్టే వాళ్ళిద్దఱిలే కవలపిల్లలు! అందు ఆడపిల్ల ఒక్కర్తె మగపిల్లవాడొకడు అనికే చెప్పక్కర్లేదు—ఇదిగో మాడండి! ఓసుంపూ! ఓపొదుపు గుంపూ! మా ఆడమనిషి నీళ్ళాడేదాకా మా గుమ్మం మీరు తొక్కవద్దు, తొక్కవద్దు. తొక్క తొక్కవద్దు.

[తెర]

విపర్యయం

శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి—శ్రీ కొండముది హనుమంతరావు

[గతసంచిక తరువాయి]

రంగము: 3

* * వెలుగూ చీకటీకాని అసురసంధ్య. బయటినుండి ప్రకృతి భీభత్సంగా రోదిస్తున్న శబ్దం విన్పిస్తున్నది. ఆ వాన జల్లుకూ, గాలి వేగానికీ, కిటికీ గాజు తలుపులూ, సింహద్వారపు తలుపులూ తట్టుకోలేక బ్రతుకునకూ మరణానికీ మధ్య వ్రేలాడుతున్నవి.

లైట్లు వెలిగించుకోలేక హాల్లో ఒంటరిగా ఓ మూలగా బాధపడుతూ కూర్చునివున్నాడు డాక్టర్ నారాయణ. చూడటానికి అతనిలో చలనంలేదు. ఎఱ్ఱగా జ్యోతుల్లావున్న కళ్ళు, విశ్రాంతిలేమినీ, బాధాతప్తహృదయాన్నీ సూచిస్తున్నవి. వేసుకున్న తెల్లనిదుస్తులు మాసిపోయి, దువ్వుకొన్న చక్కని జుట్టు చెదరిపోయి మనిషి ఓ పిచ్చివాలకంలో పడివున్నాడు.

లోపల, మానవుడే కనిపెట్టిన యంత్రం ఆ మానవుణ్నే పరిహసిస్తున్నట్లుగా పనిచేసుకుపోతున్నది. ముందువున్న గది తలుపులు దగ్గఱకు వేసి ఉన్నవి. లోపల వెలుగుతున్న దీపాల నీడలు హాల్లోకి ప్రసరిస్తున్నవి. గదిలో జాకబ్ అటూ యిటూ తిరుగాడుతున్నాడు. నిశ్చయానికి రాలేక కాబోలు! కొంతసేపటికి అతనే గది తలుపులు తీసి మెల్లగా హాల్లోకి ప్రవేశిస్తూ:

జాకబ్: (మెల్లగా) డాక్టర్! (గదిలోవున్న దీపం వెలుగు ఇద్దరిమీదకూ ప్రసరిస్తున్నది.)

డాక్టర్ నారాయణ: (పలుకలేదు. తలయెత్తి చూడలేదు. కుర్చీలోమాత్రం అటునుండి ఇటు సర్దుకున్నాడు.)

జాక: (అతన్ని సమీపిస్తూ) దయచేసి నే చెప్పేది వినండి.

నారా: (బాధగా ఒక్క నిశ్వాసం విడిచి కళ్ళు మూసుకున్నాడు.)

జాక: (అతన్ని మరీ సమీపిస్తూ) దయచేసి నే చెప్పేది వినండి, డాక్టర్! (కొంచెం మౌనం) బ్రతుకుమీద విరక్తియో ఇచ్ఛ కలిగించింది మీరు. (స్వగతంగా) అందుకనే మాని మాని మిమ్మల్ని హింసించలేకపోతున్నాను. కానీ... కానీ... డాక్టర్ ...దయచేసి, దయచేసి మనస్ఫూర్తిగా మీరు చెప్పండి. దొరికిన అవకాశాన్ని చేసేతులా జారవిడుచుకోనా? నాకు తెలుసు. ఈ జన్మకిది ఒక్కటే ఇక శివరాత్రి. విధి గ్రుడ్డిదైనా, చెడ్డదైనా అందలం ఎక్కమంటున్నది నన్ను. నే నా పని చేసుకుంటూ వుండలేను డాక్టర్!—వుండలేను. క్షమించండి నన్ను.

నారా: (జాకబ్ వేపు కోపంగా చూస్తాడు)

జాక్: (ఏదో దృఢనిశ్చయానికి వచ్చినట్టుగా, తనలో తాను అనుకుంటున్నట్టుగా) అందరం మంచివాళ్ళమే—అవసరం రానప్పుడు. అవును. ఇదివరలో నేనూ చాలా మంచివాణ్ణే. కాదా డాక్టర్?

నారా: (ఎకసెక్కంగా) అవునవును.

జాక్: కాదన్నా నాకు పోయిందేమీ లేదు. కాదనే, మంచివారు కాదని ముద్ర వేసి నా చెల్లెలిని—ఎంత ప్రేమగా చూచుకొన్నాను దాన్ని!—నా చెల్లెలిని, తల్లిని—'అమ్మా!'—నా చెల్లెలిని, నా తల్లిని, నా తండ్రినీ—అందరినీ బలి చేశారు. ఎవరో తెలుసా డాక్టర్? కనీసం ఎందుకో తెలుసా? నా చెల్లెలు పెద్దవాళ్ళమనుకునే ఈ నీతివంతుల కోర్కెలకు అంగీకరించలేదు. అంగీకరించలేకపోయింది, పిచ్చిపిల్ల! నా తండ్రి ఈ ప్రెసిడెంటునూ, ఈ మార్షల్‌నూ, తుంటత్వంకాని వీరి నిరంకుశత్వాన్నీ ధిక్కరించి విప్లవంలో చేరాడు. అందుకు ప్రతిఫలం? ఈ నాటికీ నా తండ్రి సంగతి నాకు తెలీదు. ఇంక మా అమ్మ ఎందుకు మంచిది కాలేకపోయిందో తెలుసా డాక్టర్? వీరి దృష్టిలో! అవును! మీకెలా తెలుసు? మీ నాన్నగారికి తెలుసు.

నారా: మా నాన్నగారికా?

జాక్: గాభరాపడకండి. మీరు విదేశాల్లో ఉన్నప్పుడు మీ యింట్లోనే కొంతకాలం తలదాచుకున్నాం. ఆ సంగతి మీకు తెలియదు. నేనే తెలియనీయలేదు—అవసరం రాలేదు కాబట్టి.

నారా: ఇప్పుడు అవసరం వచ్చిందా?

జాక్: ఆఁ! అవసరం వచ్చింది. మనకు తెలియకుండానే, మన ప్రమేయం లేకుండానే, మనమందరం చరమాంకంలో ప్రవేశించాం. ఇందులో ఎవరు రాలిపోతారో ఎవరు నిలబడతారో నాకే తెలీదు.

నారా: చరమాంకమా?

జాక్: నా సంగతి చెప్పనీయండి. ఒక రోజు ఉదయం నిద్రలేచి చూసేసరికి మా అమ్మ నా పక్కన లేదు. ఒక్క ఉత్తరంమాత్రం భద్రంగా ఆమె మంచం మీద పడి ఉంది.

నారా: ఏముందా ఉత్తరంలో?

జాక్: ఏముంటుంది? అపిదాన్ని చూస్తే మగవాడి చేతలూ, ఆలోచనలూ ఎంత వక్రమార్గంలో పయనిస్తాయో అందులో వివరించబడి ఉంది. మీ నాన్నగారు—ఒహ్హో ఎంతటి పెద్దమనిషి ఆయన!—ఈ సంగతి తెలిసినవెంటనే బీరువాలో వెతుక్కున్నాడు. వేసిన తాళాలు వేసినట్లే వున్నాయట కానీ, బంగారపు నగలు రెండు కనిపించటం లేదుట! మానవుడి సంస్కారం ఎంతటి నీచానికి దిగజారి పోయిందో తెలుసా డాక్టర్?

నారా: జాకబ్!

జాక్: కోపం తెచ్చుకోకండి. శాంతంగా ఆలోచించండి. నా యీ స్థితికి ఎవరు కారణం? ప్రెసిడెంటా? మార్షలా? మీరా? చెప్పండి. నేను చేసిన అపరాధం ఏమిటి? అనామకుడిగా నా జీవితం ఎందుకు రాలిపోవలసి వస్తున్నది?

నారా: నేనుమాత్రం కారణం కాదు.

జాక్: కాదు కాబట్టే ఇంతకాలమూ మీ నీడలో తలదాచుకున్నాను. కానీ ఇప్పుడు మీరే, మీకు తెలీకుండానే, నాకు హానిచేస్తున్నారు.

నారా: ఎలాగు?

జాక్: సంఘంలో గౌరవం పొందడానికి అధికారమైనా ఉండాలి. ధనవంతుడైనా అయివుండాలి. కాకపోతే ఆ మనిషి వ్యక్తిత్వం అత్యున్నతమైనదైనా అయివుండాలి. ఈ మూడూ నాకు లేవు.

నారా: అయినప్పుడు?

జాక్: మీరా యంత్రానికి కర్తగా నన్ను అంగీకరిస్తే, నాకు కావాలిసిందీ, నేను యీయవలసిందీ కూడా నెరవేరుస్తున్నాను. ఇంతకాలం బ్రతికి ఉన్న ప్రయోజనం కొంతలో కొంతగానైనా నెరవేరుతుంది.

నారా: కానీ, నేనాపని చేయలేనే!

జాక్: నా యీ జీవితగాథను మీకు విన్పించకూడదనే దినమెల్లా మిమ్మల్ని బాధిస్తూ వచ్చాను. పరోక్షంగా, మీరు బాధపడటం చూసికూడా మిమ్మల్ని బాధిస్తూ వచ్చాను. కానీ చివరకు చెప్పక తప్పలేదు. చెప్పినా ప్రయోజనం

కల్పించడం లేదు.

నారా: చూస్తూ చూస్తూ ఆ పని నే చేయలేను జాకబ్!

జాక: అలా అయితే మీ నాన్నగారు చేసిన పాపానికి మీరు పరిహారం చెల్లించవలసి వస్తుంది. ఆలోచించుకోండి.

నారా: జాకబ్! జాకబ్!?

జాక: లాభం లేదు డాక్టర్! ఎంత సౌమ్యంగా వుండాలో అంత సౌమ్యంగా వున్నాను. కానీ దాని వల్ల నాకు ఉపకారం మాత్రం ఏ మాత్రమూ జరుగలేదు.

నారా: జాకబ్! జాకబ్! ఇంకొక్కసారి ఆలోచించు. నన్ను అన్యాయం చేయబోకు! శిశు హత్యకన్నా ఘోరమైన పాపమిది!

జాక: (పెద్దగా నవ్వుతూ) పాపమా? ఎక్కడుంది డాక్టర్ ఆ పాపం? ఎక్కడ లేదు డాక్టర్ ఆ పాపం? మనమూ, మనచుట్టూ పరిభ్రమిస్తున్న సమస్తలోకమూ, పాపం మూలంగా నే ఉద్భవిస్తున్నదని మర్చిపోకండి. మన తలిదండ్రులు, మన భార్యలు, చివరకు మనం కన్న బిడ్డలూ అందరూ ఒకరినొకరు మోసగించుకుంటూ, దూషించుకుంటూ దాలిగుంటలో కుక్కల్లాగా కదూ బ్రతుకుతున్నది? నీకోసం చేసుకున్నది న్యాయం. ధర్మం, సచ్ఛీలం పేరుతో బహుదక్కగా మోసగించవచ్చు ప్రపంచాన్ని. ఎదుటివాడు దాన్ని తనకోసం వినియోగించుకుంటే అది స్వార్థం. పాపం! మతము నే దుడ్డుకఱ్ఱతో వాడికి కపాల మోక్షం చేస్తారు మీరు. ఇదీ—ఇదే న్యాయమూ, ధర్మమూ!

నారా: (జాలిగా) ఉద్రేకపడకు. నీకు నేనొక నాడు ఆశ్రయమిచ్చానన్న సంగతి మఱచిపోకుండా శాంతంగా ఆలోచించు.

జాక: ఏం? ఉపకారం చేసినందుకు ప్రత్యుపకారం చేయాలా? ఎన్నడో కర్మకాలి వాడు మీ ఇంట తల దాచుకున్నందుకు జీవితాంతం, ఉపకారమనే జైలు గోడలమధ్య, శృంఖలాలు తగిలించుకుని, వాడు ఏడుస్తూ పడివుండ వలసిందేనా? ఇదేనా ఉపకారానికర్థం? వీల్లేదు. ఎన్నటికీ అది వీల్లేదు. నేను, దాన్ని ఆచరించను. అవసరమైతే ఉపకారికి అపకారం చేయడానికైనా ఒప్పుకుంటాను.

నారా: (పెద్దగా అరుస్తున్నట్లుగా) జాకబ్!

జాక: (అంతకన్న పెద్దగా - అదే ఆవేశంలో) అవును! నువు దాన్ని ఇచ్చివేయ వలసిందే. తప్పదు. ఇచ్చేయ్. ఇచ్చేయ్ డాక్టర్!

నారా: ఇవ్వను. ఇవ్వను. ఇవ్వలేను. నేను బ్రతికుండగా ఇవ్వలేను.

[బయటనుంచి శాంతాదేవి స్వరం. కారు వెళ్ళిపోయిన శబ్దం.]

శాం: నారాయణా! నారాయణా!

నారా: వస్తున్నా. వస్తున్నా. శాంతా! (జాకబ్‌ను చూస్తూ) దయచేసి ప్రస్తుతానికి వెళ్ళిపో జాకబ్ తర్వాత మాట్లాడుకుందాం.

జాక: వెళ్లను.

నారా: (బతిమిలాడుతున్నట్లుగా) వెళ్లవా?

జాక: వెళ్లను.

నారా: సరే! (గాద్గదికంగా) నిండా మునిగిన వాడికి చలియేమిటి?

[తలుపు తీస్తాడు. వానజల్లు లోపలికొచ్చి పడుతుంది. వానజల్లుతోపాటు శాంతాదేవి కూడా.]

నారా: (తలుపులు మూస్తూ) వచ్చావా శాంతా!

శాం: ఆఁ! ఆఁ! వచ్చాను నారాయణా! ఎల్లాగో ఫీలు చేసుకువచ్చాను. (జాకబ్‌ను చూసి భయపడి ఒక్కసారిగా) ఓహ్!

జాక: ఏం శాంతా! అంతగా భయపడుతున్నావు? నే నిక్కడ ఉండడం నీకేమైనా అభ్యంతరమా?

నారా: జాకబ్! అనవసరంగా నువు మా యిద్దరిమధ్యా క్షోభ్యం కలుగజేసుకుంటున్నావు.

జాక: అనవసరంగా నువు మా యిద్దరిమధ్యా అడ్డురాకు డాక్టర్!

నారా: ఏమిటిది శాంతా!

శాం: (చలి మూలంగానూ, భయం మూలంగానూ వణికిపోతుంది.)

జాక: ఆమె చెప్పలేదు. కాదు. చెప్పడం చేతకాదు. నేను చెబుతాను. చెప్పనా శాంతా?

శాం: వ...వ...వద్దు.

జాక: ఏం అంతిశ్చయం? ఇంకా బ్రతుకుమీది అభిమానం నీకు చచ్చిపోలేదులావుంది!

శాం: ఓహ్ భగవాన్!

నారా: ఏమిటిది? ఏమిటి మీ సంభాషణ? కొంచెమైనా నాకు అర్థం కావటంలేదు. ఎవరో ఒకరు దయచేసి చెప్పండి. శాంతా కనీసం నువ్వైనా చెప్పవూ?

జాక: నేను చెబుతాను డాక్టర్!

శాం: వద్దు. వద్దు. జాకబ్! నిన్ను బ్రతిమిలాడుకుంటాను. జరిగిపోయిన విషయాలను ఎందుకు నారాయణకుకూడా జ్ఞాపకం చేస్తావు?

నారా: జరిగిపోయిన విషయాలా?!

జాక: అవును. జరిగిపోయిన విషయాలు. బ్రహ్మదేముడి వదనంమీద లేచిన మెంటిమల్లాంటివి.

నారా: అంటే?

జాక: పరమ పతివ్రతల జీవిత గ్రంథాల్లోకూడా కొన్ని కాగితాలు పొగమారి భ్రష్టమై పోయాయి.

నారా : నిజమేనా శాంతాదేవి!

శాం : (తలవంచుకుంటుంది)

జాక : ఆమె నడిగితే ఏం చెప్పగలదు డాక్టర్? నేను చెప్తాను వినండి. వీధినబోయే ఒక అనామకుడు, జీవితం అంటే ఒక్కసారి కళ్ళు తెఱచి అయినా పరికించకముందే, మహారాజసౌధాల్లో కునికిపాట్లు పడుతున్న ఒక సుందరాంగిని చూసి మరులుగొన్నాడు.

శాం : అబద్ధం అబద్ధం.

జాక : అబద్ధమా? సరే అయితే! నిజంచెప్పనా? నాల్గుగోడల మధ్య కళ్ళు మూసుకుని భవిష్యత్తులోకి తొంగి చూడటానికి భయపడుతున్న ఒక సుందరుణ్ణి చూసి, ఒకనాటి సాయంకాలం, ఓ కులమింటిపిల్ల భ్రమపడి కామోసు, ఓ చిరునవ్వును దానంచేసుకున్నది. కదూ, శాంతాదేవి!

శాం : అబద్ధం, శుద్ధబద్ధం.

నారా : (మౌనంగా) తర్వాత జాకబ్?

జాక : ఏముందీ? మామూలుకథే! వసంతం వెళ్ళిపోయి శిశిరం ముసురుకొన్నది. ఆనందమునేది ఒక ఎండమావిగా తయారయింది. ఆ లక్ష్మీపుత్రి ఇంకో లక్ష్మీపుత్రుణ్ణి చూచి, మోజుపడి తాళికట్టించుకుంది.

శాం : జాకబ్! జాకబ్! ఎందుకు నన్నిలా బాధిస్తున్నావు? నేనేం చేశాను నిన్ను? నామీద ఎందుకు నీకీకోపం?

జాక : నిన్ను నేనేంచేశాను శాంతాదేవీ? చరిత్ర కందిన కొందరినిగురించి నే చెబుతున్నది! అందులో నీకు ప్రమేయ మేమిటో?

నారా : ఇదంతా నిజమేనా జాకబ్? (మెల్లగా) అబద్ధమైతే ఎంత బాగుండును!

జాక : అబద్ధం చెప్పుకుంటూ జీవితాన్ని గడుపుకునేటంత హీనస్థితికి నేనింకా దిగజారలేదు డాక్టర్! అద్దమున్నది. మొహమున్నది. మచ్చలున్నదీ, లేనిదీ చూచుకోరాదూ?

నారా : (మెల్లగా) శాంతా!

శాం : నారాయణా! నారాయణా! చివరకు నువ్వుకూడా నన్ను బాధిస్తున్నావా? ఇందుకోసమేనా ఇక్కడకు నన్ను పిలిపించింది? ఇదేనా న్యాయం? ఆ ఉత్తరంలో రాసిందంతా అబద్ధమేనా?

జాక : అంతా అబద్ధమే శాంతాదేవి! అయినా తెలీక అడుగుతాను. పశ్చాత్తాపమూ, ఆత్మప్రశాళనమూ-ఇటువంటివన్నీ నిజమనే నమ్ముతున్నావా? అంత మూర్ఖురాలివా? కాలజారనే జారదు. జారాకా-కూడదీసుకోవటానికి ఏ మూర్ఖుడూ ప్రయత్నించడు. ఎందుకంటావా? ఆ ప్రయత్నం నిష్ఫలమౌతుంది కాబట్టి.

శాం: నిజమేనా డాక్టర్!

నారా: (మౌనం. కళ్లు చింతనిప్పుల్లా తయారవుతున్నయి.)

శాం: అయ్యో! అయ్యో! ఈ వర్షంలో ఎందుకు తడిసి వచ్చాను? మోసపోయి ఎందుకు ఊబిలో దిగబడ్డాను? (దృఢనిశ్చయానికి వచ్చినట్లుగా) సరే! నారాయణా! జరిగిందేదో జరిగిపోయింది. దానికి భయపడవలసిన అవసరంకూడా లేదు. ఇహనుండీ మాత్రం నీకూ, నాకూ ఏసంబంధమూ లేదు. వస్తాను. వస్తాను, డాక్టర్! (గాద్గదికంగా)

(చీర చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ, వీధి ద్వారం దగ్గరకు వస్తుంది. ఇది చూచి జాకబ్

హఠాత్తుగా ఆమెకు అడ్డుపోయి—)

జాక: ఆగండి శాంతా దేవీ! ఎక్కడకు తమ ప్రయాణం?

శాం: (భయం భయంగా) ఇంటికి.

జాక: ఏ ఇంటికి?

శాం: అదేమిటి జాకబ్ అలా మాట్లాడుతున్నావు? ఎన్ని ఇళ్ళున్నాయి గనుక వెళ్ళడానికి? మాయింటికే వెళ్తున్నాను.

జాక: మీ ఇల్లా? అదెక్కడ?

శాం: మా ఇల్లే! అంత క్రొత్తగా మాట్లాడుతున్నావు?

జాక: అవును అర్థం చేసుకోకపోతే అంతా క్రొత్తగానే ఉంటుంది. ఇదివరలో చెప్పాను నేను నీకు దాసుణ్ణని. ఇప్పుడు మళ్ళీ చెబుతున్నాను—నా ఇల్లే నీ ఇల్లని. ఇకనుండి నీ, నా అన్న భేదం లేదు. గతమూ లేదు; భవిష్యత్తూ లేదు. ఉన్నదల్లా వర్తమానమే. అందులో ఉన్న చుక్కల లెక్క పెడదాం.

శాం: జాకబ్! జాకబ్! ఏమిటీ మాటలు?

జాక: ఏమీ లేదు. యథార్థం పచ్చినిజం. మర్యాద నిల్పుకోవాలని ఉంటే మౌనంగా నావెంటరా. ఎదురునిలిస్తే అన్యాయంగా నీ నూరేళ్ళ జీవితాన్ని ఆర్పుకుంటావు.

శాం: జాకబ్!

జాక: లాభం లేదు శాంతా దేవీ! నువ్వు అరచి గీపెట్టినా లాభం లేదు. ఇక్కడ నీకు సహాయం చేసేవాడూ చేయగలిగినవాడూ ఎవ్వడూ లేడు.

శాం: ఏమిటది జాకబ్! ఎందుకింత పిచ్చివాడవౌతున్నావు?

జాక (ఆమె మీదకు వస్తూ) కావలసింది. ఇదివరలో నే పిచ్చివాడిని కావలసింది. కానీ అదృష్టవశాత్తూ కాలేదు. ఈ సుముహూర్తం కోసం ఎదురు చూస్తూ కాలేదు.

శాం: జాకబ్! జాకబ్! నారాయణా! నారాయణా!

జాక: నారాయణ నీ కేవిధంగానూ సహాయం చేయలేడు శాంతా దేవీ! పాపం భ్రమపడుతున్నావు.

శాం: నారాయణా! దణ్ణం పెడతాను నా చర్మం వొలిచి నీకు చెప్పులు కుట్టించి యిస్తాను. వీడి బారినుండి నన్ను తప్పించు—

జాక: లాభం లేదు శాంతా:

శాం: నారాయణా! నారాయణా! నీ చిన్ననాటి శాంతి!

[నారాయణ మహా ఉద్రేకపడిపోతున్నాడు కర్తవ్యం తెలీక కొట్టుమిట్టాడుతున్నాడు]

శాం: నీ శాంతి... ఆదుకోలేవా నారాయణా! చూస్తూ చూస్తూ ఈ కిరాతకుడికి అప్పగిస్తావా? నారాయణా! ఆలోచించకు ఆలోచించకు నారాయణా!

నారా: (ఏదో నిర్ణయానికి వచ్చినట్లుగా పెద్దగా) జాకబ్!

జాక: ఏం? ముసలమ్మకు కాళ్ళు వెలుస్తున్నాయా?

నారా: షటప్! మర్యాదగా శాంతను వదిలిపెట్టు

జాక: వదిలిపెట్టకపోతే!

నారా: (ఏం చెప్పటానికీ తోచదు)

జాక: ఊఁ; చెప్పు! ఏం చేస్తావో చెప్పు. ధీరులు బయల్దేరారు!

నారా: జాకబ్!

జాక: నీ ప్రాణాలు నాచేతుల్లో వున్నాయి. ఒక్క మాట, ఒక్క మాటచాలు. నీ ఆశా సౌధాలు మొత్తమూ కూలిపోతాయి.

నారా: అయినా సరే వీల్లేదు. నువ్వనుకున్నట్లుగా జరగడానికి వీల్లేదు. నే నెలాగూ సర్వనాశనమయ్యాను. శాంతికూడా నాశనం కావడం నాకిష్టం లేదు. అవును కానివ్వను. శాంతిను నాశనం కానివ్వను.

[బయటనుంచి మార్షల్ స్వరం—కర్కశంగా "డాక్టర్!"]

[నారాయణకు ఏం చేయాలో తోచదు. శాంత వణికి పోతుంటుంది]

జాక: ఇప్పటికైనా—నే చెప్పిందానికి ఒప్పుకో శాంతా! అంతా సవ్యంగా ఉంటుంది లేదా సర్వ నాశనమౌతావు.

శాం: ఛీ! ఛీ!

జాక: సరే అయితే. కర్మ మంచిని సూచిస్తుంటే—బుద్ధి పెడదారి తొక్కుతున్నది.

[తెలుపు తీయడానికి వెళ్తాడు]

శాం: అయ్యో! అయ్యో!!

[బయటనుండి మార్షల్ మరింత బిగ్గరగా—
"డాక్టర్!"

నారా : జాకబ్! ఇది కాదు సమయం...కక్షలు తీర్చు కోవడానికి ఆలోచించు—

జాక : ఏమిటి శాంతా! ఏమిటి నీ జవాబు?

[నారాయణ హఠాత్తుగా లోపలి గదిలోకి వెళ తాడు. ఒక్క క్షణం నిశ్శబ్దం; శ్మశాన ప్రశాంతత.]

జాక : చెప్పు శాంతా! ఏం నిర్ణయించుకున్నావు?

మార్ష : డాక్టర్! డాక్టర్! (ఉరుమురిమిన చప్పుడు)

జాక : త్వరగా చెప్పు—అదిగో మార్షల్ స్వరం విన్నావా? ఆలస్యం చేయకు. ఏమిటి? తీయనా తలుపు?

శాం : వద్దు. వద్దు.

జాక : అయితే చెప్పు! అంగీకారమేనా?

శాం : భగవాన్! భగవాన్! ఏమిటిది?

[లోపలినుంచి డాక్టర్ రివాల్వరుతో ప్రవేశిస్తూ]

నారా : ఆగు జాకబ్! నువ్వనుకిందల్లా ఆటకాదు. తలుపు తీశావా నీ ప్రాణాలు నీవి కావు. జాగ్రత్త.

[జాకబ్ చూస్తాడు. పరిస్థితుల నర్థం చేసుకుంటాడు. మెల్లగా]

జాక : డామిట్! కథ అడ్డం తిరుగుతున్నది.

నారా : ఇటు శాంతా! దొడ్డిదారిగుండా ఇల్లు చేరుకుందువుగాని.

శాం : (నిట్టూర్చి) పదనారాయణా!

(ఇద్దరూ వెనుకకు తిరుగుతారు. ఇదే అవకాశంగా తీసుకుని జాకబ్ తలుపు తీయబోతాడు. కొద్ది శబ్దం హఠాత్తుగా నారాయణ వెనుకకు తిరిగి]

నారా : ఫూల్! [పేలుస్తాడు. జాకబ్ ఎంతగా తప్పించుకుందామన్నా గుండు బుజాన్ని దూసుకుపోతుంది. అట్లాగే పట్టుకుని అతడు తలుపు తీస్తాడు. మార్షల్ లోపలికి ప్రవేశిస్తాడు అతనికి అంతా అయోమయంగా ఉంది.)

మార్ష : ఏమిటిది? ఏమిటిదంతా? ఓహ్! నువ్వా జాకబ్ ఏమిటీ రక్తం?

[మార్షల్‌ను చూచి నారాయణా, శాంతా వెం. I గదిలోనుంచి పారిపోబోతారు.]

జాక : (బాధతో చె) అటు. అటు చూడండి, అదిగో—పోతున్నారు. పోతున్నారు. వాళ్ళు...వాళ్ళను పట్టుకోండి. పట్టుకోండి మార్షల్!

మా : (తన పిస్టల్ తీసి వాళ్ల వెంటపడి) ఆగండి! ఎవరక్కడ? (నారాయణా, శాంతా లాభం లేదని ఆగిపోతారు)

మా : (వారిద్దరినీ చూచి ఆశ్చర్యపడి) ఓహ్! మీరు! శాంతా! అనుకున్నట్లుగానే నువ్విక్కడకు వచ్చావన్నమాట!

శాం : ఏమండీ!

మా : దుర్మార్గురాలా! ఇంకా ఎందుకు ఈ కల్లబొల్లి కన్నీళ్ళు? పారిపోదామనుకున్నారు. జాకబ్ అడ్డుతగిలాడన్నమాట. అతన్ని చంపటానికి ప్రయత్నించారా దుర్మార్గులు! ఏం డాక్టర్! నీకూ ఈ పిదపబుద్ధి పుట్టిందీ! మర్యాదహీనుడివి. ఛీ! ఛీ! అదిగో అటుచూడండి. మీ పాపానికి (జాకబ్ బాధగా గట్టిగా మూలుగుతున్నాడు) ఎటువంటి ఫలితం అనుభవించవలసివస్తున్నదో?

శాం : ఏమండీ! ఏమండీ! ఒక్కమాట. ఒక్కమాట వినండి. నే చెప్పేది వినండి.

మా : ఇంకా ఎందుకు వినడం ప్రత్యక్షంగా కనిపిస్తున్నదానికి? ఎక్కడకు వెళ్ళావని దెబ్బలన్నడిగాను. తెంబేలుపడ్డాడు. చెమటలు పోశాయి. పాపం! చివరకు చెప్పాడు. నమ్మలేకపోయాను. ఈ భిషుకితో ఒంటరిగా, రాత్రిపూటమాట్లాడవలసిన విషయాలు ఏముంటాయిగనుక! అందుకనే వచ్చాను అసలు సంగతి చూద్దామని. చూశాను. ఏది నమ్మలేకపోయానో అదే చూశాను. చాలు...ఇంకా ఎందుకు నీ మాటలు వినడం? ఇంతవరకూ నన్ను మోసగిస్తూవచ్చావు. ఆ మోసం చాలు.

శాం : ఏమండీ...

మా : అవును. ఆ మోసం చాలు. ఆడుతున్న కపట నాటకం అంత్యఘట్టంలో పడింది. పాపానికి ప్రాయశ్చిత్తం లభించబోతున్నది.

శాం : (ఏడుస్తుంటుంది)

నారా: ప్రాయశ్చిత్తమా?

మా : ఆఁ! ఎవరెవరు కావాలని ఈపాపానికి దోహదం చేశారో, వారినందరినీ—

శాం : వద్దు ... వద్దు ... అంతటిశిక్ష విధించకండి. నేనేమీ పాపం చేయలేదు. పాపం చెయ్యలేను కూడా!

జాక : (బాధపడుతూ, మూలుగుతూ) మార్షల్ ఆడదాని మాటలు నమ్మబోకు. చేతలు విష పూరితాలు.

నారా: మార్షల్ ! నేను పెద్దవాణ్ణి కావచ్చు. నా జీవితంలో నీతిఅనేది లోపించవచ్చు కానీ ఒక్క మాట చెబుతాను. నమ్ముతావా ?

జాక: (మెల్లగా లేస్తూ) మార్షల్ ! నమ్మబోకు. ఆ డాక్టర్‌ను నమ్మబోకు. నిలువెల్లా విషమే అతనికి.

నారా: ఐనా కోరలుడిగిన నన్ను చూసి భయపడవలసిన అగత్యంలేదు మార్షల్, నీకు ఉదారహృదయుడవై నే చెప్పేది వింటావా మంచిది. లేదూ నువు పట్టినకుందేటికి మూడే కాళ్ళంటావా సరేమంచిది నవ్వుతూ మరణించడానికి ఒప్పుకుంటాను.

మార్ష: ఏమిటి నువు చెప్పదలచుకున్నది?

నారా: ఏమీ లేదు. చాలా చిన్న విషయం. ప్రతి మానవుడిలోనూ రెండు విరుద్ధశక్తులు పనిచేస్తుంటాయి. అందరికీ అవి తెలిసినవే. మంచీ-చెడూ. పగటిపూట మంచికి యౌవనం వస్తే, రాత్రిపూట చెడు రెక్కలు తొడిగించుకుంటుంది.

మార్ష: ఇంతకూ అసలు సంగతి ఏమిటి ?

నారా: తొందరపడకు మార్షల్ ! చెప్పేది జాగ్రత్తగా విను. మంచీ—చెడూ అనే యీ రెండు విరుద్ధశక్తులూ ఆత్మచేత కాదు నిగ్రహింపబడేది. బుద్ధికి కాదు వాటిమీద అధికారంవున్నది. దేహంలో పంచేంద్రియాలని అంటుంటామే ... వాటి మూలంగా నే తటస్థించేది మంచిగానీ చెడుగానీ. నీవొక మల్లెపొదదగ్గరకు వెళ్ళావు యాదృచ్ఛికంగా. మల్లెవాసన తటాలున నిన్ను అలుముకుంటుంది. అక్కడ ఘ్రాణేంద్రియం నీ సర్వస్వాన్నీ తనఅదుపులో పెట్టుకుంటుంది. మిగిలిన వాటి విషయంకూడా అంతే!

మార్ష: (విసుగ్గా) ఏమిటీ అర్థంలేని తత్వం ?

నారా: వస్తున్నాను. అసలు విషయంలోకి వస్తున్నాను, స్త్రీ పురుష సంబంధంకూడా అంతే! ప్రేమ, అభిమానమూ ఇవి పూర్వజన్మ సంస్కారం మూలంగా ఉద్భవిస్తాయి. ఇక పశు ప్రవృత్తి అంటావా ? దానికి కారణం అశాశ్వతమైన ఈ దేహమే!

మార్ష: ఏమిటయ్యా ఇది ?

నారా: ఏమిటా ? మేము కామంతో కాదు దగ్గరకు చేరింది. ప్రేమతో అని... చెప్పటానికి. ఇక్కడ ఇంద్రియాలు కాదు ప్రాధాన్యం వహిస్తున్నది ఆత్మానాత్మ వివేకమనేది.

మార్ష: నారాయణా ! ఇదంతా నాకనవసరం. బాహ్యానికి కనిపిస్తున్నదీ, నలుగురి దృష్టిలో తప్పుగా పరిగణింపబడేది-మీరు చేసేపని. అయినా నాకూ నా వంశగౌరవానికీ సంబంధించిన విషయమిది. అయినప్పుడు వేదాంతం కాదు నాక్కావలసింది. మీరు తప్పుచేశారని ఒప్పుకుంటారా లేదా అన్న విషయం.

జాక : దీనికి వాళ్ళవసగాలా మార్షల్! ప్రేమట ప్రేమ! ఒక స్త్రీ ఎంతమందిని ప్రేమిస్తుంది? పదిమందినా? జీవితంలో వేదాంతమనేది దొరికింది మనకందరికీ, అవసరం ఉన్నా లేకపోయినా వల్లించడానికి, అసలు ప్రేమంటే ఏమిటి? ఓ నీళ్ళమూట! ఓ కుందేటికొమ్ము! పశు చర్యలో ప్రేమకోసం వెతుక్కోవడం ఇసుకలోనుండి నూనె పిండుకోవడమే! వీళ్ళను నమ్మకండి మార్షల్!—పచ్చి అబద్ధాలను మాట్లాడుతున్నారు. మిమ్మల్ని మాటలతో మోసం చేయాలని చూస్తున్నారు. మీ కనుగప్పి పారిపోవడానికి దారి వెతుక్కుంటున్నారు.

మార్ష : ఏం శాంతా! నువ్వేం చెప్తావు దీనికి సమాధానం? చేసింది తప్పని ఒప్పుకుంటావా?

శాం : నన్ను మీరు నమ్మగలరా!

మార్ష : నువ్వు నిజం చెపితే!

శాం : నిజమే చెబుతాను, సర్వం సమాప్తమైపోతూ, జీవితమే నాశనం కాబోతున్న తరుణంలో కూడా అబద్ధం చెబుతానా? అబద్ధం చెబుతానని ఎలా వూహించుకుంటున్నారు! దశాబ్దంగా సాగిన మన సంసారం, చివరకు అనుమానాన్నన్న మాట పంగించింది! అవును మరి ఆడదాని బ్రతుకే

అంతే! కూపస్థమండూకం మాకన్న ఎంతో సుఖం అనుభవిస్తుంది.

మార్ష: ఏమిటి; తప్పు చేశావా—లేదా? అదీ నేనడుగుతున్నది—ఉపన్యాసం కాదు.

శాం: (ఏడుస్తూ) అసలు నేను తప్పుచేశానని ఎలా ఊహించుకోగలుగుతున్నారు? జ్ఞానంలోనూ, అనుభవంలోనూ, మనతోడి వారలను అర్థం చేసుకోవడంలోనూ, ఇంతగా మనం పరిణతి చెందాం! ఇది మన సంస్కారం! కష్టసుఖాలను రెండింటినీ సమానంగా పంచుకుంటానని మీతో కలిసి ప్రమాణం చేసినతర్వాత, మళ్లా నేను మాట తప్పుతానని, కాలు జారుతానని ఎందుకు ఊహించుకుంటున్నారు? ఆ మాత్రం నా మీద నమ్మకం వుంచలేరూ? ప్రొద్దున లేచింది మొదలు, పడుకుంది మధ్య నవ్వుతూ, నవ్విస్తూ మీతో కాలం గడపాలి. నేనేమైనా అనుమానిస్తున్నానా? అనుమానం తప్ప మనకిక చేయవలసిన బాధ్యత, కర్తవ్యం ఏమీ లేవా? చెప్పండి. మీ మనసుకు సమాధానం చెప్పుకుని ఆ తరువాత నాకు చెప్పండి. చెప్పండి...

జాక: నమ్మకండి మార్షల్! ఈ ఆడవాళ్ల మాటలు నమ్మకండి, మగవాడికి ఈ ప్రకృతిమీదవున్న అధికారమూ, హక్కూ ఆడదానికి లేవు. సమానత్వమనేది సిద్ధించని ఓ ఆదర్శం. మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి! జీవితంలో అందరూ అందలం ఎక్కాలనుకునేవారే! మరి మోసేవారు? ఈ బాధ్యతా నిర్వహణకే స్త్రీ సృష్టింపబడింది. ఈ బాధ్యతనే మీ శాంతి నెరవేర్చ లేక పోయింది. అందుచేతనే ఆమెను మీరు శిక్షించాలి. అప్పుడే మీరు ధర్మభ్రష్టులు కాకుండా ఉంటారు.

శాం: నమ్మకండి. ఆ నీచుడి మాటలు నమ్మకండి. ఒక దుష్ప్రభావాన్ని ప్రసరింప జేస్తాడువాడు!

మార్ష: ఎందుకని? నువు చెప్పేది నిజంఎందుకు కావాలి? నమ్ముతున్నాను. అతను చెప్పిన ప్రతిఅక్షరాన్ని నమ్ముతున్నాను.

శాం: (భయంగా) నమ్ముతున్నారా? అయ్యో!

మార్ష: అవును. అతని మాటలు నిజం. మీరు వంచకులు మోసం చేయడమే మీ వృత్తి. అటువంటి... అటువంటి మీరు ...మీరు ఎందుకు బ్రతకాలి? బ్రతికి ఎవరిని ఉద్ధరిస్తారు?

శాం: అయ్యో! అయ్యో! భగవాన్! వద్దు...వద్దు. అంతటి ఘోరకార్యం—

మార్ష: చేస్తాను. నిన్ను...నిన్ను...శాంతా!

[పెద్దగా అరుపు. ఆమెను సమీపించి, రాక్షస ప్రవృత్తి కలవాడిలాగా ఆమె గొంతు పట్టి నొక్కుతుంటాడు. ఆమె గిలాగిలా పక్షిలా తన్నుకుంటుంది. నారాయణ అది చూచి క్షణంసేపు మ్రాన్పడిపోయినా తిరిగి కర్తవ్యాన్ని పుంజుకుని మార్షల్‌ను పట్టుకుని ఇవతలకు లాగుతూ—]

నారా: మార్షల్! మార్షల్! నా మాట విను. నామాట విను మార్షల్! దీని కంతటికీ కారణం ఆమె కాదు. ఆమె కాదు మార్షల్! నేను—నన్ను చంపు. నీ యిష్టమొచ్చినట్లు హింసించి నన్ను చంపు—

మార్ష: చంపుతాను. నిన్నూ చంపుతాను. ముందు దీన్ని చంపి...

నారా: (పిచ్చి కోపంతో) చంపుతావా? నా శాంతిను చంపుతావా? దుర్మార్గుడా!

[అమానుషమైన శక్తితో మార్షల్ మీదకలియబడి అతన్ని ఓమూలకు నెట్టి వేస్తాడు. జాకబ్ మార్షల్‌కు సహాయం చేద్దామన్నా చేయలేక, మరో మూల మూలుగుతుంటాడు. శాంతి వణికి పోతుంటుంది. నారాయణ మార్షల్ వేపు చూస్తూ:]

నారా: దుర్మార్గుడా! అన్నీ సవ్యంగా ఉన్నంతవరకే అధికారాలూ, గౌరవాలూ! అది గుర్తించక పోయావు. హీనుడివయ్యావు. వెళ్లిపో. ఇక్కడి నుంచి వెళ్ళిపో మర్యాదగా. నీ శాంతిను తీసుకొని తిరిగిచూడకుండా వెళ్ళిపో!

జాక: పిరికివాడిలాగా భయపడి పారిపోతావామార్షల్!

మార్ష: (పిస్తల్ గురిపెట్టూ) పారిపోతావా? ఈ కుంకేళ్ళకు భయపడి.

[ఇదిచూచి నారాయణ శాంతకు అడ్డుగా నిలుస్తాడు] నారాయణా! శాంతకు అడ్డు తొలగు నిన్ను నేచంపను అడ్డుతొలగు.

నారా: పిచ్చివాడా! నువ్వు నన్ను చంపగలంతటి శక్తి

మంటువేవా? తల్చుకుంటే నిన్ను క్షణాలమీద నేను పరలోకానికి పంపగలను. అది ఆలోచించుకుని సాహసం చెయ్!

మార్ష: అట్లాగా? చూస్తాను అది ఎంతవరకు నిజమో చూస్తాను.

[(వెళ్ళబోతాడు. ఇంతలో ప్రెసిడెంట్ ప్రవేశం. బయట కారువెళ్ళిపోయినశబ్దం. అతన్ని చూడగానే అందరూ సర్దుకోవడానికి ప్రయత్నిస్తారు. కాని ముఖకళికలు మారలేదు. జాకబ్ అతి కష్టంమీద, మెల్లగా నడుస్తూ, ఒక కుర్చీని ఆసరా చేసుకుని, నిలబడి చేతికి ఓ రుమాలు బిగించుకుంటాడు]

ప్రెసి: అబ్బబ్బ! ఏమిచలి! ఏమిగాలి! ప్రాణాలు గడ్డ కట్టుకుపోతుంటేను! పాడువర్షం. సముద్రంలో సుడిగుండం లేచిందట—ప్రకృతి మనమీద పగదీర్చుకుంటున్నది (అందరినీ చూచి, విస్మయంతో) అరె! ఇదేమిటి? కావలసినవాళ్ళూ, రావలసినవాళ్ళూ అందరూ ఒకచోటే సమావేశమయ్యారే! ఏమిటి మార్షల్ నువ్వెందుకు వచ్చినట్లు? నాతో చెప్పనైనా చెప్పలేదు.

మార్ష: అబ్బే! ఏమీ లేదండి చెప్పడానికి అంతముఖ్య విషయం కాదు కదా అని. డాక్టరు నారాయణ గారితో కాస్త మాట్లాడవలసి వచ్చింది. వాతావరణమంత బాగలేకపోయిన రాకతప్పింది కాదు.

ప్రెసి: ఓహ్హో! అలాగా?

నారా: (ప్రెసిడెంట్ ను సమీపించి, విష్ చేసి) అనుకున్నట్టుగా వచ్చారు.

ప్రెసి: అవును మరి. అవసరం మానవుణ్ణి బానిసగా చేసుకుంటుంది.

జాక: క్షమించండి—కల్పించుకుంటున్నందుకు; అంత అవసరమేమిటో!

ప్రెసి: ఇది నీ విషయం కాదు.

జాక: క్షమించండి నా విషయమే!

ప్రెసి: ఏమిటి?

జాక: అవును మీరేం మాట్లాడగలరు నావిషయం తప్ప? మీకు ఈ ప్రపంచంలో కావలసిందేది? నేను అహోరాత్రులు కష్టించి కనిపెట్టిన ఈ అపూర్వయంత్రం తప్ప? నాకు తెలుసు ప్రెసిడెంట్—మీరు చెప్పకపోయినా ఆమాత్రం నేనూహించుకోగలను.

నారా: ఏమిటీ? ఏమిటి నువ్వంటున్నది? ఆ యంత్రం నువ్వు కనిపెట్టావా? ఫూల్! తిన్నయింటి వాసాలు లెక్కపెట్టదలుస్తున్నావు? ప్రెసిడెంట్! నమ్మకండి పిడిమాటలు. ఈ కృతఘ్నుడి మాటలు నమ్మకండి.

జాక: మాటలు అనవసరంగా పారేసుకోకు డాక్టర్! - మళ్ళీ అవసరం రావచ్చు.

నారా: స్కౌండ్రల్! పరాయివాళ్ళ బిడ్డను నీ బిడ్డే అని చెప్పుకోడానికి అసలు నీకు నోరెల్లా వస్తున్నదీ అని. పాముకు పాలుపోసి పెంచాను.

ప్రెసి: నువ్వు కనిపెటిన యంత్రమా? మిస్టర్ జాకబ్! చాలా ఆశ్చర్యకరంగా మట్లాడుతున్నావు! నేను విన్నదీ, స్వయంగా డాక్టర్ నారాయణ చెప్పింది కూడా తనే యీ యంత్రాన్ని కనిపెట్టారని.

మార్ష: కాదు ప్రెసిడెంట్ - డాక్టరు చెప్పేదంతా శుద్ధ అబద్ధం.

ప్రెసి: ఎందుకనో?

మార్ష: నేను నిన్న సాయంకాలం వచ్చి అడిగాను. పరిశోధనా ఫలితం ఏమైందని. ఎంతో ప్రేమ పూర్వకంగా అడిగాను. కనిపెట్టింది ప్రభుత్వాధీనం చేసి, తద్వారా వచ్చిన ప్రతిఫలంతో జీవితమంతా హాయిగా గడపమని, సలహాయిస్తూ; ఎంతో అభిమానంతో అడిగాను. సనేమిరా తను కనిపెట్టలేదన్నాడు. తాను కనిపెట్టనే కనిపెట్టలేదన్నాడు. అటువంటివాడు - పది సంవత్సరాలుగా చేయలేని పని - ఒక్కరాత్రిలో చేయగలిగాడంటే నమ్మడం శక్యమేనా ఆలోచించండి ప్రెసిడెంట్.

ప్రెసి: కావచ్చు. శాస్త్రజ్ఞుల పరిశోధన లన్నీ విజయం పొందింది యాదృచ్ఛికంగానే.

జాక: (శాంతిను సమీపించి, అతిరహస్యం చెప్తున్నట్లు) ఇంకొక్క అవకాశం ఇస్తున్నాను శాంతాదేవీ - ఆలోచించుకుని చెప్పు. "ఈ యంత్రాన్ని కనిపెట్టింది డాక్టరు నారాయణ కాదు. జాకబ్-" అని ప్రెసిడెంటులో చెప్ప గలవా? ఇహ యీ జీవితంలో నీ జోలికిరాను

నా మాటనమ్ము.

శాంతి: నేను జీవించి ఉండగా అటువంటి కిరాతానికి ఒడిగట్టను.

జాక: ఆలోచించుకుని చెప్పు. (ప్రకాశంగా) నేను చెబుతున్నది అబద్ధమనే అనుకుంటున్నారా?- మిస్టర్ ప్రెసిడెంట్! అదుగో శ్రీమతి శాంతా దేవిగారున్నారు. మార్షల్ తివారీగారున్నారు. నేలవమైన వాదన చేస్తూన్న డాక్టర్ వున్నారు. అడగండి - అడగండి. ప్రెసిడెంట్!

ప్రెసి: శాంతాదేవి గారికీ విషయాలెలా తెలుసు? ఏం శాంతాదేవి?

నారా: నువ్వూ నాకు వ్యతిరేకమైనావా శాంతాదేవి!

మార్ష: (శాంతిను సమీపించి మెల్లగా) చూడు శాంతా! పూర్వపు కలతలు మర్చిపోయి మళ్ళీ మనం ఈ జీవితాన్ని అనుభవిద్దాం. ఇది నీకూ ఇష్టమే కదూ?

శాం: నిజంగానా?

మార్ష: ఆ! కానీ ఒక్క షరతుమీద.

శాం: ఏమిటది?

మార్ష: ఏమీలేదు. చాలా చిన్న విషయం. జాకబ్ అది కనిపెట్టాడని చెప్పు. అంతే!

శాం: (ఆశ్చర్యంగా) ఆఁ!

మార్ష: నారాయణ అది కనిపెట్టలేదని చెప్పు. చాలా చిన్న సంగతి.

శాం: అసంభవం.

మార్ష: ఆలోచించుకుని చెప్పు.

శాం: అబద్ధాన్ని నిజమని నిరూపించలేను.

మార్ష: నీ కర్మ.

జాక: చూడండి ప్రెసిడెంట్! నిజాన్ని బయటకు చెప్పడానికి బిడియపడి తనభర్తతో రహస్యంగా చెబుతున్నది. వినండి.

ప్రెసి: నిజమేనా మార్షల్?

నారా: శాంతా!

మార్ష: నిజమే.

శాం: (ఉద్విగ్నురాలై) అబద్ధం!

మార్ష: మూర్ఖురాలా! పిచ్చిదానివై పట్టున్నావు.

నారా: శాంతా! నాపాలిటి దేవతలాగా నన్ను కాపాడావు.

జాక: నాటకం ఇంతటితో ముగియలేదు డాక్టర్! నిరూపించండి. ఈ యంత్రాన్ని మీరే నిర్మించారని నిరూపించుకోండి.

ప్రెసి: నిజమే. అది సమంజసంగా ఉంటుంది.

నారా: మంచిది. ఎవరిబిడ్డను వారే గుర్తుపట్టలేరా ప్రెసిడెంట్! కానీ ఒక్క మనవి. జాకబ్‌ను నేను కొన్ని ప్రశ్నలు వేస్తాను. సమాధానం చెప్పమనండి.

జాక: నేనే ఎందుకు వేయకూడదు మిమ్మల్ని?

నారా: కాదు. నేను ముందు వేయదలుచుకున్నాను. నువ్వు సమాధానం చెప్పాలి. చెప్పితీరాలి.

ప్రెసి: డాక్టర్ ప్రశ్నలకు సమాధానం చెప్పు జాకబ్!

జాక: (అయిష్టంగానే) సరే. చెబుతాను. అడగండి డాక్టర్.

నారా: ఈ యంత్రాన్ని కనిపెట్టడంలో అసలు ఉద్దేశ్యమేమిటి?

జాక: దేముడు మానవుణ్ణి ఎందుకు సృష్టించాడో, అందుకే దీన్ని నేను సృష్టించాను.

నారా: ఈయంత్రం ఏమేం చేయగలుగుతుంది?

జాక: ఇది చేయలేనిదంటూ మాత్రం ఏమీ లేదు.

నారా: దాని నిర్మాణం చెప్పగలవా?

జాక: అది చెప్పినందువల్ల ప్రస్తుతానికి ఒరిగే ప్రయోజనమేమీ లేదు.

నారా: ఏమిటిమిస్టర్ ప్రెసిడెంట్ ఈ సమాధానాలు?

ప్రెసి: ఇంకా అడగండి డాక్టర్!

నారా: ఇదెలా పనిచేస్తుందో చేసి చూపించగలవా?

ప్రెసి: చక్కటి ప్రశ్న. వెళ్ళి చూపించు. మిస్టర్ జాకబ్!

[జాకబ్ వాళ్ళవేపు ఒక్కసారి చూసి, ఆయంత్రందగ్గరకు వెళ్తాడు. నీలం బల్బు, ఎఱ్ఱ బల్బు ఆరిపోయి వుంటాయి. తెల్లబల్బుమాత్రం వెలుగుతుంటుంది. జాకబ్ క్షణంసేపు వాటికేసి చూసి, ఏంచేయాలో తోచక, ఎఱ్ఱబల్బు వలిగే స్విచ్ వేయబోతాడు. అది డాక్టర్ చూసి కంగారుగా]

నారా: ఆగు! ఆగు! జాకబ్! ప్రమాదం. ప్రమాద మది వేస్తే. సర్వనాశనం. సర్వనాశన మౌతుంది అది వేస్తే.

శాం:
ప్రెసి: } ఆఁ!
మార్ష:

నారా: అవును. ఆ స్విచ్ వేస్తే లోపల 'చెయిన్ రియాక్షన్' జరుగుతుంది. యంత్రం పేలుతుంది. ఫలితంగా ఈ ప్రదేశమంతా ఓ శ్మశానంగా తయారౌతుంది. (జాకబ్ అది వింటాడు. ఓ చిన్న మందహాసం కొద్దిపాటి ఆలోచన. అతని వదనం క్రమంగా ఎఱ్ఱనౌతుంటుంది. మృత్యుదేవత అతని కళ్లనుండి ప్రపంచాన్ని చూచిస్తుంటుంది. జాకబ్ మెల్ల మెల్లగా యంత్రాన్ని, ఆ ఎఱ్ఱబల్బును సమీపిస్తుంటాడు. డాక్టర్ నారాయణ అదిచూచి, అతని ఇంగితాన్ని గ్రహించి, అతనిదగ్గఱకు పరుగెత్తుకు వెళ్ళబోతాడు; ఇంతలో అది మార్షల్ చూచి:)

మార్ష: (పిస్టల్ తీసి) ఆగు డాక్టర్! మరణానికి ఎదురు నడవబోకు. ఆగిపో!

నారా: జాకబ్! జాకబ్! వద్దు వద్దు—అపాయసంభవం. (పరుగెత్తబోతాడు. మార్షల్ పిస్టల్ పేలుస్తాడు. డాక్టర్ క్రిందపడిపోతాడు)

నారా: అబ్బ! దుర్మార్గుడా! తప్పదు. తప్పదు. పాప ఫలం అనుభవించి తీర్తావు. అబ్బ! శాంతా!

ప్రెసి: (ఒక్కసారిగా) మార్షల్! ఏమిటిది? ఏమిటీ ఘోరం? పడేయ్! నీ పిస్టల్ కింద పడేయ్!

మార్ష: జాకబ్! జాకబ్! త్వరగా కానీ. త్వరగా ఊ! త్వరగా!

ప్రెసి: మార్షల్! డౌన్ యువర్ పిస్టల్!

మార్ష: జాకబ్! ఊఁ! త్వరపడు జాకబ్!

[జాకబ్ పిచ్చిగా యంత్రం దగ్గరకు వెళ్తాడు. నారాయణ అది చూస్తాడు. అతని వదనంలో కోటి భావాలు! ఒక్కసారిగా లేచి ఓ పిక తెచ్చుకుని శాంతను సమీపించి, ఆమెను బలంగా మొదటి ద్వారం గుండా బయటికి విసిరేస్తాడు. ఆమె అసహాయంగా కేక పెట్టుంది]

ప్రెసి: డౌన్ విత్ యువర్ పిస్టల్! మిస్టర్ మార్షల్!

[పిస్టలు పేలుస్తాడు. అదేసమయంలో జాకబ్ కూడా ఎఱ్ఱ బల్బు వెలిగే స్విచ్ నొక్కుతాడు. ఎఱ్ఱ బల్బు వెలుగుతుంది. ఓ ఉరుము ఉరిమింది. వానజల్లు లోపలికొచ్చి పడింది. ప్రళయం కళ్ళు తెఱిచింది. యంత్రంలోని తీగలు తెగిపోయినవి. రంగంమీద వున్న ఆ ముగ్గురూ ఏమాత్రం శబ్దం లేకుండా అలానే నేల కూలిపోయారు. కొద్ది నిశ్శబ్దం.]

శాం: (మెల్లగా, అనుగులో అడుగు వేసుకుంటూ ప్రవేశించి, గద్గదంగా) అయిపోయిందా? సర్వమూ సమాప్తమై పోయిందా? ఏమిటి మిగిలింది.? నైరాశ్యమా? కన్నీళ్ళా? భగవంతుడా! ఇందుకు ఎవరు కారణం? శాస్త్ర విజ్ఞానమా? మనో వికారమా? ఎవరు కారణం దీనికి? నా పాత్ర ఏమిటి ఇందులో?— నేనా కారణం దీనికి. భగవంతుడా! దారి చూపించు. పునః సృష్టి ప్రారంభించు.

[తెర]

దైవపురుషకారములు

శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు

"వివాహములు స్వర్గములో సిద్ధముగునందురు. నరకములో సహా కొన్ని సిద్ధముగునేమో?"

తదేక ధ్యానములో జాతకదశల గుణించుచుండిన నేను తలఎత్తి నా యెదుట అల్లంతదూరమున ఆసీనురాలైయున్న తరుణీ మూర్తిని చూచితిని. బ్రహ్మతో విరసము కలిగి భూమికి దిగివచ్చిన సరస్వతి వలె ఆమె మాపట్టినది. ఆమె జాతకము నే నెపుడు గుణించుచుండుట.

"జాతక గ్రహములు దశల ననుసరించి వివాహముల ఫలములు నడచునని అర్థము. ఇచట నరకమునకు ప్రసక్తి లేదు." అంటిని.

"నా జాతకములో గ్రహములు అన్నీ క్రూరముగానున్న వేమో?"

"దశలు మారుచుండును. శుభాశుభఫలములు శాశ్వతములు కావు."

"నా జాతకము మాట ఏమో కాని, మా నాయనగారి జాతకములో మాత్రము ఒక గ్రహము మహాక్రూరమైనది కలదని ఎరుగుదుము."

ఆశ్చర్యముతో, "ఏ గ్రహము?" అని అడిగితిని.

"మీ నవగ్రహములు కావు లెండి." అని తల వంచి, కొంత వక్రముగా పెదవి విరిచి, "ద-శ మ-గ్రహము" అని మెల్లగా ఆమె జారబలికినది.

నాకు నవ్వు వచ్చెను. కాని, అపుకొంటిని, ఆమె మనసు నొచ్చునేమో, అని.

"సదా క్రూరో, సదావక్రీ,
కన్యారాశి మపేక్షతే,
తృతీయైకాదశే దృష్టిః
జామాతా, దశమగ్రహః"

సాధారణముగా అల్లుని తనపు ధార్ష్ట్యమును ఎగతాళిచేయు పైచాటు శ్లోకమును మనసులో నుంచుకొని, తన భర్త నిర్దయుడని ఆమె వ్యంగ్యముగా సూచించిన దనుకొని.

"ఆ గ్రహము చాలా మంచిదమ్మా." అంటిని, గంభీరముగా.

"అయితే, సుమతి శతకము మరచినారు." అని వెంటనే మందస్మితముగా ఆమె ప్రతి ఇచ్చినది.

"మరచిపోలే దమ్మా!

'అల్లుని మంచి తనంబును,
గొల్లని సాహిత్య విద్య, కోమలి నిజమున్.' అను నంతలో, ఆమె తటాలున చిన్నగా నాలుకకరచి.

"నేను మహాశినాత్మురాలను. కోమలిని కాను." అని సమన్వయముచేసి, మీ పనికి అభ్యంతరముచేయుచున్నా నేమో?" అనెను.

ఆమె చాతుర్యమునకు సంతసించి, జాతకదశల గుణించితిని.

ఇదే ఆమె సాయనజాతకము.

<table>
<tr><td>వరుణ 1.45
(వ)</td><td></td><td>కే 5-37
మన్మథ
12-18</td><td>I 9-41</td></tr>
<tr><td>X 28-27</td><td rowspan="2" colspan="2">(సాయనము)
—
కథా నాయకురాలి
జాతకచక్రము
—</td><td>యమ 8-40</td></tr>
<tr><td>శు 16-20</td><td>ఇంద్ర 13-45</td></tr>
<tr><td>శ 20-5
బు 0-50(వ)</td><td>చ 4-6
రా 5.47
ల 16-51-25</td><td></td><td>గు 14-28
ర 22-7</td></tr>
</table>

మిథున లగ్నపు ధనుర్నవాంశలో, కన్యాద్వాదశాంశలో, పుట్టిన మెరుపుతీగ జాతకురాలు. లగ్న, పంచమాధిపతులై, సప్తమకేంద్రములో నున్న శుభ గ్రహములగు బుధశుక్రుల నిండు దృష్టి లగ్నముపై నున్నది. అందమైన ఆకార సౌష్టవము, సౌందర్యమునకు వన్నె దెచ్చు లావణ్యము, నవనవోన్మేషము గల ప్రతిభ, చక్కని సాహిత్య రసజ్ఞత, సరసాలాప చాతుర్యము, ఊహాపటుత్వము, భావతీవ్రత, ఆమెలో సమృద్ధిగా చూపట్టుట వింతకాదు. చంద్రునితో త్రికోణ మైత్రి కలిగి రాజ్యస్థానము నాశ్రయించి యున్న వరుణుని చూడుడు. స్వనిర్మ నిర్వహణమందు శ్రద్ధ, సామాన్యముగా ఇతరులకు సులభముగా స్ఫురించని భావములు, అదృశ్యసాధనమునకై ఎంతటి త్యాగమునకైనా పూనుకొను మనస్తత్త్వము, ఇవి ఈ యోగపు ఫలములు. కాని, ఈ వరుణ మహాశయుని కేంద్రదృష్టి వేధ ప్రబలముగా లగ్నాధిపతి బుధునిపై నుండుట చింతాకరము. ఉపజ్ఞాయుతమైన నిశితబుద్ధి, ప్రబలమగు వ్యక్తి స్వాతంత్ర్యకాంక్ష, తీక్ష్ణమగు ఆర్ద్రచిత్తవృత్తి, ఆవేశము కాని, దుఃఖము గాని, అపుకోజాలని కోమల హృదయము, చూపట్ట గలవు.

"వజ్రాదపి కఠోరాణి,
మృదూని కుసుమాదపి."

అను నిర్వచనమునకు తగినది మనస్తత్త్వము. లగ్నాధిపతి బుధుడు, పంచమాధిపతి శుక్రుడు, చేరియొక వైపున సప్తమ భావమునకు సమాంతరములో నిలిచి యున్నారు. ఇది చాలక, చతుర్థ సప్తమాధిపతులగు రవి, గురువుల శుభదృష్టిలో నున్న కుజుడు, ఉచ్చగ్రహమై, అష్టమ భావములో నుండుట! రసపరతంత్ర కోమల హృదయము, దాంపత్య జీవితముపై ప్రబల కాంక్ష, విలాస విహారప్రీతి, వియోగ క్లేశాసహిష్ణుత, అనుస్వభావములను ఈ యోగము తెలుపగలదు. భర్తృభావాధిపతియగు బృహస్పతినుండియు, లాభాధిపతియగు కుజుని నుండియు, శుభత్రికోణ దృష్టియే కాక, రవి చంద్రుల సమసప్తక దృష్టి, ఇంద్రుని కేంద్రదృష్టి సహా, కలిగియున్న మన్మథ సహాయము జాతకురాలికి భర్తపై గల అనురాగమును, ఆనందపరవశత్వమును, చాటగలదు. కాని, ఏ మాత్రమైనా, వియోగమునో, విరహమునో, సహించలేని స్వభావము ఇంద్ర, రవి, చంద్రుల వేధవలన సిద్ధించును.

"హారో నారోపితః కంఠే,
మయా విశ్లేషభీరుణా,
ఇదానీ మంతరే జాతాః,
పర్వతాః, సరితో, ద్రుమాః."

అను సుభాషితమును జ్ఞప్తికి తెచ్చు హృదయము ఆమెది.

కాని, దైవదుర్విలసితమును చూడుడు! లగ్నాధిపతి బుధుడు భర్తృభావములోనే యుండి వియోగ కారకుడగు వరుణుని వేధపాలగుటయు, విషయ సుఖ (పంచమ) భావాధిపతియగు శుక్రుడు సహా ఆ భావమందే నిలిచి, చతుర్థభావమందున్న అష్టమాధిపతి శనితో కేంద్ర వేధపాలగుటయు, విషాదకరములగు యోగములు. ఇంటిలో తొందరలు, పెద్దల అవివేకము, సుఖాభావము, వియోగ క్లేశానుభవము, సూచితములగుచున్నవి. పాపము! ఆశ ఎంతో, నిరాశ అంత!

దాంపత్య విషయమగు చర్చలో, భార్యాభర్తల జాతకములను శోధించి చూచినచో, ఫలస్వరూపము బోధపడగు. జాతకురాలికి వియోగక్లేశము రావచ్చును. చతుర్థభావమందు కారణమున్నది. భార్యాభర్తలకు అన్యోన్యానురాగమును సూచించు గ్రహయోగములు పరస్పరముగా లేనిచో, జాతకురాలి మనస్తత్త్వమో, ఆమె తలిదండ్రుల అవిచార పరతయో, వియోగకారణ మగును. అట్లు కాక, వారికి అన్యోన్యప్రేమ విశ్వాసములనిచ్చు యోగము లున్నచో, భర్త ఇంటి పరిస్థితులో అతని పెద్దల ధూర్తత్వమో, వియోగమును తెచ్చిపెట గలదు. భర్త జాతకమున అనారోగ్య సూచన లుండెనేని, అదె కారణము కావచ్చును. భర్త జాతకము శీలమ్యతిని తెలుపునప్పుడు, కారణము వేరుగా ఏర్పడును. ఇట్లు, ఫలస్వభావ మొక్కటేయైనా, సందర్భముల ననుసరించి దాని స్వరూపములో మార్పులుండగలవు. అగుటచే, భర్తజాతకము గమనించవలసి యున్నది.

ఇదే అతని జాతకము :—

<table>
<tr><td>ద 20-44
I 18-16
రా 9-37</td><td></td><td></td><td>శ 21-59
చ 23 47.1</td></tr>
<tr><td>గు22-16(వ)
వరుణ 11-17
(గ)</td><td colspan="2" rowspan="2">(సాయనము)
—
కథా నాయకురాలి భర్త జాతక చక్రము
—</td><td>యురే 0-26
బు 18-18
శు 24-43
ఇంద్ర 26-40</td></tr>
<tr><td></td><td>కు 24-0</td></tr>
<tr><td>X 21-14</td><td></td><td></td><td>కే 9-37</td></tr>
</table>

లగ్నము మృదుస్వభావముగల మీనము. ఇంద్ర, శుక్ర, బుధుల కోణముల మిత్రదృష్టితో చల్లని చంద్రుడు లగ్నమునందే కలడు. ప్రశాంతమై, లలితమై, స్నిగ్ధ గంభీరమైన హృదయము నిది తెలుపజాలును. లగ్నాధిపతి గురువు. ఇతనికి రవి శనుల మిత్రదృష్టియున్నది. అందులో, కుంభ గురువు మంచి గుణవంతుడు. దాన శీలము, పరోపకారపరాయణము, నిరాడంబర నిర్మల జీవనము, యోగ్యప్రవర్తనము, ధార్మిక స్వభావము, దాక్షిణ్యశీలము, మున్నగు గుణములు రాగలవు. ఈ గురువునకు కుజుని సమసప్తక వీక్షయున్నది. అతి ధారాళము, అతి దాక్షిణ్యము, అసంప్రేక్ష్యకారిత్వము, దీనిఫలము. దశమ కేంద్రమందలి పుణ్యసహాయము లగ్న దశమాధిపతియగు బృహస్పతియొక్క శుభదృష్టి వర్షించి జాతకుడు అదృష్టశాలియనియు, సత్ప్రవర్తనము కల వాడనియు, సూచించుచున్నది. కళత్ర స్థానాధిపతి యగు బుధునితో పంచమాధిపతి చంద్రుడు పూర్ణ మైత్రితో నుండుటచే, రమ్యమైన దాంపత్య జీవితము రావలసియున్నది. కాని, ఆ చంద్రునికి నిందు కేంద్రములో చతుర్థభావమందున్న రవి, శనుల కేంద్రవీక్ష క్లేశమును తెచ్చిపెట్టగలదు. గృహచ్ఛిద్రములో, పెద్దల అవినీతియో కారణమగును. దాంపత్యసహాయము వరుణకేంద్రమందుండుటవలన, విరసముపుట్టి వియోగమునకు దారితీయగలదు. అతి దాక్షిణ్యము, అనవసర సంశయము, అనులోపములు తప్ప, ఇతరలోపములేమియు జాతకములో చూపట్టకున్నవి. ఈ స్వభావమువలన, పరిస్థితులను అదుపులో నుంచుకొనజాలక, జాతకుడు తాను క్లేశపడి భార్యను సహా క్లేశముపాలు చేయవచ్చును.

"అతిదాక్షిణ్యయుక్తానాం,
శంకితానాం పదే పదే,
పరాపవాద భీరూణాం,
దూరతోయాంతి సంపదః."

అని పెద్దలు చెప్పుదురుకదా!

ఈ దంపతుల జాతకములను పోల్చిచూతముగాక.

అన్యోన్యముగా, వీరి రవి చంద్రులకు, కుజశుక్రులకుసహా, చక్కని మిత్రదృష్టియోగములున్నవి. భక్తి రక్తులకు కొదవయుండు కారణములేదు. భర్త కళత్ర భావములో భార్య గురువు, భార్య రాజ్యభావములో భర్త గురువు! వీరి దాంపత్య జీవితము అభ్యుదయకరముగా సుఖసంధాయకముగా ఉండకతీరదు. భర్త మనస్సున సహాయమునకు భార్య శుక్రునినుండి త్రికోణశుభదృష్టిసౌకర్యమున్నది. పరస్పర ప్రేమబంధమునకు ఈ యోగము లన్నియు తగినవే. ఇక, లోపమేమనగా, భార్య సప్తమభావమందలి శుక్రునికి సమసప్తక వీక్షలో భర్త జాతకపు శని యుండుట శోచనీయము. ఆమె జాతకమందే శుక్రునికి శని వీక్షయుండగా, పులిమీద పుట్రవలె, భర్త జాతకమునుండిసహా ఆ శుక్రునికి శని వీక్షయే రావలయునా? ఆమె జాతకములో చతుర్థభావమునుండియే శని వీక్షయుండగా, భర్త జాతకములో సహా చతుర్థ భావమునుండియే శని దౌష్ట్యము వచ్చుచుండుట! ప్రాపంచికముగా, ఏమి కారణము లేర్పడినా, విషాదానుభవమును ఈ యోగము కొంత అయినా రుచి చూపించకపోదు. వైవాహిక జీవితము రమ్యముగా సాగనీయక భర్త ఇంట ఏదో ప్రతిబంధకసామగ్రిని కల్పించగలడు శని.

ఇది అంతయు గమనించితిమేని,

"సా కిం న రమ్యా, స చ కిం న రంతా,
బలీయసీ కేవల మీశ్వరేచ్ఛా."

అను సుభాషితము స్ఫురణకు రాగలదు.

చిన్ననాడే తల్లితండ్రులను కోలుపోయి, బంధువులచే పెంచబడినవాడు జాతకుడు. (చతుర్థములో రవి శనుల వీక్ష) కొంతకాలము కళాశాలలో విద్యాభ్యాసము సాగించి చాలించుకొని ఇల్లుచేరి, పిత్రీయమైన భూస్థితివలన నిరుపాధికముగా జీవితమును నడుపుకొనుచున్నవాడితడు! పదునెనిమిది యేండ్ల వయస్సులోనే వివాహమైనది. (సప్తమాధిపతికి కల చంద్ర శుక్రుల మైత్రి ప్రభావము.) మరు సంవత్సరమే భార్య కాపురమునకు వచ్చినది. ఆమె కప్పటికి ముగ్ధా వయస్సే (పదు మూడేండ్లు). ఒక సంవత్సరకాలమైనా వారు సుఖముగా గడపగలిగిరో, లేదో, అంతలోనే ముసలము పుట్టినది. ఇంటిలో యాజమాన్యము వహించియుండిన పూర్వసువాసినులిద్దరు కథానాయకురాలిని ద్వేషింప నారంభించినారు. తమ బాంధవ్యములోని కన్యను వలదని ఈమెను వరించుటచే, భర్తకు ఈ భార్యపై మనసు విరుచుటకు వారు ప్రయత్నములు జరిపినారట. మరులు మందు పెత్తికి రాచుటకై కథానాయకురాలు సన్నాహము

చేయుచున్నదని ఏవో సాక్ష్యములు చూపి, అట్లు జరుగనిచ్చినచో తల చెడి తిక్క ముసుగువని ఆమె పరిశోధకుడవు క్రమక్రమముగా భర్తకు బోధించుచు రాగా, ఆమాయకుడతడు భయపడి నానాటికి భార్యకు దూరముగుచు వచ్చెనట! (చతుర్థ భావపు వేధ). రెండు సంవత్సరములలో ఈ తంత్రముల వలన భర్తలో గొప్ప మార్పు చూపట్టినది. క్రమముగా భార్య చేతి నీరు త్రావుట, ఆమెను స్పృశించుట, సమీపించుట, పలుకరించుట, చూచుట, అన్నియును తగ్గినవి. కారణమేమో, కథా నాయకురాలికి తెలియదు. భర్తను అడుగుటకో, చూచుటకో, ఆమెకు అవకాశము లభించదు. తనలోపమేమో, తెలుసుకొను ఉపాయమే ఆమెకు కానరాదు. ఆమె మొర వినువారే లేరు. బంగారువంటి భర్త ఇంటిలో నుండగా, ఈ విషమ పరిస్థితుల పాలై, కథా నాయకురాలు కంగారైనది. పదునారు సంవత్సరముల వయస్సు వచ్చువేళకు దల్లగా ఆమెను పుట్టినింటికి పంపివేయునంతవరకు తంతు జరిగినది. కటిక రాళ్ళయినా కరుగురీతి, ఎన్నియో విన్నపము లామె భర్తకు వ్రాసుకొన్నది. ప్రతి రాలేదు. కూతురును పిల్చుకొని రావలవని మామగారి జాబులకు అల్లుని జవాబు. కడుపాత్రము పట్టలేక, కథా నాయకురాలి తండ్రి తానే పోయి ప్రార్థించినా, ప్రాధేయపడినా, పంచాయతీలు చేసినా, ఫలము కానవచ్చినది కాదు. ఆరేడు నెలలుగా ఆమె పుట్టినింటిలో దుస్సహ వియోగ క్లేశమును అనుభవించుచుండినది.

అప్పటివరకు కథా నాయకురాలు నాకు అపరిచిత. ఆమె భర్తతో మాత్రము దూరపు బంధుత్వము, కొంత పరిచయమును, కలవు. చేతనైనంత చేసి వినికి, జాతక ఫలమునైనా కనుగొందమని తండ్రి నాకడకు రాగా, అతనివెంట ఆమె వచ్చినది. పరిచయమైనతరువాత, తనకథనంతయు చెప్పుకొని, కన్నీరు కాల్వలు పొంగునట్లు దుఃఖించినదామె. ఈ సందర్భమునందే, నేనీ జాతకములు గుణించుచుండగా, నా సమీపమునందే ఆమె కూర్చుండి, అప్పుడప్పుడేదో మాటలాడుచుండినది.

పదునారు సంవత్సరముల బాల్యప్రాయ మామెది. అందము, వన్నె, వర్చస్సు, తెలివి, సంస్కృతి, అభిజాత్యము కలిగి అగ్నిజ్వాలవలె నున్న కథానాయకురాలిని చూచినవారికి, ఆమెను ధర్మపత్నిగా సంపాదించుకొన్న యువకు డెంత అదృష్టశాలియో, అనిపించక పోదు. ఆ సీమంతినియొక్క వినయ విధేయతలతోటి గంభీరప్రవర్తనము, సరససాహిత్య వాసనల జూపు సంభాషణ చాతుర్యము, సద్యస్స్ఫూర్తికల తేట తెలివి, మెచ్చుకొననివా రుండరు. కాని, ఆమెకు కల్గిన వియోగక్లేశము ఎట్టి రాతిగుండెనైనా కరిగింపజాలినది. పాపము!

వీరి వివాహము 25-4-1932 వ తేదిన జరిగినది. భర్త జాతకపు శనిమీద శుక్రుడుండిన దినమది. అతనికి శుక్రుడు అష్టమాధిపతి. ఆ శుక్రు డుదయించు వేళలో నే శుభలగ్నము! శనికి మంచి అవకాశము నిచ్చినట్లయినది కదా? తగినట్లేయున్నది పరిణామము!

చలిత లగ్నము భర్త జాతకపు శనిపైనున్న కాలములో ఆమె కాపుర మారంభించుట, ఆసమయమునందే చతుర్థ (గృహ) భావాధిపతి రవి చలనవశమున బుధ సంయోగమునందుటయు, వరుణుని కేంద్రవేధ నందుకొనుటయు, ఒక్కమారే సంభవించినది. విప్రలంభ శృంగారమును ఆమె అనుభవించుట వింత కాదు. కాని, ఇపుడు లగ్నాధిపతి బుధుడు ఋజుగతి నవలంబించి (తుల 16°) జన్మ రవిని చేరుకొని, సప్తమాధిపతియగు చలితగురువుతో (కన్యారాశిలో 16$\frac{1}{2}$°), లాభాధిపతి కుజునితో, ఈ శుభదృష్టిని సంపాదించుకొనుటే కాక, భర్తచలితరవిలో (మకరము 16°) త్రికోణమైత్రి నార్జించినాడు. చలితభర్తృ గ్రహము (సింహము 28°) భర్త జాతకపు రవితో అర్ధకోణ గుప్త మిత్రదృష్టికి వచ్చినది. చలిత దశమకేంద్రమునకు (మీనము 16°) కుజ, గురు, రవి, చలిత బుధులనుండి అనుకూలదృష్టి ఏర్పడుచున్నది. చలితలగ్నము (మిథునము 25$\frac{3}{4}$°) భర్తృ జాతకపు శని వేధను ఇప్పుడిప్పుడే దాటి యుండుట.

ఇవి అన్నియు దైవము సమకూర్చిన సౌకర్యములు. వీని నుపయోగించుకొని పురుషకారము నెరపినచో, హితమేల కలుగరాదు? భర్త జాతకమునుండి వచ్చు సౌకర్యములు చాల తక్కువయనుట సత్యమే. కనుక, కథానాయకురాలే గట్టి ప్రయత్నము చేయవలసియున్నది. కాని, అవకాశము లేనిది ఆమె ఏమి చేయగలదు? అందులో ప్రౌఢయూ, కాదు.

జాతకచక్రములను గమనించుచుండిన నా ఆలోచనలోని సారాంశ మిది. అంతలో ఆమె, మెల్లగా ఇట్లనెను.

"పరిశీలనము ముగిసినదని నా ఊహ. మా వారి జాతక మేమనుచున్నదో?"

"జాతకము ఉత్తమమైనది. నీ భర్త చాలా గుణవంతుడు. కొంత....."

నా అర్ధోక్తిలోనే ఆమె అందుకొని, కొంత తీవ్రముగా కంఠస్వరమును మార్చి,

"కొదని ఎవ్వరనిరి? నా మెడకు సహా వారు తమగుణము నొకదానిని తగిలించినారు. దాని మూలముగనే నా కింత మనోవ్యథ!" అని విసరి, చిన్నగా పెదవివి విరచినది.

ఆమె ధోరణికి మెచ్చుకొంటిని. నాకు నవ్వు వచ్చినది.

"ఏమమ్మా! శ్లేషాలంకారమా?" అంటిని.

"ఆ శ్లేషాలంకారము మరచిపోయి మూడేండ్లయినది. సాహిత్యప్రాప్తిలేని నా వంటి అభాగ్యురాలికి అలంకారములా?"

తెలుసుకొనకుండనే ఆ ముగ్ధ ఇచ్చిన ప్రత్యుత్తరములో చూపట్టిన సమయస్ఫూర్తికి, ప్రౌఢిమకు, నా కత్యాశ్చర్యమైనది. ఇట్టి రసజ్ఞురాలికా ఈ అవస్థ? క్షణమాత్రము నా హృదయము చేయిపెట్టి కలచినట్లైనది. నిరుత్తరుడై ఊరకుంటిని. అర నిమిషములో మరల నామెయే ప్రారంభించెను.

"క్షమించండి.
'ఆరడి పోకయుండ్, ఫలమునందుటయుండ్ కని పల్కు జేరమిన్, మారటినోరిదావనయి' పాటలాడు దోషము నాలోనున్నది. ఏమనుకొంటిరో, ఏమో?" అని దీనముగా నన్ను చూడగా,

"అనుకొనుట కేమున్నది? నీ భర్త ఎంత పుణ్యము చేసినాడో, అనుకొంటిని." అంటిని.

"వాస్తవముగా వారు పుణ్యాత్ములే. వారి వారు సహా పుణ్యజనములు. నేనే పాపిష్టిని. మా వారి పుణ్యములో నా అర్ధభాగమైనా నాకు రాలేదు." అనుచు తలవంచి చేలచెరగుతో ఆ తివ్వి కంటితడి ఒత్తుకొన్నది. ఆమె ప్రౌఢోక్తుల ఎత్తిపొడుపునకు నాకు నవ్వు వచ్చినా, ఆమె విషణ్ణవదనము చూచి అపుకొని, ఏదో సమాశ్వాసము చేయుదలచి ఇట్లంటిని.

"గ్రహవైషమ్యమున్న కాలములో కష్టములు వచ్చును. కాని, దశలు మారుచుండును. అమావాస్య స్థిరము కాదు; పున్నమ రానేవచ్చును."

"ఏమో కాని, అమావాస్యపైన నాకున్నంత భక్తి పున్నముపైన లేదు. వాస్తవమును చెప్పదలచినచో, నా జీవితములో ఇప్పుడే నిండు పున్నము." అని ఆమె వెంటనే విమర్శించెను.

ఆమె పూర్వపక్షమునకు నా కత్యాశ్చర్యమైనది. అభిప్రాయము బోధపడక ఆమెను ప్రశ్నార్థకముగా చూచుచు, "అనగా," అంటిని.

"మీకు తెలియక కాదు. నన్ను పరీక్షించుచున్నారు...పున్నమనాడే చంద్రునిలో గొప్ప అందము ఉండగలదనుట వాస్తవమే. కాని, భర్త అయిన సూర్యభగవానునికి అందరానంతదూరముపోయి అలంకరించుకొని చంద్రమ్మ కులుకుచూ కూర్చున్నచో, ఏమి రసము? నాకేమో, పున్నమ అంటే అసహ్యమే." అని, మరల, "నా అధికప్రసంగమును క్షమించండి." అని ముగించెను.

ఆమె యోగ్యతకు అత్యానందమైనది. "తెలివి ఒకరి సొమ్మా." అనుకొంటిని. ఆమె మాటలలో నాకు కావ్యరసాహ్లాదము లభించుచుండినది. విరహవేదనయే ఆమెకు విద్యాగురువు. క్షణకాలము ఎవరును మాటలాడలేదు. అంతలో, తటాలున నన్ను చూచి ఆమె,

"మా వారు నాకు మోక్షమార్గము చూపునట్లు చేయండి." అని, తలవంచి మరల,

"ఏ మోక్షమైనా, సరే." అని ఆమె జారబలుకగా, నా మనుస్సు కరగి నీరై పారినది.

"అమ్మాయీ! అత్రపడకుము. దైవము సహాయపడినప్పుడు ప్రయత్నింతము."

"అంతా దైవాధీనమే కదా? మన ప్రయత్నమేమి పనికివచ్చును? ప్రయత్నము చేసి చాలించుకొన్నాము మా తండ్రి."

"అట్లు కాదమ్మా. దైవము అనుకూలించినప్పుడు పురుషకారము ఫలించును. దైవ మనుకూలించినా, పురుషకారము తోడు లేనిది ఏ ఫలమూ రాదు.

'సిధ్యంతి సర్వ ఆరంభాః,
సంయోగాత్ కర్మణోర్ద్వయోః,
దైవాత్ పురుషకారాచ్చ;
న త్వేకస్మాత్ కథంచన.'

అని పెద్దలు చెప్పిరి. ప్రయత్నము ఆవశ్యకము. కాని, అది సకాలములో చేయవలసియున్నది. అంతే." అని ఉపన్యసించి, మరల, "మరి, సమయమువచ్చినప్పుడు నేను చెప్పినట్లు చేయగలవా?" అని ప్రశ్నించితిని.

ఆమె తటాలున నమస్కరించి, లేచి నిలచి,

"పతిభిక్ష పెట్టండి . . . అగ్నిప్రవేశము చేయుమనినా, చేయగలను" అని ప్రత్యుత్తరమిచ్చినపుడు, ఆమె స్వరములో చూపట్టిన సంకల్పశక్తి, ముఖములో ప్రతిబింబించిన ధీరత, దృష్టిలో వికసించిన దైన్యము, చూచి నివ్వెరపడితిని. కొంతకాలము ఓపిక పట్టవలెనని, తగిన కాలమును చూచి కర్తవ్య ముపదేశింతునని, ఆశాజనకముగా, సాంత్వన వాక్యములతో ఆమె మనస్సును కొంత సెమ్మదిపరచితిని. ఆమె జనకునికి సహా తగిన సమాధానము చెప్పితిని.

తరువాత తండ్రితో ఆమె స్వగ్రామమునకు వెళ్లినది. వారిది దూరప్రాంతమందలి పట్టణము.

కథానాయకురాలికి ఇప్పుడు దశలో కొంత దైవ బలము వచ్చినది. కాని, భర్త జాతకమునుండి ఆమెకు చాలినంత సౌకర్యము రాలేదు. వచ్చిన దేదో, అతి స్వల్పము. అగుటచే, ఆమె చేతనే గట్టి ప్రయత్నము చేయించవలసియున్నది. వారికి అన్యోన్యముగా అనురాగబంధమో, వ్యామోహమో, కలిగించజాలిన గ్రహ సౌకర్యము గల దిన మొక్కటి కావలయును. అట్టి దినమున వారికి అకస్మిక సమాగమము జరుగుట ఎంతో మేలు. కాని భర్త ఇంటిలో ఈతంత్రము పారదు. చతుర్థ భావ వేధ కలదంపతులకు ఇంటిపట్టున అనుకూలపరిస్థితు లెటు సిద్ధించగలవు? గ్రామాంతరమున వీరి సమావేశము జరుగుట ఫలకారి. కాని, ఈ ఉద్దేశము తెలిసినచో, భర్త వచ్చుటే కల్ల. భార్యప్రస్తావము వచ్చెడు సందర్భములను తప్పించుకొని జారిపోవుటే అతని వాడుకయట! ఇతర కార్యవశమున అతడు గ్రామాంతరములో నున్న కాలములో ఈ తంతు జరుగవలసియుండెను. అది ఎంత అకస్మికమైతే, అంత మేలు. కాని, ఇన్ని సమకూడుట ఎట్లు? ఇది చిక్కు సమస్య!

"అర్థార్థ వే సహాయః,
పురుషాణా మాపదర్థ వే పోతః,
యాత్రా సమయే మంత్రీ,
జాతక మపహాయ నాస్త్యపరః."

అను వరాహమిహరాచార్యుని వాక్యము స్ఫురణకు వచ్చినది. నా జాతకము నొకసారి చూచుకొంటిని. కథానాయకురాలి చలిత రవి నా జన్మగురువు పై నున్న కాలమది: నా మాటయందు గౌరవప్రతిపత్తులుంచి నా ఉపదేశానుసారము ఆమె ప్రయత్నించవచ్చును. నా దశమ భావమందలి చలిత కుజునినుండి మిత్రదృష్టిలో ఆమె భర్త జాతకపు గురు, శని, చలిత శుక్రులుండిరి. ప్రకృత విషయమున నా ప్రయత్నమునకు దైవానుకూల్యము కల దనుకొనవచ్చును. పరీక్ష చేయుటకు సంకల్పించితిని.

వెదకగా, వెదకగా, మూడు నెలలకు ఒక దినము కానవచ్చెను. సెప్టెంబరు 28వ తేదీ అది. ఆనాటి గ్రహస్థితి :

	శ 1-27	వ 13-4	కే 9-13
	(సాయనము) — దైవానుకూల్యము చూపుదినము —		చ 21-16
గు 17-49			
కు 18-45 రా 9-18		ర 4-56	శు 4-3 బు 17-45 ఇ 19-19

పాఠకమహాశయులు లొక్కసారి ఇంద్ర బుధ స్థానములను తిలకింతురుగాక. కథానాయకురాలి భర్త జాతకములోని సప్తమ (కళత్ర) భావబిందువునకు (కన్యారాశి (18°-14') చెరియొకవైపున, ఒకభాగ అంతరములో, ఇంద్ర బుధులు ఆనాడు నిలిచియుందురని కనుగొన్నంతనే, నాఉత్సాహము ఉప్పొంగినది. ఆమె లగ్నాధిపతి బుధుడు. భర్తజాతకములో కళత్రాధిపతి సహా బుధుడే కదా? ఇంద్ర, శుక్రులతో చేరి అతని పంచమ (విషయసుఖ) భావమందే బుధుడుండుట. లగ్నాధిపతియగు బృహస్పతి దృష్టి యీబుధునిపై వచ్చియుండినచో, 'భార్యయే పరదైవము' అనుభావన వచ్చియుండెడిదేమో? ప్రశంసాదినమున ఇంద్ర బుధులకు, కళత్రభావమునకుసహా, బృహస్పతియొక్క పరిపూర్ణకటాక్ష వీక్షణము (కోణదృష్టి) అబ్బగలదు. ఇంతే కాదు. ఆమె లగ్నాధిపతి బుధునికి నేరుగా అభిముఖుడై యుండగల డా బృహస్పతి. ఈ దంపతులా నాడు ఒకరినొకరు సమీపించగల్గినచో, వారికి

ఆనందబ్రహ్మ సాక్షాత్కారము లభించు టేమియగును?

మరియొక్కటి. భర్త జాతకమందలి చలిత మన్మథ వివాహసహమములు (వృషభము 18°) ఆనాటి ఇంద్ర బుధులతో, బృహస్పతితో. ఎంత హృదయంగమముగా శుభదృష్టిని సంపాదించుకోగలవో, చిత్తగింపుడు. అవకాశము వెదికించి చూడవలయునుగదా వీని ప్రభావము?

పోతే, భార్య దైనిక దశమకేంద్రములో గురువు నిలుచు దినమది. భార్య చలితశుక్రస్థానమందే (మకరము 11°) భర్త దైనిక సప్తమకేంద్రము ఆనాడు నిలువ గలదు. అతని దైనిక చతుర్థకేంద్రములోనే (తుల 4°) చలిత భార్యాసహమము ఆనాడు స్థానము చేర్పరచు కొనుట.

ఇన్ని సౌకర్యములుగలదినము మరి ఎన్నడు లభించగలదు? దైవము అనుకూలపరిస్థితులను చూపు చున్నది. దీనికి పురుషకారము తోడుపడవలయునంతే.

"...ఇక్షుశరాసన సాయక వ్యథా,
ఖిన్నత వాడి వత్తిలయి, కేల కపోలములూది.
మోమునన్,
విన్నదనంబు దోప, కను వేడుకునన్ పయి గాలి
సోకినన్,
వెన్నవలెన్ కరంగు"

స్థితిలోనున్న కథానాయకురాలికి ఇట్టి దైవానుకూల్యము సూచించుదినమున భర్తృసాన్నిధ్యము చేకూర్చేని నిస్సంశయముగా విజయలక్ష్మి ఆమెదే.

సరేకాని, నా ప్రయత్నమునకు దైవము సహాయకారి కావలయునుకదా? నా దైనికలగ్న మానాడు కన్యారాశిలో 5°లో నుండగలదని గుణించుకొంటిని. అనగా, ఆనాటిశుక్రుని పైననే. సంకల్పించిన కార్య మా శుక్రుని యాజమాన్యములోనిది. పైగా, 'పంచమ రాజ్యాధిపతి' యగుటచే, నాకు యోగకారకుడు శుక్రుడు! మరియు, ఆనాటి బృహస్పతి నికరముగా నాజన్మలగ్నమందే. ఇది అంతియు శుభసూచనగా భావించి, దైవమును నమ్మి, పురుషకారమును సాగించుటకు నిశ్చయించితిని.

కథానాయకురాలి భర్తకు జ్యోతిషముపై ఆసక్తి కలదు. కొన్నాళ్ళకు పూర్వము నాతో కొన్ని విషయము లభ్యసించియుండెనుకూడ. వ్యాసంగ మెటున్నదని విచారించి, కొన్ని గ్రంథములను చూడుమని అతని కొక లేఖ వ్రాసితిని. తగిన ప్రత్యుత్తరము వచ్చినది. కొన్ని నూతన గ్రంథములను తెప్పించితిని. వానిని గూర్చి మాకు జాబు, జవాబులు జరుగసాగినవి. రెండు నెలలు కడచెను. వీలు కలుగచేసుకొని కొన్నాళ్ళు నా ఇంట నిలువగలిగినచో, నూతన గ్రంథముల వ్యాసంగము చేయవచ్చునని సూచించగా, సెప్టెంబరు 15 వ తేదీ నాటికి అతడు వచ్చెను. కార్యాలయములో ఉండవలసిన కాలముతప్ప ఇతర సమయములలో అతని వ్యాసంగములోనే కడపుచు వచ్చినాను. ముఖ్యముగా చారగ్రహములవలన వ్యక్తి జీవితములకు కలుగు ఉత్తేజనము, దైనిక జాతక ప్రక్రియ అను వానినిగూర్చి విపులముగా చర్చ సాగినది. వాస్తవ జీవితమునుండి అనేకోదాహరణములనెత్తి విమర్శించితిమి.

ఈ వ్యాసంగము పది దినములు జరిగినది. అయినా ఈ మధ్యకాలములో అతని సంసార పరిస్థితులను గూర్చి కాని, అతని భార్యనుగూర్చి కాని, ఏ విధముగనైనా ప్రస్తావము రాకుండునట్లుగా, జాగరూకతతో కాలము కడిపితిని.

సెప్టెంబరు నెల 25 వ తేదీ వచ్చెను. గడువుదినము సమీపించుకొలది నాకేమో లోలోపల ఆందోళనము అధికముగుచుండినది. దైవ పరిపాకమును నిరీక్షించు చుంటిని.

ఆనాటి సాయంకాలమున ఆ తరుణుడొక కుండలిని తదేకదీక్షతో పరిశీలించుచుండుట గమనించితిని. అతడి ముఖమున వికాసముతగ్గి విషాదరేఖలు అలముకొని యుండినవి. ఆనాటికి అతని దైనికదశమ కేంద్రము మేషరాశి 1 వ భాగలో నుండినది. అచటనే ఆనాడు శనియుండుట. దైనిక చతుర్థములోనున్న తాత్కాలిక రవికి ఆ శనినుండి సమసప్తకవేధ. తన గృహచ్ఛిద్రములనుగూర్చిన మనోవైకల్యము, నిరాశాభావము, కారణము గానోపునని భావించితిని. కాని, ఆ గ్రహద్వయమునకు మిత్రదృష్టిలో నా లగ్నాధిపతి యుండుటచే నా సాన్నిధ్యము అతనికి హితకరము కావలయును కదా? చూతము గాక.

మరుదినము భానువార మగుటచే, పగలంతయు దైనిక జాతక చర్చలతోనే కడచినది. కాని అప్పుడప్పుడు ఆ యువకుడు ఏదో ఆలోచన చేయుచు, మధ్యమధ్య తాను వేసియుంచుకొనియుండిన కుండలిని గమనించు చుండినాడు. ఆ కుండలి 28 వ తేదినాటి గ్రహస్థితికి సంబంధించినదని కనుగొనుటకు కష్టముకాలేదు. కనుక,

అతని ఆలోచనమునకు కారణము నేనడుగలేదు. ఆ రాత్రి అతడు ప్రశ్నించెను.

"దైనిక జాతకములో గ్రహకేంద్రయోగములు సూచించు ఫలములు జరుగని సందర్భములు కలవా?"

"సాధారణముగా ఆ ఫలములు వచ్చును."

"అపవాదమే లేదా?"

"గ్రహఫలము జరిగి తీరును. గ్రహగతులకు అపవాదము లేనప్పుడు, వాని ఫలములకు అపవాదము ఎట్లువచ్చును? కాని, వయస్సు, కాలము, ప్రకృతి, సంస్కారము మొదలగు వైయక్తిక పరిస్థితుల ననుసరించి ఆ ఫల స్వరూపము మార్పుచెందును. అంతే కాని, ఫల స్వభావములో భేదముండదు. ఉదాహరణముగా, శుక్రుని తీసికొందము. పసిబాలునికి, తరుణ వయస్కునికి, వృద్ధునికి, శుక్రుని ఉత్తేజనము వచ్చినని వారికి సమానఫలము వచ్చుననుకొనుట నగుబాటుకదా? ఇంతేకాదు. యవ్వనములోనున్న వారికైనా, అందరికి సమానఫలము రాదు. స్వాధీనపతికయగు భార్యకలవాడు ఆమెతో ఆనందమనుభవించును. విరహావస్థలో నున్న దంపతులు అన్యోన్యసాన్నిధ్యము చేరుకో గలరు. అవివాహితుడు విషయ సుఖ సంపాదనమునకై ప్రయత్నించును. శీలభంగమునకు అలవాటుపడినవాడు సానివాడలలో సంచరించును. రసికులు సంగీత సాహిత్య కళావినోదములతో కాలముగడుపుదురు. సామాన్యులకు సాంఘికముగా సుఖకరమగు పరిస్థితి యబ్బును. ఇట్లు ఆయా వ్యక్తియొక్క ఆదర్శములు అవకాశములు, ప్రాపంచిక పరిస్థితులు, మున్నగువాని కనుగుణముగా శుక్రుని ఫలము భిన్న రూపములతో వ్యక్తమగును. అప్పటి దశలు దాని కొక స్వభావము నీయగలవు. గ్రహములు సూచించునది దైవశక్తి. పురుషకారము దాని కెంతమాత్రము తోడగునో, అంతే ఫలము లభించును.

"దైవే పురుషకారే చ,
కర్మసిద్ధి ర్వ్యవస్థితా"

అని ప్రాచీనులు స్పష్టముగా చెప్పిరి. పురుషకారములేక, దైవము ఫలించదు. యుద్ధము చేయ నొల్లని వానికి, ఆయుధము లేమి పనికివచ్చును!?"

సావధానముగా విని ఆ తరుణుడు నిమిష కాలము ఆకాశమువంక చూచుచుండి తరువాత తన సందేహమును వెలిబుచ్చెను.

"నా జాతకమునకు ఈ పద్ధతి అన్వయించదేమో?"

"కారణము?" అంటిని.

"నా వివాహము నాడు దైనికలగ్నము మకరములో $21\frac{1}{3}^{\circ}$ లో నుండినది. ఏ గ్రహ సంబంధము కాని అగుపడదు."

"నీవు గమనించలేదు. బుధుని తెలివి తేటలు, శుక్రుని సాహిత్యకళ, ఈ రెండును ఆ గ్రహద్వయము యొక్క మధ్య బిందువందు కేంద్రీకృతమై యుండును. నీ జాతకములో అట్టి బిందువుందే ఆనాడు నీ దైనిక సప్తమము (భార్య) నిలచుట నీ భాగ్యము. ఆధర్మములు రెండింటిని మేళవించుకొన్న ఉత్తమురాలగు భార్యను సంపాదించుకొన్నావు.

అనగా, ఆ తరుణుడు క్షణము ఆ చక్రమును గమనించి చూచి మరల పూర్వపక్షము నెత్తెను.

"పోనివ్వండి. ఎల్లుండికి దైనిక చక్రము వేసితిని. ఇది నాకేమీ బోధపడలేదు."

అతడు నాకు అందిచ్చిన కుండలిని క్షణము గమనించిన శాస్త్రముచేసి, సందేహమేమి యని అడిగితిని.

"దైనిక సప్తమములో నా చలిత పుణ్యసహమము జన్మసప్తమములో ఇంద్ర బుధ సంయోగము; పైగా గురువునుండి శుభదృష్టి! ఏమి అర్థము?"

"ఏమున్నది? దాంపత్య జీవితములో అదృష్టము ఫలించునని."

"అది నా జీవితములో అసంభవము." అని ఆ తరుణుడు కొంత వెడనవ్వు నవ్వి ఆ కుండలిని అవల త్రోసెను.

"నా దృష్టిలో అసంభవము కానరాదు. ఆనాడు నీ దైనిక సప్తమ కేంద్రములోనే నీ భార్య చలిత శుక్రుడు, పంచమభావాధిపతి."

"మీకు తెలియదేమో? మాకు వైమనస్యములు పుట్టి దాదాపు మూడేండ్లు అయినది. మాకు మాటలు లేవు. తొమ్మిది నెలలుగా నా భార్య పుట్టినింటిలోనే యున్నది."

"అయితే మాత్రము మనుస్సులు మారకూడదా? నీ జాతకములో లోపము చతుర్థ భావములో నున్నది కాని, కళత్రభావములో లేదు" అని, మరల "పోనిమ్ము

నీ స్వంత విషయములో నీ ఇష్టము. ఏదైనా వేరు విషయము చర్చించుట మేలు." అనుచు, ప్రక్కనున్న పరుపుపై మేను వాల్చితిని.

ఏమేమో లెక్కలు వేసుకొనుచు అతడట్లే కూర్చుండియుండెను. ఆ రాత్రి అతని కంటికి నిద్ర అంటలేదు. గ్రహయోగములు తమపని ప్రారంభించినవని ఊహించితిని. తన దశలను గురించి అతడేమేమో ప్రశ్నించుచు రాగా, తోచిన సమాధానములు చెప్పుచు ఆ రాత్రి నేను సైతము నిద్రాదేవికి స్వస్తి చెప్పవలసి వచ్చెను. మా చర్చ రాత్రి అంతా సాగినది. కాని, ఇట్లు ప్రవర్తించమని మాత్రము నేనతనికి చెప్పలేదు.

ఆనాడు శుక్రుడు కన్యారాశిలో $1\frac{1}{2}^{\circ}$లో నుండినాడు. అనగా, కథానాయకురాలి జన్మ తరుణునికి నేరుగా సమసప్తక మనుట. ఆమె భర్తజాతకమున చలిత రవికి అర్ధకేంద్ర వేధలో నే ఈ శుక్రుడుండుట. వియోగ క్లేశమును అనుభవింపజేయు యోగమిది. ఆమె చలిత శుక్రుడు (మకరము 10°) మాత్రము భర్త దైనిక లగ్నమును ప్రబలముగా ఆకర్షించుచున్నాడు. కాని, అతని దైనికదశమము పైన నాటి శని ప్రయత్నమునకు సంకల్పము రానీయడు. ఏమో సందేహము, ఏదో దీర్ఘాలోచన. అతని అవస్థ చూచుటకే కష్టముగనుండెను. క్షణము లెక్కలు వేయుట, క్షణ మాలోచించుట, క్షణము శూన్యదృష్టితో ఆకాశమును చూచుట, క్షణము ఉస్సురనుట! ఏదో స్ఫురణకువచ్చి ప్రశ్నించును. మరల ఏదో గుణించును. క్షణములో ఆశ, మరల నిరుత్సాహము. అతని హృదయాంతరాళమున గొప్ప రామరావణయుద్ధము జరుగుచుండినట్లు చూపట్టినది. ఆశ గెల్చునో, ఆత్మాభిమానము గెల్చునో చూడవలసి యుండెను.

ప్రశాంత శీతలవాయువులు రాత్రి గత ప్రాయ మగుట సూచించెను. గడియారమువంక చూడగా, నాల్గుగంటలు కావచ్చుచుండినది. అంతలో సమీపము లోనున్న రైలుస్టేషనులో ఘంటారావము వినవచ్చెను. ఆ తరుణుని కేదో అనిర్వచనీయమగు ఆవేదనము వచ్చినది. కారణము నాకు బోధపడలేదు. అతడేమో ఆలోచించుచుండెను. అంతలో దూరమున రైలుబండి ఈల వినవచ్చినది. దానితో అతనిలో గొప్ప సంచలనము చూపట్టెను. చుట్టునుజూచి ఏదో మాటలాడ నుంకించి, అంతలో ఆగి, గదినుండి బైటకివెడలి ఆకాశమును చూచుచు క్షణకాలము నిలిచెను. రైలుబండి సమీపించు సవ్వడి వినరాగా లోనికివచ్చి నన్ను చూచినాడు. ఏదో, అనిర్వచనీయమగు హృదయాందోళనము. శుక్రోదయమగు కాలమది. ఈ నాటకమంతా అతనికే కాబోలు ?

తటాలున "మీకొక శ్రమ ఇచ్చుచున్నాను." అని ఆ తరుణుడనగా, నాకత్యాశ్చర్యమైనది "ఏమి" అంటిని.

"నేను పోలేను. నా భార్య ఒంటరిగా రాలేదు. ఆమె తల్లిదండ్రులు వచ్చుట నాకు రుచించదు. మీరు వెళ్ళి నాభార్యను పిల్చుకొని రావలెనని నా ఆశ. ఈ రైలులో వెళ్ళితే, ఎల్లుండి ఉదయము పదిగంటలకు రాగలరు. రేపు ఒకనాటికి సెలవుచీటీ వ్రాసియిచ్చి వెళ్లివచ్చు."

ఇది విన్నప్పుడు నాకు కలిగినది ఆశ్చర్యమో, ఆనందమో చెప్పలేను. దైవమహిమ!

"నీవు వెళ్లుటబాగు. నావెంటవారు ఆమెను పంపుదురా? ఆమె రాగలదా?" అంటిని.

అంతలో రైలు ప్లాటుఫారము చేరవచ్చుచుండినది.

"నాకొరకై మీరు వెళ్ళండి. నా భార్యతో చెప్పండి. వచ్చినాసరే, రాకపోయినాసరే. బండి వచ్చినది. అవకాశములేదు. నేను ముందుగా పోయి టిక్కట్టు కొనివత్తును. త్వరగా రండి."

అనుచు ఆ తరుణుడు పరుగెత్తెను. నవ్వుకొనుచు నేనుసహా వెళ్లితిని. స్టేషన్ చేరి బండిలో కాలు పెట్టునరికి రైలు కదలినది. టిక్కట్టుసహా వచ్చినది. తలవని తలంపుగా, నాకీ ప్రయాణమువచ్చుట

ఆలోచించినకొలది ఆ తరుణుని చిత్తవృత్తి విచిత్రముగా తోచినది. అనురూపురాలు, శీలవతి భార్య. ఆమె పైన ద్వేషమో, ఈర్ష్యయో, కానరాదు. వైమనస్యమునకు బాహ్యప్రతిబంధక సామగ్రియే కారణమనుట స్పష్టము. తానో శీలవంతుడు. విరక్తుడు కాడు. భార్యపైన అభిమానమున్నది. వియోగక్లేశము నోర్వలేని మోహతిహకలడు. తానే వెళ్లియుండినచో, అత్తవారింటివారు ఎంతో ఆనందించియుందురు. భార్య ఇతనిని పూలతో కనకాభిషేకము చేసియుండును. కడకు రమ్మని తంతివార్త పంపియున్నచో, వారందరు తలతో నడచివచ్చియుందురు. కాని, ప్రయత్నమేమీ చేయనొల్లడు, ఏమి విచిత్ర స్వభావమో!

మనస్సులో ఏమున్నదో, అగమ్యగోచరము. మానవరాశి మహాసముద్రమువలె శాంత గంభీరమైనది. దాని లోతుపాతులు తెలియవు. మణులో, మహాతిమింగిలములో, అన్నియు లోపలనే. బైటికి కానరావు. ఇట్టిది ఇతని లగ్నము. దానిలో శీతకిరణుడు చంద్రుడు. మృదు గ్రహములగు ఇంద్ర శుక్ర బుధులు మరియొక జలరాశిలో నిలిచి లగ్నమును కటాక్షించుచున్నారు. పురుష గ్రహములగు కుజ గురు వరుణులు శనిదృష్టికి లోనైరి. సంకల్పకారకుడగు రవితో, శని సంయోగము! స్వభావము అతిమృదువు, పైగా శశి యోజనాన్యము పురుషకారము మట్టముగుటకు ఇదే కారణము కాబోలు' కథా నాయకురాలు సంకల్ప శక్తికలది. విషయము విన్నచో, ఆమె రెక్కలు కట్టుకొని వ్రాలగలదు. కాని అప్పుడు ఆమెను మాటలాడించు మాత్రమైనా ఇతని పురుషకారము అవసరము కదా? పలుకరించనిచో పాపము ఆముగ్ధ ఏమి చేయగలదు? ఆమెకా సహనశక్తి తక్కువ. మంత్రముమీద ఇది విషమపరీక్షా సమయము. ఆమెకు మాత్రమే కాదు, ఒక విధముగా నాకుసహా.

రైలు ప్రయాణములో నా ఆలోచనలోని సారాంశమిది. సాయంకాలమునకు గమ్యస్థానము చేరితిని. అతిథిసత్కారముల అనంతరము కథా నాయకురాలు నాకడకువచ్చి కూర్చుండి కుశల ప్రశ్నల తరువాత తన భర్తనుగూర్చి ఏమేమో ప్రశ్నించినది. నా సందేశము చెప్పగా ఆమె కనుపరచిన ఉత్సాహమునకు పారములేదు. తల్లి తండ్రులతో సంప్రతించి ప్రయాణమునకు సిద్ధపడినది. ఆరాత్రి రైలులోనే ప్రయాణముచేసి మరుదినము పగలు 11 గంటలకు స్వగ్రామముచేరి కథా నాయకురాలిని మా ఇంటిలో శ్రీమతికి ఒప్పగించి, అతనున్న కార్యస్థానమునకు బోతిని. ఆమెభర్త ఇంట నుండలేదు. ఉద్దేశపూర్వకముగా ముఖము తప్పించుకొనెనో, ఏదైనా కార్యార్థము వెడలి యుండెనో, తెలియదు.

ఆ సాయంత్రమున ఇంటికివచ్చి విచారించగా, ఆ తరుణుడు ఇంటిలోనికే రాలేదనియు, ఎదుట నున్న నాగదిలో కూర్చుండి ఏదో చదువుకొనుచుండెననియు తెలిసి నవ్వుకొంటిని. కథానాయకురాలు మౌనముగా ఒకమూలలో కూర్చుండి యుండెను. ధైర్యము చెప్ప దలచి, ఆమెతో ఏదో లోకాభి రామాయణము నారంభించితిని.

"జ్యోతిష్యమున కేమో శాప మున్నదట కదా?" నాకిది కథానాయకురాలి ఎత్తిపొడుపు.

"ఏ శాపమూ లేదు. గ్రహములు తమ తమ ధర్మములను తప్పక నెరవేర్పగలవు." అంటిని.

"గ్రహముల మాట ఏమోకాని, అనుగ్రహము మాత్రము తన ధర్మమును మరచినట్లున్నది."

"ఆత్రమువలదు. క్రమముగా అంతా జరుగగలదు."

"ఉపక్రమమే లేదు. క్రమమెప్పుడో?" కథా నాయకురాలి ధోరణికి నాకు నవ్వు ఆగినది కాదు. కళాపూర్ణోదయములోని సుగాత్రీశాలీనుల కథ స్ఫురణకువచ్చెను.

"కాంతుడు నిబ్బితకాడె,
కాంతయు నట్లయిన సిగ్గు కాపురమింకన్."

అని చెప్పి నాగది చేరుకొంటిని.

ఆమె భర్త ఏదో చదువుకొనుచుండెను. భార్య వచ్చినదా అని కాని, అత్తవారింటిలో ఏమి జరిగెనని కాని, అతడు ప్రస్తావించనే లేదు. ఎంత నిబ్బరమో, అతనిది? భోజనావసరమున ఇంటిలోనికి వెళ్ళినపుడు సైతము భార్యవైపు అతడు కన్నెత్తి చూడలేదు; కంకిమ్మనక మరల గదిచేరుకొన్నాడు. ఏమి శనిమహాశయుని ప్రభావము!

ఆరాత్రి కథానాయకురాలు తానే ఆగది ప్రవేశించి ఆప్యాయముగా కుశల ప్రశ్న కావించినది. ఇంద్రబుధులు గెల్చినారు. శనిపట్టు కొంత వదలినది.

మరుదినము ఉదయము కాఫీ కషాయమును సిద్ధపరచుచుండిన కథానాయకురాలిని చూచి,

"జ్యోతిష్యమునకు శాపమున్నదేమమ్మా?" అని యడిగితిని. ఆమె తటాలున నమస్కరించి నిలిచి ముకులిత హాసములతో,

"ధన్యరాలను. మీ అనుగ్రహమువలన 'రామా, కృష్ణా' అనుకొనుచు కాలక్షేపము చేసెదను." అని సవినయముగా ప్రతి ఇచ్చినది. (ఆమె భర్త నామాక్షరములవి.) నాకేలనో కన్నులు చెమ్మగిల్లినవి. ఆశీర్వదించితిని. నా పరీక్ష ముగిసినది.

మూడు నాల్గుదినములు ఆ తరుణ దంపతులు అత్యానందముతో కడపిరి. తరువాత త్వరగానె వారు స్వస్థానము చేరుకొన్నారు. పది నెలలకు చక్కని చుక్కవంటి పుత్రికను భర్తకు ఉపాయనమిచ్చినది కథానాయకురాలు.

దైవబలమెంత యుండినా, ఫలసిద్ధి కావలె నన్నచో, దానికి పురుషకారపు సాహాయ్య మవసరమని మనకీ నా సత్యచరిత్ర బోధించుచున్నది.

"న దేశ కాల వ్యవసాయవర్జ్యం,
ధివేత్ ఫలాప్తిం, సతి చాపి దైవే."

కోరికల సత్యం

శ్రీ బలివాడ కాంతారావు

తీరి చివరిదశలో గత జీవితంలోని ఘట్టాలు తలుచుకుంటుంటే యివన్నీ నిన్నా మొన్నా జరిగినట్లే వున్నాయ్ రామయ్యకు.

సరిగ్గా ముప్పయియేళ్ళ క్రితం చిన్న చిరిగిన పంచె, మాసిన లాల్చీతో పొట్ట చేతపట్టుకొని యీ పట్నంలో అడుగు పెట్టాడు. వారంరోజులు పాదాలు అరిగిపోయినట్లు తిరగాతిరగ్గా ఒక కంట్రాక్టరు దగ్గర రోజుకి అర్థణాలమీద పనికుదిరింది. ఇదే చాలని సంతోషించాడు. అంతా స్వంతం అనుకొని పట్టుదలతో పనిచేసేవాడు.

ఒకనాడు వూరిబయట యెండప్పుడు మర్రిచెట్టు క్రింద మిగతా వాళ్ళతో మేనువాల్చి ఎండనక, వాననక యిలా నలిగిపోయే యీ మేస్త్రీ ఉద్యోగం కంటె మేనేజరు ఆఫీసులో గుమస్తా వుద్యోగం లభిస్తే యెంత బాగుండేదని కోరుకున్నాడు. ఈయన పనితనానికి మెచ్చుకున్న మేనేజరు ఆ కోరిక కొనసాగించాడు.

తన తెలివితేటలు వినయ విధేయతలు, కంపెనీకి లాభం చూపించే క్రొత్త విధానాలు — అసలు కంట్రాక్టరుకే చూపించే అవకాశం కలిగింది. తను మేనేజరుకంటె తెలివైనవాడినే తనెందుకు మేనేజరు కాకూడదనుకున్నాడు. ఆ కోరిక ఫలించడానికి నాలుగేళ్ళయినా అవసరం లేకపోయింది. ఈలోగా ఆ పదవికోసం తనెంత ఆరాటపడి పోయాడు!

అది వచ్చాక లాభాలు కుప్పలుగా కురుస్తుంటే తనే కంట్రాక్టరు అయితే యెంత బాగుండేది అనిపించింది. కారు— మేడలు మిద్దెలు—పిల్లలకు పెద్ద చదువులు అమ్మాయిలకు పెద్ద సంబంధాలు!

ఆ కోరిక ఫలించడానికి యెన్నో సంవత్సరాలు పట్టలేదు. యజమాని తనకంపెనీలో చిన్న వాటా యిచ్చాడు. ఆవాటా రానురాను పెంచి కొన్నాళ్ళకు పటుతరమైన విశ్వాసంలో కంపెనీ వ్యవహారాలన్నీ తనమీద విడిచిపెట్టి దూరదేశాలకు సంచారం వెళ్లిపోయాడు. రామయ్య తనవంతుకు వచ్చే లాభంతో మేడకట్టించాడు—కారు కొన్నాడు. పిల్లలు కాలేజీకి కారుమీద వెళ్తారు. తనకు యిప్పుడు దొరికే మిత్రుల బంధువుల అంతస్థులే వేరు.

భాషన్నూ, తిండీ అన్నీ మారిపోయాయ్. యిప్పుడు భోజనం టేబిలుమీద చెయ్యవలసివస్తోంది. కారుంటేగాని కాలుకదలకుండావుంది. కంట్రాక్టరు తిరిగివచ్చేసరికి తనే ఆకంపెనీ అంతటికీ అధినాయకుడు అయిపోయాడు. పెద్దకంట్రాక్టరు తనను యేవో మీటింగులకు పిలిచి సభామర్యాద చేస్తున్నారు. పనేమిరా పైకొదన్నా తనే మహాదాత అని పొగిడి పొగిడి పత్రికల్లో యెక్కిస్తున్నారు. తన పేరుమీద వూర్లో గ్రంథాలయం లేచింది. హైస్కూలుభవనం కూడా తనపేరుమీదే కట్టేసున్నారు. తను పెద్దనాయకుడైపోయాడు. కౌన్సిలరునుంచి మ్యునిసిపల్ ఛైర్మన్ అయికూర్చున్నాడు.

అందివచ్చిన పెద్దకొడుకు అంతా చూసుకుంటున్నాడు. ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ తను పెట్టడమే. చూస్తూండగానే బట్టలమిల్లు, రెండుధాన్యం మరలు, ఉప్పుగల్లీ...అన్నీ తనపేరనే లేచిపోయాయి. ఇవన్నీ వృద్ధిఅవుతున్నకొద్దీ తనలో దయాధర్మగుణాలు పెరిగిపోయాయి. యెప్పుడూ యెవరికి యేమి యిద్దామా అనే వుబలాటమే!

జ్వరంతో పడుకున్న తనకు ఈనాడు యింకో కోరిక కలిగింది. కానీ ఆకోరిక కొనసాగదన్న సత్యం యింకోకోరికకు దారితీసింది! తనమీద రోజులన్నీ కూడి, సంవత్సరాలై వేగంగా ముసలితనాన్ని ప్రసాదించాయ్! ఆరోగ్యం క్షీణించింది. ఈ గడ్డంలో నీరసించిన తనను కొద్దినెలల క్రితంవున్న రామయ్యఅని

పోల్చుకో లేరే! అంలాటిది తన్ను చాలా కాలం బ్రతకా లంటే ఆకోరిక కొనసాగుతుందా !

కాదు కాబట్టే తనకింకో కోరిక కలిగింది. తన చేతులతో దానధర్మాలు చేసాడు. తను చచ్చిపోయినా కలకాలం నిలిచిచే కీర్తి గౌరవం ప్రజల్లో విడిచి పోతున్నానని గుండెమీద చెయ్యి వేసుకొని ధీమాగా, తృప్తిగా చెప్పగలడు. తను దాతఅని, తనను కర్ణునితో పోల్చకవులు లేకపోలేదు. ఎందరు కీర్తించలేదు. ఉవ్విళ్ళూరిపోతున్న రామయ్యలో తను ప్రజల్లో మారు వేషంలో తిరిగి తనపైనున్న గౌరవ ప్రతిష్ఠలను కళ్ళారా చూసి, చెవులారా విని, మనసారా సంతోషించి కళ్ళుమూద్దామనే కోరిక నిమిషనిమిషానికి బలీయమై మనస్సులో గాఢంగా పాతుకుపోయింది.

కొద్ది రోజుల్లో యెవరికీ తెలియకుండా దానికి కావలసిన సరంజామా సంపాదించుకున్నాడు. ఒంట్లో నాలుగు ఫర్లాంగులు నడవగలిగే శక్తి చేకూరింది. ఎవరూ తన దగ్గరకు వచ్చి అట్టే విసిగించ వద్దని ఆవేళనుంచీ చెప్పేసాడు. ఇల్లు ఎల్లప్పుడూ పిల్లలూ వాళ్ళ స్నేహితులు, బంధువులతో కళకళ్ళాడుతూ నిత్యకళ్యాణం పచ్చతోరణంలా వుంటుంది. కానీ యేరోజైతే అంతాయేదో విషయంలో నిమగ్నులై వుంటారో ఆరోజే పెరటి ద్రోవగుండా యెవరికీ తెలియకుండా వెళ్ళి తిరిగి వచ్చాక అందరినీ ఆశ్చర్యం పొందేటట్లు చేద్దామనుకున్నాడు. తను ఆనందంతో తిరిగి వచ్చేసరికి అందరూ తను అనుక్కునే వాసని యెంత గాఅడుగుతారో అప్పుడు జరిగే గమ్మత్తు నవ్వు అంతా వూహించి ఆనంద పడ్డాడు!

ఆరోజు వచ్చింది. చీకటిపడింది. ఇంట్లో వాళ్ళంతా మూడో అంతస్థుమీదకు పోయారు. తన చిన్నకూతురి సంబంధం కోసం కాబోయే వియ్యాల వారొచ్చారు. వాళ్ళ గౌరవార్థం పెద్దపార్టీ, పార్టీ అయ్యాక భరతనాట్య ప్రదర్శనం జరుగబోతుంది. తను యెలాగో కష్టపడి దిగువనుంచి, చివరి అంతస్థుకి ప్రాకగలడు. కానీ తను నీరసంగా వున్నానని రాలేనని అందరినీ పంపించివేసాడు. పరిస్థితులన్నీ అనుకూలంగానే వున్నాయ్. కానీ ఆకాశం అంతా కారు మబ్బుల మయమై వుంది. అయినా యింత వేగిరం వర్షంవచ్చే చిహ్నాలేమీ కనపడలేదు. "ఇంతకంటె మరి అవకాశం దొరకదు. పిళ్ళెవరైనా చూస్తే నన్ను కదలనివ్వరు. వర్షంవచ్చేలోగా తిరిగి రాలేనా?" అన్న ధీమాతో గబగ"-బట్టలు మార్చాడు. ఎదురుగా వున్న నిలువుటద్దంలో తన వేషం చూసి తనే ఆశ్చర్య పోయాడు. అచ్చంగా ఓగతిలేని ముసలి బిచ్చగాడు! గాలేస్తే పడిపోయేట్లున్నాడు!

ఇటూ అటూ యెవరూ లేకపోవటం చూచి ఒక్కసారి చాటుగా పెరటితలుపు తీసి రోడ్డుమీద పడ్డాడు. చేతికర్రతో వస్తేవంచినడుస్తూ అలా గబగబ వెళ్ళిపోతున్న ఒక వ్యక్తితో.

"బాబూ!"

వెంటనే ఆవ్యక్తి "యేంలేదుపోరా!" అన్నాడు. రామయ్యకు ఒక్కసారి ఒళ్ళు మండింది. కాని వెనువెంటనే శాంతించి వెంటబడి:

"బాబూ! ఈ వూరు రావటం యిదే తొలిసారి, ఆ మేడమీద సందడిగా..."

తనమాటలు పూర్తికాకుండానే "ఉంటుందిలే! వాడి మేడమీదలేక యింకెవరి మేడమీద ఉంటుంది?"

"ఏం బాబూ?"

"ఎందరో తిండిలేక చస్తుంటే వాడింట్లోవున్న పిల్లికి కూడా పుట్టినరోజు పండుగచేసి డబ్బు తగలేస్తారు!"

"ఎవరుబాబూ ఆయన!"

"రామయ్య అంటారులే..."

"ఆ బాబా? మా వూరిచేపు ఆ బాబంటే దర్మదాతంటారు?" ఆ వ్యక్తినవ్వి "వాడి పేరుపెట్టకుండా అచ్చు గుద్దకుండా యెవరికైనా ఒకగుడ్డ దానం చేసాడా ఒక స్కూలు కట్టించాడా? నీకేం తెలుసు వాడి సంగతి?—ఒంటిగా వుండేటపుడు చెయ్యిచాపు ఒక దమ్మిడీ విసుర్తాడేమో? పదిమందిలో వుండగా చెయ్యి చాపు పది రూపాయల కాగితం విసుర్తాడు! దోస్తున్నాడు. ఆ పాపం కప్పుకోవడానికే దానాలు. మనం పిచ్చివాళ్లం కానీ వాడు పిచ్చివాడుకాడు ముసలోడా?"

అంటుంటే రామయ్యకు నోరు పెగల్లేదు. అలా రోడ్డుప్రక్కన కూర్చుండిపోయాడు. ఆ వ్యక్తి ముందుకు వెళ్ళిపోతుంటే వీధిదీపం వెలుతుర్లో చూసాడు. ఇంకెవరూ కాదు, తన దయాధర్మ గుణాన్ని నిండు సభలో పొగిడినవ్యక్తే యితను!

కొంతసేపయ్యాక లేచాడు. అలా నడిచిపోతున్న

వాళ్లెందరినో చూశాడు. ఎవరివంటికి లేదేం చెడ్డచెప్పి పోతారోనని గుండె బితుకు బితుకుమంటోంది. ఈ వూర్లో అడుగు పెట్టిన దగ్గరనుంచీ పరిచయంవున్న వాని యిల్లు చూడగానే నడుస్తూ యెంతో దూరం వచ్చేశానని గుర్తుకు వచ్చేసింది.

ఆ వ్యక్తి భోజనం అయ్యాక వాకిట వాలుకుర్చీ వేసుకుని కూర్చొని పద్యాలు వల్లించుకుంటున్నాడు. ఎన్నిసార్లు యితను తనను పద్యాన పత్రాలలో ఇంద్రుడూ, చంద్రుడు అని పొగిడాడు. ఈ యువకవి—ప్రజాహృదయానికి ప్రతినిధి—యీ నాడు నోటనా కీర్తికాంతను వర్ణించగా విని హాయిగా తిరిగిపోతాను. అంతదూరం నడవలేనేమో? ఏబండివాడు యీ బిచ్చగాడికి బండికట్టడానికి ఒప్పుకుంటాడు? అయ్యో! ఈ చింకిజేబులో ఒక రూపాయైనా వేసుకోవ్వాను కాదే?"

తన కంఠస్వరం యెంత మాత్రం పోల్చుకో కూడదని వణుకుతూ "బాబూ!" అన్నాడు.

తన వేపు చూడకుండానే "భోజనాలయి పోయాయ్. పోవోయ్!" అన్నాడు.

"బాబూ! ఈ వూరిలో కాలుపెట్టడం యిదే... ఎవరో రామయ్య బాబట! అడిగిన వాడికే పాపమట! ఆ మారాజు పేరు దేశమంతా మ్రోగిపోతున్నది—ఆ యిల్లెక్కడో చెప్పరా?"

ఈ మాటలతో ఆయన తలొకసారి త్రిప్పి పక్కున నవ్వాడు. కొద్దిగా ఆయాసంగా వుండడం వలన రామయ్య అక్కడ కూర్చుండ బడిపోయాడు.

ఆకాశాన నల్లని మేఘాలు ముద్దుగా పేరుకు పోతున్నాయ్. ఉండి వుండి చల్లని గాలి వీస్తోంది. ఆ వ్యక్తి ఒక్క అవులింత తీసి "ఆ రామయ్య సంగతా? వినాలని వుందా?"

"సిత్రం!"

"వాడు యిప్పుడు దేవేంద్ర భోగం అనుభవిస్తున్నాడని అంతా అనుకుంటారుగానీ యీ వూరు చింకి బట్టలతో వచ్చిన క్రొత్త రోజుల్లోవున్న సుఖం వాడికేది? నిజం చెప్తాను తాతా నీలాంటి సుఖమైన మనిషి లోకంలో యెక్కడా వుండడు, ఎందుచేత నంటావ్—నీకు కోరికల్లేవు. కావలసిన బట్టా తిండీ అడుక్కుని ఆ అవసరాలు తీర్చుకుంటావ్? వింటున్నావా? అర్థం అయిందా?"

"ఆఁ..." మూలిగాడు.

"ఆ రామయ్య యెండనక వాననక కష్టపడి అదిగో చూశావా ఆ కనుపించే మర్రిచెట్టు క్రింద హాయిగా పడుకొనేవాడు. ఆ రోజుల్లోనూ నేను వాడిని యెరుగుదును. ఎంత మంచి మనిషంటావ్? తను యేకీర్తి కోరకుండానే ఒకరికి సహాయం చేసేవాడు తను బాధపడి కూడానూ... మరి యిప్పుడో... వాడికి యేపని చేసినా, చివరికి నీకో కానీ ధర్మంచేసినా కీర్తి కోరి చేస్తున్నాడు. అంచేత మనిషిగా ఒక విలువను సంపాదించినవాడు, ఆనాటి రామయ్య కానీ యీ నాటి రామయ్య యెంతమాత్రం కాదు! నేనేదో పిచ్చిమాటలు అనేస్తున్నాను—అర్థమౌతోందా?"

కళ్ళపర్యంతరం నీరు తెచ్చుకున్న రామయ్య "ఊఁ" అని విధిలేక గొణిగాడు.

అతను హృదయానికి హాయినిచ్చే గాలి వీస్తుంటే వునికి మరచిపోయి తను మరుగుపరచుకున్న వ్యక్తిత్వాన్ని వెలిగ్రక్కుతున్నాడు.

"ఈ లోకంలో బాగా మోసపోయేవాడెవడంటే రామయ్య అంటాను! ఒక మాటంటాను; లోకం మోసావు; న్యాయం చెప్పు! ఆకలని వచ్చావ్. కడుపునిండా తిండేకాదు మంచి బట్టలిచ్చాను. మా యింట్లో మనిషిగా చూసుకున్నాను. నమ్మి యింటిపెత్తనం యిచ్చి పనిమీద వూరికి వెళ్ళాను. నేను తిరిగి వచ్చేసరికి దొంగలెక్కలతో యీ యిల్లూ ఆస్తీ అంతా కాజేశాన్నాడు. చూశావా? ఇంత చేసినందుకు పదునైన కత్తితో వెనకనుంచివచ్చి పొడిచి చంపినట్లు లేదూ? ఆశతో రాక్షసుడైపోయాడు రామయ్య! రాక్షసుడు కంపెనీ కబళించుకున్నాడు? ఎన్ని కార్లు, ఎన్ని మేడలు, ఎన్ని లక్షలున్నా, ఎన్ని దానాలు చేసినా రాక్షసుడు సత్యం న్యాయంకి చిహ్నమైన మనిషెలా అయిపోతాడు చెప్పు? ఇలాంటిహీనుడు ప్రజల్లో గొప్పవానిగా యెలా చెలామణిఅయిపోతాడు? ముఖస్తుతికి పొంగి వుబ్బి పోయేవాడు, వుత్తి నీచుడన్నమాట! తన నీచత్వం తను తెలుసుకుంటాడని తనని యింద్రుడు చంద్రుడని నేనే పొగిడినవాడు వుబ్బి తబ్బిబ్బయిపోయాడు! తనలాంటి రాక్షసుడు, యింద్రుడు, చంద్రుడెలాగౌతాడనైనా ఒక్షణమైనా ఆలోచిస్తే యీ భాగ్యభోగాలు విడిచి తనతప్పులకు పశ్చాత్తాపం చెంది యే అడవుల్లోనో కష్టాలు పడి తాపసిగా వుండిపోనూ. చూశావా! కోరికలతో

పడినట్లు అతని స్మృతిపథంలో నీడగానైనా లేకపోవచ్చు... కాని... కాని—తర్కం ద్వారా యీ విధంగా కలిగేస్పష్టి అతిస్వల్పం— క్షణికం కూడా — తార్కశాస్త్రం అతనయి వాలుగు లక్షణాలూ వున్న మానవుణ్ణి సృష్టించి తీర్చి దిద్దుతుంది. కాని అందులో జీవంమాత్రం వుండదు— ఏమిటి ప్రయోజనం? భాస్కరం ఫిలాసఫీతో నాకు ప్రమేయం లేదు. జీవితంలో క్రమంగా స్థిరపడిపోయిన అభిప్రాయాలు నాకూ వున్నాయి. 'తనకు మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం' అంటాను నేను. దీన్ని ఖండించేవారు చాలామంది—కాని వారి వాద ప్రతివాదాలలో నాకు సంబంధం లేదు. చెట్టుమీద పక్వానికి వచ్చిన ఫలంవుంది. అది నాకు కావాలి. అందే వరకూ యత్నిస్తాను. ఎదురౌన్న విపరీతశక్తుల్ని ఎదిరిస్తాను. అదీ నా తత్వం—కొందరు హితబోధ చేయవచ్చు:

'పోనిద్దూ!...ఎందుకంత శ్రమ! అదుగో నేల మీద రాలిన మరో ఫలం వుంది. అంతమంచిది కాకపోయినా ఫరవాలేదు. తీసుకో—అడ్డంకులు లేవు.' అని.

నా గదికి వచ్చాను. ఆరోజు వచ్చిన టపా బల్లమీదవుంది. విద్యాశాఖాధికారి దగ్గర్నుంచి వచ్చిన రెండు మూడు వుత్తరాలు తప్పించి అందులో ఏమీ లేదు. ఇంటి విలాసానికి వచ్చిన టపా తీసుకుని ప్యూను మరో అయిదునిమిషాల్లో వచ్చాడు. అందులోనైనా భాస్కరం రాసిన వుత్తరం వుంటుందని ఆశించాను. ఏమీ లేదు—బంధువుల దగ్గర్నుంచి వచ్చిన రెండుత్తరాలు—మాడరన్ రెవ్యూ—గదికి తాళం వేయమని ఇల్లుచేరుకున్నాను. స్నానంచేసి కుర్చీలో కూర్చున్నా—అద్దంలో ప్రతిబింబం కనిపించింది.

అప్పటికీ, ఇప్పటికీ ఎంత వ్యత్యాసం! ఆలోచనలు అడ్డదిడ్డంగా సాగిపోయాయి.

* * *

'మేష్టారూ! మిమ్మల్ని ఓమాట అడగాలనుకుంటున్నానండి' అన్నాడు భాస్కరం.

అతనిముఖంలో అశాంతివుంది. కొద్దిగా సిగ్గు కూడా మిళితమైవుంది. భాస్కరం కొత్తగా చేరిన వుపాధ్యాయుడు. అతనికి జీవితానుభవం లేదు. అప్పుడే కాలేజీనుండి విడుదలైవచ్చినా ఆ కొంటెతనంలేదు. ఏదో వస్తువు పారేసుకుని దాన్ని వెతుక్కుంటూవచ్చి యీ స్కూల్లో దొరుకుతుందన్న ఆశతో యిక్కడ చేరాడను కుంటాను.

'ఏమిటి భాస్కరం?' అనడిగాను.

'మరి...మరి...మీరేమీ అనుకోకుండా వుంటే —అసలు అడగటానికే సంకోచంగావుంది. అయినా మీదగ్గర అడగటానికి భయం ఎందుకు' అని తనలో తనే మాట్లాడుకున్నట్టు అన్నాడు.

నాకు తెలుసు—భాస్కరానికి నేనంటే చాలా గౌరవం వుంది. ఆ స్కూల్లో పదిసంవత్సరాలుగా పనిచేస్తున్నాను. కనక ఆనేక విషయాలు అడిగేవాడు. అతనికే కాదు. తోటి ఉపాధ్యాయు లందరికీ ఓ విధమైన ఆప్యాయత—అనురాగం వున్నాయి.

'విమలను మీకు బాగా తెలిసే వుంటుంది—ఆ అమ్మాయి ఎలాంటిది?'

అతని కళ్ళల్లోకి చూశాను. ఏదో క్షమించరాని అపరాధం చేసిన వాడిలా కనిపించాడు. నిజానికి ప్రతి మానవుడూ మనసులో ఎన్నో వూహించు కుంటాడు. అందులో కొన్ని సంఘం ఆమోదించినవీ వుంటాయి. తిరస్కరించినవీ వుంటాయి. అందుకని ఆమోద ముద్ర పొందని భావాలు ఎక్కడా బయటికి పొంచి చూపకుండా మాటల్లోనూ చేతల్లోనూ అతి జాగ్రత్తగా వుంటాడు. మానవహృదయంలోవుంటే అభిప్రాయాన్ని విభజించి వ్యక్తం చేసే 'ఎక్స్‌రే' యంత్రం వుంటే ఎంత బాగుండును.

'స్కూలు ఫైనలు చదువుతోంది—ఆ అమ్మాయేనా?'

అవునన్నట్టు తల వూగించాడు.

'అంటే నీ అభిప్రాయం?...ఆ అమ్మాయి తెలివైంది. మర్యాదస్థుల కుటుంబం—'

'ముసుగులో గుద్దులాటఎందుకండీ? ప్రతి క్లాసులోనూ ఆ అమ్మాయి నన్ను వేపుకు తింటోంది. ఏవో కొంటె ప్రశ్నలు వేస్తుంది. నేనన్న ప్రతి వాక్యానికీ తనూ తందానా పాడుతుంది. నవ్వుతుంది. అదిచూసి నన్నో వెర్రి వెంగళాయుడి కింద కట్టేసి తతిమ్మా వాళ్ళు కూడా నవ్వుతారు.

ఆ అమ్మాయి ఎసెంబ్లీలో అపోజిషన్ లీడర్ లా పని చేస్తోందంటే నమ్మండి. నేను క్లాసు కంట్రోలు చేయలేక పోతున్నా. నాలుగైదు సార్లు

మందలించి చూశాను. కాని ప్రయోజనం లేదు. ఆఅమ్మాయి మెదడు సరైన స్థితిలో లేదనుకుంటా.'

కొన్ని క్షణాలు ఆశ్చర్యంలో మునిగిపోయి ఏమీ సమాధానం చెప్పలేక పోయాను. కాని మౌనం వహిస్తే ఎలా?

'చూడు భాస్కరం! ఇందులో కంగారు పడవలసింది ఏమీ లేదు. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయుల్ని విద్యార్థులు ఇలాగే ఏడిపిస్తారు. ఇది మన శక్తి పరీక్ష. ఈ తుఫానుకు బయపడకుండా ఎదిరించి నిలబడాలి. ఒకటి రెండు సార్లు విమలను గెట్ ఔట్ చేస్తే సరిపోతుంది.' అని సలహా యిచ్చాను.

భాస్కరం వెళ్ళిపోయాడు.

కాని విమల ప్రవర్తన నాకో ప్రశ్న అయింది. ఈ పదేళ్ళలో నేనిలాంటి మనస్తత్వపు సమస్యను ఎదుర్కోలేదు. భాస్కరం అందంగా వుంటాడు. అతను స్టాఫ్ రూంలో అప్పుడప్పుడు పాటలు పాడుతూంటగా విన్నాను. అతను చాలా పుస్తకాలు చదివి కొంత విజ్ఞానం ఆర్జించాడు. విమలకు పద్దెనిమిదేళ్ళు వుంటాయి. ఒక వేళ అతన్ని ప్రేమిస్తోందేమో! కాని వెంటనే మరో ప్రశ్న ఉదయించింది. ప్రేమ ప్రకటనకు ఇది మార్గంఅవుతుందా అని. సమాధానంకూడా వెంటనే వచ్చింది. విమలకు జీవితమంటే ఏమిటో పూర్తిగా అవగాహనయ్యే అవకాశం లేదని.

నా నిర్ణయం తల్చుకుంటే నాకే నవ్వొచ్చింది. ఈ 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అనే దాంట్లో నాకు పూర్తిగా నమ్మకం లేదు. అయినా నేతి బీరకాయకు మల్లే యీ ప్రేమేమిటి? అదంతా వూహాగానం. విమల నాకు బాగా తెలుసు. ఆమె కుటుంబంతో నాకు బాగా పరిచయం వుంది. అంతదాకా ఎందుకు? విమల తండ్రి కేశవరావు నేను అత్యంత స్నేహితులం. అతను తాలూకాఫీసులో గుమాస్తాగా వున్నాడు. విమల తల్లికి కనుపులో ఏదో రోగం—దాని తాలూకు బాధతో బాటు ప్రతిక్షణం విమల వివాహం గురించి బెంగ పెట్టుకునేది. విమల ప్రవర్తన నిజానికి నా అంతరాంతరాలకు నిప్పు పెట్టింది. అమాయకత్వమూ అంటే చిన్న పిల్లకాదు. సగం వికసించిన పువ్వు—అనుమానం—ప్రశ్న—తీరంలేని సముద్రాలు అన్నీ నన్ను చుట్టుముట్టేసి ఉక్కిరి బిక్కిరి చేశాయి.

నెమ్మదిగా స్కూలు ఫైనలు క్లాసు దగ్గరకు వచ్చాను. గోడవారగా ఎవరికీ కనపడకుండా నిలబడ్డాను. భాస్కరం క్లాసులో పాఠం బోధిస్తున్నాడు. 'మర్చెంట్ ఆఫ్ వెనీస్' షేక్స్పియర్ నాటకంలో ఒకచోట సంగీతం జంతువుల్ని సహితం నృత్యం చేయించగలదని వర్ణింపబడివుంది. ఆ ఘట్టాన్ని భాస్కరం విశదీకరించాడు.

'అయితే మేష్టారూ! సంగీతం అంటే నాకు ప్రాణం—మరివినాలో!'—అది విమల కంఠం. ఇంకొంచెం ముందుకునడిచి జాగ్రత్తగా విన్నాను. 'అదంతా నీ కనవసరం!' అని భాస్కరం గద్దించాడు. నా సలహాను అతను పాటిస్తున్నందుకు లోలోన సంతోషించాను. వారివారిమధ్యా వైరుధ్యాన్ని—అసహ్యతను సృష్టించటమే నా వుద్దేశ్యం—అంటే ఇతరులబాధలు చూసి సంతోషించే మనస్తత్వం కాదునాది. కారణం విశదీకరించలేను. అది హృదయాంతరాల అట్టడుగున వుండి పోతుంది...'అదేమిటండి!... మీరు చెప్పక పోయినా నాకు తెలియదా ఏమిటి? మీరు పాడుతుండగా నేను చాలాసార్లు విన్నాను—బాగా పాడతారు.'

అందరూ గొల్లుమన్నారు. విమల మాటలు నిజంగా అధికప్రసంగంలోకే వస్తాయి. అంతా, కొత్త మేష్టార్ని విమల బాగా ఏడిపిస్తోందనే అనుకున్నారు. కాని అందులో నిప్పష్టమైన అర్థం ఏదో వుందని నేను మాత్రం వూహించుకో గలిగాను. ఇంక అక్కడ వుండలేక పోయాను.

మర్నాడు విశ్రాంతిసమయంలో విమలవచ్చింది.

'భాస్కరం మేష్టారు వున్నారాండి?' అనడిగింది.

కళ్ళల్లోనూ, కంఠంలోను బెదురు స్పష్టంగా కనుపించింది.

అయితే ఈ భయం నన్ను చూసేగాబోలు!

'ఏం కావాలి విమలా?' అనడిగాను.

'ఇంగ్లీషు పాఠంఅర్థంకాలేదండి. అడుగుదామని వచ్చాను.' నిజానిజాలు తెలిసివుంటే ఆమె యింత స్వేచ్ఛగా మాట్లాడివుండేదికాదేమో! లేడిలాగెంతుతూ పారిపోయింది.

'ఏం? నీకు తెలియక పోతే నేను బోధపరుస్తాను అతనే కావాలా?'

'అవునండి—' అంటూ గదంతా హోమారు కలయజూసి అతను లేడని నిర్ణయించుకుని వెళ్ళిపోయింది. అవమానంలో పళ్ళు పటపట కొరికాను—త్రాచులా అటూ యిటూ కదులుతున్న ఆమె పొడుగాటి జెడకేసి చూస్తుంటే నా మనస్సులో భయంకరసర్పాలు తలెత్తి బుసకొట్టి నన్ను ఉత్సాహపరిచాయి. గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించిందట! సరే! ఎండాకాలం వస్తే చెరువు ఎండుతుంది. కాని తిరిగి వాన కురిస్తే నిండుతుందన్న సంగతి మర్చిపోయాను. షెల్లీ తన మనోవ్యథను బయట పెడుతూ 'వెస్ట్‌విండ్'లో శీతాకాలం తరువాత 'వసంతం' రాకుండా వుంటుందా? అన్నాడు. కాని వసంతం తరువాత నైట్రోజన్ సర్కిల్‌లా శీతకాలం రాక తప్పదని అతను మర్చిపోయుంటాడు.

ఆ సాయంత్రమంతా ఆలోచించాను. ఈ సమస్య నూటికి నూరుపాళ్ళు నా వ్యక్తిగత జీవితానికి సంబంధించినది. అందుచేత నే దాన్ని పరిష్కరించాలి. ముళ్ళబాటల వీధికి పరుగెడుతున్న బండిని సరైన మార్గంలోకి మళ్ళించాలి. అదే నేను చేసుకున్న ఆఖరు నిర్ణయం.

వారం రోజులు గడిచాయి. విమల ఇదివరకటి మల్లే చిలిపి ప్రశ్నలు వేయటం తగ్గించిందని భాస్కరం అన్నాడు. కొంత తృప్తిపడ్డాను.

ఓనాడు సాయంత్రం పేపరు చదువుకుంటున్నాను. స్టాఫ్ రూంలో ఎవరూ లేరు. భాస్కరం నెమ్మదిగా వచ్చి నా ఎదురుగా కూర్చున్నాడు.

'మేష్టారూ! మనకు వచ్చే జీతాలు చాలా తక్కువ. అందుచేత ప్రైవేట్లు వస్తే ఒప్పుకోటం మంచిదంటారా?'

'అందులో తప్పేముంది? అసలు ప్రైవేట్లు రావాలని ఎంత మంది కాసుక్కూచునుంటారో తెలుసా?'

'కాని మరో ప్రశ్న ఎదురైందండి. విమల తమ్ముడొకడు సెకండు ఫారం చదువుతున్నాడటగా! ఇద్దరికీ కలిసి ప్రైవేటు చెప్పాలిట—సాయంత్రం ఇంటికి రమ్మంటూంది విమల—'

ఏం చెప్పాలో బోధపడింది కాదు. నిర్మాణం సగంపూర్తిఅయిన భవనం తాలూకు పునాది కూలినట్టైంది.

'నువ్వేం చెప్పావు?'

'ఆలోచించి రేపు చెబుతానన్నాను. నేను ఎంతడిగితే అంతా ఇవ్వటానికి సిద్ధమేనట! వాళ్ళనాన్న అడగమన్నాడుట.'

కొన్ని క్షణాలు ఆలోచించి అన్నాను.

'చూడు భాస్కరం' లోకం మంచిది కాదు. దానికి వెయ్యి కళ్ళూ వెయ్యి నాలుకలూ వున్నాయి. నువ్వింకా జీవితంలో అడుగు పెడుతున్నావు. అంతే! అందుచేత నీ కన్నీ పంచవర్ణాలు పూసుకుని తళతళ లాడుతూ అందంగా కనిపిస్తాయి. కాని వాటి వెనక ఎర్రగా కాలిన ఇనపవూచలుంటాయి. నీపరువు ప్రతిష్ఠలు ధ్వంసమయ్యాక నువ్వు బతక లేవు. అదినా కెంతమాత్రం యిష్టం లేదు. విమల చిన్నపిల్ల గాదు. పెళ్ళికెదిగి కూర్చుంది. ఇప్పటికే నీగురించి పుకారు బయలుదేరి వుంటాయి. వాటిని రుజువు చేసిన వాడవవుతావు. అంటే కొరివితో నెత్తి గోక్కోటమన్న మాట. అంతే— తరువాత నీ యిష్టం—.'

ఆ మాటలు అసహజంగా ధ్వనించాయి. వాటిని భాస్కరం ఎలా అర్థం చేసుకున్నాడో తెలియదు. అందులో ఎంతవరకూ నిర్మలత్వం వుందని అతను ఆలోచించలేదనుకుంటా. పెద్దగా నిట్టూర్చి కదలి పోయాడు.

ఇంటికి వెడదామని లేచాను.

'నమస్కారం' అంటూ విమల వచ్చింది. ఆమె నేవిధంగా పలకరించాలో తెలియక మాటలకోసం వెదుక్కుంటున్నాను.

'మేష్టారూ! నాన్నగారు మిమ్మల్ని ఓమాట అడిగిరమ్మన్నారు.

మా తమ్ముడు బొత్తిగా చదువుకోటం లేదండి. వట్టిగడుగ్గాయిలా తయారై భయభక్తులు లేకుండా తిరుగుతున్నాడు. అందుకని భాస్కరం మేష్టార్ని ప్రైవేటుకు పిలవమన్నారు. మీ అభిప్రాయం ఏవిటి?' అంటూ డొంక తిరుగుడుగా వయ్యారంగా ప్రశ్నించింది.

హఠాత్తుగా వుపమానం జనించింది. ఓ వ్యక్తి జేబులోంచి పర్సు దొంగిలించి అందులోంచి అయిదు రూపాయల కాగితం తీసి అతనికే యిచ్చి 'అయ్యా! నాకు ఫలానా వస్తువు తెచ్చి పెట్టండి!' అంటే ఎలా వుంటుంది?

'అదేదో మీ నాన్నతో నే చెబుతాలే' అన్నాను. విమల తిరిగి నమస్కరించి కదిలిపోయింది. నేను బయటకొచ్చేసరికి భాస్కరం వాలీబాల్ కోర్టులో వున్నాడు.

తిన్నగా ఇంటికొచ్చాను. అమ్మ కాఫీయిచ్చింది. తాగేసి విమల యింటికెళ్ళాను. కేశవరావు అరుగు మీదే వున్నాడు. గౌరవించి కూర్చోమన్నాడు.

'విమల ఇంట్లో లేదా?'

'లేదండి! గుళ్ళోకెళ్ళింది. ఏమిటో ఇలా దయ చేశారు.' అన్నాడు.

'మరేం లేదు. భాస్కరాన్ని ప్రైవేటు చెప్ప మన్నారట!'

అతను మొదట్లో తెల్లబోయి తరువాత సర్దుకుని 'మరే...మరే...' అన్నాడు అసందర్భంగా.

'అతన్ని గురించి చెబుదామనే వచ్చాను. ఇదంతా మనిద్దరికీ మధ్యవున్న స్నేహాన్ని పురస్కరించుకుని చెబుతున్నా. అతనిమీద నాకేలాంటి ద్వేషమూ లేదు. అతన్ని గురించి నాకు తెలిసిందికూడా తక్కువే. అయినా వయసువచ్చిన విమల అతన్తో అలా మాట్లాడటం—తిరగటం—మంచిది కాదు. కొంతమంది చెప్పగా విని అర్థం చేసుకున్నాను. అతను ఆడపిల్లల్ని వల్లో వేసుకోటంలో బాగా ఆరితేరినవాడని. అందుకని దుష్టులకు దూరంగా వుండటం మంచిది. అదలావుంచి అతన్ని ఇంటికి రమ్మనడం ఘోరాతి ఘోరం. ముందుముందది ప్రమాదకరంగా పరిణమిస్తుంది. ప్రైవేటు కావాలంటే నేను చెప్పనా? అతనే కావాలని మీ అమ్మాయి పట్టుబట్టడం ఆశ్చర్యంగా వుంది. ఇదంతా చూస్తుంటే...' అంటూ ఆగిపోయాను.

'అబ్బే! అలాంటిదేమీ లేదు. మీరే అనుమానిస్తే ఇంక నాకు దిక్కేమిటి? మన మధ్యవున్న సంగతి ఆమెకు చెప్పకుండా దాచి వుంచాను. స్కూలు ఫైనలు పూర్తికానివ్వండి. విమలను నేను మందలిస్తాను.' అన్నాడు భయంతో కేశవరావు.

మానవులకు అభిప్రాయాలూ, ఆదర్శాలూ వున్నప్పటికీ వాటిని చెలాయించేటందుకు కాలంకూడా కలిసి రావాలి. నావికుడు నావ నడపటంలో తనకున్న శక్తిని పెను తుఫానులమధ్య ప్రదర్శించి ప్రయోజనం లేదు. విజయాన్ని అందుకోలేదు. ఏదేలావున్నా, ప్రశాంతంగా పారుతున్న నదీ జలంలో మట్టిబెడ్డలు విసరబడ్డాయి. స్వచ్ఛంది జలం తన రంగును కోల్పోయింది. నా జీవితంకూడా అంతే అయింది. 'ఎన్నో నీతి గ్రంథాలు చదివాను. కాని ఇప్పుడు నేను చేసేపనిని నీతి దృక్పథంలోనుంచి చూడటం మానుకున్నాను. నాక్కావలసింది విజయం. భాస్కరం విమల యింటికి వెళ్ళకపోయినా ఆమె తమ్ముడుమాత్రం ప్రతి సాయంత్రం స్కూల్లోనే ప్రైవేటు చెప్పించుకుంటున్నాడు. పుండుమీద కారం జల్లినట్టు అప్పుడప్పుడు విమలకూడా అతనికి సాయం వుంటోంది. దీని పర్యవసానం ఏమవుతుందని వూహించే శక్తి నాకు లేదు.

పబ్లిక్ పరీక్షలు పూర్తయ్యాయి. నేను ఎదురుచూస్తున్న ముహూర్తం దగ్గర పడుతోంది. కాని అనుకున్నదానికి విరుద్ధంగా విమలతల్లి కడుపునొప్పితో చనిపోయింది. ఆమె శారీరకంగా ఎంత బాధపడినా కేశవరావుకు అండగా నే వుండేది. సరిగ్గా వారం రోజుల తరువాత మరో పిడుగు. కేశవరావుకూడా గుండెపోటువలన చనిపోయాడు. విమల దిక్కులేని పక్షి అయిపోయింది. ఆమె తన్నుతాను పోషించుకోవాలి. తమ్ముడిజీవితాన్ని సరిదిద్ది అతన్నో వ్యక్తిగా మార్చాలి. ఇదంతా మోయలేని బరువు. కర్మకాండంతా పూర్తైంది.

ఓనాడు విమల ఇంటికెళ్ళాను. దిగులుగా కూర్చునివుంది. 'విమలా! ఏమిటి నిర్ణయించుకున్నావు?' అనడిగాను. 'ఏముందండీ!...అంతా అయిపోయింది. ఇంక ట్రెయినింగు చదువుదామని ఆలోచిస్తున్నాను. ఇల్లున్నా నిలబడుతుందనుకున్నాను. కాని అప్పులవాళ్ళు దాన్నికూడా ఎగేసుపోతారట. ఏం చేసేది?' అంది.

నేను ఏదో చెబుదామని నోరెత్తాను. కాని ఎందుకో నా అభిప్రాయాలు నన్ను మూగవాణ్ణి చేశాయి. చెప్పలేకపోయాను.

మర్నాడు మా అమ్మను పంపించాను. ముఖ్యంగా విమల వివాహ విషయం తెలుసుకురమ్మని. ఆమెతండ్రి వుంటే నాకేలాంటి బాధ్యతా లేకపోను. కేశవరావుకూ నాకూ మధ్య కొన్ని రహస్యాలు వున్నాయి. అవి మాయిద్దరికీ తప్పించి మరెవరికీ తెలియవు. విమల ట్రెయినింగ్ చదవటం నా కెంతమాత్రం యిష్టం లేదు. విమలకు వరుడు సిద్ధంగా వున్నాడు. అతను భాస్కరానికి మల్లే నవయువకుడు కాకపోయినా అస్థిరత్వంతో వూగిసలాడేవాడు కాదు. అమ్మకోసం

ఎదురుచూస్తూ కూర్చున్నాను. విమల తప్పకుండా నెగ్గుకుంటుందని నాకు తెలుసు. ట్రెయినింగ్ చదవటమంటే ఎన్నో ఎడారులు-నదులు-లోయలు-దాటవలసి వుంటుంది. ఆమె ఏ ధైర్యంతో ఆ నిర్ణయానికి వచ్చిందో మాత్రం నా కర్థం కాలేదు.

'విమలకు తను ట్రెయినింగు చదవాలన్న ధ్యాసే కాని మరే విచారమూ లేదు. అసలామె పెళ్లి చేసుకోవటం-అన్నీ ఏర్పాట్లూ చేస్తానని చెప్పి చూశాను. దాన్ని వంచటం ఎవరి తరమూ కాదు.'

అవి అమ్మ చెప్పిన మాటలు—

'పోనీ, విమల ట్రెయినింగ్ చదివితే తప్పేముంది? మనబంగారం మంచిది కావాలి కాని వుద్యోగం చేయటంలో తప్పేముంది? ఆమెను ప్రోత్సహించటం నావిధి' అనుకున్నాను. విమలచేత అప్లికేషన్ పెట్టించాను. నాకున్న పలుకుబడి వలన ఆమెకు సీటు వచ్చింది.

కాని విమల మాటలు మళ్ళీ నన్ను ఆలోచనలోకి విసిరేశాయి. 'మేష్టారూ! మామీదవుండే ఆదరంతో నాకోసం శ్రమపడ్డారు. మీఋణం ఎలా తీర్చుకుంటానో తెలియదు. అందుకు అవకాశం రావాలనే ప్రార్థిస్తున్నా. ఇంక మీరు నాగురించి శ్రద్ధ తీసుకోటం-మిమ్మల్ని బాధించినట్టే అవుతుంది. నేను కాకినాడలో రూం తీసుకున్నాను. అందులో మేం నలుగురం వుంటాం-మీరేం బెంగపెట్టుకోకండి. ఇక ముందు ఆర్థికంగా నాకెలాంటియిబ్బందులూ వుండవు.'

ఆ మాటల్లో అంతులేని అగాధం కనిపించింది. అగాధమైతే మసగ్గా కనిపించింది కాని అందులో ఏం వున్నాయో-క్షారమృగాలే వున్నాయో-రంగురంగుల పువ్వులే వున్నాయో-మాత్రం దృగ్గోచరం కాలేదు. నేను, విమల తన స్వంత కాళ్ళమీద ఎలా నిలబడగలుగుతుందని అడుగుదా మనుకున్నాను. కాని ఆమె మాట్లాడే తీరులో అందుకు అవకాశం ఎక్కడా లేదు. ఇంటికి తిరిగి వచ్చేశాను.

విమల ఇంత ధైర్యంగా మాట్లాడటం వింతగానే కనిపించింది. సముద్రపు అలల్ని చూసి భయపడుతూనే వుంటాం - కాని పరిస్థితులు కెరటాల మధ్యకు విసిరివేస్తే ఎక్కడలేని ధైర్యం వస్తుంది. ఊరికే ఏడుస్తూ కూర్చుంటే జీవిత శృంఖలాల్ని తెంపుకోలేం. గడ్డిపరక దొరికితే అది రక్షిస్తుందన్న ఆశవదలదు. క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొనే శక్తి స్త్రీలకు ఎక్కువగా వుంటుంది.

కాని పదిరోజులు పోయాక కాని ఈ చదరంగంలోవున్న ఎత్తులు బోధపడలేదు. భాస్కరం రిజైన్ చేసి కాకినాడలో ఓ హైస్కూలులో చేరాడు. రెండుమూడుసార్లు నేను అక్కడికి వెళ్ళినప్పుడు విమలను కలుసుకున్నాను. ఆమె గుప్పిట్లో దేన్నో దాచి వుంచుకుని రహస్యంకనుక్కోమన్నట్టు సవాలుచేసింది. ఆమె తమ్ముడుకూడా అక్కడే చదువుతున్నాడు. భాస్కరాన్ని త్రోవలో కలుసుకున్నాను.

'భాస్కరం! నీకు విమలకనిపిస్తోందా?' అనడిగాను.

'కనిపించకేమండి! వారానికి రెండుమూడు సార్లు ఇద్దరం కలుసుకుంటున్నాం.'

అతను ఎప్పటికిమల్లే నే మాట్లాడాడు.

'కాని, నా సందేహం ఒక్కటే! విమల ఆర్థికంగా ఎలా సమాళించుకుంటోందని.'

'క్షమించాలండి — మొదట్లో విమల చాలా పెంకిపిల్ల — క్లాసులో నన్ను ఏడిపించటమే ఆమె అభిప్రాయమని అనుకుని భయపడ్డాను కాని ఇప్పుడా భావం తొలగిపోయింది. ఆమెకు అప్పుడప్పుడు స్వార్థరహితంగా నేనే సాయంచేస్తున్నా, నాకు పనుంది. మళ్ళీ కలుసుకుందాం —' అంటూ చకచకా వెళ్ళిపోయాడు.

పొంగుతున్న పాలు హఠాత్తుగా విరిగినట్లయింది.

ప్రతివ్యక్తికీ కొన్ని నిశ్చితాభిప్రాయాలు వుంటాయి — వాటినెవరూ మార్చలేరని ముందే చెప్పాను. అవి స్థిరమైన స్వయంసిద్ధాంతాలమీద ఆధారపడిపోయినాసరే—విమల, భాస్కరం ఇలా విహంగాల్లా తిరగటం నాకిష్టంలేదు. సామ దాన భేద దండోపాయాలచేత దీన్ని చెదరగొట్టటం నా దృష్టిలో న్యాయసమ్మతంగానే కనిపించింది.

నా ఓటమిని అంగీకరించలేకపోయాను.

* * *

కాలచక్రంలో రెండుసంవత్సరాలు దొర్లిపోయాయి

కాకినాడలో ఓ హైస్కూలులో నాకు హెడ్మాష్టరుగా అపాయింటుమెంటు దొరికింది. అదృష్టవశాత్తూ ఆ స్కూల్లో భాస్కరం పనిచేస్తున్నాడు. కొత్తగా ఛార్జి తీసుకున్న రెండువారాలకు ట్రెయినింగ్ పాసైన విమల ఇంటర్వ్యూకి వచ్చింది. ఆమెతోబాటు అనుభవంవున్న మరో యిద్దరుకూడా పోటీగావచ్చారు. కాని కరస్పాండెంటుకు నచ్చచెప్పి విమలకు ఆ వుద్యోగంవచ్చేట్టుచేశాను. ఇందులో సానుభూతికంటె స్వార్థం ఎక్కువగావుంది.

ఇంక భాస్కరంమీద పగసాధించాలి. అతని లోపాలుకనిపెట్టి వున్నవి లేనివి మేనేజరు చెవిలో వూదాను. రెండుమూడుసార్లు లేటుగావస్తే బలవంతంగా లేటు మార్కు చేయించాను. వారానికి రెండుసార్లు అతని క్లాసుకు వెళ్ళి టీచింగు తృప్తికరంగా లేదని రిపోర్టు రాశాను. అతని చుట్టూ విషసర్పాల్ని సృష్టించాను. అతనిదగ్గర

విషయంగా ప్రవర్తించిన విద్యార్థులు నా ప్రోద్బలంతో ఎదురుతిరిగి అతన్ని ఏడిపించసాగారు. భాస్కరం అంతా గమనిస్తూనే వుండాలి. కాని ఏమీ ఎరగనట్టు కాలం గడుపుకుంటూ పోతున్నాడు.

ఉన్నట్టుండి భాస్కరం డిస్మిస్ అయ్యాడు. చట్టప్రకారం అతనికి నోటీసు యివ్వవలసివుంది. కానతను ప్రతిఘటించలేదు. కాని ఏ పునాదిమీద నా భవనాన్ని నిర్మించదలచుకున్నానో ఆ పునాది కూలిపోయింది.

విమలకూడా రిజైన్ చేసి వెళ్ళిపోయింది. ఆమెను వారించటానికి యత్నించాను. విఫలతే నన్ను చూసి నవ్వింది.

ఎడారిలో ఎండమావులకోసం ప్రయాసకోర్చి పయనం సాగించినట్టు — ఎక్కడో బంగారు గనులున్నాయని మైళ్ళకొలది దూరం నడచి చివరికి పిడికెడు ఇసుక దొరికితే ఎలావుంటుంది? నా పరిస్థితి కూడా అంతే అయింది. తరువాత వాళ్ళజాడ తెలియలేదు.

ఓ సంవత్సరమైన తరువాత నేను మొదట పని చేసిన హైస్కూలుకే హెడ్మాష్టరుగా తిరిగివచ్చాను.

* * *

అమ్మ దీపంవెలిగించింది.

గదిలో విహారంచేస్తున్న చీకటి చెదిరిపోయింది.

'మేష్టారూ!' అంటూ గదిలో ఎవరో అడుగుపెట్టారు. తలెత్తిచూశాను. కొంతసేపు అలాగే వుండిపోయాను.

'జ్ఞాపకం లేనండీ? భాస్కరాన్ని' అన్నాడు.

'నువ్వా? కూర్చోవోయ్! చాలా మారిపోయావు — బాగున్నావా?' భాస్కరం వచ్చి నాకెదురుగా కూర్చున్నాడు. మానసికంగానూ, శారీరకంగానూ నాలో కలిగిన దౌర్బల్యాన్ని అతను గుర్తించే వుంటాడు.

'మేష్టారూ! మీతో ఒక ముఖ్యవిషయం చెబుదామని వచ్చాను. వచ్చే శనివారం విమలకూ - నాకూ పెళ్ళి - ఇది ఎంతో కాలంక్రితం జరగవలసింది. అందరికీ మల్లే శుభలేఖ పంపటం నా కిష్టంలేదు. మీ ఆదరణకు - ప్రేమకూ జీవితంలో నే నెంతో ఋణపడివున్నాను. అందుకే స్వయంగా పిలవటానికి వచ్చాను. మీరు తప్పకుండావచ్చి మమ్మల్ని ఆశీర్వదించాలి.'

నా కళ్ళు నీటితో నిండిపోయాయి. కళ్ళజోడును తుడుచుకుంటున్న నెపంతో కన్నీళ్ళు తుడుచుకున్నాను.

'భాస్కరం! నిన్ను నేను చాలా బాధించాను. నువ్వు డిస్మిస్ కావటానికి నేనే కారణం. నన్ను క్షమించు' అన్నాను.

'తప్పండి — మీరలాగనకూడదు. నాకంటె మీరు పెద్దవారు, మీమనసు పాతజ్ఞాపకాలతో కలవరపడుతూంది. జీవితానికి కర్థంలేదని గ్రహించిన మీరే ఇలా బాధపడటం న్యాయంకాదు. నేను మిమ్మల్ని తరువాత కలుసుకుంటాను.' అంటూ సెలవుతీసుకున్నాడు.

నా నెత్తిమీదబరువు దిగినట్లయింది. బహుశా భాస్కరం నే ననుకున్నంత 'చెడ్డమనిషి' కాడు. నాకంటె అతని హృదయం విశాలమైంది.

నేను ఎవరి మంచికోసమూ ఇంత శ్రమపడలేదు. నా భార్య చనిపోయిన రెండు సంవత్సరాలకు విమల తండ్రి విమలను నాకిచ్చి పెళ్ళిచేస్తానని వాగ్దానం చేశాడు. అందుకే భాస్కరాన్ని దూరంగా వుంచాను. నేను మంచిచేసినా, చెడ్డచేసినా విమలకోసమే! ఆమెకోసమే జీవించాను—ఉపాధ్యాయుడికి ప్రేమించే హక్కు లేదని కొందరు వాదిస్తారు గాబోలు!

అంతా అయిపోయింది.

పక్వానికి వచ్చిన ఫలం నాకు అందలేదు. కాలవృత్తంలో పోరాటంమాత్రం మిగిలింది. వేదాంతంతో వూరట పొందవచ్చు. కాని అదికూడా క్షణికం-ఇంద్రధనుస్సు మాయమైంది. కారుచీకటి అలుముకుంది— అయినా ప్రయాణం సాగించక తప్పదు. ఇదివరకు గమ్యస్థానం మనసులో వుంచుకుని ఆ దిశగా నడిచాను. ఇప్పుడు చీకట్లో ఎక్కడికి పోతున్నానో—ఏమిటో తెలియదు. కాని పయనించక తప్పదు. జీవితం నేర్పిన పాఠాలు అవగాహన చేసుకోటానికి ఇంకా కొంత కాలంపడుతుంది. అనాడు విమలతో అసలు విషయం చెప్పివుంటే ఈ బాధ వుండేదికాదు. ఆకాశంలో ఎక్కడో మబ్బుల్లో దాగివున్న కాంతిని పట్టుకు తీసుకురావాలి. శరీరంలో జనించే ఉద్రేకాలకు ఆత్మ ఎంత మాత్రం బాధ్యత వహించదు. అది కేవలం అసహాయతతో గూటిలో చిలకలా చూస్తూ కన్నీరు కారుస్తుంది. అంతే—చాలాదూరం వెళ్ళాక కాని తప్పుత్రోవలో పడామన్న సంగతి తెలియదు.

నా జీవితాన్ని చీకటి గుహలో బంధించిం దెవరు? భాస్కరమా? విమలా? కేశవరావా? లేక నా చర్యల్ని సమర్థించుకునేందుకు నేను సృష్టించుకున్న సిద్ధాంతాలా? పగైన వయసు రాకుండానే తల నెరిసింది. చీకటి కళ్ళను ఆవరించింది. నామీద ఎవరికీ సానుభూతికూడా వుండదు. బ్రౌనింగ్ అడిగితే ఇవన్నీ 'సుఖమైన కాలం' అంటాడేమో! కిటికీలోనుంచి బయటికి చూశాను.

దూరంగా ఆకాశజ్యోత్స్నలా దీపాలు మిణుకు మిణుకుమంటున్నాయి. దేవుడి విగ్రహంముందు నిలబడి అమ్మ ఏవో స్తోత్రాలు చదువుతూంది.

కనుకొలకుల్లో రెండు నీటిబిందువులు నిలిచాయి.

వసతి గృహం

శ్రీ బలిజేపల్లి రాఘవరావు

పాత్రలు: కాంతారావు, కృష్ణారావు, ఉష, రాము, భాస్కర్, ప్రభాకర్, సీతారామయ్య

* * కాంతారావుగారి యిల్లు, నాగరికుల యింట్లో వుండవలసిన సామగ్రి అంతా వుంటుంది. కుడి ఎడమ వైపులకు ఇంట్లోకి, వీధిలోకి ద్వారా లుంటాయి. ఎదురుగా ఒక ద్వారం, దాని పక్కనే రేడియోసెట్టు, రేడియోపైన వీణ వాయిస్తున్న సరస్వతి విగ్రహం అమర్చబడి వుంటుంది. గోడమీద రాధాకృష్ణుల ఫోటో, దానికి చెరోవైపునా రెండు ప్రకృతి దృశ్యాలూ కనిపిస్తాయి. మూడు పేము కుర్చీలూ, మధ్యని టీపాయ్, దాని మీద ఎంబ్రాయిడరీ చేసిన టేబిల్‌క్లాత్ వుంటాయి. తెర లేచేసరికి కాంతారావు హడావుడిగా తిరుగుతూ కనిపిస్తాడు. వయస్సు 50 సం॥లు.

కాంతా: రామూ! ఒరే రామూ!

[లోనుండి "బాబూ"అని కేక. రాము ప్రవేశం. 16 సం॥ల వయస్సు. కేక వేసిన ఒక నిమిషానికి వస్తాడు.]

రాము: పిల్చేరా బాబూ!

కాంతా: చిత్రం! ఇంత వేగం వచ్చేరేమండీ!

రాము: అదేమిటి బాబయ్యా! పిలవగానే వచ్చేనుకదండీ!

కాంతా: (కోపం అణుచుకుంటూ) పిలవగానే వచ్చేడుట! వెధవ! ఇంకా జవాబు చెపుతున్నావ్... నీకు బుద్ధి లేదురా!

రాము: చిత్తం!

కాంతా: (కోపంగా) ఏమిటి చిత్తం, బత్తెం!... నువ్విప్పుడెన్ని తప్పులు చేసేవో తెలుసా?

రాము: తెలీదండి.

కాంతా: ఔను నీకెలా తెలుస్తుంది?

రాము: చెబితేనండి.

కాంతా: ఆహాఁ! అయితే విను. మొదటిది. పిలవగానే రాలేదు. రెండోది,...ఆఁ!, పిలవగానే ఏం చెయ్యాలని చెప్పేను?

రాము: ఏ పని చేస్తున్నా ఆ పని అలాగే వదిలేసి....

కాంతా: నిశ్శబ్దంగా నాదగ్గరికి రావాలి, అని చెప్పేను కదా?

రాము: అవునండి.

కాంతా: మరి నువ్విప్పుడేం చేశావ్?

రాము: ఏం చేసేనండి?

కాంతా: ఏం చేసేవా!...పిలవగానే "బాబూ!" అని కవేసియన్ ఇంజన్ కూతలాంటి కేక ఒకటి వేసేవ్. దానివల్ల యిక్కడ ఎంతమందికి డిస్టర్బెన్స్ అయిందో తెలుసా?

రాము: అవుతుందండి.

కాంతా: అవదు మరీ! అందెందుకు, అసలు నిన్నెందుకు పిల్చేనో కూడా నేను మరిచిపోయాను ఆ కేకవల్ల!

రాము: అలాగాండి!

కాంతా: ఆఁ! అందుచేత ఇకనుండి అలాంటి వెధవకేకలు వేస్తే రూపాయి ఫైన్. ఇక పో!

రాము: (వెళ్తూ మధ్యలో ఆగి) ఇంతకీ నన్నెందుకు పిల్చేరు బాబూ?

కాంతా: అదే మర్చిపోయానని అన్నానా ఇందాకా!

రాము: చిత్రం! (వెళ్తూవుంటాడు)

కాంతా: (ఒక్క క్షణం వూరుకుని) ఒరే రామూ!

రాము: (నిశ్శబ్దంగా దగ్గిరికి వచ్చి నిలబడతాడు)

కాంతా: అబ్బాయి ఒచ్చేడ్రా!

రాము: రాలేదు బాబూ!

కాంతా: రాలేదు. నాకు తెలుసు వాడు రాడని. లక్ష సార్లు చెప్పేను వాడికి ఆ క్లబ్బులో పేకాడ వద్దని. వింటేనా! పోనీ అమ్మాయేనా వుందా?

రాము: వున్నారండీ!

కాంతా: నేను రమ్మన్నానని పిలు!

["అలాగేనండి" అని రాము లోనికి వెళ్తూండగా వీధిలోనుంచి కృష్ణారావు ప్రవేశం. వయస్సు సుమారు 22 సం||లు. చురుకుగా కనిపిస్తాడు.]

కాంతా: (ఇంట్లోకి వెళ్తూన్న కొడుకుని చూసి) ఒరే కృష్ణా!

కృష్ణా: (ఆగి) ఏం?

కాంతా: ఒక్కసారి యిలా రా!

కృష్ణా: (వచ్చి) ఎందుకు?

కాంతా: షికారు పూర్తయిందా? ఏమిటా వేషం నువ్వూను!

కృష్ణా: ఏం? ఇప్పుడేం తక్కువైంది నాకు?

కాంతా: ఇంటికివచ్చే అతిథులముందు అలావుండడానికి సిగ్గువెయ్యడంలేదు నీకు?

కృష్ణా: నాకెందుకు సిగ్గు? అయినా ఆ వచ్చేవాళ్ళు చెల్లాయిని చూడ్డానికి వస్తారుగాని నన్ను చూడ్డానికి కాదుగా!

కాంతా: అయితే దాని పెళ్ళి బాధ్యత నీకేం లేదన్న మాట

కృష్ణా: అన్ని బాధ్యతలూ సక్రమంగా నిర్వర్తించేందుకు మీరున్నారుగా! మరి నేనెందుకు?

కాంతా: పనికిఅన్నవైనందుకు నీబుద్ధిపోనిచ్చుకున్నావుగావురా! చదువా సంధ్యా! ఇరవై నాలుగ్గంటలూ ఆక్లబ్బులో పేకాడకపోతే అలా ఒకసారి పొలంవేపు వెళ్ళిరారాదూ?

కృష్ణా: ఐందా? ఇంకేమన్నా వుందా? ఇందుకేనా నన్ను పిల్చింది?

కాంతా: (కోపం అణుచుకుంటూ) ఒరేయ్ నాయనా ఈ రెండురోజులైనా ఇంటిపట్టున వుండరా నామాటవిని!

కృష్ణా: అలాగేలెండి. (లోపలికి వెళ్తాడు)

కాంతా: (కూర్చుంటూ) ఛ! ఛ! పూర్తిగా భయం భక్తిలేకుండా పోయాయిగదా! అందుకే పిల్లల్ని అతిగారాబం చెయ్యొద్దన్నారు పెద్దలు.

[లోనుండి ఉష ప్రవేశం. గుండ్రటి ముఖం. చురుకుగానూ ముద్దుగానూ కన్పిస్తుంది. వయస్సు 16 సం|| లైనా 18 సం|| రాలు గలదిగా కనిపిస్తుంది. అందమైన విగ్రహం]

ఉష: ఏం నాన్నా పిల్చేరట?

కాంతా: ఆ! చూడమ్మా! నువ్వు బట్టలూ అవీ త్వరగా మార్చుకుని సిద్ధంగా వుండాలి.

ఉష: రేపటి సంగతేగదా నాన్నా!

కాంతా: అన్నా! రేపటి సంగతైతేనేం? వాళ్ళివాళే రావొచ్చు.

ఉష: ఎవరు?

కాంతా: పెళ్ళికొడుకు, అతని స్నేహితుడు, వాళ్ళ నాన్నగారు. ఆయనా నేను చిన్నప్పుడు ఒకేస్కూల్లో చదువుకున్నాంలే! కుఱ్ఱవాడు సౌమ్యుడు, అభ్యుదయభావాలున్నవాడు,

[ఈ సంభాషణ అవుతూవుండగా కృష్ణారావు వీధిలోకి వెళ్తూవుంటాడు.']

కాంతా: (ఆగి) వీధిలోకి మళ్ళీ?

కృష్ణా: ఇంటిదగ్గరుండి ఏం చెయ్యమన్నారు?

ఉష: అవున్నాన్నా! అలావెళ్ళి వస్తాడు!

కాంతా: సరే! నువ్వూ తోడయావు!...ఒరే! వాళ్ళకి ఎదురు వెళ్ళరాదురా?

కృష్ణా: అలాగేలెండి! (వెళ్తాడు).

కాంతా: ఛ ఛ! మరీ పొగరుబోతుగా తయారౌతున్నాడు!

ఉష: ఎవరు నాన్నా?

కాంతా: ఇంకెవరు?వాడే! పొద్దున్న లేచిన దగ్గర్నుంచీ రోజల్లా ఆ క్లబ్ లో పేకాడడమే పని!

ఉష: మరి ఇంటిదగ్గర ఊసుపోవద్దూ నాన్నా!

కాంతా: ఇంట్లో ఊసుపోకపోతే పేకాట ఆడమని వుందా యేమి?...సరే! నువ్వెళ్ళమ్మా! వెళ్లు!

ఉష: అలాగేలెండి (వెళ్తుంది.)

కాంతా: రామూ! ఒరే రామూ! (రాము తొందరగా వస్తాడు.) ఒరే మాడు! ఎవరైనా వస్తే నేనా మండువాగదిలో వుంటాను చెప్పు. తెలిసిందా?

రాము: తెలిసిందండి!

కాంతా: నువ్విక్కడే వుండు! (వెళ్తాడు.)

[కొద్దిక్షణాలు నిశ్శబ్దం. వీధిలోంచి కృష్ణారావు, భాస్కర్, ప్రభాకర్ వస్తారు. వాళ్ల చేతుల్లో లెదర్ బేగ్స్ వుంటాయి. ఇద్దరూ ఒకే యీడువాళ్లు.]

ప్రభా: (చుట్టూ కలయజూసి) ఇదేనా?

కృష్ణా: ఆc! యిదే!...ఒరే రామూ! ఆ దక్షిణపు వేపుగది శుభ్రంచేసి వీ రిద్దరికీ మంచాలూ అవీ వేసి సిద్ధం చెయ్యి! వీళ్లిద్దరూ ఇవాళ యిక్కడే భోజనమని లోపల చెప్పు.

రాము: అలాగేనండి(ఎదురుగావున్న ద్వారంలోనుంచి వెళ్తాడు.)

భాస్క: ఏమండీ! ఒక చిన్న సందేహం!

కృష్ణా: ఏమిటండీ?

భాస్క: ఇది హోటల్ లా లేదే!

కృష్ణా: అదే నండీ యీ వసతిగృహం యొక్క ప్రత్యేకత! చాలా హోమ్లీగా వుంటుంది.

ప్రభా: ఇంతకంటె మంచివి లేవా అండీ యీ వూళ్లో?

కృష్ణా: అబ్బే! ఎలా వుంటాయండీ? ఇది పల్లే పట్నం కాదు.! ఉన్నవాటిలో యిదే మంచిది!

భాస్క: వెయిటర్స్ ఎవరూ కనపడరేం?

కృష్ణా: ప్రత్యేకంగా లేరు గాని, ఇందాక వెళ్లేడే వాడే అన్నీను.

ప్రభా: పోనీ యజమాని అంటూ వొకడున్నాడా అదీ లేదా?

కృష్ణా: ఉన్నాడు లెండి ఒకపక్షి!

ప్రభా: అయితే ఫరవాలేదు లెండి!

భాస్క: ఇవాళ ఇక్కడ దిగవలసింది మే మేలా వుంది...వూళ్లోనా కెవరైనా.

కృష్ణా: ఈ వూళ్లో కొత్త పెద్దమనుషులన్న వాళ్లంతా యిక్కడికి వస్తారులెండి.

భాస్క: అలాగా!

కృష్ణా: మీ..రీవూరు పెళ్లిచూపులకి వచ్చేమన్నారు కదూ!

భాస్క: అవును.

కృష్ణా: ఎవరి పిల్లని?

ప్రభా: ఈ వూళ్ళో కాంతారావుగారని వున్నారట! వారమ్మాయిని. వీడేలెండి, వరుడు.

కృష్ణా: మరి మీవెంట పెద్దవాళ్లెవరూ రాలేదేం?

ప్రభా: వాళ్ల నాన్నగారు పట్నంనుంచి మమ్మల్నిక్కడికి రమ్మని వ్రాసేరు. ఆయనకూడా వస్తారు. మేం నేరుగా పట్నంనుంచి వచ్చే మిక్కడికి.

కృష్ణా: మరి మీకు తెలుసా ఆ కాంతారావుగారు?

భాస్క: తెలీదు. కానివారికి మాత్రం మమ్మల్ని తెలిసేవుంటుంది.

కృష్ణా: ఎలా?

భాస్క: వారూ, మా నాన్నగారూ చిన్నప్పుడు ఒకేస్కూల్లో చదువుకున్నారు. బాల్యస్నేహితులు. ఎప్పుడో పదేళ్లక్రిందట ఆయన మా యింటి కొచ్చినప్పుడు చూసేను. ఆయన నన్నెరుగుదురనుకుంటాను.

కృష్ణా: మీ రాయన్ని గుర్తుపట్టగలరా?

భాస్క: చాలా కష్టం! నేను పోల్చలేనండి.

ప్రభా: అది సరేగాని, ఏమండీ! నాకు తెలీక అడుగుతాను, ఈ కాంతారావుగారి స్థితి యేలాటిదండీ?

కృష్ణా: అంటే?

ప్రభా: మనిషి మంచివాడేనా అని?

కృష్ణా: మంచివాడే.

భాస్క: ఆయనెప్పుడైనా యిక్కడకు వస్తారండీ?

కృష్ణా: ఆc! అప్పుడప్పుడు...వారమ్మాయి మాత్రం రోజూ వస్తుందిక్కడికి.

భాస్క: ఎందుకు?

కృష్ణా: ఈ హోటల్ యజమాని కూతురూ ఆమె స్నేహితులు. క్లాస్ మేట్స్. అంచేత రోజూ వస్తుంది. ఇవాళకూడా వచ్చేవుంటుంది.

ప్రభా: ఇవన్నీ మీకెలా తెలుసండీ?

కృష్ణా: సరే! నాకు గాకపోతే మీకు తెలుస్తాయా? నాకీ హోటల్లో భాగంవుందికూడా తెలుసా?

భాస్క: అలాగా! మరి చెప్పారు కారేం?

కృష్ణా: మీరు చూడాలనుకుంటే ఆ అమ్మాయిని పిలిపిస్తాను. ఇక్కడే చూడొచ్చు.

ప్రభా : ఈ హోటల్‌లో అలాంటి సమావేశాలు కూడా అవుతాయేమిటండీ ?

కృష్ణ : అచ్చే ! ఆ అమ్మాయి ఒక వరసని నాకు చెల్లె లవుతుందిలెండి !

ప్రభా : ఓహో ! అలాగా !

భాస్కర్ : ఎవరండీ ఆ వొస్తున్నాయన ?

కృష్ణ : (చూసి) ఆయన... ఆయనే ఈ హోటల్ యజమాని, చాలా మంచివాడు ! (కాంతారావు లోనుండి వస్తాడు. అంతా లేచి నుంచుంటారు.)

భాస్కర్, ప్రభా : నమస్కారమండి !

కాంతా : నమస్తే !

భాస్కర్ : మేం ఈ రాత్రికి యిక్కడే వుంటామండి ! ప్రొద్దున్నే...

కాంతా: కృష్ణా ! వీరెవరు ?

ప్రభా : మేమూ......—

కృష్ణ : (మధ్యలో ఆపి) అదంతా నే చెప్తానెండి ! మీరెందుకు శ్రమ ! వీరిద్దరూ ఈ రాత్రికి యిక్కడే వుంటారు.

కాంతా: అసలు వీరెవరో ?

ప్రభా : మేమూ......

[రాము వస్తాడు]

కృష్ణ : సరే మీరెవరో నేను చెప్తానులెండి!... ఏరా ! గది సిద్ధమేనా ?

రాము : అయిందండి.

కృష్ణ : రండి. ముందు మీకు గది చూపిస్తాను. నే నాయనతో అన్నీ చెప్తాలెండి.

[ముగ్గురూ కలిసి ఎదురుగా వున్న ద్వారంగుండా వెళ్తారు.]

కాంతా: ఒరే రామూ ! వీళ్ళెవర్రా ?

రాము : ఏమోనండి ! చిన్నయ్యగారే తీసుకొచ్చారు. దక్షిణపు వేపు గది సిద్ధం చెయ్యమన్నారు అరిద్దరికీ. ఇయ్యాళ ఆరిద్దరూ భోజనం అన్నీ యిక్కడే !

కాంతా: ఎవరు చెప్మా ! ఎక్కడో చూసినట్టు జ్ఞాపకం ! ఎక్కడ చూసేనో !

రాము : అయ్యా ! కొంపదీసి మనం అనుకుంటున్న వారే నేమో యీరు.

కాంతా: ఎవరు ?... పెళ్లివారా ?...ఛ ఛ ! వాళ్లు కారు.

రాము : లేకపోతే చిన్నయ్యగారి స్నేయితుల్లేమో ?

కాంతా: ఏమో ? కావచ్చు.

రాము : పోయి అడిగేదాండి ?

కాంతా: వొద్దు వొద్దు ! నువ్వేం అడగొద్దు ! అబ్బాయొస్తాడు, వాణ్ణే అడగొచ్చు !

రాము : అది సరేగాని బాబూ ! ఆ పెళ్లికొడుకుగారు ఆ దొరబాబు నాగుంటారండీ ?

కాంతా: ఏ దొరబాబురా ?

రాము : అదే నేనండీ ? ఆ టోపీ యేసుకున్నాయన !

కాంతా: ఓహో ! అతనా !...అవునా ! ఇంచు మించు అలాగే వుంటాడు. ఏమో సరిగ్గా జ్ఞాపకం లేదు. ఆ అబ్బాయిని ఎక్కడో చూసి నట్టుంది.

[కృష్ణారావు ప్రవేశం]

కృష్ణ : ఒరే ! రామూ ! వాళ్ళకేదైనా అవసరం వుంటుందేమో ! నువ్వెళ్ళి అక్కడే వుండి ఏది కావలిస్తే అది యివ్వు ! పో !

[రాము వెళ్తాడు.]

కాంతా: కృష్ణా ? వాళ్ళెవరు ?

కృష్ణ : ఏమో నాకూ తెలీదు. కొత్తగా వచ్చేం, ఇక్కడేదైనా వసతి సదుపాయం దొరుకుతుందా అని అడిగేరు. పోనీలే అని తీసుకొచ్చేను. ఈ రాత్రి వుంటారు, పొద్దున్నే పోతారు.

కాంతా: వాళ్లెవరో, ఏం పనిమీద వచ్చేరో తెలుసుకున్నావా ?

కృష్ణ : పోనిద్దురూ, అవన్నీ మనకు ఎందుకు ? అయినా మనకవి అనవసరమేమో !

కాంతా: అంతేలే అంతే ! కాని తెలుసుకుంటే మంచిదికదా అని అన్నాను...ఆఁ ! నేనలా బస్ స్టేండుకి వెళ్తాను.

కృష్ణ : ఎందుకు ?

కాంతా: ఆ వొచ్చేవాళ్ళకు మన యిల్లేం తెలుస్తుంది చెప్పు ? వాళ్లకి ఎదురు వెళ్ళినట్టూ వుంటుంది, షికారూ అవుతుంది. వెళ్తాను.

కృష్ణ: సరే ! మీయిష్టం !

కాంతా: ఆఁ! ఇంటిదగ్గర జాగ్రత్త. వస్తాను.

[కాంతారావు వీధిలోకి వెళ్తాడు. కృష్ణారావు తివలోనవ్వుకుంటూ వుంటాడు. లోనుండి ఉష వస్తుంది].

ఉష: ఎవరన్నయ్యా ఆ వచ్చింది?

కృష్ణా: ఎవరో మనకెందుకు?

ఉష: ఎందుకొచ్చేరు?

కృష్ణా: ఏమో! ఈ రాత్రివుంటారు, ప్రొద్దున్నే పోతారు.

ఉష: బాగుంది. ఊరూ పేరూ తెలుసుకోకుండా యింట్లో ప్రవేశపెడతావా?

కృష్ణా: వాళ్ళేం దొంగలనుకున్నావా దోచుకోడానికి?

ఉష: ఏమో, ఎందుకు కాకూడదు?

కృష్ణా: బాగుంది. అలాగని ఇంకెక్కడా అనకు. నాన్నగారికి కోపం రాగలదు.

ఉష: నాన్నగారికి తెలుసా?

కృష్ణా: తెలుసు...ఆయనే అన్ని సదుపాయాలూ చెయ్యమన్నారు.

ఉష: అలాగా!

కృష్ణా: ఆఁ! చూడుచెల్లీ! వాళ్ళతో కాస్త మర్యాదగా మాట్లాడూ!

ఉష: అలాగేలే!

కృష్ణా: (ఒక్క క్షణం వూరుకొని) నేనలా వెళ్ళియిప్పుడే వస్తానూ...వాళ్ళకేమైనా కావలిస్తే చూడూ!

ఉష: సరే! నువ్వు మళ్ళీ వేగంరావాలి సుమా!

కృష్ణా: ఇక్కడున్నట్టురానూ!

[వీధిలోకి వెళ్తాడు. కొద్దిక్షణాలు నిశ్శబ్దం. ఎదురుగావున్న ద్వారంలోనుంచి ప్రభాకర్ ప్రవేశం. అతిన్ని చూసి ఉష లేచి నిలబడుతుంది. ప్రభాకర్ కొద్దిగా తటపటాయించి ఏదో వూహిస్తాడు].

ప్రభా: నమస్తే!

ఉష: నమస్తే!...కూర్చోండి. [ఇద్దరూ కూచుంటారు]

ప్రభా: మీరూ...

ఉష: నేనీగృహయజమాని కుమార్తెను.

ప్రభా: ఓఁ! అలాగా!

ఉష: మీకిక్కడ అన్ని సదుపాయాలూ సరిగా అమిరాయా?

ప్రభా: ఓఁ! అద్భుతంగా వుందండి. ఇక్కడివసతి. మాకెంతో హాయిగావుంది.

ఉష: ఆఁ! ఏదోలెండి. మావూరు పూర్తిగా పట్నం కాదు, పూర్తిగా పల్లెగాదు; రెంటికీ చెడ్డ రేవడి!

ప్రభా: ఐతేనేమండి. ఇటువంటి వసతి సదుపాయాలు ఏపట్నంలోనూ వుండవ్. పైగా బోలెడుడబ్బు తీసుకుంటారు. ఒకటే సరిగ్గావుండదు...అది సరే గాని మీరేమీ అనుకోకపోతే ఒక చిన్నవిషయం అడుగుతాను.

ఉష : అడగండి.

ప్రభా : మీరీ వూళ్ళో కాంతారావుగారని......

ఉష : అవును. ఆయన మా నాన్నగారే!

ప్రభా : ఏమిటీ! అంటే మీరూ!...మీ పేరు?

ఉష : నా పేరు ఉష. ఇంతకీ మీరెవరు?

ప్రభా : నా పేరు ప్రభాకర్. ఆ రెండో ఆయన పేరు భాస్కర్. నా స్నేహితుడు. మేమిద్దరం పట్నంలో బి. ఏ. ఫైనల్ యియర్ చదువుతున్నాం.

ఉష : మరి ఈ వూరెందుకొచ్చారు?

ప్రభా : పెళ్ళి చూపులకి.

ఉష : ఎవరికి?

ప్రభా : మావాడున్నాడే...మా భాస్కర్‌కి. వాళ్ళ నాన్నగారు ఇక్కడొక సంబంధం వుందని, చూడమని వ్రాసేరు. వాడికి తగని బిడియం! అందుకని నేను వెంటవచ్చాను.

ఉష : ఇంతకీ మీరెవరి పిల్లని చూడాలి?

ప్రభా : (తాపీగా) మిమ్మల్నే!

ఉష : (ఆశ్చర్యంగా) ఏమిటీ!

ప్రభా : ఈ వూళ్ళో కాంతారావుగారి అమ్మాయిని మేం చూడాలి. మీరే అన్నారుగా వారు మీ నాన్నగారేనని. అంచేత మీరే నన్నమాట మేం చూడాల్సిన మనువు.

ఉష : మరి మా నాన్నగారు మీకోసం వెళ్ళేరే! మీకు తెలీదా ఆయన్ని?

ప్రభా : తెలీదు. ఈ హోటల్‌కి మీరొస్తారని ఆ పెద్ద మనిషి చెప్పాడు.

ఉష : ఇది హోటలని ఎవరు చెప్పేరు?

ప్రభా : కాదా?

ఉష : కాదు.

ప్రభా : మరి? ఆ పెద్దమనిషి యిది హోటలని చెప్పేడే!

ఉష : మీరు పొరబడి వుంటారు. మీరనుకుంటున్న కాంతారావుగారి యిల్లు ఇదే.

ప్రభా : (ఆశ్చర్యంగా) ఆఁ! ఇది కాంతారావుగారి ఇల్లా!

ఉష : ఔను. ఆ ముసలాయనే కాంతారావు గారంటే!

ప్రభా : ఇంకా నయం! ఆయన దగ్గర ఈ మాట అన్నాం కాము. పీపు రాండ్రోలు వాయించును.

ఉష : ఇంతకీ ఇది హోటలని చెప్పిన ఆ పెద్ద మనిషి యెవరు?

ప్రభా : మమ్మల్నిక్కడికి తీసుకొచ్చాడే, ఆ రౌద్ర బుష్‌కోటు వేసుకున్నాయనే!

ఉష : (తేలిగ్గా) ఓఁ! అతనా! అతను మా అన్నయ్యే లెండి!

ప్రభా : ఏమిటీ! ఆ మహానుభావుడు మీ సహోదరుడా గొప్ప కిలాడీ లాగున్నాడే!

ఉష : వాడికి కొత్తవాళ్లని ఏడ్పించడమంటే కొంచెం సరదాలెండి!

ప్రభా : ఏం సరదావో బాబూ!...దయచేసి మీ నౌఖర్ని పంపుతారా తోమాటు!

ఉష : ఎందుకు!

ప్రభా : ఏదైనా హోటల్ చూపిస్తే అక్కడికి పోతాం!

ఉష : మరేం ఫర్వాలేదు. ఇక్కడే వుండండి. అసలు మీకోసమే ఎదురుచూస్తున్నాం మేమంతాను.

ప్రభా : అలాగా! థేంక్స్!

ఉష : అసలు మీరెలా కనిపించారు మా అన్నయ్యకి?

ప్రభా : బస్సు దిగగానే ఆ మహానుభావుడే ఎదురు పడ్డాడు. కొత్తవాళ్ళులాగా వున్నాడుకదా అని 'ఏదైనా వసతి గృహంవుందా యీవూళ్లో?', అని అడిగాం "ఎవ్వరు? ఏంపని మీదవచ్చేరు?", అని అడిగేడు. ఇలా పెళ్ళి చూపులకి ఒచ్చేమని చెప్పాం. మేము చెప్పినవన్నీ విని అదోలా మొహం పెట్టి నాతోరండని చెప్పి యిక్కడికి తీసుకొచ్చాడు.

ఉష : అలాగా!

ప్రభా : అసలు ఈ యింటిని చూడగానే యిది హోటల్ కాదనిపించింది మాకు. కాని ఆయన మమ్మల్ని దబాయించేసు. మరింకేంచేస్తాం? అసలే కొత్తవూరు. అంచేత ఆయన చెప్పిన మాటలు నమ్మవలసి వచ్చింది!

ఉష : పాపం!

ప్రభా : చూడండి!...మీతో ఇంత యిదిగా మాట్లాడుతున్నందుకు.......

ఉష : మరేం ఫర్వాలేదు. చెప్పండి! అసలు నాకు కలుపుగోలుతనంగా వుండేవాళ్ళంటే సరదా!

ప్రభా : అలాగా! అయితే ఫర్వాలేదు. కాని మా వాడువున్నాడు చూసేరూ!

ఉష : ఎవరూ?

ప్రభా : అదే మా భాస్కర్. అంటే పెళ్ళికొడుకు... వాడు చాలా ముభావంగా వుంటాడండి. అసలు వాడి ప్రకృతే వేరండి!

ఉష : ఉహూఁ! (పైమాటలుఅవుతూండగా భాస్కర్ వస్తాడు.)

భాస్క : ఒరే ప్రభర్! (అని ఉషనిచూసి మధ్యలో ఆగిపోతాడు.)

ప్రభా : ఫర్వాలేదు చెప్పు!

భాస్క : అబ్బే ఏం లేదు.

ప్రభా : చూడండి, ఇతను నా స్నేహితుడు భాస్కర్. IV. బి. ఏ. — వీరు కుమారి ఉషారాణి. [భాస్కర్, ఉష నమస్తేఅంటే నమస్తే అనుకుంటారు.]

ఉష : (భాస్కర్‌ని ఉద్దేశించి) ఇంకా నిలబడే వున్నారు. కూచోండి!

భాస్క : ఫర్వాలేదులెండి. (కూర్చుంటాడు)

ప్రభా : ఈమె యీ గృహ యజమానిగారి కుమార్తె!

భాస్క : అల్లాగా!

ప్రభా : మా వాడు కథలూ గేయాలూ వ్రాస్తూంటాడు లెండి. పత్రికల్లో మాత్రం పడవు.

ఉష : మంచిదే!

ప్రభా : మా భాస్కర్ బుర్ర మంచి పదునైంది లెండి! క్లాసులో ఫస్టుమార్కులన్నీ వాడివే! ప్రత్యేకం తెలుగులో.

భాస్క : వాడి మాటలకేం లెండి.

ప్రభా : (జేబులు తడుముకుంటూ) అరె సిగరెట్లు మర్చిపోయా రూమ్‌లో. ఇప్పుడే వస్తా!

[ప్రభాకర్ వెళ్తాడు. కొద్ది క్షణాలు నిశ్శబ్దం ఇద్దరూ ఎవరిలోకంలో వాళ్లుంటారు. భాస్కర్ తలవంచుకుని వుంటాడు. సూటిగా ఆమెవైపన్నా చూడడు. ఏదో బెరుగ్గావుంటాడు. ముందుగా ఉష పెదవులు కదుపుతుంది.]

ఉష: మీకిక్కడ అన్నీ సదుపాయాలూ సరిగా వున్నాయా?

భాస్క : ఓఁ!

ఉష : మీరు బి. ఎ. ఫైనల్ ఇయరా?

భాస్క : అవును...మీరేమన్నా చదువుతున్నారా?

ఉష : ఫిఫ్త్‌ఫారం పాసయేను.

భాస్క : అలాగా! (రేడియో చూసి) మీకు సంగీతం వొచ్చా?

ఉష : కొద్దిగావచ్చు!...ఫిడేలు వాయిస్తాను.

భాస్క : అలాగా!...మీరు తరుచు సినీమాలు చూస్తారనుకుంటాను.

ఉష : లేదండి. మా వూరు మంచి సినిమాలు రానే రావు...మీరూ...పాడగలరా!

భాస్క : పాట!...అబ్బే! నాకు రాదండి!

ఉష : తెలుగు సినీమానటుల్లో మీ అభిమాన నటీనటులెవరో తెలుసుకోవచ్చా?

భాస్క : దానికేం? స్త్రీలలో భానుమతి, పురుషులలో నాగేశ్వరరావు.

[కొద్ది క్షణాలు నిశ్శబ్దం. భాస్కర్‌కు గందరగోళంగా వుంటుంది. ఆవిడముఖం చూడకుండా తప్పుకొనడానికి ప్రకృతి దృశ్యాలు చూస్తూ వుంటాడు.]

ఉష : ఆ దృశ్యం చూసేరా! (ఒక దృశ్యం చూపుతుంది.)

భాస్క : (చూసి) చాలాబాగుంది! పల్లెసీమల్నీ, వారి ఆచారాలనూ, పల్లెవాతావరణం చూపే దృశ్యాలంటే నాకెంతో యిష్టం!

ఉష : అది నేను వేసిందే!

భాస్క : అహాఁ! అలాగా! అంటే మీకు చిత్రకళలో కూడా ప్రవేశముందన్నమాట!

ఉష : ఏదో కొద్దిగా!

[మళ్ళీ నిశ్శబ్దం! భాస్కర్‌కి మరింత గందరగోళంగా వుంటుంది. ఆమెనెలాగైనా వొదిలించుకోవాలని అనుకుంటాడు.]

భాస్క : అఁ! కొంచెం మంచినీళ్లు తెప్పిస్తారా! శ్రమ అనుకోకపోతే.

ఉష : దానికేం! నేనే తెస్తాన్లెండి! [ఉష వెళ్తుంది.]

[భాస్కర్‌కి కొండంతబరువు దింపినట్టవుతుంది. ప్రభాకర్ వస్తాడు.]

భాస్క : ఒచ్చేవా! రక్షించేవ్!

ప్రభా : ఏం ఇప్పుడేమైంది నీకు?

భాస్క : ఏమైందా? ఆ అమ్మాయిదగ్గర నన్నొక్కడ్నీ వదిలి నువ్వు పోయావుగదా! అదేంబాగుందిరా నీకు?

ప్రభా : ఏడ్చినట్టుంది. ఆ అమ్మాయి అంత 'ఫ్రీ' గా వుంటే నువ్విలా నంగిరిగా నీరు కారిపోతావేం! నీ నంగిరి చూసి ఆమె యేమనుకుంటుందో ఆలోచించావా?

భాస్క : ఏమనుకుంటే నాకేం! నేనుమాత్రం ఆమె ముఖమన్నా తిన్నగా చూడలేదు.

ప్రభా : ఉద్ధరించేవ్! చూస్తేయేం?...ఇంత పిరికివాడివేంరా నువ్వు? రేపు పెళ్ళయిన తరవాతకూడా యిలాగే సిగ్గుపడతావేమిటి?

భాస్క : ఒరే ఎప్పుడైనా నీకీ అలాంటి పరిస్థితి తటస్థపడితే తెలుస్తుందిరా! ఆడవాళ్ళతో మాట్లాడాలంటే ఎంత చికాగ్గా వుంటుందో తెలుసా? అందులోనూ ఒంటరిగా చదువుకున్న స్త్రీతో...

ప్రభా : అఁ! అఁ! బాగుంది! రేపు ఆ అమ్మాయే నువ్వు చూడవలసిన పిల్ల అనుకో. అప్పుడూ యిలాగే సిగుపడి చూడ్డం మానేస్తావా?

భాస్క : అది రేపటి విషయంకదా! ఆ తరవాత ఆలోచించవచ్చులే!

ప్రభా : ఒరే! నామాట విని ఈసారైనా ఆ అమ్మాయితో సరిగా మాట్లాడరా బాబూ!

భాస్క : అదిమాత్రం నాకు చేతగాదు సుమీ!

ప్రభా : నీకు కాబోయేభార్య ఎలాంటిదో తెలుసుకోవాలని లేదా నీకు?

భాస్క : అబ్బబ్బ! అవన్నీ నువ్వే తెల్సుకుందూ ఆ తర్వాత! నన్ను చంపకు!

ప్రభా : ఇది మరీబాగుంది......(చూసి) ఒరే! ఆ అమ్మాయి మళ్ళొవస్తోంది. ఈ సారైనా సరిగా మాట్లాడరా!

భాస్క : (గాభరాగా) వస్తోందీ! ... చచ్చాన్రా బాబూ!...ఒరే నీకు పుణ్యముంటుంది! నన్ను పోనీరా! [ఎదురుగా వున్న ద్వారం వేపు పోతూవుంటాడు].

ప్రభా : ఒరే! ఆగరా! ఆగు!

భాస్క : నువ్వు వెయ్యిచెప్పు లక్ష చెప్పు! నేనవన్నీ అడగలేను. నువ్వే అడుగు! [భాస్కర్ వెళ్తాడు]

ప్రభా : హారి నీసిగ్గు బంగారంగానూ! [మంచినీళ్ళ గ్లాసుతో ఉష వస్తుంది].

ఉష : (చూసి) ఏరీ ఈయన?

ప్రభా : ఎవరూ!...భాస్కరా?

ఉష : ఔను.

ప్రభా : ఒంట్లో ఏదో యిదిగా వుందని వెళ్ళిపోయాడు

ఉష : అరె! మంచినీళ్ళు కావాలన్నారే!

ప్రభా : మరేం బాధలేదులెండి. మాగదిలో వున్నాయి. అవసరమైతే తాగుతాడు.

ఉష : ఒంట్లో బాగాలేదా? ప్రయాణపు బడలిక కాబోలు!

ప్రభా : ఆఁ! అంలాంటిదే ఏదో అయివుంటుంది లెండి...(తాపీగా) ఆఁ! చూడండి! మీ యిద్దరి సమావేశం విజయవంతంగా ముగిసిందని అనుకోవచ్చా?

ఉష : అంటే?

ప్రభా : మీరిద్దరూ ఆ సమావేశంలో ఒకరి హృదయాలొకరికి విశదపర్చుకున్నారా?

ఉష : అబ్బే! నాకంటే వారు తెలుసుగాని, వారికి నేనెవరో తెలీదుగా!

ప్రభా : అయితేనేం? మనిషి తత్వం కనిపెట్ట వచ్చుగా!

ఉష : అబ్బే! ఇంకా మేమిద్దరం....—

ప్రభా : నేనంతా వింటూనే వున్నాన్లెండి! చూడండి! ఆమాట్లాడిన కాస్సేపట్లోనూ మీరు వాడి స్వభావం ఎలాంటిదో కనిపెట్టగలిగేరా?

ఉష : లేదు. అసలు నాకా వుద్దేశమే లేదు.

ప్రభా : చూడండి! నేను మీకోసంగతి చెబుతాను. ఏం అనుకోరుగదా!

ఉష : చెప్పండి.

ప్రభా : మా వాడిది అదోరకమైన ప్రకృతి. ఆడ వాళ్ళతో మాట్లాడ్డ మంటేనే చాలాసిగ్గు! అందులోనూ యిక్కడ మరీను. వాడు మీముఖ మైనా సరిగా చూడలేదుకదూ?

ఉష : ఔను. చూచినట్టు లేదు.

ప్రభా : మరి...మీకు వాడి భావాలూ ఆదర్శాలూ తెలుసుకోవాలని ఉందా?

ఉష : ఉంది. కాని వాటికేం తొందర?

ప్రభా : అదికాదు. మీ రిద్దరూ వధూవరులు. మీ భావి జీవితం సౌఖ్యదాయకంగా వుండాలంటే యిద్దరి భావాలూ ఏకీభవించాలి. విరుద్ధ భావాలు గల భార్యాభర్తల సాంసారిక జీవితం ఎలా వుంటుందో మీకు చెప్పనక్కర్లేదు. ఏమంటారు?

ఉష : అవును.

ప్రభా : అదీగాక యిది జీవితాంతం వుండవలసిన అను బంధంగాని, ఒక రోజుతో తెగిపోవలసిన సం బంధం కాదు.

ఉష : నిజమే!

ప్రభా : అలాంటప్పుడు మీరు చేపట్టబోయేవ్యక్తి యొక్క భావాలూ, ఆదర్శాలూ, మనస్తత్వం తెల్సుకోవాలనుకోడం ధర్మం న్యాయం కూడాను. ఏమంటారు.

ఉష : నిజమే! మీరన్నట్టు యిది జీవితాంతం వుండాల్సిన అనుబంధం!

ప్రభా : అంచేత మీరు వాడి స్వరూప స్వభావాలు తెలుసుకోవాలనుకోడం లేదూ?

ఉష : ఉంది. కాని ఎలా?

ప్రభా : నేనొక ఉపాయం చెప్తాను. అలా చేస్తారా?

ఉష : ఓఁ! అలాగే చేస్తాను. చెప్పండి!

ప్రభా : మీరు వాడి మనస్తత్వం తెలుసుకోవాలను కున్నా వాడితో 'ఫ్రీ'గా మాట్లాడాలనుకున్నా ఇలా వస్తే లాభంలేదు. మీరు వేషం కాస్త మార్చాలి.

ఉష : అంటే?

ప్రభా : అంటే మీరు కాసేపు కాంతారావుగారి కూతురినన్నమాట మర్చిపోవాలి.

ఉష : మీరు చెబుతున్నది నాకేం అర్థం కావడంలేదు.

ప్రభా: మరేం లేదు. మీరు కొంచెం సేపు ఉషాదేవిగా కాక ఉషాదేవి పనిమనిషిగా మారిపోవాలి. అలా మారి ఏదో మిషమీద మా వాడి దగ్గరికి రండి అప్పుడు మీరు ఫ్రీగా మాట్లాడొచ్చు. నేను చెప్పింది అర్థమైందను కుంటాను.

ఉష : అయింది. అంటే నేనిప్పుడొక పని మనిషిగా మారాలన్న మాట!

ప్రభా: ఆ కొద్దిసేపే! "జస్ట్ ఫర్ ఫైవ్ మినిట్స్"— అదయినా కేవలం అభినయమే—

ఉష : దానికేం లెండి. అలాగే చేస్తాను.

ప్రభా: అయితే మరి మీరు త్వరగా మీ వేషం మార్చుకురావాలి...ఆ! మీ నౌకరు పేరేమిటి?

ఉష : రాము. ఏం?

ప్రభా: ఆఁ! ఏంలేదు. మీరు వెళ్ళండి.

[ఉష లోపలికి వెళ్తుంది. ప్రభాకర్ పచార్లు చేస్తూ రాముని పిలుస్తాడు. రాము వస్తాడు.]

రాము: పిల్చేరా బాబూ!

ప్రభా: ఆఁ!...ఏం చేస్తున్నారాయన?

రాము: ఎవరూ? ... ఇందాక మీ కూడా వచ్చినాయనా?

ప్రభా: అవును.

రాము: ఏదో చదువుకుంటున్నారండి.

ప్రభా: ఓ సారి నేనిలా రమ్మన్నానని చెప్పు!

రాము: అలాగేనండి. [రాము లోనికి వెళ్తాడు. వీధి లోనుంచి కృష్ణారావు వస్తాడు.]

కృష్ణా : హల్లో! ఏమిటిలా వొంటరిగా కూర్చున్నారు?

ప్రభా : ఏముంది? ఏంలేదు.

కృష్ణా : ఏదో దిర్ఘాలోచనలో వున్నట్టున్నారు?

ప్రభా : ఎవరూ? నేనా? లేదే!

కృష్ణా : మీరు చాలా తేలిగ్గా అబద్ధాలాడతారే!

ప్రభా : అదిమీకు బాగా అలవాటు కాలేదు!

కృష్ణా : అదిసరే! మీ కిక్కడ అన్నీ సరిగా వున్నాయా? ఏమైనా లోటుపాట్లున్నాయా?

ప్రభా : లేదండి! క్షేమ్రంగావుందిక్కడి వసతి!

కృష్ణా : ఏదో చేతనైనంతవరకూ సదుపాయాలుచేస్తాం! అపైన లోటుపాట్లుంటే కాస్త సర్దుకుపోవాలి!

ప్రభా : అమ్మమ్మ! ఎంతమాట! ఈమాత్రం వసతైనా దొరికింది మీధర్మాన!

కృష్ణా : నాకేముంది?...వస్తాను (లేస్తాడు.)

ప్రభా : మళ్ళా యెక్కడికి?

కృష్ణా : అలావెళ్ళి సిగరెట్లు తెచ్చుకుందామని.

ప్రభా : నౌకర్ని పంపకూడదా?

కృష్ణా : ఎందుకండీ యీమాత్రం దానికి? "డిగ్నిటీ ఆఫ్ లేబర్!" దీన్లో తప్పేంవుంది?

ప్రభా : బాగా చెప్పారు. అదేత్రోవనే మాకూ ఒక పేకెట్ 'బెర్ కిలీ' తెచ్చి పెడతారా?

కృష్ణా : అలాగే! అసలు మీకిక్కడ అన్నీ సరిగా వున్నాయో లేవో చూసిపోదామని వచ్చేను. మరోస్తాను!

ప్రభా : మళ్లీ పునర్దర్శనం?

కృష్ణా : మరోక అరగంటలో! గంటలోనో వస్తాను.

[వీధిలోకి వెళ్తాడు.]

ప్రభా : "పూర్ ఫెలో!" ఇంకా మనసంగతి తెలీదు పాపం! హుఁ! [ఎదురుగా వున్న ద్వారం లోనుంచి మెల్లగా భాస్కర్ వస్తాడు.]

భాస్క : (ఉష వుందేమోనని చుట్టూ చూసి) ఏరా బ్రదర్? పిల్చేవట?

ప్రభా : అవును.

భాస్క : ఏమిటంత కొంపమునిగి పోయినంతపని?

ప్రభా : కొంప మునిగిపోయినంత పని అని మెల్లిగా అంటావేమిటిరా! నీనుండి వ్యవహారమంతా చెడిపోయింది!

భాస్క : ఏమిట్రా·అది? నాకేం అర్థకావడం లేదు.

ప్రభా : ఔను. నీకెలా అర్థమౌతుంది? ఆ అమ్మాయి ముందు అలా మన్నుతిన్న పాములా వుండక పోతే కాస్త డాబుగా వుండరాదూ?

భాస్క : ఏం? అయితే యిప్పుడేమైంది?

ప్రభా : ఏం కావాలింకా! ఆమె నిన్నొక చవటకింద కట్టి పారేసింది.

భాస్క : ఆఁ!

ప్రభా : మర్రి యిరవయ్యో శతాబ్దంలో వుండవలసిన వాడివి కావట!

భాస్క : ఆఁ! మరి?

ప్రభా : నిన్ను చూస్తే రాతి యుగపు మనుషులు జ్ఞాపకం వస్తారట?

భాస్క : ఆఁ! అంతమాట అన్నదిరా?

ప్రభా: పైగా స్త్రీలను గురించి అయినవకు సద్భావాలున్నట్లు లేదు అంది.

భాస్క : ఉహూఁ! ఇంకా?

ప్రభా: ఇంకేం వుంది? ఇంకా చాలా చాలా అందిలే!

భాస్క : అవన్నీ వింటూ నోరూమ్కుకోని ఊరుకున్నావ్ నువ్వు?

ప్రభా: మరేం చెయ్యడం? వాదించినా లాభం లేక పోయింది.

భాస్క : అరెరే!

ప్రభా: ఒరే బ్రదర్! నా మాటవిని ఇకముందైనా ఆడ వాళ్లంటే సిగ్గుపడకురా!

భాస్క: అలా గేలే!

ప్రభా: అసలు వాళ్లని చూస్తే నీ కెందుకురా ఆ భయం?

భాస్క: ఎందుకో నువ్వే ఆ పరిస్థితుల్లో వుంటే నీకే తెలిసేది.

ప్రభా: బాగుంది!

భాస్క: అది సరేగాని...ఒరే ప్రభాకర్!...అంత మాట అన్నదిరా ఆ అమ్మాయి?

ప్రభా: అహఁ! లేదు. నేనే కల్పించాను.

భాస్క: అబ్బే నేనలా అన్నామట్రా!...ఆమె కంత ధైర్యం ఎలా వచ్చిందా అని?

ప్రభా: లేకపోతే అంతా నీలాగే వంగిరిగా నీరుకారి పోతారనుకున్నావా?

భాస్క: (ఆలోచిస్తూ) ఒరే బ్రదర్!

ప్రభా: ఏం?

భాస్క: ఆ అమ్మాయికి మన తడాఖా చూపిం చాలిరా!

ప్రభా: తడాఖా చూపించాలా?

భాస్క: అహాఁ! తప్పకుండా.

ప్రభా: ఎలాగంటావ్?

భాస్క: అదే మరి మనావాలోచించాలి.

ప్రభా: (ఆలోచిస్తూ) నే నొకటి చెప్తాను. అలా చెయ్యి!

భాస్క: (ఆత్రంగా) ఏమిటది?

ప్రభా: ఆ అమ్మాయి స్వభావం ఎలాంటిదో కనిపెట్టు ముందు. ఆ తర్వాత చెప్తాను.

భాస్క: ఎలా?

ప్రభా: ఏముంది? నీ నౌకరో, దాసీపిల్లనో అడిగితే తెలిసిపోతుంది.

భాస్క: అయితే వాణ్ణి పిల్చి కనుక్కుందామా? (పిలవబోతాడు).

ప్రభా: (ఆపి) ఆగాగు! ఇలాంటివి దాసీపిల్లలకి, ఆడ వాళ్లకి తెలుస్తాయి బాగా! వినుంటావ్?

భాస్క: అవును. నిజమే! అదెలా కుదురుతుంది మరి?

ప్రభా: ఎలా గేమిటోయ్! మనం తల్చుకుంటే అన్నీ వాటంతటవే అయిపోతాయి...కాని నువ్వు మాత్రం కొంచెం జాగ్రత్తగా వ్యవహరించాలి.

భాస్క: చూస్తావుగా! ఇందాకంటే ఏదో అయి పోయిందిగాని ఇహ చూసుకోవోయ్ మన ప్రతాపం!

ప్రభా: నాకు నమ్మకం లేదు సుమా!

భాస్క: ఒరే బ్రదర్! అన్ని నాటకాల్లో వేషం వేసేను గదా! ఈ మాత్రం నటన చెయ్యలేనురా! నువ్విలా చూస్తూవుండు ఎలా 'టేకిల్' (tackle) చేస్తానో? పోనీ రిహార్సల్ చూపించ మంటావా?

ప్రభా: ఒద్దులే వొద్దు!

భాస్క: ఇహ చూడవోయ్ మన తడాఖా! ఏమను కుంటో ఆ అమ్మాయి మనమంటే! హుఁ!

ప్రభా: రైట్! విష్‌యూ గుడ్‌లక్!

భాస్క: థేంక్ యూ!

[పని మనిషి వేషంలో మంచినీళ్ళ గ్లాసుతో ఉష వస్తుంది.]

ఉష: మంచినీళ్లు కావాలన్నారట బాబూ!

భాస్క: ఆఁ...

ప్రభా: ఇలా తే! (త్రాగి) ఒరే! బ్రదర్! అలా వెళ్లి క్వశ్చను పేపర్లు తెచ్చుకుంటాను. నువ్విక్కడే వుండు [అని భాస్కర్ భుజం తడతాడు.]

భాస్క: అలా గేలే వెళ్లిరా!

[ప్రభాకర్ వీధిలోకి వెళ్తాడు.]

ఉష: [ఖాళీగ్లాసు తీసుకొని వెళ్ళిపోబోతుంది.]

భాస్క: ఆఁ! అమ్మాయ్!

ఉష: (ఆగి) ఏంబాబూ!

భాస్క: నీ పేరేమిటన్నావ్?

ఉష: నా పేరాఅండి...రాధ!

భాస్క: రాధ! చాలా మంచిపేరు!...నువ్విక్కడ పనిమనిషివా?

ఉష: ఔనండి!

భాస్క: జీతం ఎంతిస్తారు నీకు?

ఉష: జీతం యివ్వరు కాని...

భాస్క: కాని?

ఉష: కడుపునిండా తిండిపెట్టి, బట్టలూ అవీ నాకు కావలసినవన్నీ యిస్తారండి.

భాస్క: అహాఁ! నీకు తల్లీ తండ్రీ వున్నారా?

ఉష: తల్లి లేదండి. తండ్రిమాత్రం వున్నాడు.

భాస్క: అతనేం చేస్తూ వుంటాడు?

ఉష: ఏం లేదండి!...ఇక్కడే వుంటాడు.

భాస్క: అంటే అతను కూడా యిక్కడే వుద్యోగం చేస్తున్నాడన్నమాట!

ఉష: ఉద్యోగం కాదుగాని...అలాంటిదేనండి!

భాస్క: నీ మాటలతీరు చూస్తే నువ్వు దాసీపిల్లలా కనిపించవే! నువ్వేమైనా...

ఉష: నాకు కొంచెం చదువొచ్చండి.

భాస్క: అహాఁ! నీకు చదువొచ్చు నన్నమాట! ఏం చదివేవ్?

ఉష : ఫోర్తుఫారం పాసయేవండి!

భాస్క : అబ్బా! అంతవరకూ చదివేవా! మరి యీ దాసీ పనిచేస్తున్నావేం కర్మ?

ఉష : మరేం చెయ్యడం?

భాస్క : ఏదైనా వుద్యోగం చెయ్యాల్సింది.

ఉష : నే నిప్పుడు చేస్తున్నది వుద్యోగమేగా!

భాస్క : బాగుంది! ఈ దాసీ పని ఉద్యోగమా?

ఉష : కాదా! ఉద్యోగమన్నా ఒకరు చెప్పినట్టు చెయ్యాల్సిందేగా! అయినా నే నిప్పుడు దాసీనిగా నే!

భాస్క : మరి నువ్విప్పుడు చేస్తున్న పనేమిటి?

ఉష : మంచినీళ్ళు యిమ్మన్నారు ఇచ్చాను. అంతే!

భాస్క : అది దాసీ పని కాదా?

ఉష : కాదండి! అలాగంటే మా అమ్మాయిగారు రగ్గయిపోతారండి.

భాస్క : అలాగా!

ఉష : ఔనండి! అసలా మాటకొస్తే అమ్మాయిగారికి నేనంటే ప్రాణమేనండి!

భాస్క : అల్లాగా!

ఉష : ఔనండి!

[అనుకోకుండా ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకుంటారు. ఇద్దరూ తడబడతారు. ఆ తత్తర పాటులో ఉష చేతిలోని గ్లాసు క్రిందపడుతుంది.]

భాస్క : అరె! క్రిందపడిందే!

ఉష : ఫరవాలేదు లెండి!

[గ్లాసు తియ్యాలని ఇద్దరూ ఒకే సారి వంగుతారు. మళ్ళీ అనుకోకుండా ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకుంటారు. భాస్కర్ గ్లాసుతీసి ఉషకిస్తాడు. ఒక్క క్షణం నిశ్శబ్దం]

భాస్క : (తేరుకుని మెల్లగా) నువ్వు సినిమాలు చూస్తావా?

ఉష : మా అమ్మాయిగారూ నేనూ వెళ్తామండి!

భాస్క : నువ్వెప్పుడైనా మద్రాసు చూసేవా?

ఉష : మా నాన్నగారితో వెళ్ళేను.

భాస్క : ఎవరు?

ఉష : (సర్దుకొని) అదేనండి! మా అయ్యగారితోనండి

భాస్క : అలాగా! పువ్వులంటే నీకు...

ఉష : చాలా యిష్టం!

భాస్క : (రాధాకృష్ణుల చిత్రం చూపి) ఆచిత్రం చూసేవా?

ఉష : రాధాకృష్ణులు! అదంటే నాకెంతో యిష్టం!

భాస్క : అల్లాగా! కలకాలం ఆ రాధలా కాలంగడపాలని కోరిక గావుందా?

ఉష : అంటే?

భాస్క : (ఏదో ఆవేశం వొచ్చి మాట్లాడలేకపోతాడు) ...రాధా!...

ఉష : (చూసి) ఆఁ! ఏమిటి?...ఎందుకలా చూస్తారు

భాస్క : (తేరుకొని) ఏం లేదు...నువ్విష్టపడితే కలకాలం ఆ చిత్రంలోని దివ్య మూర్తులవలె ధన్య జీవుల మౌదామని వుంది.

ఉష : అంటే మీరూ......

భాస్క : నిన్ను ప్రేమిస్తున్నాను రాధా!

ఉష : ప్రేమించడమే!

భాస్క : అవును రాధా! నిన్ను నేను ప్రేమిస్తున్నాను

ఉష : ఆఁ!...ఇంకేమన్నా వుందా!

భాస్క : ఏం? ప్రేమించకూడదా? ప్రేమకి అంతరాలు అడ్డురావు రాధా! నేను మొట్టమొదటసారిగా నిన్ను చూసేను. ప్రేమించాను. అంతే! పెళ్లి చేసుకుంటాను!

ఉష : పెళ్ళిచేసుకోడమే!

భాస్క : ఔను రాధా! పెళ్ళిచేసుకుంటాను. నీకేమైనా ఆటంకం వుందా?

ఉష : కాని మా నాన్న యిష్టపడొద్దా? పెద్దల యిష్టాయిష్టాలెలావుంటాయో! వాళ్ళ అంగీకారం లేకుండా మనం పెళ్లాడ్డం బాగుంటుందా? వాళ్లేమంటారో?

భాస్క : ఏమంటారు? అయినా యిది మనిద్దరికీ సంబంధించినది. ఇందులో వాళ్ళ యిష్టాయిష్టాలకు తావేది? మనసులు కలిసిన తరువాత ఎన్ని ఆటంకాలొచ్చినా అభిప్రాయాన్ని నెరవేర్చుకోవలసిందే!

ఉష : మరి...మీ నాన్నగారు ఇష్టపడతారా?

భాస్క : తప్పకుండా ఒప్పుకుంటారు. మనసులేని మనువు చేసుకుని జీవితం నరకంగా చేసుకోమని ఆయన చెప్పరు. నా యిష్టమే ఆయనయిష్టం!

ఉష : మరి..............

భాస్క : నువ్వేమీ అనుమానించవద్దు! ఇవన్నీ హృదయపూర్వకంగా చెబుతున్న మాటలుగాని బూటకాలు కావు! నన్ను నమ్ము. ఏమంటావ్ రాధా! ...నీ కిష్టమేనా?

ఉష : [కాసేపు అతని ముఖంలోకి చూసి చరచర లోనికి వెళ్తుంది].

భాస్క: రాధా! రాధా! [ఆమెవెనుక వెళ్తావుంటాడు. ఇంతలో బయటినుండి చప్పట్లుకొడుతూ ప్రభాకర్ వస్తాడు].

ప్రభా: ఎక్సలెంట్! అద్భుతం! ఏమి నటనరా!

భాస్క: నటన! నట నేమిటిరా?

ప్రభా: మరిప్పుడు చేసిందంతా యేమిట్రో! అద్భుతంగా మోస్ట్ నేచురల్ గా వుందిరా నీనటన!

భాస్క: అది నటన కాదురా!

ప్రభా: మరి?

భాస్క: అదంతా నిజమే! నేనా అమ్మాయిని ప్రేమించాను.

ప్రభా: ప్రేమ! ఆఁ! [ఏమీ తెలియనట్టు మొహం పెడతాడు.]

భాస్క: ఔను. ఆ అమ్మాయిని పెళ్ళిచేసు కుంటాను.

ప్రభా: బాగుందిరా అబ్బీ! బాగుంది! ప్రథమ వీక్షణంలోనే ప్రేమాంకురాలు మొలిచిన మీ ప్రేమ కలకాలం వర్ధిల్లుగాక!... కాని ఈ సంగతి మీ నాన్నకి తెలిస్తే యేమౌతుందో తెలుసా?

భాస్క: తెలిస్తే యేం?

ప్రభా: ఏం లేదు. తాతాధ్యాయాలు! వీపు విమానం మోత! నీకొక్కడు. ముందు నాకు!

భాస్క: నీ కెందుకు మధ్య?

ప్రభా: ఎందుకా! మనవాడు పిల్లని ప్రేమిస్తుంటే చూస్తూ వూరుకున్నందుకు.

భాస్క: ఊరుకోక?

ప్రభా: అదికాదురా! మనం యీవూ రెందు కొచ్చాం?

భాస్క: పెళ్ళి చూపులకి. అయితే?

ప్రభా: ఔనా! మరి మనం చూడవలసిన పిల్లని చూడకుండా మరో దాసీపిల్లని...

భాస్క: ఇదిగో! ఆ అమ్మాయి దాసీపిల్ల కాదు.

ప్రభా: పోనీ దాసీ కాదనుకో! ఆ వేషంలోవున్న అమ్మాయిని పెళ్ళాడ్డం ఏం బావుంది? మీ నాన్న ఒప్పుకుంటాడా?

భాస్క: మా నాన్న ఒప్పుకోకపోయినా సరే! నేనా అమ్మాయి నే పెళ్ళిచేసుకుంటాను.

ప్రభా: అయితే ఎన్ని ఆటంకాలొచ్చినా సినిమాలో హీరోలాగ నువ్వా అమ్మాయి నే పెళ్ళి చేసుకుంటా నంటావ్!

భాస్క: ఒరే ప్రభాకర్!

ప్రభా: ఏం?

భాస్క: నిజంగా నీకు నామీద స్నేహవాత్సల్య ముందా?

ప్రభా: ఇప్పుడా అనుమానం ఎందుకొచ్చింది?

భాస్క: ఉంటే ఈ ఆటంకాలేవీ చెప్పకుండా నాకూ ఆ అమ్మాయికీ......

ప్రభా: పెళ్ళియే యేర్పాటు చెయ్యమంటావ్! అంతేనా?

భాస్క: అంతే!

ప్రభా: మరి మీ నాన్న?

భాస్క: అదంతా ఆతర్వాత చూద్దాం! ఆయన్ని ఒప్పించేపూచీ నాది!

ప్రభా: ఆల్ రైట్! అలాగే చేస్తాలే!

భాస్క: నీ మేలు ఈజన్మలో మరిచిపోలేనురా!

ప్రభా: (వారిస్తూ) ఆఁఆఁ! అవన్నీ ఇప్పుడెందుకు గాని, ముందు నువ్వుపోయి కాస్త విశ్రాంతి తీసుకో! ఇప్పటికే చాలా అలసిపోయావ్!

భాస్క: మర్చిపోవద్దుసుమా!

ప్రభా: ముందు నువ్వెళ్ళవోయ్!

[భాస్కర్ గదిలోకి వెళ్తాడు. అంతవరకూ పొంచివున్న ఉష వస్తుంది]

ప్రభా: ఓఁ! రండి రండి. మీకోసమే చూస్తున్నాను.

ఉష: ఏమంటారు మీ మిత్రరత్నం?

ప్రభా: ఏమంటాడో మీకు తెలీదా?

ఉష: నాకేం తెలుస్తుంది? ఆప్తమిత్రులు మీకు తెలియాలిగాని!

ప్రభా: శభాష్! సరిపోయూ రిద్దరికిద్దరూను!...చాలా సహజంగా జరిగింది సన్నివేశంమాత్రం!... ఏమంటారు?

ఉష: (సిగ్గుతో) ఏమనమంటారు?

ప్రభా: అదీ నేనే చెప్పాలా? బాగుంది!

ఉష: (మెల్లగా) ఇన్నిమాటలు చెప్పారు. అదీ మీరే చెప్పండి. అక్కడికి పూర్తవుతుంది కథ!

ప్రభా: (నిదానంగా) ఐతే మీ వుద్దేశం నావుద్దేశం ఒకటే అన్నమాట! అంగీకారమేనా?

ఉష: (సిగ్గుతో తల వాలుస్తుంది)

ప్రభా! చాలా సంతోషమమ్మా! ఇవాళ నా సొంత చెల్లికి సంబంధం నిశ్చయమైనంత హాయిగావుంది నాకు.

ఉష: అలాగా! మా సొంత అన్నయ్యకంటే మీరే నయమేమో!

ప్రభా: అలా అనొద్దు! అతను నిజంగా మహానుభావుడు! అతనివల్లే మనకింత సన్నిహిత సంబంధం కుదిరింది!...ఆఁ! మరి నే నీసుభవార్త వాడి చెవిని వేసి వస్తాను.

ఉష: అలాగే!

ప్రభా : ఇప్పుడే వస్తాను. [ప్రభాకర్ లోనికివెళ్తాడు. ఉష అక్కడున్న పేపర్లూ అవీ సర్దుతూ వుంటుంది. వీధిలోనుంచి సీతారామయ్య, కాంతారావు ప్రవేశం]

కాంత : రావోయ్! రా!...అమ్మాయ్! నీ కాబోయే మామగారు! నమస్కారం చెయ్యమ్మా! (ఉష నమస్కారం పెడుతుంది)

సీతా : శీఘ్రమేవ కళ్యాణప్రాప్తిరస్తు!

కాంత : అయితే వాళ్ళని నేరుగా ఇక్కడికే రమ్మని వ్రాశావన్నమాట!

సీతా : అవునోయ్! మళ్ళీ అక్కణ్ణుంచి ఇంటికీ, ఇంటి నుండి యిక్కడికీ తిరగడం యెందుకని నేరుగా యిక్కడికే రమ్మని వ్రాసేను.

కాంత : ఏరీమరి! ఒచ్చినట్టులేదే! అమ్మాయ్! మంచి నీళ్ళుపట్రా తల్లీ!

[ఉష లోనికి వెళ్తుంది.]

సీతా : వస్తారులే!...ఏమో యీపాటికే వచ్చి ఏదేనా హోటల్లో దిగేరేమో.

కాంత : అబ్బే! ఈవూళ్ళో అంతపాటి హోటలెక్కడ?

సీతా : ఐతే సాయంత్రం బస్సులో వస్తారులే! ఫైనల్ ఇయరుగామరి! టైమ్ వేస్టుచేస్తే యెలా చెప్పు!

కాంత : అవును నిజమేనురి...ఆఁ! ఒక్కడే వస్తాడా?

సీతా : అహాఁ! వాళ్ల రూమ్‌మేటు ప్రభాకర్ అని ఒక కుర్రాడున్నాడు వాళ్లిద్దరూ కలిసివస్తారు. నీకు వ్రాసేనే!

కాంత : దీనికి సెలక్షన్ కమిటీ కూడానా!

సీతా : నవయువకులు కదటోయ్!

కాంత : బాగా చెప్పావ్!

[ప్రభాకర్ ప్రవేశం]

సీతా : (చూసి) ఏమోయ్ ప్రభాకర్ ఎప్పుడొచ్చారు మావాడేడీ?

కాంత : (ఆశ్చర్యంగా) ఏమిటీ! ఈయనే వేమిటి...

సీతా : మావాడి రూమ్‌మేటులే!

కాంత : ఐతే ఆరెండోవాడు మీ అబ్బాయన్నమాట!

ప్రభా : అవునండి.

కాంత : బాగుంది. మరి చెప్పావుకాదేమయ్యా!

ప్రభా : అవకాశం చిక్కనిస్తేనా?

సీతా : ఎంతసేపైంది మీరొచ్చి?

ప్రభా : మధ్యాహ్నమే వచ్చామండి.

[ఉష మంచినీళ్ళు తెస్తుంది.]

ఉష : ఇదిగో నాన్నా మంచినీళ్లు!

[ఇస్తుంది. కాంతారావు త్రాగుతాడు.]

సీతా : మా భాస్కరేడీ?

ప్రభా : తీసుకొస్తానుండండి! (లోనికి వెళ్తాడు.)

కాంత : (గ్లాసు ఉషకిచ్చి) పిల్లిద్దరేఅన్నమాట! కొత్తగావచ్చేమని, హోటల్ కోసం వెదుకుతూ వుంటే మాఅబ్బాయి తీసుకొచ్చాడు.

సీతా : అలాగా!

కాంత : పేర్లయినా తెల్సుకున్నాడుకాదు. వాడో దద్దమ్మ!

సీతా : పోనీ యిప్పుడేం మునిగింది?

కాంత : అహాఁ! అదికాదు...(ఉషనిచూచి) యేమమ్మా! ఆయిద్దరబ్బాయిల్నీ చూసేవా.

ఉష : ఆఁ.

కాంత : ఇప్పుడువెళ్ళి వాడువకాక ఆరెండోఅతనే వీరి అబ్బాయి. చూసేవా?

ఉష : (మెల్లగా) ఆఁ! ఇప్పుడే మాట్లాడేనకూడా!

కాంత : మరేమంటావ్?

ఉష : (సిగ్గుతో) ఏముందీ...(అర్థోక్తిలోనే ఆగిపోతుంది.)

సీతా : చూసేవా! అప్పుడే చూడ్డం, మాట్లాడ్డంకూడా అయిపోయింది!

కాంత : ఆఁ—ఇంక మీవాడు "ఊఁ" అనడమే తరవాయి.

[గ్లాసు తీసుకొని ఉష వెళ్లిపోతుంది.]

సీతా : ఆ! నచ్చకేంజేస్తుంది? ఇంతకంటే రంభ దొరుకుతుందేమిటి వాడికి?

కాంత : ఏదో ఆ మూడుముళ్లూ పడితే నీదరాన్నన్న!

సీతా : చూడు కాంతం! అలాంటి మాటలంటేనే నాకు చిరాకు!

[భాస్కర్, ప్రభాకర్ వస్తారు]

సీతా : రారా అబ్బాయ్! రా!

భాస్క : ఎంతసేపైంది మీరొచ్చి?

సీతా : ఇప్పుడే. (కాంతారావుని చూచి) వీరే నీ కాబోయే మామగారు.

భాస్క : (ఆశ్చర్యంగా) ఎవరు? ఈయనా?

సీతా : అవును. ఈయనే కాంతారావుగారంటే!

కాంత : (భాస్కర్‌తో) ఏం బాబూ అలా చూస్తావ్! మొదటే ఫలానా అని చెబితే!

ప్రభా : చెబుదామనుకుంటూ వుండగానే మరి...

భాస్క : ఆయనెవరో నేచెప్తాలెండి అన్నాడు. అంచేత వూరుకున్నాం.

కాంతా : ఎవరు ?
ప్రభా : మమ్మల్నిక్కడికి తీసుకొచ్చినాయన.
కాంతా : వాడా ! మా అబ్బాయి ! వాడో మతిభ్రష్టు రామన్న ! వాడిసంగతి నీకు తెలీదూ రామం !
సీతా : తెలియకేం ?... ఆఁ ! ఏరా అబ్బాయ్ ! వీరి అమ్మాయిని చూసేవుట !
భాస్క : ఎవరమ్మాయిని ?
సీతా : వీరి అమ్మాయి ఉషని రా. ఆ పిల్ల "ఊఁ" అంది. ఇహ నువ్వే !
భాస్క : నేనా అమ్మాయిని చూడందే !
సీతా, కాంతా : చూసేవుట !
భాస్క : లేదే !
సీతా : అదేమిట్రా అలా గంటావ్ ? నువ్వు ఆ అమ్మాయీ మాట్లాడుకున్నారుట గూడాను.
భాస్క : (ఆశ్చర్యంతో) ఎవరన్నారు ?
సీతా : ఆ అమ్మాయే చెప్పింది.
భాస్క : శుద్ధ అబద్ధం ! అసలు నేనా అమ్మాయిని చూడనే లేదు ! ఇంకెక్కడి మాట్లాడ్డం ?
కాంతా : (ఆశ్చర్యంగా) ఆఁ ! చూడనే లేదూ ?
భాస్క : లేదు.
కాంతా : మరి అమ్మాయి అలా చెప్పిందేమిటి ? నీతో మాట్లాడానంది కూడా !
భాస్క : బహుశా ఆమె కలగనివుండొచ్చు !
సీతా : ఓయ్ కాంతం ! నువ్వెళ్ళి అసలు సంగతేమిటో అమ్మాయిని అడిగిరా.
కాంతా : అలాగే వెళ్ళి అడిగివస్తానుండు. (కాంతారావు లోనికివెళ్తాడు)
సీతా : ఏమోయ్ ప్రభాకర్ ! ఏంజరిగిం దసలు !
ప్రభా : ఏమోనండి.........ఆ అమ్మాయి ఇంకేం చెప్పిందండి ?
సీతా : నచ్చేడా అంటే...తల వూపింది.
ప్రభా: అయితే మరేం ! ముహూర్తం పెట్టించండి !
భాస్క: ఒరే ! నీకేం మతిపోతున్నదా ? నేనాఅమ్మాయిని పెళ్లాడను.
సీతా: ఏం ? ఎందుకు ?
భాస్క: మనసులేని పెళ్ళిచేసుకొని జీవితం నరకంగా చేసుకోలేను.
సీతా: పోనీ ఆ అమ్మాయిని చూడు. నచ్చకపోతే మానెయ్ !
భాస్క: ఎలాగో నచ్చదు. ఆమాత్రం దానికి చూడ్డ మెందుకు ?
సీతా: (విసుగ్గా) ఎందుకు నచ్చదోయ్ ?
భాస్క: ఇంతకుముందు నేనొక అమ్మాయిని ప్రేమించేను.
సీతా: ఆమాట ముందే చెప్పకపోయావా ! మరి వీళ్ళకి మాటయిచ్చానే ?
భాస్క: అదికూడా యిక్కడే జరిగింది !
సీతా: ఏమిటోయ్ ప్రభాకర్ ! నీకైనా తెలుసా ?
ప్రభా: (తడబడుతూ) నాకెలా తెలుస్తుందండి !
భాస్క: వాడికంతా తెలుసు ! చెప్పరా.
ప్రభా: ఏమిటి చెప్పడం, ఎలా చెప్పడం ?
భాస్క: అదే. నే నెవర్ని యేవిధంగా ప్రేమించేనో చెప్పరా !
ప్రభా: ఓఁ ! అదా ! చెప్తాను.

[లోనుండి కాంతారావు ప్రవేశం]

కాంతా: (వేగంగా) అమ్మాయి ఖచ్చితంగా చెబుతోంది భాస్కర్ తో మాట్లాడినట్టు.
భాస్క: (ఆశ్చర్యంతో) మీ అమ్మాయే చెప్పిందా ?
కాంతా: అవును.
భాస్క: తమాషా గావుందే ! ఏమని చెప్పింది ?
కాంతా: ఏమనేమిటి ? నువ్వామెని ప్రేమించానని చెప్పావుట ! ఇష్టపడితే పెళ్ళాడతానన్నావట కూడాను !
సీతా: ఏరా ! నిజమేనా !
భాస్క: నేను ప్రేమించానన్నదీ వీరి అమ్మాయిని మాత్రం కాదు. మరొక స్త్రీ.
సీతా: (విసుగ్గా) అదే ఎవరోయ్ ?
కాంతా: బాబూ ! ఈ ముసుగులో గుద్దులాట ఎందుకు? ఏంజరిగిందో వివరంగా చెప్పెయ్ !
భాస్క: నేను ప్రేమించానన్నదీ పెళ్ళిచేసుకుంటానన్నదీ వీరి అమ్మాయిని కాదు. ఆమె ఒక దాసీ పిల్ల. ఈయింట్లోనే పనిచేస్తోంది !
కాంతా: (ఆశ్చర్యంగా) ఏమిటీ ! మాయింట్లో... దాసీ !...
భాస్క: అవును. కావాలంటే ప్రభాకర్ ని అడగండి.
కాంతా: మాయింట్లో ఆడవాళ్ళెవరూ పనిమనుషులుగా లేరే ! ఇదెలా...
ప్రభా: మీరుండండి. ఒరే బ్రదర్ ! నామాటవిని నువ్వు ప్రేమించి పెళ్ళిచేసుకుంటానన్న పిల్లని లోపలికెళ్ళి తీసుకురా !
సీతా: అవును. అదిబాగుంది. వెళ్ళరా ! వెళ్ళు.

[భాస్కర్ వెళ్తాడు].

కాంతా: ఏమిటీ యిదికలా ! యథార్థమా ?
సీతా: నీకు తెలుసంటానేమిటోయ్ !

ప్రభా : అవును. నాకు తెలుసు.
సీతా : ఐతే వాడు ప్రేమించింది దాసీపిల్లేనా ?
ప్రభా : ఆహా ! అలాంటిదే.
కాంతా : అరె ? మాయింట్లో ఆడవాళ్లు పనిమనుషులుగా లేరయ్యా అంటూవుంటే. ఉన్నది వాడొక్కడే ఆ రాముగాడు !
ప్రభా : ఏం ? ఇవాళ కొత్తగా చేరకూడదా ?
కాంతా : నాకు తెలియకుండానా !
ప్రభా : అవును.
కాంతా : అది అసంభవం ! నాకు తెలియకుండా అటువంటిదేమీ జరగదీయింట్లో.
సీతా : మరి మీ అమ్మాయి అలా చెబుతుందేం ?
కాంతా : అదే ఆశ్చర్యం !
సీతా : ఏమోయ్ ! నీకు తెలిస్తే చెప్పరాదూ !
ప్రభా : చెబుతానుండండి ! అదొక పెద్దగాథ !
సీతా : (లోనికిచూసి) అదుగో మావాడూ, మీ అమ్మాయీ వస్తున్నారు !
ప్రభా : రైట్ ! పదండి మనం అలా ఆ వరండాలోకి పోయి మాట్లాడుకుందాము.
కాంతా : ఎందుకు ?
ప్రభా : ఎందుకో మీకే తెలుస్తుంది. పదండి ముందు ! అక్కడ నేనంతా చెప్తాను ! [కాంతారావు, సీతారామయ్య, ప్రభాకర్ వీధిలోకి వెళ్తారు. లోనుండి భాస్కర్, ఉష ప్రవేశం]
భాస్క : (చూసి) అరె ! ఏరీ వీళ్లు ?
ఉష : అసలు నన్నెందుకు తీసుకొచ్చారిక్కడికి ?
భాస్క : ఏముంది ? అది చెప్పడానికే !
ఉష : ఏది ?
భాస్క : అదే. నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాననీ, నేను చూసింది నిన్ను గాని ఆ కాంతారావుగారి అమ్మాయిని కాదని చెప్పడానికే !
ఉష : ఈమాట ముందె వారికి చెప్పలేదా ?
భాస్క : చెప్పేను. కాని వింటేనా ?
ఉష : వాళ్ళేమంటారింతకీ ?
భాస్క : ఏమంటారు ? నువ్వు చూసింది మా అమ్మాయే ! అసలు మాయింట్లో దాసీపిల్లలే లేనప్పుడు నువ్వు చూడడం ఎలా సంభవం ? అంచాత మా అమ్మాయినే చూసివుంటావ్ అంటారు !
ఉష : అయితే ఇప్పుడు మీరేమంటారు ?
భాస్క : నిన్ను వాళ్లకిచూపించి, పెళ్ళిచేసుకుంటానని చెప్తాను. ముందే చెప్పానుగా నిన్ను నేను ప్రేమించాననీ, నిన్నుతప్ప మరెవ్వరినీ పెళ్లాడననీ !
ఉష : అసలు మీరిక్కడకు వచ్చింది కాంతారావుగారమ్మాయిని చూడాలని కదా ?
భాస్క : ఔను. వారమ్మాయిని చూడాలనీ, నచ్చితే పెళ్ళిచేసుకోవాలనీ వచ్చేం. కాని నేనామెను చూసైనా చూడలేదుగా !
ఉష : ఒకవేళ నేనే వారమ్మాయినైతే ?
భాస్క : అదేమిటి ? అదెలాగ అవుతుంది ? నువ్వు రాధవి. అతని కూతురువి కాదే !......రాధా ! ఇలా మాటలతో కాలం వ్యర్థం చెయ్యడం నాకిష్టంలేదు. మనం పెళ్ళిచేసుకోవాలి.
ఉష : ఎలా ?...... మీ నాన్నగారు ఇష్టపడతారో లేదో ?
భాస్క : ఆయన నాయిష్టప్రకారం చేస్తారు. ఆయన ఒప్పుకోకపోయినా యీ పెళ్ళి జరిగితీరవలసిందే ! అంతేగాని ప్రేమలేని పెళ్ళి చేసుకోను !
ఉష : ఐతే మనమిప్పుడేం చెయ్యాలి ?
భాస్క : వెంటనే మా నాన్నగారికి చెప్పి, పట్నం పోయి "రిజిష్టర్ మారేజ్" చేసుకుందాం !
ఉష : వాళ్లకి తెలియకుండానా ?
భాస్క : వాళ్లకి చెప్పే వెళ్దామన్నానా ? ఇందులో దొంగతనమేముంది ?
ఉష : ఐతే మీరూ నేనూ......
భాస్క : (విసుగ్గా) అబ్బ ! అవన్నీ యెందుకు రాధా ! ఒక్కమాట అడుగుతాను చెప్పు. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా లేదా ?
ఉష : ప్రేమిస్తున్నానే అనుకోండి.
భాస్క : ఇంకా అనుకోడమేమిటి ?
ఉష : ప్రేమిస్తే ?
భాస్క : ముందు నామాటవిని పద ! నడు !
ఉష : ఎక్కడికి ?
భాస్క : చెప్తానుగా ! నడు !
[ఉష ఒక్కక్షణం అతని ముఖంలోకి చూస్తుంది. అతను "క్విక్" అంటాడు. ఇద్దరూ రెండడుగులు ముందుకు వేస్తారు. బయటినుండి కాంతారావు, సీతారామయ్య, ప్రభాకర్ వస్తారు. వాళ్ళనిచూసి ఇద్దరూ ఆగుతారు.]
కాంతా : (భాస్కర్‌తో) భ లే వా డి వే నోయ్ ! ఈ అమ్మాయినేనా నువ్వు ప్రేమించావ్ !
భాస్క : అవును.
కాంతా : మరి మా అమ్మాయిని కాదని దమాయించావేం ?
భాస్క : ఈమె మీ అమ్మాయా ?
కాంతా : కాదా ?
భాస్క : కాదు.

[ఉష, ప్రభాకర్ వాళ్లలో వాళ్లు నవ్వుకుంటూ వుంటారు.]

కాంతా: (కోపాలోశంగా) మా అమ్మాయినిగురించి నాకంటే ఎక్కువ తెలిసినట్టు మాట్లాడుతున్నావే! కని, పెంచిన తండ్రిని! నా కూతురు నాకే తెలీదూ!....పదమ్మా ఉషా! లోపలికి పద!

భాస్క: ఉష ? ఆమె ఎవరు ?

సీతా : వాడి కూతురురా !

భాస్క: ఆమె ఉష కాదు. రాధ !

సీతా : పోనీ అలాగేకానీ ! కాంతం ! వాడికి ఆమె రాధ ! తెలిసిందా !

కాంతా: అలాగేలే ! పదమ్మా !

భాస్క: ఏమండోయ్ !......

సీతా :ఒరే బాబూ! నీకేం తెలియనట్టు నటిస్తావేంరా ?

భాస్క: మీ మాటలు నాకేం అర్థంకావటం లేదు.

సీతా : సరే. ప్రభాకర్ ! వాడికి అంతా చెప్పవోయ్!

[వీధిలో నుండి కృష్ణారావు ప్రవేశం]

కృష్ణా :(అందర్నీ చూసి) ఏమిటీ అసాధారణసమావేశం?

ప్రభా : రండి స్వామీ ! మీకోసమే చూస్తున్నాం ! మీతో రావలసిన వారంతా వచ్చినట్టే !

భాస్క: ఏమిటిదంతా ?

ప్రభా : ఒరే బ్రదర్ ! కొంచెం ఓపికపట్టు ! రాధకీ, ఉషకీ అట్టే తేడా లేదు. ఆమే యీమే ఒకటే!

భాస్క: ఏమిటే నువ్వనేది ?

ప్రభా : అదంతే !

కృష్ణా : ఏమిటండీ మీరు చెప్పేది ?

కాంతా: మహాగొరా ఒక్కక్షణం ! కానీవోయ్ !

ప్రభా : సీతారామయ్యగారు వ్రాసిన ప్రకారం చేమిద్దరం బయలుదేరి ఈ వూరొచ్చాం. కాస్త ముందుగా రావటంవల్ల ఏదైనా హోటల్లో దిగుదామనుకుంటూ వుండగా ఈయన కనిపించారు కృష్ణారావుగారు.

కృష్ణా : ఔను. ఈ వూళ్ళో ఏదైనా వసతిగృహం దొరుకుతుందా అని మీరు నన్నడిగారు. నే నిక్కడికి తీసుకొచ్చాను.

ప్రభా : ఊరికే తీసుకొచ్చారా ! ఇది వసతి గృహం అని చెప్పేరు. అసలు దీన్ని చూడగానే హోటల్ కాదనిపించింది మాకు ! కాని ఈయన మమ్మల్ని దమాయించాడు ! మరేం చేస్తాం ! అసలే కొత్తవూరు ! అంచేత ఆయన మాటల్ని నమ్మవలసి వచ్చింది !...ఆ తరువాత ఉషని కలుసుకున్నాను.

ఉష : ఔను. నా దగ్గర మీరు ఇది హోటల్ అన్న భావంతో మాట్లాడితే ఇది హోటల్ కాదనీ, కాంతారావుగారియిల్లనీ అంతా చెప్పాను. మీరు వెళ్ళిపోతామంటే వుండమనికూడా చెప్పాను.

ప్రభా: అప్పటికి నాకు విషయమంతా బోధపడింది! ఈలోగా భాస్కర్ వచ్చాడు., ఉషని, భాస్కర్‌నీ విడిచి ఏదో మిషమీద లోపలికి వెళ్ళాను నేను. ఏరా బ్రదర్!

భాస్క: అవును నువ్వు వెళ్ళాక నేను యమబాధ పడ్డాను. ఆమె ముఖమున్నా సూటిగా చూడలేదు నేను. చివరికి ఆమెను వదిలించుకోవాలని మంచినీళ్లు తెప్పించమని నేను బతుకుపడ్డాను.

ప్రభా: అదే! అనవాళ్ళంటే నీకుండే అసిగ్గూ, భయమూ పోగొట్టాలనే ఉషా నేనూ కలిసి ఈపథకం వేసేం. దాని ప్రకారం ఉష రాధ అయింది. మిగిలిందంతా మీకు తెలిసిందే!

కృష్ణా: బాగుందండి నాటకం!

భాస్క: మీ నాటకం కంటేనా?

కాంతా: అసలు నువ్వెందుకు అబద్ధం చెప్పావురా ఇది వసతి గృహమని?

కృష్ణా: (తేలిగ్గా) ఏముంది? కాస్త వినోదం కోసం, వీళ్ళని ఏడిపించాలనీను!

భాస్క: ఐతే యిప్పుడేడ్చిన వాళ్ళెవరో?

కాంతా: ఎవరో యేమిటి? అంతా యేడ్చాం!

ప్రభా: అలాగనకండి! కొందరు మాత్రమే యేడ్చాం!

సీతా: కాంతం! మొత్తంమీద మన ప్రమేయం లేకుండానే పెళ్లి ఏర్పాటయి పోయిందోయ్!

కాంతా: అఁఅఁ! అందులోనూ మీ అబ్బాయి అమోఘమైన నటన!

సీతా: మీ అమ్మాయి కంటేనా!

ఉష: నాన్నగారు ఉంటూఉండగా మమ్మల్నెందుకనటం? ఈ క్రెడిటంతా ప్రభాకర్ దే!

ప్రభా: క్రెడిట్ మాటకేం! బూరె ముక్కలకు ఎలాగో ఆలస్యం వుంది, ముందు కాస్తకాఫీ అన్నా పోయించండి, ఆలసిపోయి ఆత్మారాముడు గోలచేస్తున్నాడు? (అంతా నవ్వుతారు.)

కాంతా: పదండోయ్! లోపలికి రండి!

[ముందు కాంతారావు, వెనుక సీతారామయ్య, భాస్కర్, ఉష, కృష్ణారావు, ప్రభాకర్ వెళ్తూ వుంటారు]

కృష్ణా: (ఆగి) సారీ! ఇదుగో మీ సిగరెట్ పెట్టె!

ప్రభా: (తీసుకుని) థేంక్ యూ వెరీమచ్!

కృష్ణా: నో మెన్షన్ ప్లీజ్ !

[ఇద్దరూ నవ్వుకుంటూ నిష్క్రమిస్తూండగా తెర జారుతుంది.]

---

* గోల్డ్‌స్మిత్ వ్రాసిన "ది మిస్టేక్స్ ఆఫ్ ది నైట్" ఆధారంగా.

కలగూరగంప

బుద్ధుని జననము

శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి

గౌతమబుద్ధుని మహాపరినిర్వాణమునకు చెందిన 2500 వార్షికోత్సవాన్ని భారతదేశం జయప్రదంగా చేసింది. కాని బుద్ధుడు గతించి 2500 సంవత్సరాలైనా అనే సంశయం కలగటానికి చాలా ఆధారాలున్నవి. 1552 సంవత్సరాల క్రిందట మనదేశానికి వచ్చిన ఫాహీన్ యాత్రికుడు బుద్ధుని నిర్వాణమంతకుముందు 1497 ఏండ్లనాడు జరిగిందనే వదంతిని పేర్కొన్నాడు దీనిని బట్టి బుద్ధనిర్వాణము క్రీ. పూ 1086 వ కావాలి. బుద్ధ నిర్వాణమై ఎన్ని ఏండ్లు గడచినవనే విషయంలో అభిప్రాయభేదాలున్నవని, ఈ మధ్యకాలం 900 నుంచి 1500 దాకా గలదని చెప్పేవాదాలున్నవని యువాన్‌చ్వాంగ్ చెప్పినాడు (వాటర్స్ 2.28), టిబెట్ దేశపు సంప్రదాయంలో బుద్ధనిర్వాణాన్ని గురించి పధువాలుగు తేదీలు చెప్పబడ్డవని మాక్స్ ముల్లర్ పేర్కొన్నాడు. ఇవి క్రీ పూ. 546, 576, 653, 752, 837, 880, 882, 884, 1060, 1310, 2135, 2139, 2148, 2422 సంవత్సరాలు. కాంటన్ లోని సంప్రదాయం ప్రకారం క్రీ. పూ. 487, చీనా సంప్రదాయంలో క్రీ. పూ. 639, ఇతరులు క్రీ పూ. 544 అన్నారు. ఇన్ని తేదీలు కన్పిస్తుంటే ఏదిసరియైనదని నమ్మగలము ?

మాక్స్‌ముల్లర్ తన సంస్కృత సాహిత్యచరిత్రలో (పుట 189) టిబెట్‌వారిచ్చిన తేదీలనిస్తూ, చీనా వ్రాతల ప్రకారం అశోకుడు క్రీ. పూ. 850 లోనో, 750 లోనో రాజ్యానికి వచ్చినట్లున్నదని (పుట 134-5) పేర్కొన్నాడు. ఇలాంటి చిక్కులలో బుద్ధనిర్వాణము ఎప్పుడుజరిగిందో నిర్ణయించటం చరిత్రకారులకు మాత్రమెలాసాధ్యమౌతుంది? అందులో అలెగ్జాండరు కాలానికి చంద్రగుప్తమౌర్యుడున్నాడని చెప్పే పాశ్చాత్యసిద్ధాంతాలను నమ్మే చరిత్రకారులీ తేదీల న్నిటినీ త్రోసివేయటం సహజమే. మున్షీగారి విద్యాభవనం తరఫున భారతదేశచరిత్ర సంపుటాలు వెలువడుతున్నవి. రెండవ సంపుటంలో విచిత్ర విషయాలున్నవి. బుద్ధనిర్వాణమైన 218 ఏళ్ళకు అశోకుడు రాజ్యానికి వచ్చినాడు గనుక నిర్వాణము క్రీ. పూ. 487 లో నన్నారు. మహావీర నిర్వాణము క్రీ. పూ. 528 అనిజైన సంప్రదాయమంటున్నా ఈ తేదీ క్రీ. పూ. 487 కు సరిపోదు గనుక త్రోసివేయాలన్నారు. (పుటలు 36,37) బుద్ధనిర్వాణమైన పదహారేండ్లకు మహావీరుడు గతించెనను వాక్యాన్ని అందరూ అంగీకరిస్తారు. కాని మహావీరుని కాలాన్ని దిద్దటంలో అభిప్రాయమేమి? జైన సంప్రదాయాన్ని బట్టి బుద్ధనిర్వాణము క్రీ. పూ. 543 లో జరిగి వుండాలి. బుద్ధుడు ఎనభైఏండ్లు జీవించి ఉన్నాడని అందరు అంగీకరించిన విషయమే. ఈ తేదినిబట్టి బుద్ధుని జననము క్రీ. పూ. 623 లో అయి ఉండాలి.

కాని బౌద్ధ జైన సంప్రదాయాలే కాకుండా వైదిక సంప్రదాయంలో కూడా బుద్ధుని ప్రసక్తి ఉన్నది. ఈ సంప్రదాయంలో కన్పించే విషయాలనుబట్టి బుద్ధుని కాలనిర్ణయం చేయవచ్చును. మనకు నేడు కన్పించే శక్తి సంగమతంత్రంలో ఛిన్నమస్తాఖండము ఉన్నది. దీని ఆరవపటలంలో వివిధ అవతారాలు ఏ సంవత్సరంలో వచ్చినవో చెప్పబడినవి. ఇవట:

"కలౌ చ వత్సరే శైవ ఖరే చాషాఢ కేరిథా
శుద్ధాచ దశమీ జీవ రవి వారేణ సంయుతా
శుక్ల యోగే విశాఖాయాం దివా నాడీ షట్తథా
బౌద్ధో ఽవతీర్ణో దేవేశి తిథిః కలియుగేశ్వరః."

అని ఉన్నది. కలియుగంలోనిది బుద్ధావతారము. ఖరనామ సంవత్సర ఆషాఢ శుద్ధ దశమీ ఆదివారంనాడు, శుక్లయోగము, విశాఖ నక్షత్రము ఉండగా సూర్యోదయానంతరము ఆరుఘడియలకు బుద్ధుడు జన్మించినాడన్నమాట. క్రీ. పూ. 569, 629, 689, 749, 809, 869, 929 మొదలైనవన్నీ ఖరనామ సంవత్సరాలు. వీటిలో ఏ సంవత్సరానికి ఆషాఢ శుద్ధ దశమీ ఆదివారం విశాఖ నక్షత్రం వస్తుందో తెలుసుకోవాలి. బుద్ధ నిర్వాణానికి క్రీ. పూ. 489, 549, 609, 669 మొదలైన సంవత్సరాలు రాగలవు. జైనులు చెప్పే మహావీర నిర్వాణానికి సమీపంలో ఉన్న సంవత్సరము క్రీ. పూ. 549. ఇది బుద్ధ నిర్వాణమని అంగీకరించితే, బుద్ధుని 2500 వ పరినిర్వాణ వార్షికము క్రీ. శ. 1951 లో వస్తుంది.

ఫాహియాన్ చెప్పిన క్రీ. పూ. 1086 ను అంగీకరిస్తే బుద్ధుని జననం 1166 లో ఔతుంది. దీనికి దగ్గరగా ఉన్న క్రీ. పూ. 1169 ఖరనామ సంవత్సర మౌతుంది. కాంటన్ సంప్రదాయం ప్రకారము క్రీ. పూ. 569, చీనా వారి లెక్క ప్రకారము క్రీ. పూ. 629 బుద్ధుని జన్మ సంవత్సరం కాగలదు. జ్యోతి స్సిద్ధాంతం ప్రకారం లెక్క వేసి విజ్ఞులీ విషయాన్ని నిర్ధరించాలి.

జైనుల లెక్కను, వైదిక సంప్రదాయాన్ని కూడా త్రోసివేసి మన ఇష్టం వచ్చిన తేదిని అంగీకరించడం శాస్త్రీయము కాదు. శక్తి సంగమ తంత్రంలో చెప్పినది మాత్రము ప్రామాణికమా? అని కొందరు ప్రశ్నించవచ్చును. బౌద్ధ తంత్రాలు చాల వరకు శాక్త, శైవతంత్రాలుగా తర్వాతి కాలంలో మారినవి. దీనితో పాటు కొన్ని బౌద్ధాచారాలు అద్వైతపరంపరలోకి వచ్చినవి. ఇలా వచ్చిన వాటిలో చాతుర్మాస్య దీక్ష ఒకటి ఉన్నది. ఈ దీక్ష యతులకు విధింపబడ్డది. ఆషాఢ శుద్ధ ఏకాదశినాడీ దీక్ష ప్రారంభము. కేవలము వర్షాకాలంతోనే నిమిత్త ముంటే ఈ దీక్షను పూర్ణిమనుంచిగాని, పాడ్యమి నుంచిగాని ఎందుకు ప్రారంభించ కూడదు? దాదాపు బుద్ధుని జన్మదినముతో ప్రారంభమయే ఈ దీక్షలో బౌద్ధవాసన కన్పించకపోదు. ఇదే సమయానికి జగన్నాథుని రథయాత్ర కూడా కన్పిస్తుంది. జగన్నాథాలయమునకు పూర్వకాలంలో బౌద్ధుల సంబంధము లేదని ఎవరునూ చెప్పలేరు గదా! ఈ ఆధారాలచేత శక్తి సంగమతంత్రంలోని శ్లోకము పరమ ప్రామాణికమని ఒప్పుకోవలెను. అప్పుడు బుద్ధుని నిర్వాణ సంవత్సరము క్రీ. పూ. 549 లోనో అంతకంటె చాల ముందో ఐ ఉండాలి.

గ్రంథవిమర్శనము

పాలవెల్లి

సాహిత్య వ్యాససంపుటి; రచన: శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య: సారస్వత కుటీరము: మద్రాసు-21. వెల: రు. 1/-

ఇది పూర్వకవులలోని కొన్ని పాత్రములను, సన్నివేశములను ఏరుకొని వాని నిర్మాణమును వివరించుటకుఁ జేసిన ప్రయత్నము. 'మలయమాంచాల' 'దమయంతి పెండ్లి' 'మాలదాసరి' 'శాలీనుఁడు' 'కాటమరాజు' 'చిత్రాంగి' అను శీర్షికలతో ఆఱు వ్యాసము లీ సంపుటిలోఁ గలవు. పూర్వసాహిత్యముపై విద్యార్థుల కాభిముఖ్యమును గల్పించుటయే యీ రచనోద్దేశ్యమని గ్రంథకర్త–'మనవి' లో తెలిపెను. ఈ యూహ మేలు. ప్రాథమికులకై – అభిరుచి నిర్మితికై – యుద్దిష్టమైన రచన నిస్పష్టమైన ఆలోచనలో, పునరుక్తిలేని వివరణలో, ప్రామాణికములైన సిద్ధాంతములలో, నుండుట మంచిది. ఎంత ప్రాథమికులకు అంత పరిణతుల మార్గదర్శిత్వము, ప్రయోజనకరము. తెలుఁగు వాఁటికి పలనాటి వీరచరిత్రము రెండవ భారతము. 'మలయ మాంచాల'లో గ్రంథకర్తయొక్క వివరణాన్వేషణమునకు దొరకక మిఱుమిట్లు గొలుపుచున్న భావమును, పరిచయకర్త రెండు మాటలతో ఎత్తి చూపిరి. 'మాంచాల మనోరత్న'మని! పలనాటి వీర చరితమునందలి ఏ పాత్ర మధురము కాదు? ఒక్కొక పాత్రమునందలి మాధుర్యము ననుభవమునకు వచ్చుట మన యభిరుచి విలువ పెఱుఁగుటకు గురు. వీర చరితమునందలి పాత్రముల మానసిక పరిణతియే, వేఱు. వారందఱు పండిన తత్త్వవేత్తలు. అందు మనస్వినియైన మాంచాల మనోరత్నము. తెనుఁగు సారస్వతమునకు త్రికాలములకు వెలుఁగు!

'దమయంతి పెండ్లి'లో గ్రంథకర్త స్థాపింపఁ దలఁచినది శ్రీనాథుఁడా పెండ్లి సంబరమునకు ఆంధ్రత్వ ముద్రవైచెనని. మంచిదే. ఈమాత్రమునకు భారతి నలకథకులేని కావ్యత్వమును దిన నలకథకు శ్రీనాథుఁడు సంపాదించెనన నక్కఱలేదు. బహుభాషల యందు బహుజనులు స్వస్థాన వేష భాషామయములుగ నే యితిహాస కథలను జిత్రించికొని యానందింతురు. ఆంధ్రత్వముద్ర ఆంధ్రహృదయమునకు మాత్రమే రుచిజేసి రసస్ఫురణకు హేతువు. ఇతిహాస కథలు సర్వ మానవ హృదయ స్పందకములు సుదాత్తతకలవి. ఆ యుదాత్తతకు భంజకము కాని యట్టి యాంధ్రత్వముద్ర అభిలషణీయము కాదు. భారతినలకథ యందలి యుదాత్తత సంస్కృతాంధ్ర నైషధములు నెరసి అందకొనరానిది.

'మాలదాసరి' సృష్టిగొప్పదే. కాని విష్ణుచిత్త గోదాపాత్రములు ప్రబంధ లక్షణములకు లోనైన పాపమునఁ గృత్రిమము లయ్యెననుట అవిచారితము. రాయల పాత్రనిర్మాణశక్తి 'మాలదాసరి' సృష్టియందే ఉట్టి గట్టఁ గొనలేదు. అది విష్ణుచిత్తుఁడు, పాండ్యుఁడు, అతని పట్టమహిషి, యామునాచార్యుఁడు, కేశిధ్వజ ఖాండిక్యులు—అతివి సర్వపాత్రములయందుఁ గలదు. నేఁటి హరిజనాభిమానమువలన 'దాసరి' మనకు సన్నిహితుఁడనిపించు చేమో! మాలదాసరి కథలో స్వభావోక్తి ప్రియుఁడైన రాయలవర్ణనా ప్రతిభయు వాద ప్రౌఢియుఁ గలసి దాని కా ప్రశస్తిని దెచ్చినవి. దాసరి మిక్కిలి గడుసరి. వానిలోతు తెలిసికొనుట కింకను దిగ వెదుకవలయును. అతఁడు బ్రహ్మరాక్షసునకుఁ జరమ గీత ఫలమీయ లేదు. 'ఇచ్చినాఁడని మనము గ్రహింప వలె'నని గ్రంథకర్తయనుట సరికాదు. దాసరిదృష్టిలో గీతఫలమునకు ఇయత్తాకల్పన దోషము. గీతఫలమువలన నీ రాక్షసత్వము పోవుచున్నచో ఇయత్తచేసినట్లే. ఇంతకు వాని రాక్షసత్వముపోవుటకు గీతఫలము వలెనేల? తన సంకల్పమాత్రము చాలదా! దాసరికింత ఆత్మప్రత్యయము. 'అట్లేయనుట' కర్థమిది. దీనిని తెలిసికొని వివరింపవలెను.

శాలీనుఁడు... పెద్దన ప్రవరునకుఁ బై చేయిగా మారన చేసిన సృష్టియని కొందఱు వాకొందురు. వీరి యూహాతాత్పర్య మిదియై యుండును. ప్రవరుఁడు వరూధినిని నిరాకరించెను. శాలీనుఁడు సుగాత్రి నొల్లలేదు' కదా! అని, మొదటియతఁడు ధర్మాధర్మ వివేకముచేత — రెండవయాతఁడు నిం భరణ సౌందర్యాభిమానముచేత—ధర్మాభిమానము కన్న సౌందర్యాభిమానము గొప్పయనుదృష్టి కంతే. కాని

అక్కండ్లగా సుగాత్రి నొల్లకుండుటకు నిరాదరణ పొందరాదభిమాన మనుటకంటె—ఉద్బోధక సామగ్రికి అలవడిన శాలీనుని సహజ శాలీనతియే హేతువను కొనుట యుక్తతరము. పురుష ప్రభేదములలో నది యొకటి. దానిని పరిశీలించి మారన వాస్తవిక దృష్టితోఁ గావ్యమున నిక్షేపించుటయే నేఁటి భావుకుల నదియాకర్షించుటలోని రహస్యమైయుండును. ఈ శాలీనుని కథలోని అందమును పూర్వ విమర్శకులు వివరించిరి.

కాటమరాజుకథ — ఇది తరతరములుగఁ దెలుఁగు నాఁట బహుళ జనానురాగ పాత్రము. అట్లగుటకు విందలి పాత్రీకరణ ప్రజ్ఞయే హేతువని గ్రంథకర్త యుపపాదన. ఆ పాత్రీకరణ మెట్లు నిర్వహింపఁబడెనో నిరూపింపలేదు. కాటమరాజు జయోదాహరణముగ 'కొమారబంగారము' ఛిట్టుపలికిన పలుకు లివి యని గ్రంథకర్త యుదాహరించిన ద్విపదలలో నతఁడు పసుల మేపికొనుచు తిరిగిన దేశముల పట్టి యున్నది కాని అతని వ్యక్తి లక్షణములను పట్టియిచ్చు నాధారములు లేవు.

ఇంకు పాత్రీకరణము గొప్పగా నున్నదని చెప్పుటతోఁ బాటు 'పెద్దనకుఁ బూర్వమున్న కవులలో నొక్క తిక్కన్నలోఁదప్ప నీ పాత్రచిత్రణము కానరాదు' అని యొక అవిచారితి నిర్ణయము! కాటమరాజు కథలోనున్న పాటి పాత్రచిత్రణము పెద్దనకుఁ దిక్కనకు మధ్యనున్న కవులలో నెవరిలోను లేకపోవును గాక! ఇంతకు పూర్వము మన ప్రశంస లందికొన్న పలనాటి వీరచరిత్రము గతి యేమి కావలెను?

'నాటకీయముగఁ బాత్ర నిర్మాణము సేయలేదు. రచన నాటకీయముగ నున్నప్పుడు కాని పాత్ర నిర్మాణ ముండదు. రసపుష్టికిఁ బాత్ర నిర్మాణ మవసరమయి నప్పుడు కాటమరాజు కథ మొదలయిన గేయప్రబంధములలోఁ బాత్ర నిర్మాణముయొక్క యావశ్యకత ఇట్టి దని వేఱుగఁ జెప్పనక్కఱలేదు.'

ఇన్నిసార్లు పాత్ర నిర్మాణమును వాడుటకన్న అది కాటమరాజు కథలో ఎట్లు చేయఁబడినదో నిరూపించియుండిన బాగు. ఈ వ్యాసములో మెకంజీ లోకలు రికార్డులనుండి 'కాటమరాజు కథా వృత్తాంత మని' యుదాహరింపఁబడిన వ్యావహారిక పు తెనుఁగు రచన కాటమరాజు కీలారముల పాలిమేఁకలలోనికి మనలను దీసికొనిపోవునంటి రమ్యముగ నున్నది.

'చిత్రాంగి'—ధర్మవరమువారి విషాదసారంగధర నాటకములోని ప్రధాన పాత్రమును దృష్టితో ననుశీలనము వచ్చినది. పరిగ నిట్టి విషాద సారంగధరలోఁ జిత్రాంగి చిత్రణమున్నచో నది చేమకూర సారంగధర చరిత్రకు అక్షరశః నకలు! ఈ సృష్టివలని కీర్తిప కీర్తులు 'చేమకూరకు' చెందవలెను. ధర్మవరమువారు చేసిన మార్పులు ఒకటి రెండున్నచో నవి చిత్రాంగిపై సామాజికులకు సానుభూతి కలిగించుటకు చేసినవి. ఇట్టి పాత్రములమీఁద సానుభూతి, దేవుని యంతరిశాల హృదయుఁడు పూని నిర్వహింపఁగలఁడు కాని, సామాన్య మానవుల నిది యుపమార్గముల కీడ్చి తీఱును. కావఁగని, విమర్శకులు దానిఁ గల్పించుటకై ప్రయత్నింపరాదేమో! మొత్తముమీఁద యీ వ్యాసములను గూర్చిన గ్రంథకర్త యాశయము మేలేకాని ఇందలి పెక్కు విషయములు నెటుకటి తరము విమర్శకులు తెలిసినవే. విమర్శలోఁగూడ నుపజ్ఞవలయును గదా! ఈ రచయిత తగినంత పరిణతితోఁ గ్రొత్త ఘట్టములను మనకు వివరింపఁగలరని ఆశింపవచ్చును.

ఉ షా సు ం ద రి

నాటకము; రచన: శ్రీ పిడిపాటి సుబ్బరామ శాస్త్రి, మారుతీనగర్, విజయవాడ; వెల రు 1.50.

ఈ ఏడంకముల నాటకమునకు ఉషాపరిణయ కథ వస్తువు. బాణాసురుని రక్షణ శిక్షణములకై పోటీ పడిన శివకేశవుల తగాదాకు బ్రహ్మను దీర్పరిని జేయుట యీ రచయిత యుపజ్ఞ. దీనిని గమనింపవలసినదని పీఠికలో ప్రత్యేకముగ హెచ్చరిక కలదు. ఈ పన్నివేశములోఁ త్రిమూర్తులు దేవతాత్వము జాఱిపోయి కేవలము 'వ్యవహారపక్షులు' గా గోచరింతురు. సాంఘికమైన వస్తువును దీసికొని యెట్లు నిర్వహించినను అంత ప్రమాదము లేదు. దివ్యులను పాత్రములుగాఁ జేసి నిర్వహించుటకు గొప్ప సంస్కారమును భావనాశక్తియుఁ గావలయును. పౌరాణిక వస్తువును దీసికొని అనౌచిత్యము రాకుండ నిర్వహించుట మిక్కిలి కష్టము. ప్రణయ కథకు ఉషానిరుద్ధులే అక్కఱలేదు. ఎవరైన పనికివత్తురు.

ఈ వాక్యములు పరిశీలించునది.

ఉష॥ మన సత్త్వములు మార్చుటకు యుద్ధము సాధనమా? ఉషాసుందరి కారణముగా ఇరు పక్షములను రక్త ప్రవంతులు పొంగి పొరలవలసినదేనా? అమాయిక స్త్రీలు ధృతి కారణముగ పతిసుతాదుల మృత్యుకై బలి పెట్టవలసినదేనా? హింసా స్వరూపిణి యుద్ధమారి వేయి నాల్కలు చాచి వికృతాట్టహాసమును చేయుచున్నదే?

ఇంతటి అభ్యుదయభావధరమును ఉష పోయఁ గలదా? ఇంకొకచోట:

బాణు॥ జాతి గౌరవము ప్రతిష్ఠా వాత్సల్యముకన్న మిన్న. [ఈ బాణాసురుఁడు జాతీయ నాయకునివలె నున్నాఁడు.]

నాందీ పద్యము—

శ్రీయుమాశారదా రాగసించితములు
హరిహరహిరణ్యగర్భహృత్సరసిజములు
మధుర మధురంపుతావి సంపదల పొదలి
విశ్వకల్యాణరోచి ప్రహ్వీభవించు॥

'శ్రీయుమా' సమాసమేని విసంధి చేయరాదు. కాదేని అర్థము కుదురదు. ఉమకు పర్యాయ పదము వెతుకవలెను.

రాగసించితములు—రాగములో రంజనము కుదురును గాని సేచనము కుదురదు.

విశ్వకల్యాణరోచి ప్రహ్వీభవించు—ప్రహ్వీభవించుటకు నమ్రమగుట - ముకుళించుకొనుట అర్థము. కవి యుద్దేశమునకు విరుద్ధార్థము వచ్చుచున్నది.

ఇక పీఠికలో—"కాళిదాసుని యభిజ్ఞాన శాకుంతలము చదివిన పిమ్మట చక్కని నాటకము రచింపవలెనను అభిలాషయే "ఉమాసుందరిగ రూపొందినది." ఈ సృష్టికి అది యుద్బోధకమని పేర్కొనుటకైన కొంచెము సంకోచ ముండవలయును. ఈ రచయిత యిట్టి రచనల కుపక్రమించుటకు ముందు కొంత ఆత్మవిచారమును చేసికొనవలయును.

జాతీయ భారతి

గేయసంపుటి: రచన: శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి; మారుతీనగర్, విజయవాడ. వెల రు. 2-50.

ఇది జాతీయతా ధర్మప్రబోధము. కొందఱు దేశనాయకులు, పంచశీల వీని ప్రచారమును దృష్టియందుంచికొని వ్రాసిన గేయముల సంపుటి. ఈ రచనలకు వలసిన యర్హత యీ రచయితకు గలదు. ఈ గేయములకు వింతకు పూర్వమే దేశములో ప్రచారముగలదు. ప్రతి గేయముక్రిందను ఒక్కొక్క సంగీతవాద్య చిత్రమున్నది. ఆ గేయమును ఆ వాద్యముపైఁ బలికింపవలయునని రచయిత సూచనయై యుండును. ప్రచార సులభమైన శైలిలోనుండుట యీ గేయముల లోని విశేషము. తంద్రాళువైన జాతికి నిత్యప్రబోధము అవసరమే కావచ్చునుగాని ఒక్కొక్కసారి—

"తెలుంగుదేశం మనదేనోయ్
తెలుంగులంచే మనమేనోయ్.
రాయలు మనవాడోయ్—పండిత
రాయలు మనవాడోయ్
కలంతిక్కనా ఖడ్గతిక్కనా
గణపతిదేవులు మనవారోయ్".

ఇత్యాదులు చూచినప్పుడు 'తెలిసిన పాటలో తెగఁజంపుటయే కలిగిన ఫలమా? కవితిలకున్' అని యనిపింపక మానదు. ఈ పురశ్చరణవలన ఫలమేమి?

ఇందలి 'గోమాత' 'ఏఱువాక' అను గేయములలోఁ గొంత కావ్యగుణమున్నది.

శివశర్మ

శృంగార తిలకము

మహాకవి కాళిదాసు రచనగా చెలామణి అవుతున్న చిన్ని కృతికి అనువాదం: అనువాదకులు: శ్రీ ఉప్పాడ రాజారావు; ప్రకాశకులు: శ్రీ హనుమంతుమోహనరావు, తలగాము, (వయా) చాపడా, శ్రీకాకుళము జిల్లా, వెల: రు. 0-50.

వ్యాసులు, శంకరులు, కాళిదాసులూ, మనకు అనంత సంఖ్యలో నున్నారు. ఈ 'శృంగార తిలక' మాతృక ఏ కాళిదాసు రచనో మనకు తెలియదు. ఇది స్త్రీ సౌందర్యవర్ణన పరమాశయంగాగల కావ్యం. భావనలో వైచిత్రి వున్న కారణంగా కావ్యగౌరవాన్ని సంతరించుకున్నది.

అనువాదం సరసంగా వుంది.

"కుసుమే కుసుమోత్పత్తిః
శ్రూయతే నచదృశ్యతే
బాలే! తవ ముఖాంభోజే
కథ మిందీవర ద్వయం॥"

అన్న శ్లోకాన్ని ఇలా అనువదించారు:

"కుసుమమున కుసుమోత్పత్తి రొసగుటెందు
పృథివితలమందు గనలేదు; వినగలేదు
బాల! భవదీయ లలితాస్య పంకజమున
గానవయ్యె జగానల్లకల్వదోయి."

చెరగని అక్షరాలు

కథల సంపుటి: రచన: శ్రీ ఇసుకపల్లి దక్షిణామూర్తి; ప్రచురణ: నవ్యభారతి, 760 హిమాయత్ నగర్, హైద్రాబాదు. వెల: రు. 1-00.

ఈ సంపుటిలో, టపాకాయలు, పూవులూ కాయలూ, కాలిన చేతులు, ధర్మపత్ని, చెరగని అక్ష

రాలు, కథలో కథానిక, విశాలహృదయం, జన్మహక్కు — అనే ఎనిమిదికథలున్నాయి. వీటిలో చెరగని అక్షరాలు అనే కథ లోగడ 'భారతి' ద్వారా పాఠకులకు పరిచయమైనదే. మిగతా కథలుకూడా, ఆయా పత్రికలలో లోగడ ప్రచురింపబడినవి. శ్రీ దక్షిణామూర్తిగారి రచనలో, భావతీవ్రత వుంటుంది. దానికి తగిన నిరాడంబరమైన భాషనుకూడా సమకూర్చుకోగలరు.

వాస్తు పద్మాకరమ్

[ప్రథమ ఖండము]

రచన శ్రీ కె. యస్. శర్మ; ప్రాప్తిస్థానం: రచయిత, మెయిన్‌రోడ్, కాకినాడ; వెల రు 8/-

మనకు ప్రాచీన వాస్తుశాస్త్రం అనంతంగా వున్నదని చెబుతారు. కాని అదంతా సంస్కృతంలో వున్నది, ఎక్కడెక్కడో అటకలమీద మూలుగుతున్న అముద్రితములైన తాటాకు గ్రంథాలలో వున్నది. అందు చాలా గ్రంథాలు, సాంకేతిక విజ్ఞాన శాఖకు చెందివున్న కారణంచేత వాటిలో వాడబడిన పారిభాషిక పదజాలం మామూలు సంస్కృతి భాష చదువుకున్న మాత్రం చేత అర్థంకావు, ఆశాస్త్ర విషయంలో పరిపూర్ణ పాండిత్యంగల గురువులు లభించితే నే తప్ప ఈ కవిలెకట్టలు విప్పనెవ్వరికీ సాధ్యం కాదు. అట్టి గురువులు ఇప్పుడు ఈ దేశంలో ఎంతమంది వున్నారు. అంతేగాదు ఈశాస్త్ర విజ్ఞాన గ్రంథాలతో ఒక చిక్కుగూడా వుంది. వీటిలో ప్రక్షిప్తాలు అనంతం. మన ప్రాచీన లేఖకులలో కొంతమంది చాలా అనాలోచితంగా వ్యవహరించారు. పరిమిత పరిజ్ఞానమూ అంధ విశ్వాసములు గల ఈ లేఖకులు మూలగ్రంథాలను మూల గ్రంథాలుగా వుంచారు గాదు. కాస్త రెండుశ్లోకాలు వ్రాయటంచేతనైన ప్రతి ఒక్కడూ ఏదో చేర్చివ్రాసి మూల గ్రంథాలలోకి దూర్చారు. భారతం వంటి ఐతిహాసిక గ్రంథంలోనే ఇలాంటి దౌర్భాగ్యం అనంతంగా కనుపించుతోంది. ఈ దుశ్చర్యతో దానికిగల ఐతిహాసిక ప్రామాణ్యాన్ని దగ్గం చేశారు. అలాగే శాస్త్రవిజ్ఞానగ్రంథాలలోకూడా చేసి వాటికిగల శాస్త్రీయ ప్రామాణ్యాన్ని నాశనం చేశారు. ఏశాస్త్ర విజ్ఞాన గ్రంథాన్ని చూచినా శాస్త్రీయ విషయంతో పాటుఅశాస్త్రీయమైన, అవివేకమైన, మూలచ్ఛేదకమైన చెత్త ఎంతో కనుపించుతుంది. దాంతో బుద్ధిమంతుడైన పాఠకునిలో ఆ గ్రంథంయొక్క ప్రామాణ్యవిషయములోనే ఆశంక కలిగి, అవిశ్వాసం పుడుతుంది. మన విజ్ఞానశాస్త్రాలమీద దేశంలో నేడు ప్రబలియున్న అవిశ్వాసాని కంతకూ ఇదే కారణం. ఈస్థితికి, మరొకరెవరో కారణమనీ, దేశంలో ఆంగ్లభాషవ్యాప్తిచేత అలాటిది కలిగిందనీవాదించటం, ఆత్మవంచన చేసుకుని మన బాధ్యతలనుంచి మనం తప్పుకోవటానికి ప్రయత్నించటమే. అయితే ఇప్పుడు మనం నిర్వహించగల బాధ్యతలేవిటి? ఆయా విజ్ఞాన శాస్త్రాలలో తగిన వ్యుత్పత్తిని సంపాదించుకోవాలి. ఆ శక్తితో ఈగ్రంథ బాహుళ్యంలో వున్న విషయ సంచయంలో శాస్త్రీయ విషయాలేవో అశాస్త్రీయ విషయాలేవో నిర్ణయించి శాస్త్రీయ విజ్ఞాన గ్రంథాలను పునర్నిర్మాణం చేసి, పునరుద్ధరించాలి. ఇది కబుర్లతో జరిగేపని గాదు, విశేషమైన కృషి అవసరం. పాత తాటాకులమీద వ్రాసివున్నదంతా పరమ ప్రమాణమునే అంధవిశ్వాసం గల వ్యక్తులు ఈ రంగంలో పనిచేయటానికే అనర్హులు. శాస్త్రీయ విజ్ఞానానికి ప్రజా ప్రయోజనం పరమలక్ష్యముగా ఉండాలి. ప్రయోజనరహితమైన శాస్త్రం అంతరించి పోతుంది. శ్రీ శర్మగారు ఈ రచనలో ఈ విషయాన్ని అంతగా గమనించినట్లు కనుపించదు. ఏవో శ్లోకాలు ఉటంకించినంత మాత్రంచేత ఆ గ్రంథానికి ప్రామాణ్యతా సిద్ధించదు — ప్రయోజనమూ ఉండదు.

ప్రాచీన వాస్తుశాస్త్రం ఈ దేశంలో పూర్తిగా నశించిపోయింది — దానికి కారకులెవరైనా కానీయండి. దీనివల్ల ఈ దేశానికి ఎలాంటి దౌర్భాగ్యస్థితి పట్టిందో ఊహించ శక్యంగాదు. చిన్న కుటీరం నిర్మించుకుందామనుకున్న సామాన్యగృహస్థుని దగ్గర నుంచీ, పెద్ద పెద్ద ప్రాజెక్టులు నిర్మించుతున్న వారిదాకా, ప్రణాళికారచన సంఘందాకా దారి తెలియక అంధకారంలో తన్నుకుంటున్నారు. విదేశాలలో నిర్మాణ కార్యక్రమాలు ఎలా సాగుతున్నాయనే దృష్టి తప్ప దేశీయ పరిస్థితులదృష్టి లేదు. విజాతీయ శాస్త్ర విజ్ఞానంయొక్క అంధానుకరణ ఇందుకు కారణం. 'స్వామీ' చిన్నగృహం నిర్మించుకోవాలని వుంది అని అడిగితే 'సిమెంటుకూ, ఇనుముకూ పర్మిట్లు సంపాదించావా' అనేప్రశ్న వస్తోంది. యావద్భారత ప్రజానీకానికీ గృహనిర్మాణం జరగాలంటే సిమెంటూ, ఇనుమూ, ఇంజన్లూ ఎక్కడినుంచి వస్తాయి, వీట్లో నుంచి ఇన్ని యుగాలనుంచీ ఈ దేశంలో జరిగిన నిర్మాణాలన్నీ, సిమెంటూ, ఇనుమూతోనే నిర్మించారా, ఇంజన్ల సహాయంతోనే కట్టారా? ఇక్కడ

లభించే సాధనసంపత్తి యేమిటో చూసుకోవాలి, ఇక్కడ మానవశక్తి ఎంత పుష్కలంగా లభించుతుందో కళ్లు తెరచి చూసుకోవాలి. లేకపోతే మనకు మోక్షంలేదు. అంధానుకరణవల్ల, దేశీయ పురోగమనం డొంకదోవనుబట్టి, డాలర్ బిక్షలకొరకు నిరీక్షిస్తూ చేతగానివాళ్లమై కూర్చునే దౌర్భాగ్యం పట్టింది. ఈ వక్రమార్గాన్నుంచి మరలించటానికి, జాతీయ శాస్త్ర విజ్ఞానవేత్తలు ప్రయత్నించాలి. ఈ రంగంలోవారు జాతికి చెయ్యదగిన సేవ చాలావుంది. జాతీయ వాస్తు శాస్త్రజ్ఞులు ఈ రంగంలో తమకుగల శక్తి సామర్థ్యాలేమిటో విస్పష్టం చేయాలి. శ్రీ శర్మగారు ఎలాగో మూడు ఖండాలుగా ఈ వాస్తు శాస్త్రాన్ని ప్రకటించ బోతున్నారు గనుక ఈ విషయాలను దృష్టిలో వుంచుకొని మిగతా రెండు ఖండాలను, ఇప్పటికే రచింప బడివుంటే, తగిన విధంగా సంస్కరించి, ప్రయోజనకరమైన విషయాన్ని అందచేయగలరనీ, జాతికి కొంత సేవచేయగలరనీ ఆశించుతున్నాము.

ఈ ప్రథమ ఖండాన్ని శ్రీ శర్మగారు నాలుగు గుచ్ఛాలు (భాగాలు)గా విభజించారు. మొదటిభాగం ఇంచుమించు దేవతలకు సంబంధించింది. రెండవ గుచ్ఛంలో 'క్షేత్రీకృతపదము' అంటే యేమిటో చర్చించారు. అనేకరకాల కొలతలు వ్యవహారంలోకి వచ్చిన ఈనాడు ఈ 'క్షేత్రీకృతపద' చర్చ కేవలం నిష్ప్రయోజనకరం.

తృతీయ గుచ్ఛంలో ఆయా రకాల గృహాలకు పారిభాషికంగా వుండే పేర్లను వాటి వివరాలనూ చర్చించారు. చతుర్థ గుచ్ఛంలో వారశూలలు వగైరా చర్చించారు.

ఈ రచన యావత్తూ ప్రశ్నలు జవాబుల రూపంలో జరిగింది. శ్రీ శర్మగారు మిగతా రెండు ఖండాలనూ ఇంతకంటే వాస్తవిక దృక్పథంతోనూ, ప్రయోజనకరంగానూ రచించి అందచేయ గలరని ఆశించుతున్నాము.

చైతన్య స్రవంతి

రచన: శ్రీ బుచ్చిబాబు; ప్రచురణ : ఆదర్శ సాహిత్యమాల, (17-5-350 out-side Dabipura) హైదరాబాదు-2; వెల రు 1/-.

ఈ సంపుటిలో చైతన్యస్రవంతి అనే ఆధివాస్తవిక రచన ఒకటి, 'ఇంటాయన X నేను' పూడిన చక్రం 'వాడనిపుష్పం' 'దాగిలిమూతలు', 'పశ్చాత్తాపం' అనే నాలుగుకథలూ వున్నాయి. కథారచన విషయంలో శ్రీ బుచ్చిబాబును క్రొత్తగా పాఠకాలలకు పరిచయం చేయవలసిందేమీ లేదు. ఆధునిక కథారచయితలలో శ్రీ బుచ్చిబాబు పేరెన్నికగన్నవారు. ఇక మిగిలిన 'చైతన్యస్రవంతి' అనే రచనను గురించే ఒకటిరెండు మాటలు చెప్పవలసివుంది.

ఆంగ్లభాషతో ఎక్కువ పరిచయంవున్నవాడూ లేనివాడూకూడా, ఎంతచదువుకున్న పెద్దమనిషైనా సరే "మీరు 'జేమ్సు జాయిస్' చదివారా?" అని దబాయించటం పరిపాటిఅయింది. అది తలకాయికి పట్టినా పట్టకపోయినా దొరటోపీ పెట్టుకోవటం ఆధునిక ఫాషన్‌గా ఎలా చెలామణీఅయిందో, తలకు పట్టినా పట్టకపోయినా 'జేమ్సు జాయిస్' చదివాననటం జాయిస్ 'యులిసిస్' ప్రతిని ఒకదాన్ని చంకలో పెట్టుకు తిరగటం సాహిత్యకారుల మనిపించుకోజూస్తున్న వారిలో ఒక ఫాషనయిపోయింది. ఈవాతావరణంలో బుచ్చిబాబు, 'జాయిస్'ను అనుకరించుతూ ఒక రచన చేయటానికి ప్రయత్నించారంటే అందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. అక్కడ పశ్చిమదేశాల్లో ఏవెర్రికేక బయలుదేరినా దాని ప్రతిధ్వని ఇక్కడ వినిపించటంతప్ప దీనివల్ల కలిగే విశిష్టప్రయోజనమేమీ లేదు. ఈరకం అంధానుకరణవల్ల ఇప్పటికే మనం చాలా చెడ్డాం. స్వతంత్రమైన భావుకతను సృజనశక్తినీ మనం పెంపొందించుకోకపోతే మనకు ఎప్పటికీ మార్గం దొరకదు. పాఠకుల పరిశీలనార్థం శ్రీ బుచ్చిబాబు రచననుంచి, కొలదిభాగాన్ని క్రింద ఉటంకించుతున్నాం.

'ఇప్పుడను తెలిసిందా? నేనెందుకు చేరతానో ఈ చేరలో? పావ్‌లావ్ కుక్కలాగా పొట్టకూటికి గుంట్రడని ఎముకని చూపిస్తే వాడి చెయ్యి నాకుతా, వాడి పెళ్ళాం కాళ్లు పడతా ఛీ ఛీ. ఫ్రాయిడ్ తాతయ్య మారిపోతాడురా. వాడి పెళ్లాం గొడవ నాకెందుకు? వాడి కాళ్లే పడతా. ఫ్రేజరు (Frazer). 'బంగారు బొమ్మ'లో జనక ఈజిప్టురాణి వెన్నునాకేటందుకు ఇద్దరు జీతగాళ్ళుండేవారని వ్రాశాడు. ఇది చదివి నాలిక కొరుక్కున్నాను. అయిదువేల కాపీలు అమ్ముడయాయి, ఈ దేశంలో గినవారం పత్రిక లేకపోలేను—దిన, వారం మాసికం సంవత్సరీకం పత్రిక ఒక్క కాగితాన్ని ఐదువేలమంది ముక్కలక్రింద కొరుక్కుతింటారు. పదివేలమంది పెళ్ళాలు—అంటే జుంగు (Jung) గాడు చెప్పినట్లు ప్రతివాడికి ఒక పెళ్ళాం ఒక ప్రియురాలు—మొత్తం ఎంతమంది? పదివేలమంది. దానితో పొయ్యి రాజేస్తారు.'

ఈ రచనయొక్క ప్రయోజనాన్ని గురించి పేజీల తరబడి చర్చ అనవసరం. పాఠకులు పైన ఉటంకించిన భాగాన్ని పరిశీలించితే సర్వం అర్థమౌతుంది.

తె. సూ.

స్వీకారము

గాలి, గ్రహాలు: పద్యాలలో చెప్పబడిన ఖగోళ శాస్త్రం. రచన: శ్రీ వసంతరావు వేంకటరావు; ప్రాప్తిస్థానం: రచయిత, విజయనగరం; వెల రు 1-00

మాధురీమహిమ: వ్యాససంపుటి; రచన: శ్రీపిల్లలమర్రి వేంకటహనుమంతరావు; ప్రచురణ: శారదా పీఠము, గుంటూరు. వెల: రు 2-00.

సుభాషితత్రిశతి: శ్రీ నీలకంఠ దీక్షితులవారి "సభారంజన" "కలివిడంబన" "వైరాగ్యశతకము" అనే రచనలకు అనువాదం. అనువాదకులు: శ్రీ రూపావతారం నారాయణశర్మ; ప్రాప్తిస్థానం: భారతి కుటీరము, హిందూపూరు, అనంతపురంజిల్లా: వెల రు 0-75.

మానవబోధామృతము: పద్యరచన: శ్రీ అకుండి వేంకటశాస్త్రిగారు, విజయనగరము; అమూల్యం.

రసవాహిని: ఖండకావ్యసంపుటి: రచన: శ్రీ పి; వి. యల్. వి. ప్రసాదరావు; హిందూకాలేజి, గుంటూరు: వెల రు 1-50.

మహాభారతి విమర్శనము: రచన: శ్రీ కొడాలి లక్ష్మీనారాయణ, ప్రాప్తిస్థానము: సాహితీకేంద్రము తెనాలి; వెల రు 3.00.

ఆంధ్ర తులసీరామాయణము: (ఉత్తరకాండము) అనువాదకులు: శ్రీ మైలవరపు సూర్యనారాయణమూర్తి; కృష్ణపాలెం (పోస్టు), వయా కొవ్వూరు. వెల. రు 1-50.

మునిగోరింట: కథల సంపుటి; రచన: శ్రీమల్లాది రామకృష్ణశాస్త్రి; విశాలాంధ్ర ప్రచురణాలయం; విజయవాడ 2; వెల రు 1-25.

రంగవల్లి: కథల సంపుటి; రచన: శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి; విశాలాంధ్ర ప్రచురణాలయం— విజయవాడ 2-వెల 1-25.

1857 పూర్వరంగములు: (ప్రథమ భారతీయ స్వాతంత్ర్య సమర పూర్వరంగములు); రచన: శ్రీ దిగవల్లి వేంకట శివరావు; విశాలాంధ్ర ప్రచురణాలయం; వెల 2-75.

అల్లో నేరేడు: కథల సంపుటి; రచన: శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి. విశాలాంధ్ర ప్రచురణాలయం; విజయవాడ—2.

రసమంజరి: కథల సంపుటి; రచన: శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి విశాలాంధ్ర ప్రచురణాలయం; విజయవాడ. 2-వెల రు 1-25.

నర్తనశాల: బాలబాలికల కొరకు ఉద్దేశింపబడిన నాట్యశాస్త్ర ప్రబోధకగ్రంథం; రచన: శ్రీ నటరాజ రామకృష్ణ; విశాలాంధ్ర ప్రచురణాలయం; విజయవాడ—2; వెల రు 5-0 0

ప్రాచీన కావ్యమంజరి: సంకలనం; శ్రీ శ్రీగంటి జోగి సోమయాజులు; విశాలాంధ్ర ప్రచురణాలయం; విజయవాడ—2; వెల రు. 1-50.

దనువిచ్చిన స్కూల్ మాస్టరు: ఏకాంకిక: రచన: శ్రీ కె. సుధాకరమూర్తి; ప్రాప్తిస్థానం: కె. సుధాకరమూర్తి (alias) కె. కృష్ణమూర్తి, కుప్పం, చిత్తూరుజిల్లా వెల: రు. 0-37.

శ్రీ కన్యకాపరమేశ్వరీ దండకము: రచన: కోట సోదరకవులు; ప్రాప్తిస్థానము: కవిచంద్ర గ్రంథమాల; 147 మింటుస్ట్రీటు, మద్రాసు-1. వెల: రు. 0-25.

మేఘసందేశము: కాళిదాస కృతికి అనువాదం; అనువాదకులు: శ్రీ యం. వి. ఆర్. కృష్ణశర్మ; ప్రాప్తిస్థానం: ఆదిత్యప్రచురణలు అరండల్ పేట గుంటూరు.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.

నాందీ పద్యము—

శ్రీయుమాశారదా రాగసించితములు
హరిహరహిరణ్యగర్భహృత్సరసిజములు
మధుర మధురంపు తావి సంపదల పొదలి
విశ్వకల్యాణరోచి ప్రహృష్టభవించు॥

'శ్రీయుమా' సమాసమేని విసంధి చేయరాదు. కాదేని అర్థము కుదురదు. ఉమకు పర్యాయ పదము వెతుకవలెను.

రాగసించితములు—రాగములో రంజనము కుదురును గాని సేచనము కుదురదు.

విశ్వకల్యాణరోచి ప్రహృష్టభవించు—ప్రహృష్టభవించుటకు నమ్రమగుట - ముకుళించుకొనుట అర్థము. కవి యుద్దేశమునకు విరుద్ధార్థము వచ్చుచున్నది.

ఇక పీఠికలో—"కాళిదాసుని యభిజ్ఞాన శాకుంతలము చదివిన పిమ్మట చక్కని నాటకము రచింపవలెనను అభిలాషయే "ఉషాసుందరిగ రూపొందినది." ఈ సృష్టికి అది యుద్బోధకమని పేర్కొనుటకైన కొంచెము సంకోచ ముండవలయును. ఈ రచయితయిట్టి రచనల కుపక్రమించుటకు ముందు కొంత ఆత్మ విచారమును చేసికొనవలయును.

జాతీయ భారతి

గేయసంపుటి: రచన: శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి; మారుతీనగర్, విజయవాడ. వెల రు. 2-50.

ఇది జాతీయతా ధర్మప్రబోధము. కొందఱు దేశనాయకులు, పంచశీల వీని ప్రచారమును దృష్టియందుంచికొని వ్రాసిన గేయముల సంపుటి. ఈ రచనలకు వలసిన యర్హత యీ రచయితకు గలదు. ఈ గేయములకు నింతకు పూర్వమే దేశములో ప్రచారముగలదు. ప్రతి గేయముక్రిందను ఒక్కొక్క సంగీతవాద్య చిత్రమున్నది. ఆ గేయమును ఆ వాద్యముపైఁ బలికింపవలయునని రచయిత సూచనయై యుండును. ప్రచార సులభమైన శైలిలో నుండుట యీ గేయముల లోని విశేషము. తంద్రాళువైన జాతికి నిత్యప్రబోధము ఆవసరమే కావచ్చునుగాని ఒక్కొక్కసారి—

"తెలుంగు దేశం మన దేనోయ్
తెలుంగులంటే మన మేనోయ్.
రాయలు మనవాడోయ్—పండిత
రాయలు మనవాడోయ్
కలంతిక్కనా ఖడ్గతిక్కనా
గణపతి దేవులు మనవారోయ్".

ఇత్యాదులు చూచినప్పుడు 'తెలిసిన సాదతో తెఱఁజంపుటయే కలిగిన ఫలమా? కవితలకున్' అని యనిపింపక మానదు. ఈ పురశ్చరణవలన ఫలమేమి?

ఇందలి 'గోమాత' 'ఏఱువాక' అను గేయములలోఁ గొంత కావ్యగుణమున్నది.

శివశర్మ

శృంగార తిలకము

మహాకవి కాళిదాసు రచనగా చెలామణి అవుతున్న చిన్ని కృతికి అనువాదం: అనువాదకులు: శ్రీ ఉప్పాడ రాజారావు; ప్రకాశకులు: శ్రీ హనుమంతు మోహనరావు, తలగాము, (వయా) చాపడా, శ్రీకాకుళము జిల్లా, వెల: రు. 0-50.

వ్యాసులు, శంకరులు, కాళిదాసులూ, మనకు అనంత సంఖ్యలో నున్నారు. ఈ 'శృంగార తిలక' మాతృక ఏ కాళిదాసు రచనో మనకు తెలియదు. ఇది స్త్రీ సౌందర్యవర్ణన పరమాశయంగాగల కావ్యం. భావనలో వైచిత్రి వున్న కారణంగా కావ్యగౌరవాన్ని సంతరించుకున్నది.

అనువాదం సరసంగా వుంది.

"కుసుమే కుసుమోత్పత్తిః
శ్రూయతే నచదృశ్యతే
బాలే! తవ ముఖాంభోజే
కథ మిందీవర ద్వయం॥"

అన్న శ్లోకాన్ని ఇలా అనువదించారు:

"కుసుమమున కుసుమోత్పత్తి యొనసు టెందు
పృథివితలమందు గనలేదు; వినగలేదు
బాల! భవదీయ లలితాస్య పంకజమున
గానవచ్చె జగానల్లకల్వదోయి."

చెరగని అక్షరాలు

కథల సంపుటి: రచన: శ్రీ ఇసుకపల్లి దక్షిణామూర్తి; ప్రచురణ: నవ్యభారతి, 760 హిమాయత్ నగర్, హైద్రాబాదు. వెల: రు. 1-00.

ఈ సంపుటిలో, టపాకాయలు, పూవులూ కాయలూ, కాలిన చేతులు, ధర్మపత్ని, చెరగని అక్ష

రాలు, కథలో కథానిక, విశాలహృదయం, జన్మ సాఫల్యం — అనే ఎనిమిదికథలున్నాయి. వీటిలో చెరగని అక్షరాలు అనే కథ లోగడ 'భారతి' ద్వారా పాఠకులకు పరిచయమైనదే. మిగతా కథలుకూడా, ఆ యా పత్రికలలో లోగడ ప్రచురింపబడినవి. శ్రీ దక్షిణామూర్తిగారి రచనలో, భావతీవ్రత వుంటుంది. దానికి తగిన నిరాడంబరమైన భాషనుకూడా సమకూర్చుకో గలరు.

వాస్తు పద్మాకరమ్

[ప్రథమ ఖండము]

రచన శ్రీ కె. యస్. శర్మ; ప్రాప్తిస్థానం: రచయిత, మెయిన్‌రోడ్, కాకినాడ; వెల రు. 3/-

మనకు ప్రాచీన వాస్తుశాస్త్రం అనంతంగా వున్నదని చెబుతారు. కాని అదంతా సంస్కృతంలో వున్నది, ఎక్కడెక్కడో అటకలమీద మూలుగుతున్న అముద్రితములైన తాటాకు గ్రంథాలలో వున్నది. అందు చాలా గ్రంథాలు, సాంకేతిక విజ్ఞాన శాఖకు చెందివున్న కారణంచేత వాటిలో వాడబడిన పారిభాషిక పదజాలం మామూలు సంస్కృత భాష చదువుకున్న మాత్రం చేత అర్థంకావు, ఆశాస్త్ర విషయంలో పరిపూర్ణ పాండిత్యంగల గురువులు లభించితేనే తప్ప ఈ కవిలెకట్టలు విప్పనెవ్వరికీ సాధ్యం కాదు. అట్టి గురువులు ఇప్పుడు ఈ దేశంలో ఎంతమంది వున్నారు. అంతేగాదు ఈశాస్త్ర విజ్ఞాన గ్రంథాలతో ఒక చిక్కుగూడా వుంది. వీటిలో ప్రక్షిప్తాలు అనంతం. మన ప్రాచీన లేఖకులలో కొంతమంది చాలా అనాలోచితంగా వ్యవహరించారు. పరిమిత పరిజ్ఞానమూ అంధ విశ్వాసములు గల ఈ లేఖకులు మూలగ్రంథాలను మూల గ్రంథాలుగా వుంచారు గాదు. కొత్త రెండుశ్లోకాలు వ్రాయటంచేతనైన ప్రతి ఒక్కడూ ఏదో చేర్చివ్రాసి మూల గ్రంథాలలోకి దూర్చారు. భారతం వంటి ఐతిహాసిక గ్రంథంలోనే ఇలాంటి దౌర్భాగ్యం అనంతంగా కనుపించుతోంది. ఈ దుశ్చర్యలతో దానికిగల ఐతిహాసిక ప్రామాణ్యాన్ని దగ్గం చేశారు. అలాగే శాస్త్రవిజ్ఞానగ్రంథాలలో కూడా చేసి వాటికిగల శాస్త్రీయ ప్రామాణ్యాన్ని నాశనం చేశారు. ఏశాస్త్ర విజ్ఞాన గ్రంథాన్ని చూచినా శాస్త్రీయ విషయంతో పాటుఅశాస్త్రీయమైన, అవివేకమైన, మూలచ్ఛేదకమైన చెత్త ఎంతో కనుపించుతుంది. దాంతో బుద్ధిమంతుడైన పాఠకునిలో ఆ గ్రంథంయొక్క ప్రామాణ్యవిషయములోనే అశంక కలిగి, అవిశ్వాసం పుడుతుంది. మన విజ్ఞానశాస్త్రాలమీద దేశంలో నేడు ప్రబలియున్న అవిశ్వాసానికి కంతకూ ఇదే కారణం. ఈస్థితికి; మరొకరెవరో కారణమనీ, దేశంలో ఆంగ్లభాషావ్యాప్తిచేత అలాటిది కలిగిందనీవాదించటం, ఆత్మవంచన చేసుకుని మన బాధ్యతలనుంచి మనం తప్పుకోవటానికి ప్రయత్నించటమే. అయితే ఇప్పుడు మనం నిర్వహించగల బాధ్యతలేవిటి? ఆయా విజ్ఞాన శాస్త్రాలలో తగిన వ్యుత్పత్తిని సంపాదించుకోవాలి. ఆ శక్తితో ఈగ్రంథ బాహుళ్యంలో వున్న విషయ సంచయంలో శాస్త్రీయ విషయాలేవో అశాస్త్రీయ విషయాలేవో నిర్ణయించి శాస్త్రీయ విజ్ఞాన గ్రంథాలను పునర్నిర్మాణం చేసి, పునరుద్ధరించాలి. ఇది కబుర్లతో జరిగేపని గాదు, విశేషమైన కృషి అవసరం. పాత తాటాకులమీద వ్రాసివున్నదంతా పరమ ప్రమాణమనే అంధవిశ్వాసం గల వ్యక్తులు ఈ రంగంలో పనిచేయటానికే అనర్హులు. శాస్త్రీయ విజ్ఞానానికి ప్రజా ప్రయోజనం పరమలక్ష్యముగా ఉండాలి. ప్రయోజనరహితమైన శాస్త్రం అంతరించి పోతుంది. శ్రీ శర్మగారు ఈ రచనలో ఈ విషయాన్ని అంతగా గమనించినట్లు కనుపించదు. ఏవో శ్లోకాలు ఉటంకించినంత మాత్రంచేత ఆ గ్రంథానికి ప్రామాణ్యతా సిద్ధించదు — ప్రయోజనమూ ఉండదు.

ప్రాచీన వాస్తుశాస్త్రం ఈ దేశంలో పూర్తిగా నశించిపోయింది — దానికి కారకులెవరైనా కానీయండి. దీనివల్ల ఈ దేశానికి ఎలాంటి దౌర్భాగ్య స్థితి పట్టిందో ఊహించ శక్యంగాదు. చిన్న కుటీరం నిర్మించుకుందామనుకున్న సామాన్యగృహస్థుని దగ్గర నుంచీ, పెద్ద పెద్ద ప్రాజెక్టులు నిర్మించుతున్న వారిదాకా, ప్రణాళికారచన సంఘందాకా దారి తెలియక అంధకారంలో తన్నుకుంటున్నారు. విదేశాలలో నిర్మాణ కార్యక్రమాలు ఎలా సాగుతున్నాయనే దృష్టి తప్ప దేశీయ పరిస్థితులదృష్టి లేదు. విజాతీయ శాస్త్ర విజ్ఞానంయొక్క అంధానుకరణ ఇందుకు కారణం. 'స్వామీ' చిన్నగృహం నిర్మించుకోవాలని వుంది అని అడిగితే 'సిమెంటుకూ, ఇనుముకూ పర్మిట్లు సంపాదించావా' అనే ప్రశ్న వస్తోంది. యావద్భారత ప్రజానీకానికీ గృహనిర్మాణం జరగాలంటే సిమెంటూ, ఇనుమూ, ఇంజన్లూ ఎక్కడనుంచి వస్తాయి, ఏట్లో నుంచి ఇన్ని యుగాలనుంచీ ఈ దేశంలో జరిగిన నిర్మాణాలన్నీ, సిమెంటూ, ఇనుమూతోనే నిర్మించారా, ఇంజన్ల సహాయంతోనే కట్టారా? ఇక్కడ

లభించే సాధనసంపత్తి యేమిటో చూసుకోవాలి, ఇక్కడ మానవశక్తి ఎంత పుష్కలంగా లభించుతుందో కళ్లు తెరచి చూచుకోవాలి. లేకపోతే మనకు మోక్షం లేదు. అంధానుకరణవల్ల, దేశీయ పురోగమనం డొంకదోవనుబట్టి, డాలర్ బిక్షలకోరకు నిరీక్షిస్తూ చేతగానివాళ్లమై కూర్చునే దౌర్భాగ్యం పట్టింది. ఈ వక్రమార్గాన్నుంచి మరలించటానికి, జాతీయ శాస్త్ర విజ్ఞానవేత్తలు ప్రయత్నించాలి. ఈ రంగంలో వారు జాతికి చేయదగిన సేవ చాలావుంది. జాతీయ వాస్తు శాస్త్రజ్ఞులు ఈ రంగంలో తమకుగల శక్తి సామర్థ్యాలేమో విస్పష్టం చేయాలి. శ్రీ శర్మగారు ఎలాగో మూడు ఖండాలుగా ఈ వాస్తు శాస్త్రాన్ని ప్రకటించ బోతున్నారు గనుక ఈ విషయాలను దృష్టిలో వుంచుకొని మిగతా రెండు ఖండాలను, ఇప్పటికే రచింప బడివుంటే, తగిన విధంగా సంస్కరించి, ప్రయోజనకరమైన విషయాన్ని అందజేయగలరనీ, జాతికి కొంత సేవజేయగలరనీ ఆశించుతున్నాము.

ఈ ప్రథమ ఖండాన్ని శ్రీ శర్మగారు నాలుగు సూచ్యాలు (భాగాలు)గా విభజించారు. మొదటిభాగం ఇంచుమించు దేవతలకు సంబంధించింది. రెండవ సూచ్యంలో 'క్షేత్రీకృతపదము' అంటే రేఖలతో చర్చించారు. అనేకరకాల కొలతలు వ్యవహారంలోకి వచ్చిన ఈనాడు ఈ 'క్షేత్రీకృతపద' చర్చ కేవలం నిష్ప్రయోజనకరం.

తృతీయ సూచ్యంలో ఆయా రకాల గృహాలకు పారిభాషికంగా వుండే పేర్లను వాటి వివరాలనూ చర్చించారు. చతుర్థ సూచ్యంలో వారశూలలు వగైరా చర్చించారు.

ఈ రచన యావత్తూ ప్రశ్నలు జవాబుల రూపంలో జరిగింది. శ్రీ శర్మగారు మిగతా రెండు ఖండాలనూ ఇంతకంటె వాస్తవిక దృక్పథంతోనూ, ప్రయోజనకరంగానూ రచించి అందజేయ గలరని ఆశించుచున్నాము.

చైతన్య స్రవంతి

రచన: శ్రీ బుచ్చిబాబు; ప్రచురణ : ఆదర్శ సాహిత్యమాల, (17-5-850 out-side Dabipura) హైదరాబాదు-2; వెల రు 1/.

ఈ సంపుటిలో చైతన్యస్రవంతి అనే అధివాస్తవిక రచన ఒకటి, 'ఇంటూయన X ఐదు' వూడిపడక్రం 'నాడనిపుష్పం' 'దాగిలిమూతలు', 'పశ్చాత్తాపం' అనే నాలుగుకథలూ వున్నాయి. కథారచన విషయంలో శ్రీ బుచ్చిబాబును క్రొత్తగా పాఠకులకు పరిచయం చేయవలసిందేమీ లేదు. ఆధునిక కథారచయితలలో శ్రీ బుచ్చిబాబు పేరెన్నికగన్నవారు. ఇక మిగిలిన 'చైతన్యస్రవంతి' అనే రచనను గురించే ఒకటి రెండు మాటలు చెప్పవలసివుంది.

ఆంగ్లభాషలో ఎక్కువ పరిచయంవున్నవాడూ లేనివాడూకూడా, ఎంతచదువుకున్న పెద్దమనిషినైనా సరే "మీరు 'జేమ్సు జాయిస్' చదివారా?" అని దబాయించటం పరిపాటిఅయింది. అది తలకాయికి పట్టినా పట్టకపోయినా దొరటోపీ పెట్టుకోవటం అమూల్య ఫాషన్‌గా ఎలా చెలామణీఅయిందో, తలకు పట్టినా పట్టకపోయినా 'జేమ్సు జాయిస్' చదివాననటం జాయిస్ 'యూలిసిస్' ప్రతిని ఒకదాన్ని చంకలో పెట్టుకు తిరగటం సాహిత్యకారుల మనిపించుకో జూస్తున్న కొరులలో ఒక ఫాషనయిపోయింది. ఈ వాతావరణంలో బుచ్చిబాబు, 'జాయిస్'ను అనుకరించుతూ ఒక రచన చేయుటానికి ప్రయత్నించారంటే అందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. అక్కడ పశ్చిమదేశాల్లో ఏదైనాకొక బయలుదేరినా దాని ప్రతిధ్వని ఇక్కడ వినిపించటంతప్ప దీనివల్ల కలిగే విశిష్టప్రయోజన మేమీ లేదు. ఈరకం అంధానుకరణవల్ల ఇప్పటికే మనం చాలా చెడ్డాం. స్వతంత్రమైన భావుకతను సృజనశక్తినీ మనం పెంపొందించుకోనకపోతే మనకు ఎప్పటికీ మార్గం దొరకదు. పాఠకుల పరిశీలనార్థం శ్రీ బుచ్చిబాబు రచననుంచి, కొలదిభాగాన్ని క్రింద ఉటంకించుతున్నాం.

'ఇప్పుడు తెలిసిందా? నేనెందుకు చేరతానో ఈ చేరలో? పావ్‌లావ్ కుక్కలాగా పొట్టకూటికి గుంట్రడని ఎముకని చూపిస్తే వాడి చెయ్యి నాకుతా, వాడి పెళ్ళాం కాళ్లు పడతా ఛీ ఛీ. ఫ్రాయిడ్ తాతయ్య నూరిపోశాడురా. వాడి పెళ్లాం గొడవ నాకెందుకు? వాడి కాళ్లే పడతా ఫ్రేజరు (Frazer). 'బంగారు బొమ్మ'లో పవక ఈజిప్టురాణి వెన్ను నాకేటందుకు ఇద్దరు జీతగాళ్ళుండేవారని వ్రాశాడు. ఇది చదివి నాలిక కొరుకున్నాను. అయిదువేల కాపీలు అమ్ముడయాయి, ఈ దేశంలో దినవారం పత్రిక లేకపోతేను—దిన, వారం మాసికం సంవత్సరీకం పత్రిక ఒక్క కాగితాన్ని ఐదువేలమంది ముక్కలక్రింద కొరుక్కుతింటారు. పదివేలమంది పెళ్ళాలు—అంటె జుంగు (Jung) గాడు చెప్పినట్లు ప్రతిమగాడికి ఒక పెళ్ళాం ఒక ప్రియురాలు—మొత్తం ఎంతమంది? పదివేల మంది. దానితో హాయిగ్గా రాజేస్తారు.'

ఈ రచనయొక్క ప్రయోజనాన్ని గురించి పేజీల తరబడి చర్చ అనవసరం. పాఠకులు పైన ఉటంకించిన భాగాన్ని పరిశీలించితే సర్వం అర్థమౌతుంది.

తె. సూ.

స్వీకారము

గాలి, గ్రహాలు: పద్యాలలో చెప్పబడిన ఖగోళ శాస్త్రం. రచన: శ్రీ వసంతరావు వేంకటరావు; ప్రాప్తిస్థానం: రచయిత, విజయనగరం; వెల రు 1-00

మాధురీమహిమ: వ్యాససంపుటి; రచన: శ్రీపిల్లలమర్రి వేంకటహనుమంతరావు; ప్రచురణ: శారదా పీఠము, గుంటూరు. వెల: రు 2-00.

సుభాషితత్రిశతి: శ్రీ నీలకంఠ దీక్షితులవారి "సభారంజన" "కలివిడంబన" "వైరాగ్యశతకము" అనే రచనలకు అనువాదం. అనువాదకులు: శ్రీ రూపావతారం నారాయణశర్మ; ప్రాప్తిస్థానం: భారతి కుటీరము, హిందూపూరు, అనంతపురంజిల్లా: వెల రు 0-75.

మానవబోధామృతము: పద్యరచన: శ్రీ అకుండి వేంకటశాస్త్రి గారు, విజయనగరము; అమూల్యం.

రసవాహిని: ఖండకావ్యసంపుటి: రచన: శ్రీ పి; వి. యల్. వి. ప్రసాదరావు; హిందూకాలేజి, గుంటూరు: వెల రు 1-50.

మహాభారతి విమర్శనము: రచన: శ్రీ కొడాలి లక్ష్మీనారాయణ, ప్రాప్తిస్థానము: సాహితీకేంద్రము తెనాలి; వెల రు 3-00.

ఆంధ్ర తులసీరామాయణము : (ఉత్తరకాండము) అనువాదకులు : శ్రీ మైలవరపు సూర్యనారాయణ మూర్తి; కృష్ణపాలెం (పోస్టు), వయా కొవ్వూరు. వెల. రు 1-50.

మునిగోరింట : కథల సంపుటి; రచన : శ్రీమల్లాది రామకృష్ణశాస్త్రి; విశాలాంధ్ర ప్రచురణాలయం; విజయవాడ 2; వెల రు 1-25.

రంగవల్లి: కథల సంపుటి; రచన : శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి; విశాలాంధ్ర ప్రచురణాలయం— విజయవాడ 2-వెల 1-25.

1857 పూర్వరంగములు : (ప్రథమ భారతీయ స్వాతంత్ర్య సమర పూర్వరంగములు); రచన: శ్రీ దిగవల్లి వేంకట శివరావు; విశాలాంధ్ర ప్రచురణాలయం; వెల 2-75.

అల్లో నేరేడు: కథల సంపుటి; రచన: శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి. విశాలాంధ్ర ప్రచురణాలయం; విజయవాడ—2.

రసమంజరి : కథల సంపుటి; రచన : శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి విశాలాంధ్ర ప్రచురణాలయం; విజయవాడ. 2-వెల రు 1-25.

నర్తనబాల : బాలబాలికల కొరకు ఉద్దేశింపబడిన నాట్యశాస్త్ర ప్రబోధకగ్రంథం; రచన : శ్రీ నటరాజ రామకృష్ణ; విశాలాంధ్ర ప్రచురణాలయం; విజయవాడ—2; వెల రు 5-0 0

ప్రాచీన కావ్యమంజరి : సంకలనం; శ్రీ శ్రీగంటి జోగి సోమయాజులు; విశాలాంధ్ర ప్రచురణాలయం; విజయవాడ—2; వెల రు. 1-50.

చనువిచ్చిన స్కూల్ మాష్టరు : ఏంకాంకిక : రచన : శ్రీ కె. సుధాకరమూర్తి; ప్రాప్తిస్థానం : కె. సుధాకరమూర్తి (alias) కె. కృష్ణమూర్తి, కుప్పం, చిత్తూరుజిల్లా వెల : రు. 0-37.

శ్రీ కన్యకాపరమేశ్వరీ దండకము : రచన : కోట సోదరకవులు; ప్రాప్తిస్థానము : కవిచంద్ర గ్రంథమాల; 147 మింటుస్ట్రీటు, మద్రాసు-1. వెల: రు. 0-25.

మేఘసందేశము : కాళిదాస కృతికి అనువాదం; అనువాదకులు : శ్రీ యం. వి. ఆర్. కృష్ణశర్మ; ప్రాప్తిస్థానం: ఆదిత్యప్రచురణలు అరండల్ పేట గుంటూరు.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.